







తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రచురణ,
హైదరాబాదు

సహ పాఠ్యాంశాలు

# విలువల విద్య - జీవన నైపుణ్యాలు



8వ తరగతి




రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణా సంస్థ,
తెలంగాణ రాష్ట్రం, హైదరాబాదు

# విలువల విద్య - జీవన నైపుణ్యాలు

## వాచకం, ఉపాధ్యాయ కరదీపిక

## 8వ తరగతి

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ

తెలంగాణ, హైదరాబాదు.

# ముందుమాట

మానవులు సంఘజీవులు. తమ మనుగడకోసం అవసరమైన సమాజాన్ని నిర్మించుకొన్నారు. ఈ వ్యవస్థ నిర్వహణకు, కలిసికట్టుగా మనుగడసాధించడానికి, అభివృద్ధి పొందడానికి సరైన అవగాహన, విశ్వసనీయతలు అవసరం. దీనికి సమిష్టితత్త్వం, పరస్పరాధారిత భావాలు కూడా అవసరం. కాబట్టి మానవ సమాజాలకు జనమెరిగిన ఆమోదయోగ్యమైన ప్రవర్తనా నియమావళి అవసరం. మనం కోరుకొన్న విధంగా మనం ప్రవర్తించలేం. ప్రతి సమాజానికీ దానికి అనుగుణమైన నైతిక నియమావళి ఉంటుంది. ఈ నైతిక నియమాల బహుళత్వానికి కూడా అంతర్లీనంగా కొన్ని ఆమోదిత ఉమ్మడి నియమాలు ఉంటాయి.

నీతిసూత్రాలు మన నడవడికి మార్గదర్శకంగా ఉండే నియమాలు. కాబట్టి పిల్లలుకూడా వాటిని ఆకళింపుచేసుకోవాలి. నైతికాభివృద్ధి అంటే కొన్ని నిబంధనలను అనుసరించడమో లేక ఎవరో ఏర్పరిచిన ఆదర్శ నమూనాల ప్రకారంనడుచుకోవడం మాత్రమేకాదు. నైతికాభివృద్ధి అంటే ప్రతి సందర్భంలోనూ సరైన కారణాన్ని తెల్సుకోగలగడం, విచక్షణతో నిర్ణయాన్ని తీసుకొని దాని ప్రకారం నడుచుకోగల సామర్థ్యం కలిగి ఉండడం. నైతిక చైతన్య అభివృద్ధిలో తాను తీసుకోబోయే నిర్ణయంతో తాను స్థిరంగా ప్రశాంతంగా ఉండగలిగే సామర్థ్యంకూడా ఉంటుంది. "అది నాకలాగే చెప్పారు. కాబట్టి నేను చేస్తున్నాను" అనే భావనకు ఇది విరుద్ధం. అందుచేత ఒక వ్యక్తి తనకు తాను శాంతి సౌఖ్యాలతో, ప్రశాంతంగా, స్థిరంగా ఉండడమే నైతికాభివృద్ధి సారాంశం. ఇందుకవసరమైన నైపుణ్యాలు కలిగి ఉండడమే జీవననైపుణ్యాలు. వీటిలో సమస్యను పరిష్కరించుకోవడం కలిసి పనిచేయడం, భావప్రసారంచేయడం, నాయకత్వం వహించడం, ఇతరులతో పరస్పర సంబంధాలను కల్గి ఉండడం వంటివి ముఖ్యమైనవి.

దురదృష్టవశాత్తు నేడు సమాజంలో నైతిక విలువలు పతనమౌతున్నాయని ప్రతి ఒక్కరూ భావిస్తున్నారు. మనలో స్వార్థం పెరగడం, దురాశ పెరగడం, అవినీతికి అలవాటుపడడం, నైతిక నియమావళిని ఉల్లంఘించడం, లోభత్వం పెరగడం, నేను నాది వంటి అవలక్షణాలవల్ల వ్యక్తులు తమ జీవితాన్ని సంక్లిష్టం చేసుకోవడంతోపాటు సమాజంలోని వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు. ప్రతి ఒక్కరిలో అశాంతి పెరిగింది. నైతిక విలువల పతనంతోపాటు, పెరిగిపోతున్న ఒత్తిడిని, కనుమరుగౌతున్న మానవతా విలువలు, మానవసంబంధాలను గమనించవచ్చు. ఇవన్నీ ఒకరోజులోనో, ఒక సంవత్సరంలోనో వచ్చినవి కావు. మన జీవితాలలో సంయమనం, సమతుల్యత, విచక్షణ లోపించడమే దీనికి కారణం. వాటి స్థానంలో దురాశ, వినిమయవాదం, దోపిడీలు చోటుచేసుకొంటున్నాయి. వాటి నికర ఫలితమే సమాజంలోని అభద్రతాభావం, అపనమ్మకం, విచ్ఛిన్నమైన కుటుంబవ్యవస్థ, విలువల పతనం, సమాజంలో అశాంతి వ్యాపించడం మొదలగునవి.

వీటిని అరికట్టడానికి విద్యను ఒక సాధనంగా భావించి మనం విలువల విద్య, జీవననైపుణ్యాలు అనే అంశాన్ని ఒక ప్రధాన సబ్జెక్టుగా పాఠశాల విద్యలో ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ప్రవేశపెట్టడం ద్వారా పిల్లలు పాఠశాల విద్య పూర్తయ్యేసరికి హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి అవసరమైన శిక్షణ పొందుతారు. ఉన్నతమైన విలువలు, వైఖరులు, త్యాగబుద్ధి కలిగి ఉండి సమాజంపట్ల, పర్యావరణంపట్ల, తోటివారిపట్ల సమన్వాయంతో ప్రతిస్పందించే బాధ్యతాయుత పౌరులుగా ఎదగడానికి అవసరమైన పాఠ్యప్రణాళికను (Syllabys) రాష్ట్రవిద్య, పరిశోధన, శిక్షణసంస్థ రూపొందించింది. పిల్లలు స్వేచ్ఛగా మాట్లాడడం, ప్రశ్నించడం, ప్రతిస్పందించడం, విచక్షణతో వ్యవహరించడం చేయగలగాలని రాష్ట్ర విద్యాప్రణాళిక

పరిధిపత్రం 2011లోని రాష్ట్ర దృక్పథం (State Vision)లో పేర్కొన్నారు. వీటిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రంలో 1 నుండి 10వ తరగతి వరకు విలువల విద్య, జీవన నైపుణ్యాల పాఠ్యప్రణాళిక రూపొందించారు. అనంతరం తరగతి వారీగా బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకోసం ఉపాధ్యాయుల కరదీపికలను రూపొందించారు. 1వ తరగతి నుండి 10వ తరగతి వరకు పెంపొందించాల్సిన 18 ప్రధాన విలువలను గుర్తించి ప్రతి తరగతిలో వీటికి సంబంధించిన పాఠాలను చేర్చారు. అవి, 1) స్వేచ్ఛ, 2) సంతృప్తిగా జీవించడం, 3) శీలనిర్మాణం, 4) జీవన నైపుణ్యాలు, 5) బాధ్యతవహించడం, 6) పొదుపుచేయడం, 7) ఆరోగ్యవిలువలు, 8) సంస్కృతి సంప్రదాయలపట్ల గౌరవం, 9) ఆరోగ్య విలువలు, 10) శాస్త్రీయదృక్పథం, 11) న్యాయం, 12) శాంతి, కలిసిమెలిసి జీవించడం, 12) శ్రమవిలువ, 14) సేవాభావం, 15) సమానత్వం, సోదరభావం, స్త్రీలపట్ల గౌరవం, 16) జాతీయ భావన – దేశభక్తి, 17) లౌకికతత్త్వం – మతసామరస్యం, 18) ప్రజాస్వామ్య విలువలపట్ల గౌరవం. వీటిలో ప్రాథమికస్థాయికి 12 ప్రధాన విలువలు, ఉన్నతస్థాయికి మొత్తం 18 విలువల ఆధారంగా ఒక్కొక్క విలువకు తరగతివారీగా ఉపవిలువలను నిర్ధారించి పాఠాలను పొందుపర్చారు.

విలువలు ప్రధానంగా బోధిస్తే వచ్చేవికావు. ఆచరిస్తే వచ్చేవి. కాబట్టి తరగతి వారీగా రూపొందించిన ఉపాధ్యాయ కరదీపికల్లో సన్నివేశాలు, సంఘటనల ఆధారంగా చర్చించడం, ఆచరించి అనుభవాలు చెప్పడం వంటి కృత్యాలతో కూడిన అభ్యాసాలు ఉన్నాయి. చర్చల ద్వారా వైఖరి నిర్మాణం జరగాలి. ఆచరణ ద్వారా ప్రవర్తనలో మార్పురావాలని ఆశించి పాఠాలను పొందుపరచారు. వీటిని నిర్వహించడం మన బాధ్యత. నిర్వహణతీరుతెన్నులను గురించి "ఉపాధ్యాయులకు సూచనలు" కూడా చేర్చారు. అల్లే విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి.

ఎంత మంచి కరదీపికైనా ఉపాధ్యాయుడికి ధీటుగాదు. ఉపాధ్యాయుడు తాను ఆదర్శంగా ఉంటూ విలువలను పెంపొందించడానికి కృషి చేయాలి. ప్రణాళికాబద్ధంగా తరగతి వారీగా రూపొందించిన కరదీపికల ఆధారంగా బోధనాభ్యసన ప్రక్రియలు నిర్వహించాలి. మన రాజ్యాంగం పీఠికలో పేర్కొన్నవిధంగా ఉన్నతమైన విలువలు, వైఖరులుకల్గిన హేతుబద్ధమైన పౌరులుగా ఎదగడానికి ఉపాధ్యాయులుగా మనవంతు కృషిచేయాలి. ఈ కరదీపికలోని అంశాలు మీకు కొంతమేరకు దిశానిర్దేశం చేస్తాయి. వీటికే పరిమితం కాకుండా అదనపు అంశాలు కూడా సేకరించవచ్చు. వినియోగించవచ్చు. విలువలతో కూడిన సమాజ నిర్మాణానికి మన ఈ చిన్న ప్రయత్నం గోరంతదైనా ఇది కొండంత వెలుగునిస్తుందనే విశ్వాసంతో ప్రయత్నిద్దాం. ఫలితాలు సాధిద్దాం!

**సంచాలకులు**
రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

**యత్కర్మకుర్వతోఽ స్యస్యాత్, సరితోషోఽ ం తరాత్మనః**
**తత్ ప్రయత్నేన కుర్వీత, విపరీతం తు వర్జయేత్ – మనుస్మృతి**

**ఏపని చేస్తే అంతరాత్మకు సంతృప్తి కలుగుతుందో, ఆపనులే చేయాలి. దానికి విపరీతమైన పనులు చేయకూడదు.**

## రూపొందించినవారు

**శ్రీ సువర్ణ వినాయక్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ టి.వి.ఎస్.రమేశ్,** కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ శ్రీనివాసుల రఘురాం,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., గ్రంథసిరి, గుంటూరు జిల్లా.

**శ్రీ ఎల్.ఎం.ప్రసాద్,** ఉపాధ్యాయుడు, ప్ర.ఉ.పా., సి.పి.ఎల్, అంబర్‌పేట్, హైదరాబాదు.

**శ్రీ పసుల ప్రతాప్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా.గిమ్మ, జైనత (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ బలగం రామ్మోహన్,** ఉపాధ్యాయుడు, ప్రా.పా., రవీంద్రపూర్, ముథోల్ (మం), ఆదిలాబాద్ జిల్లా.

**శ్రీ నందిగామ కిశోర్‌కుమార్,** తెలుగు పండితులు, జి.ప.ఉ.పా., ఇప్పటూరు, మహబూబ్‌నగర్ జిల్లా.

**శ్రీమతి కె.ఆర్.టి.ఎల్. జ్యోతిర్మయి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి యు. బుగ్గమ్మ,** తెలుగు పండితులు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీమతి వంగీపురం స్వర్ణలత,** ఉపాధ్యాయిని, జి.ఉ.పా., పాతపట్టిసం, పోలవరం, పశ్చిమగోదావరి జిల్లా.

**శ్రీమతి అగుదూరి సరళమ్మ,** ఉపాధ్యాయిని, ప్రా.పా., చెర్లోపల్లి, చిత్తూరు జిల్లా.

**శ్రీమతి పల్లి మాధవి,** తెలుగు పండితులు, భారతీయ విద్యాభవన్, ఆత్మకూరి రామారావు పాఠశాల, జూబ్లీహిల్స్, హైదరాబాదు.

**శ్రీమతి జి. సరళాదేవి,** ఉపాధ్యాయిని, ప్రా.పా, గంగాపూర్, మహబూబ్‌నగర్

## సహకరించినవారు

**డా॥ రమాదేవి,** ఉపన్యాసకురాలు, ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.
**శ్రీ వొజ్జల శరత్‌బాబు,** తెలుగు పండితులు, సీతాఫల్‌మండి, హైదరాబాదు.
**డా॥ దోనేపూడి నరేశ్ బాబు,** తెలుగు పండితులు, జి.ఉ.పా., గోస్పాడు, కర్నూల్ జిల్లా.
**శ్రీ దోరవేటి చెన్నయ్య,** సూల్ అసిస్టెంట్, జగద్గిరినగర్, రంగారెడ్డి జిల్లా.
**శ్రీ రామక విఠల్‌శర్మ,** ఉపాధ్యాయుడు, కరీంనగర్ జిల్లా.
**డా॥ గుడిసేవ విష్ణుప్రసాద్,** స్కూల్ అసిస్టెంట్, కృష్ణా జిల్లా.
**శ్రీ కలమట సోమేశ్వరరావు,** ఉపాధ్యాయుడు, శ్రీకాకుళం జిల్లా.
**శ్రీ దివ్వెల చిన్నారావు,** తెలుగుపండితులు, విజయనగరం జిల్లా.
**శ్రీ అయ్యగారి శ్రీనివాసరావు,** స్కూల్ అసిస్టెంట్, విజయనగరం జిల్లా.

**ముఖచిత్రం - డిజైనింగ్**
**కె.సుధాకరాచారి,**
SGT, UPS,
నీలకుర్తి, వరంగల్

## విషయనిపుణులు, ఎడిటింగ్

**డా॥ఎన్.ఉపేందర్‌రెడ్డి,**
ప్రొఫెసర్, విద్యాప్రణాళిక విభాగాధిపతి,
ఎస్.సి.ఇ.ఆర్.టి., హైదరాబాదు.

**శ్రీ సువర్ణ వినాయక్,**
కోఆర్డినేటర్, ఎస్.సి.ఇ.ఆర్.టి.,
హైదరాబాదు.

## సలహాదారులు

**శ్రీ జి.గోపాల్‌రెడ్డి,**
పూర్వ సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

**శ్రీ ఎస్.జగన్నాథరెడ్డి,**
సంచాలకులు, రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణ సంస్థ,
తెలంగాణ, హైదరాబాదు.

# కృతజ్ఞతలు

**"విలువల విద్య - జీవననైపుణ్యాలు"** కరదీపిక / వాచకాలను రూపొందించడంలో తమ అమూల్యమైన సలహాలు, సూచనలు అందజేసి అవసరమైన సామగ్రిని ఇచ్చి ప్రోత్సహించిన పెద్దలకు, ఆయా సంస్థలకు రాష్ట్ర విద్యా, పరిశోధన, శిక్షణ సంస్థ, పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు.

**సలహాలు, సూచనలిచ్చినవారు :**

**శ్రీ శిఖికంఠానంద,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**శ్రీ కె.ఆర్.వేణుగోపాల్,** విశ్రాంత ఐ.ఎ.ఎస్., అధికారి, హైదరాబాదు.

**శ్రీ వాసగిరి లక్ష్మీనారాయణ,** ఐ.పి.ఎస్., కమీషనర్ ఆఫ్‌పోలీస్, థానే, మహారాష్ట్ర.

**డా॥ వి.బ్రహ్మారెడ్డి,** ప్రజావైద్యశాల, కర్నూలు జిల్లా.

**శ్రీ దూస రామకృష్ణ,** ఉపాధ్యక్షులు, విద్యాభారతి, అఖిలభారతీయ శిక్షాసంస్థాన్, న్యూఢిల్లీ మరియు సంచాలకులు, విజ్ఞానవిహార్, గడిలోవ, విశాఖపట్టణం.

**శ్రీ రావుల సూర్యనారాయణ,** తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్నాటక రాష్ట్రాల శైక్షణిక ప్రముఖ, సరస్వతి విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.

**శ్రీ ఫాదర్ పల్లిదానం,** సంచాలకులు, పీపుల్స్ ఆక్షన్ ఫర్ రూరల్ అవేకనింగ్ (PARA), రావులపాలెం, తూ.గో.జిల్లా.

**శ్రీ సుదర్శనాచార్య,** జాతీయ సంధానకర్త, లీడ్ ఇండియా సంస్థ, హైదరాబాదు.

**శ్రీమతి పోరూరి కృష్ణకుమారి,** ప్రజ్ఞ, కో-ఆర్డినేటర్, వికాస తరంగిణి, జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, హైదరాబాదు.

**శ్రీ ప్రేమ్‌కుమార్‌సింగ్,** రామకృష్ణమఠం, హైదరాబాద్.

**డా॥ పి.జయధీర్ రెడ్డి,** విశ్రాంతప్రధానాచార్యులు, జిల్లా విద్యా శిక్షణ సంస్థ, కరీంనగర్.

**శ్రీ రవీందర్,** కో-ఆర్డినేటర్, వందేమాతరం సంస్థ, వరంగల్ జిల్లా.

**శ్రీ కె.మాధవరెడ్డి,** వందేమాతరం సంస్థ, మహబూబ్‌నగర్ జిల్లా.

**సహకరించిన సంస్థలు :**

- జియ్యర్ ఎడ్యుకేషన్ ట్రస్టు, హైదరాబాదు.
- రామకృష్ణమఠం, హైదరాబాదు.
- సత్యసాయి విద్యాసంస్థలు, హైదరాబాదు.
- బ్రహ్మకుమారీ సంస్థ, హైదరాబాదు.
- వందేమాతరం సంస్థ, వరంగల్, మహబూబ్‌నగర్.
- ఈనాడు, నమస్తే తెలంగాణ, ఆంధ్రజ్యోతి, సాక్షి, దినపత్రికలు.
- శ్రీ సరస్వతీ విద్యాపీఠం, బండ్లగూడ, హైదరాబాదు.
- ఎమెస్కో పబ్లిషింగ్ సంస్థ, హైదరాబాదు.
- జాతీయ విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్.సి.ఇ.ఆర్.టి.), న్యూఢిల్లీ.
- శ్రీ సీతారామ సేవాసదన్, మంథని, కరీంనగర్ జిల్లా.

పైన తెల్పిన వ్యక్తులు, సంస్థలతోపాటు పరోక్షంగా కూడా సహకరించిన వ్యక్తులకు, సంస్థలకు, వాచకాలు / కరదీపికల రూపకల్పనలో పాల్గొన్న ఉపాధ్యాయులు, ఉపన్యాసకులు, విషయనిపుణులు, ఎడిటింగ్ చేసిన వారందరికీ ప్రత్యేక ధన్యవాదాలు. **విలువల విద్య - జీవన నైపుణ్యాల** గురించి వాచకం కరదీపికను రూపొందించడంలో ఇది ఒక తొలి అడుగుమాత్రమే! దీన్ని మరింత వృద్ధిపరచుకోవచ్చు. ఇందుకోసం భవిష్యత్తులో కూడా అందరూ సహాయ సహకారాలను ఇలాగే అందిస్తారని ఆశిస్తున్నాం.

**సంచాలకులు**

రాష్ట్ర విద్య, పరిశోధన, శిక్షణసంస్థ, తెలంగాణ, హైదరాబాద్.

# ఉపాధ్యాయులకు సూచనలు

- "విలువల విద్య – జీవన నైపుణ్యాలు" కోసం 1 నుండి 10 తరగతులకు తరగతివారీగా కరదీపికలు రూపొందించారు. వీటిని పిల్లలను ఉద్దేశించి తయారుచేశారు. అనగా వీటిని ఉపాధ్యాయులు బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు, పిల్లలు స్వయం అభ్యసనానికి వినియోగించవచ్చు.
- ఒక విద్యా సంవత్సరంలో పాఠశాల విద్యాశాఖ సబ్జక్టువారీగా కేటాయించిన పీరియళ్ళ భారత్వం ప్రకారం తరగతి వారీగా పాఠాలు పొందుపర్చారు.
- 6 నుండి 10 తరగతులకు వారానికి 48 పీరియళ్ళు ఉంటాయి. వీటిలో ఒక్కొక్క సబ్జక్టుకు కింది విధంగా భారత్వం ఉంటుంది.

| | | | | | |
|---|---|---|---|---|---|
| ప్రథమ భాష | – | 6 పీరియళ్ళు | సాంఘికశాస్త్రం | – | 6 పీరియళ్ళు |
| ద్వితీయ భాష | – | 3 పీరియళ్ళు | విలువలవిద్య, జీవననైపుణ్యాలు | – | 2 పీరియళ్ళు |
| తృతీయ భాష | – | 6 పీరియళ్ళు | శారీరక, ఆరోగ్యవిద్య | – | 3 పీరియళ్ళు |
| గణితం | – | 8 పీరియళ్ళు | కళలు, సాంస్కృతికవిద్య | – | 3 పీరియళ్ళు |
| భౌతిక, రసాయన శాస్త్రం | – | 4 పీరియళ్ళు | పని, కంప్యూటర్ విద్య | – | 3 పీరియళ్ళు |
| జీవ శాస్త్రం | – | 4 పీరియళ్ళు | **మొత్తం** | – | **48 పీరియళ్ళు** |

- విలువల విద్య, జీవన నైపుణ్యాల గురించి బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణకు ప్రాథమికస్థాయిలో వారానికి 1 పీరియడ్, ఉన్నతస్థాయిలో వారానికి 2 పీరియళ్ళు ఉన్నందున, ఇందుకనుగుణంగానే పాఠాలను పొందుపర్చారు.
- ప్రాథమిక స్థాయిలో 12 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్కదానికి ఒకటి చొప్పున 12 పాఠాలు ఉన్నాయి. అట్లే ఉన్నత స్థాయిలో 18 ప్రధాన విలువల ఆధారంగా ఒక్కొక్క దానికి ఒక పాఠం చొప్పున 18 పాఠాలు ఉన్నాయి.
- వీటితోపాటు విలువలను పెంపొందించడానికి తోడ్పడేలా పద్యాలు, కథలు, గేయాలు, పాటలు అదనంగా చేర్చారు. 3వ తరగతి నుండి స్ఫూర్తిదాతలను కూడా చేర్చారు.
- విలువల విద్య – జీవన నైపుణ్యాలను పాఠాలలో సగటున ఒక పాఠానికి 3 పీరియళ్ళు అవసరమౌతాయి.
- ఒక పాఠంలోని విషయం అమరిక కింది విధంగా ఉంటుంది.

  ●) పాఠం పేరు, ●) ప్రధానవిలువ, ●) ఉపవిలువ, ●) ఆశించేఫలితాలు / లక్ష్యాలు, ●) ఉపోద్ఘాతం, ●) విషయం – సన్నివేశాలు / సంఘటనలు / కథనాలు, ●) అభ్యాసాలు – 'ఆలోచించడం – ప్రతిస్పందించడం', 'తరగతి కృత్యం – జట్టుపని', 'ఆచరించడం – అనుభవాలు చెప్పడం', ●) సూక్తి.
- విలువల విద్య, జీవన నైపుణ్యాలలోని అంశాలు ప్రధానంగా చర్చింపజేయడానికి ఉద్దేశించినవి. ఆచరించి అనుభవాలు చెప్పించడానికి ప్రాధాన్యతనిచ్చారు. కాబట్టి వీలైనంతమేరకు వీటిని రాయించకూడదు.
- **ఆలోచించడం – ప్రతిస్పందించడం**లోని ప్రశ్నల ద్వారా తరగతిలో చర్చ నిర్వహించాలి. ఆ తర్వాత **'తరగతి కృత్యం – జట్టుపని'** నిర్వహించాలి. అట్లే **'ఆచరించండి – అనుభవాలు చెప్పండి'**లోని అంశాలను ఆచరింపజేసేలా చేసి పిల్లలతో వారి అనుభవాలు, అనుభూతులను చెప్పించాలి.
- మిగతా సబ్జక్టులవలెనే **విలువల విద్య – జీవన నైపుణ్యాల**ను కూడా మూల్యాంకనం చేయాలి. వీటిని సంగ్రహాత్మక మూల్యాంకనం సందర్భంగా చేయాలి. అనగా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మూల్యాంకనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం పరీక్షలు నిర్వహించకూడదు. పిల్లల్ని పరిశీలించడం, వారి అనుభవాలు, ఆచరణ, ప్రవర్తన, విలువలు మొదలగు వాటి ఆధారంగా మూల్యాంకనం చేయాలి.
- దీని మూల్యాంకనాన్ని 50 మార్కులకు నిర్వహించాలి. **విలువల విద్య – జీవన నైపుణ్యాలు** ఆధారంగా పిల్లల్లో విద్యాప్రమాణాలు సాధించాలి. అవి 1) మంచి, చెడు విచక్షణ జ్ఞానాన్ని ప్రదర్శించడం, సత్ప్రవర్తనకల్గి ఉండడం, 2) రాజ్యాంగ విలువలు పాటించడం, 3) వ్యక్తిగత విలువలు అనగా సహనం, దయ, సానుభూతి, తదానుభూతి

మొదలగునవి కల్గి ఉండడం, 4) జీవన నైపుణ్యాలు కల్గి ఉండడం, 5) ఉపాధ్యాయులు, పెద్దలు, సమాజం, ప్రభుత్వ ఆస్తుపట్ల సరైన వైఖరులు కల్గి ఉండడం.

- ♦ పైన తెల్పిన విద్యాప్రమాణాలను ఆయా పాఠాల ఆధారంగా పరిశీలించాలి. వీటిని సాధించడానికి అనుగుణంగానే ప్రధాన విలువకు సంబంధించిన పాఠాలు తరగతుల వారీగా ఉన్నాయి. ఒక్కొక్క సామర్థ్యానికి 10 మార్కుల చొప్పున 50 మార్కులకు నిర్వహించాలి. అనగా పరిశీలించి మార్కులు కేటాయించాలి.
- ♦ పిల్లల ప్రగతిని పరిశీలించి గ్రేడింగ్ నమోదుచేయాలి.

  A1 - 91%

  A2 - 71% - 90%

  B1 - 51% - 70%

  B2 - 41% - 50%

  C - 0 - 40%
- ♦ పిల్లల ప్రగతిని గురించి గ్రేడింగ్ నమోదు చేసినప్పుడు వాటికి సంబంధించిన గుణాత్మక రిమార్కులు కూడా నమోదుచేయాలి.
- ♦ బోధనాభ్యసన ప్రక్రియల నిర్వహణ విధానం - ప్రాథమిక స్థాయి

**మొదటి పీరియడ్** :
- ఉపోద్ఘాతం గురించి తెలియజేయాలి.
- పాఠానికి సంబంధించిన విషయంలోని సన్నివేశాలు / సంఘటనలు / కథనాలను ఒకరితో చదివించాలి. లేదా చెప్పాలి.
- 'ఆలోచించండి - ప్రతిస్పందించండి' లోని ప్రశ్నల ఆధారంగా తరగతిలో చర్చ నిర్వహించాలి.

**రెండవ పీరియడ్** :
- **'తెలుసుకోండి'**లోని విషయాన్ని గురించి పిల్లలకు చెప్పాలి లేదా ఒకరితో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- **'తరగతి కృత్యం - జట్టుపని'**ని తరగతిలో పిల్లలను జట్లుగా విభజించి నిర్వహించాలి.
- ఒక్కొక్క జట్టువారు చేసిన పనులను ప్రదర్శించాలి.
- **'ఆచరించండి - అనుభవాలు చెప్పండి'** లోని అంశాలను ఇంటివద్ద ఆచరించమని చెప్పాలి.

**మూడవ పీరియడ్** :
- పుస్తకం చివర ఉన్న 'అనుబంధం'లో చేర్చిన కథ / పాట / పద్యం / శ్లోకం / స్ఫూర్తిదాతల గురించి తరగతిలో పిల్లలతో చదివించాలి. చర్చద్వారా అవగాహన కల్పించాలి.
- ఆ తరవాత **'ఆచరించండి - అనుభవాలు చెప్పండి'** గురించి ఒక్కొక్కరితో మాట్లాడించాలి.
- పాఠం చివర ఉన్న సూక్తి గురించి తెలియజేయాలి.

- ♦ పాఠశాలలో **'విలువల విద్య - జీవన నైపుణ్యాలు'** పుస్తకాలను పిల్లలకు కూడా ఇవ్వవచ్చు. గ్రంథాలయ పీరియడ్ సమయంలో లేదా భోజన విరామ సమయంలో కూడా పిల్లలకిచ్చి చదువుకోమని చెప్పాలి.
- ♦ 'విలువల విద్య - జీవన నైపుణ్యాలు' లోని సన్నివేశాలు, సంఘటనలు, సూక్తులు, పద్యాలు, శ్లోకాలు, కథలు, స్ఫూర్తిదాతల వంటి ఇతర అంశాలు కూడా సేకరించి తెలియజేయవచ్చు. వాటి ఆధారంగా కూడా చర్చ నిర్వహించడం, జట్టుపనులు చేయించడం, 'ఆచరించండి - అనుభవాలు చెప్పండి' వంటివి నిర్వహించవచ్చు.
- ♦ పాఠశాల గ్రంథాలయంలోని పుస్తకాలు, మ్యాగజైన్లు, వార్తాపత్రికలు వంటి వాటిని వినియోగించాలి.
- ♦ విద్యార్థులకు సూచనలు కూడా ఉన్నాయి. వీటిని మొదటి పీరియడ్‌లోనే చదివి వినిపించాలి. వీటి గురించి అర్థం చేయించాలి. ఆ ప్రకారం పిల్లలు నడుచుకొనేలా చూడాలి.

# విద్యార్థులకు సూచనలు

- పిల్లలూ! **'విలువల విద్య - జీవన నైపుణ్యాలు'** పుస్తకం మీకోసమే రూపొందించి పాఠశాలలకు పంపారు.
- వీటిలోని పాఠాలు, పద్యాలు, కథలు, శ్లోకాలు, పాటలు, స్ఫూర్తిదాతల గురించి మీకు మీ ఉపాధ్యాయులు బోధిస్తారు. లేదా మీరే చదవండి. ఇతరులకు చెప్పండి, వాటి గురించి చర్చించండి.
- వీటి గురించి మీకు వారానికి ఒకరోజు బోధిస్తారు.
- ఒక పాఠంలోని సన్నివేశాలు, సంఘటనలు గురించి మీలో ఒకరు చదివిన తర్వాత మీ ఉపాధ్యాయుడు, కొన్ని ప్రశ్నలు అడుగుతారు. వీరందరూ ఆ ప్రశ్నలకు ఆలోచించి జవాబులు చెప్పండి. చర్చలో పాల్గొనండి.
- తరగతిలో జట్టు కృత్యాలు నిర్వహిస్తారు. మీరు మీ మిత్రులతోకల్సి జట్టు పనుల్లో పాల్గొనండి. మీరు జట్లలో చర్చించిన విషయాల గురించి తరగతిలో చెప్పండి.
- **'ఆచరించండి - అనుభవాలు చెప్పండి'** అని కొన్ని పనులను మీకు పురమాయిస్తారు. ఆ ప్రకారం మీరు ఆచరించండి. ఆ తరవాత వచ్చే పీరియడ్‌లో ఏం చేశారు? మీకెలా అనిపించిది? దీన్నుండి మీరేమి నేర్చుకొన్నారు? మొదలగు విషయాలను, మీ అనుభవాలను తెలియజేయండి.
- వీటిలోని అంశాలు ఎక్కువగా చర్చించడానికి, ఆచరించి అనుభవాలు చెప్పడానికి ఉద్దేశించినవి కాబట్టి రాయాలని భావించకండి. తప్పనిసరిగా చేయండి.
- మీరు తెల్సుకొన్న, చర్చించిన అంశాల ఆధారంగా వార్తాపత్రికలలో చూడండి. వాటి నుండి సేకరించిన విషయాలు, వార్తలు, వ్యాసాలు, సూక్తులు మొదలగువాటిని తరగతిలో చదివి విన్పించండి. ఆ తరవాత వాటిని తరగతిలోని గోడపత్రికలో ప్రదర్శించండి.
- వీటికి కూడా మూల్యాంకనం ఉంటుంది. ఐతే, వీటికి పరీక్షలు ఉండవు. మీరెలా పాల్గొంటున్నారు? మీ ప్రవర్తన ఎలా ఉంది? మీలో ఏం మార్పువచ్చింది? మొదలగు విషయాలను మీ ఉపాధ్యాయులు పరిశీలించి మార్కులు కేటాయిస్తారు. వాటి ఆధారంగా మీకు గ్రేడింగ్ ఇస్తారు.
- ఇలా ఒక విద్యా సంవత్సరంలో మూడుసార్లు మీ గురించి నమోదుచేస్తారు. మొదటి సంగ్రహణాత్మక, రెండవ సంగ్రహణాత్మక, మూడవ సంగ్రహణాత్మక మూల్యాంకనాలతోపాటు మిమ్మల్ని పరిశీలించి మీ ప్రగతిని గ్రేడుల రూపంలో నమోదుచేస్తారు.
- 10వ తరగతి మెమో / సర్టిఫికెటులో కూడా ఈ వివరాలు ఉంటాయి.
- వంట ఎంత మంచిగా వండినా, దాంట్లో చిటికెడు ఉప్పు లేకుంటే రుచి ఉండదని భాస్కరశతకంలోని పద్యం ఉంది. అట్లే మనం ఎంత చదువుకున్నా, ఎంత మంచి గ్రేడు వచ్చినా, మనలో 'వినయం, సహనం, శీలం, విచక్షణ' లేకుంటే మనకు విలువ ఉండదు. కాబట్టి విలువల విద్య - జీవన నైపుణ్యాలు పాఠాల ద్వారా మీరు గొప్పవారుగా ఎదగాలి.

# విషయసూచిక


| వ.సం. | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 1. | స్వేచ్ఛ | స్వాతంత్ర్యం యొక్క విలువను, ఆవశ్యకతను గుర్తించడం | స్వాతంత్ర్య ఆవశ్యకత | 1 |
| 2. | సంతృప్తిగా జీవించడం | అత్యాశ, దురాశ వినాశనానికి హేతువు అని గ్రహించడం | అత్యాశ అనర్థదాయకం | 7 |
| 3. | శీల నిర్మాణం | క్షమాగుణాన్ని కలిగిఉండడం | క్షమాగుణం | 12 |
| 4. | జీవననైపుణ్యాలు | ఆలోచనా నైపుణ్యాలను కలిగి ఉండడం | మన ఆలోచనలకు పదునుపెడదాం | 17 |
| 5. | బాధ్యతలు నిర్వర్తించడం-కర్తవ్యపాలన | ప్రకృతివైపరీత్యాలు సంభవించినపుడు ప్రతిస్పందించడం | ఆదుకుందాం | 23 |
| 6. | పొదుపు ఆవశ్యకత | ఇంధన వనరుల పొదుపుపై అవగాహనపొందడం | కాపాడండీ...కాపాడండీ | 29 |
| 7. | ఆరోగ్య విలువలు | చక్కని ఆరోగ్యానికి పోషకాహారం, నీరు అవసరం. | పోషకవిలువలను కాపాడుకుందాం | 35 |
| 8. | సంస్కృతి-సంప్రదాయాలు | ఆచారాలు, వాటి శాస్త్రీయతను అవగాహన చేసుకోవడం | మన ఆచారాలు | 47 |
| 9. | పర్యావరణ-పరిరక్షణ | భూకాలుష్య నివారణ గురించి అవగాహన కలిగించడం | భూకాలుష్యాన్ని నివారిద్దాం | 52 |
| 10. | శాస్త్రీయ దృక్పథం | కార్యకారణ సంబంధాలను తెలుసుకోవడం | కారణాలు తెలుసుకుందాం | 57 |
| 11. | న్యాయం | తాము జీవిస్తూ ఇతరులు జీవించేలా చూడడం | జీవించు-జీవించనివ్వు | 61 |
| 12. | శాంతి, అహింస సౌందర్యాత్మక స్పృహ | శాంతి - ప్రశాంత కుటుంబం | ప్రశాంత కుటుంబం | 64 |

| వ.సం. | ప్రధాన విలువ | నేర్పవలసిన విలువ | పాఠ్యాంశం | పేజీ |
|---|---|---|---|---|
| 13. | శ్రమవిలువ | శ్రమ విభజన - శ్రమదోపిడి | శ్రమను పంచుకుందాం | 68 |
| 14. | సేవాభావం | సమాజానికి సేవచేయడం | సమాజసేవ | 73 |
| 15. | సమానత్వం, సోదరభావం స్త్రీల పట్ల గౌరవం | వివక్షత ఉండకూడదని గ్రహించడం | వివక్షత | 78 |
| 16. | జాతీయ భావన-దేశభక్తి | దేశ సంస్కృతి గొప్పదనాన్ని గుర్తించడం | దేశ సంస్కృతిని కాపాడుదాం | 82 |
| 17. | లౌకికత్వం-మతసామరస్యం | అన్ని మతాలను గౌరవించడం | అన్నిమతాలను గౌరవించడం | 87 |
| 18. | ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం | హక్కులతోపాటు, మన బాధ్యతలను తెలుసుకోవడం, పాటించడం | హక్కులను తెలుసుకోవడం | 91 |


## అనుబంధాలు


1. శ్లోకాలు 99
2. పద్యాలు 101
3. పాటలు / గేయాలు 105
4. కథలు 116
5. స్ఫూర్తిదాతలు 131

# 1 స్వాతంత్ర్యం ఆవశ్యకత

**I. ప్రధాన విలువ**

స్వేచ్ఛ

**II. ఉప విలువ**

*స్వాతంత్ర్యం యొక్క విలువను, ఆవశ్యకతను గుర్తించడం.*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- *స్వాతంత్ర్యపు ఆవశ్యకతను తెలుసుకొని కాపాడుకుంటారు.*

**IV. ఉపోద్ఘాతం**

పక్షిని పంజరంలో బంధించిపెట్టి ఉంచి ఒకసారి పంజరంలోంచి విడిచిపెడితే దాని స్వేచ్ఛా ప్రపంచంలో అది విహరించినపుడు అది పొందే ఆనందం అనిర్వచనీయం. బానిస బతుకు నుండి, చీకటి బతుకునుండి విముక్తి పొందినపుడు ఆ జీవుల స్వతంత్రతను లెక్కపెట్టలేం. స్వేచ్ఛాగా ఊపిరి పీల్చుకుని స్వేచ్ఛగా బతికే హక్కు భూమిపై ప్రతి జీవరాశికి ఉంది. అందుకే ఎక్కడైనా దురాక్రమణ చేసుకొని ప్రజలని బానిసలుగా చూడడం జరిగితే ఎదురొడ్డి పోరాడి స్వాతంత్ర్యాన్ని తెచ్చుకుని స్వేచ్ఛగా బతుకుతున్న ప్రజలను అడిగితే స్వాతంత్ర్యం యొక్క విలువ మనకు తెలుస్తుంది. అందుకే మనుషులందరూ స్వేచ్ఛను కోరుకుంటారు. స్వేచ్ఛగా బతకడం మన హక్కు. అటువంటి స్వతంత్రత పొందడానికి ప్రజలు ఎన్ని కష్టాలుపడ్డారో, ఎంతమంది తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడారో తెలుసుకుంటే మనకు స్వాతంత్ర్యపు విలువ అర్థం అవుతుంది.

## V. విషయం

### సంఘటన-I

బ్రిటీష్‌వాళ్ళు భారతదేశాన్ని పరిపాలిస్తున్న రోజులవి. భారతదేశ ప్రజలందరినీ బానిసలుగా చూస్తూ వాళ్ళకున్న హక్కులను కాలరాస్తూ, అన్యాయంగా ప్రవర్తిస్తూ, ఎదిరించిన వారిని చితకబాది జైళ్ళల్లో పడేసేవారు. మాట్లాడే స్వేచ్ఛ లేదు. ప్రశ్నించే స్వేచ్ఛలేదు ఇది చేయను అనడానికి లేదు. ఎవరైనా ఎదురుతిరిగితే అణగదొక్కేయడమే. అలాంటి రోజులలో భారత స్వాతంత్ర్యంకోసం ఎందరో వీరులు నడుంకట్టి ప్రజలందరినీ ఉత్తేజపరిచారు. స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపారు. బ్రిటీష్‌వాళ్ళను తరిమికొట్టారు. స్వాతంత్ర్యం సాధించారు. ఆరోజు భారతీయులందరూ స్వేచ్ఛా వాయువులను పీల్చుకున్నరోజు. తమకు లభించిన స్వాతంత్ర్యానికి సంబరాలు చేసుకున్న రోజు.

### సంఘటన-II

దక్షిణాఫ్రికా దేశంలో 75% మంది నల్లజాతివారు ఉన్నారు. 25% తెల్లజాతీయులు వీరిని బానిసలుగా చూసేవారు. నల్లజాతీయులు ఒక ప్రదేశంనుండి మరొక ప్రదేశానికి వెళ్ళరాదు. ఉద్యోగం కోసమైనా, నివాసం కోసమైనా ఎక్కడికీ వెళ్ళకూడదు. వీళ్ళచేత పని బాగా చేయించుకునే వారు జీతం తక్కువ ఇచ్చేవారు. వీళ్ళ ఆస్తులంతా తెల్లజాతీయులే ఆక్రమించుకునేవారు. అంతేకాదు వీళ్ళని జైల్లోపెడితే విచిత్రంగా వీళ్ళు మాయమయ్యేవారు. ఇలా మాయమైన వాళ్ళచేత అత్యంత ప్రమాదకరమైన గనులలో బలవంతంగా పనిచేయించేవారు. నెల్సన్ మండేలా ఈ నల్లజాతి వారి కోసం పోరాడాడు. దీనికొరకు ఆయన 28 సం॥ జైళ్ళలో ఉండవలసి వచ్చింది. నల్లవారంతా ఏకమై తెల్లవారిని వ్యతిరేకించారు. - 1994వ సం॥లో. మండేలా కృషి ఫలించింది. నల్లజాతీయులకు స్వాతంత్ర్యం వచ్చింది. నెల్సన్ మండేలా దక్షిణాఫ్రికా దేశాధ్యక్షుడుగా ఎంపిక అయ్యాడు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై రెండు సంఘటనల ద్వారా మీకు ఏమి అర్థమైంది?
2. స్వాతంత్ర్యం ఎందుకు అవసరం? మనకు స్వాతంత్ర్యం రాకముందు పరిస్థితులు ఎలా ఉండేవో చెప్పండి. అప్పటికి, ఇప్పటికి ఏమి తేడా గమనించారు?
3. ప్రజలు స్వేచ్ఛను ఎందుకు కోరుకుంటారు? దానివల్ల మనకు కలిగే ప్రయోజనం ఏమిటి?
4. మన దేశంలో మనకు స్వేచ్ఛ లేకుండా ఇతర దేశస్థులు మనల్ని పరిపాలించడం వల్ల మనకు కలిగే నష్టాలు ఏమిటి?
5. ప్రజలకు స్వతంత్రతే లేకపోతే ఎలా ఉంటుందో ఊహించండి?

6. స్వాతంత్ర్యం విలువ కిందివారిని అడిగితే తెలుస్తుంది. నిజమేనా?

- జైలునుండి బయటకి వచ్చిన ఖైదీని.
- వెట్టిచాకిరీ చేస్తున్న బాలబాలికలను
- అపహరింపబడి రవాణా చేయబడుతున్న బాలబాలికలను
- గృహహింస అనుభవిస్తున్న మహిళలను
- ప్రైవేటు పాఠశాలలో ఉదయం 7 గం॥ల నుండి రాత్రి 7 గం॥ వరకు ఉండే విద్యార్థులను

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మనకు స్వాతంత్ర్యం రాకముందు, వచ్చిన తర్వాత ప్రజల జీవనవిధానం ఎలా ఉందో తెలుసుకొని రండి. మీ అభిప్రాయాలను చెప్పండి.
- మనకు స్వాతంత్ర్యం లభించింది కదా! దానివల్ల ఏఏ సౌకర్యాలు మనం పొందుతున్నామో జాబితా తయారు చేయండి. వాటి గురించి చర్చించండి.

## VII. తెలుసుకోండి

### స్వాతంత్ర్యం వచ్చింది

స్వాతంత్ర్యం వచ్చింది గాని - దేశం విభజించబడినది. మూడు ముక్కలైంది.

సైనిక తిరుగుబాటులో విప్లవాగ్ని దేశవ్యాప్తంగా ప్రజ్వరిల్లింది. ఆంగ్లేయులు భారతదేశం నుండి పారిపోవాలని నిర్ణయించుకొన్నారు. వెళ్తూ వెళ్తూ ఈ దేశానికి తీరని ద్రోహం తలపెట్టి వెళ్ళారు.

ఇంగ్లాండులో ప్రధాని అట్లీ భారతదేశానికి స్వాతంత్ర్యమిస్తున్నట్లు ప్రకటించాడు. స్వాతంత్ర్య సమరంలో మన విజయాన్ని సూచించే ప్రకటన ఇది. భారతీయులకు అధికారం ఏవిధంగా అప్పగించాలో అట్టి ఏర్పాటు చేయటానికి మౌంట్‌బాటన్ భారతదేశం వచ్చాడు. అతడు ఒక పథకంతో భారతదేశం చేరాడు.

అప్పుడు భారతదేశం పరిస్థితి చాలా క్లిష్టంగా ఉంది. దేశంలో హింసాత్మక వాతావరణాన్ని ముస్లింలీగ్ బుద్ధి పూర్వకముగా నిర్మిస్తూ ఉంది. దేశ విభజనకు బెంగాల్, పంజాబులలో ఆందోళన ప్రారంభించారు. హిందూదేశం అఖండంగా ఉండడం కోసం, ఆర్థిక, ధార్మిక, చారిత్రక, సాంస్కృతిక, సైనిక దృక్కోణముల నుండి కారణాలు చూపి జిన్నా మనసు మార్చ ప్రయత్నించారు భారత నాయకులు. కాని జిన్నా మొండిపట్టు వదలలేదు. ముసల్మానులకు పాకిస్తాన్‌ను ప్రత్యక్షంగా పంచి ఇచ్చే ఆంగ్లశక్తి ఆయన వెనుక ఉంది.

అతడెందుకంగీకరిస్తాడు? మౌంట్ బాటన్ దేశ విభజనకు ప్రకటన చేశాడు. దానితో హిందూదేశ సమైక్య స్వరూపము విచ్ఛిన్నమైంది. ఆ ప్రకటన మీద దేశ విభజనకు సమ్మతిస్తూ జిన్నా, నెహ్రూలు సంతకం చేశారు. ఇది భయంకరమైన, ఘోరమైన దేశద్రోహం. భారతమాత విముక్తి కోసం మనం వందల సంవత్సరాలు సమరం సాగించాం. కాని హిందూ దేశ సమగ్ర సుందర స్వప్నాన్ని దర్శిస్తున్న కల ఆనాటితో కరిగిపోయింది. రాష్ట్ర ద్రోహులుగా వ్యవహరించిన కొందరు ముస్లిముల ముందు మనం తలవంచాము. దేశాన్ని ముక్కలు చేసి స్వాతంత్ర్యం తెచ్చుకోవలసిన స్థితి దాపురించింది. గాంధీజీ "ఇది ఏమి స్వరాజ్యం?" అని వాపోయారు.

1947 ఆగష్టు 14, 15వ తేదీల మధ్య రాత్రి పన్నెండు గంటలకు భారతదేశం స్వతంత్రమైంది. అఖండభారతం హిందూస్తాన్, పాకిస్తానులుగా ఖండించబడింది. హిందూదేశం మీద ఇంగ్లండు పెత్తనం ముగిసింది. త్రివర్ణపతాకం దుఃఖం లోనే అయినా సగర్వంగా లాల్‌ఖిల్లాపై రెపరెపలాడింది. ఇప్పుడు దానికి చెందిన గంగా-యమునలు స్వతంత్రమైనాయి.

ఈ స్వాతంత్ర్యంలో శత శరత్తుల పుణ్యఫలం లభించింది. హుతాత్ముల బలిదానం ఫలించింది. భారత స్వాతంత్ర్య చరిత్రలో సువర్ణాక్షర లిఖిత క్షణమిది. "ఖడ్గము - కమలము - పౌరుషము - పవిత్రత" ఈ క్షణంలో సగర్వంగా తలలు పైకెత్తినాయి.

1947 ఆగష్టు 15 శుభదినాన మనదేశం స్వతంత్రమైంది. కుటిల రాజనీతి ఉన్మత్త ఖడ్గ శక్తితో ఢిల్లీ సింహాసనం అధిష్టించిన బ్రిటీషు సామ్రాజ్య శక్తి భయభ్రాంతమై దేశం వదలిపోయింది. ఈ సంఘటనను శరీరం పులకరించేలా వర్ణించాడు సావర్కర్.

"కత్తి బలంతో సామ్రాజ్యాన్ని జయించి, కత్తి బలంతోనే పరిపాలిస్తానని మదోన్మత్తమై గర్జించిన బ్రిటీషు సామ్రాజ్య శక్తి ఏ పడమటి సముద్రం నుండి హిందూదేశంపైకి దండెత్తి వచ్చి ఏ ఢిల్లీ సింహాసనమునధిష్టించిందో, ఆ ఢిల్లీ సింహాసనం నుండి దానిని క్రిందకి పడలాగి, దాని గర్విష్ఠి గర్జనలను తుత్తునియలు చేసి మరల అదే పడమటి సముద్రం వరకు దానిని తరిమి ఆ పడమటి సముద్రంలోనే ముంచివేశాం. పరాజితులైన ఆంగ్లేయులు తలలు వంచుకొని మనకు వెన్ను చూపి ఆ పడమటి సముద్రం దాటి వెళ్ళడం మనము కళ్లారా చూశాం. "ఈ భావావేశమెంత స్ఫూర్తిమంతం! అర్థవంతం! స్వాభిమాన పూరితం!

ఈ క్షణం కోసం మన పూర్వులు ఎడతెరిపిలేకుండా వందల సంవత్సరాలు సంగ్రామం నడిపారు. రణయజ్ఞం నిరంతరం ప్రజ్వలిస్తూ ఉండునట్లు చూశారు. రణచండి కోరినవానినన్నింటిని సమర్పించారు. ఈ ఉగ్రసాధన వారెందుకు చేశారు? హౌతాత్మ్యమనే అభీల జ్వాలలను వారెందుకు కౌగిలించుకొన్నారు? "స్వవంశాన్ని నశింపజేసుకొనియైనాసరే అఖండ వంశంతో జీవిస్తాం" అనే ప్రేరణ వారికిచ్చిందెవరు? విప్లవ వేదిక మీద అర్పించడానికి మేము మా యౌవన సుగంధాన్ని తెచ్చాము అనే సమర్పణ భావనను వారిలో మేల్కొలిపిందెవరు?

ఆవంతైన వెనుకంజ వేయని వజ్రకఠోరత వారిలో నింపిందెవరు? ఈ విషయాలన్నిటి యథార్థజ్ఞానం పొందడానికే మనం భారత స్వాతంత్ర్య సమర చరిత్రను పరిచయం చేస్తున్నాం.

ఇంత తీవ్ర ప్రయత్నాల ద్వారా, అపారమైన కష్టాల ద్వారా మనం సంపాదించుకున్న స్వాతంత్ర్యం ఒక మహాధర్మానికి ప్రాథమిక సాధనం. 'కృణ్వంతో విశ్వమార్యమ్' అన్నది మన అచంచల ఆదర్శం.

ఐదువేలు - కాదు, వేలవేల సంవత్సరాల అఖండ సమర సంస్కృతి మనది. నరుని నారాయణుని చేయడానికి ఆశావాదాన్ని, వ్యక్తిలో అణచరాని చైతన్యాన్ని నిర్మాణం చేసే స్ఫూర్తి కేంద్రం మన హిందూధర్మం. శ్రీరామచంద్రప్రభువు, శ్రీకృష్ణభగవానుడు, యుగపురుషుడు శివాజీ మహారాజు వంటి తేజోమూర్తుల పరంపర మనది. ఈ పరంపర, ఈ సంస్కృతి, ఈ భూమి పరమవైభవశాలి కావడానికి 'కర్తవ్యం కోసం కర్తవ్యం, శీలం కోసం శీలం' అనే ఉజ్జ్వల భారతీయ, ఆధ్యాత్మిక జీవన దృష్టి సర్వమానవులలో ఉదయింపజేయడానికి మనవారీ స్వాతంత్ర్యం సంపాదించారు. ఇప్పుడీ స్వాతంత్ర్యాన్ని మనం తను, మన, ధనాలు ఒడ్డి సంరక్షించాలి. గ్రీకులు వెళ్ళిపోయారు. హూణులు వెళ్ళిపోయారు. ఆంగ్లేయులూ వెళ్ళిపోయారు. కాని ఇక ముందు మరెవ్వరూ రావడానికి సాహసించలేని పరిస్థితిని మనం నిర్మించాలి.

ఈ పరిస్థితి ఎలా నిర్మింపబడుతుంది? ఎప్పుడెప్పుడు మనలో ఆత్మ విస్మృతి కలుగుతుందో 'స్వ' మరపునకు వస్తుందో అప్పుడే మనం సర్వమూ పోగొట్టుకొన్నాం. ఇకముందు మనం 'స్వ'ను ఎప్పుడు కూడా మరపునకు రానియ్యమని హృదయపూర్వకంగా ప్రతిజ్ఞ తీసుకోవాలి.

మనదేశం భారతదేశం, ఈ భూమే మన పాలన, పోషణ చేస్తుంది. ఈ భూమి అంకసీమ లోనే మనం ఆడుతూ పాడుతున్నాం. ఈ భూమిపై ప్రవహించే నదులు, ఇందలి పర్వతాలు, ఇక్కడి వృక్షలతాదులు, ఇక్కడి వనచరాలు, ఈ భూమిపై ప్రసరించే వాయువీచికలు పరమ పవిత్రమైనవి. ఈ భూమిలోని ప్రతి అణువూ పవిత్రమే. ఈ భూమి నా తల్లి, నేనామె బిడ్డను, బిడ్డ అని పిలిపించుకోగానే మన తల్లి సుఖము కోసము అన్ని పనులు చేయవలసిన బాధ్యత మనదే అవుతుంది. ఆమె పూర్వవైభవాన్ని మరల ఆమెకు సంపాదించి స్వర్గసమానమైన దివ్యలోకానికి చేర్చాలి. ఆ స్వప్నానికి మాతృభూమిలో మనమే రూపురేఖలు దిద్దాలి. సాకారం చేసుకోవాలి. ఆ నిర్భయ వాతావరణం ఆ స్వాభిమాన సంపన్నత, ఆ జ్ఞానపిపాస, ఆ సత్య ప్రియత్వం, ఆ క్రియాశీలత, విజ్ఞానాధిష్ఠితమైన ఆ పూర్వప్రజ్ఞ, ఆ ఉన్నత భావాలు, ఆ సభ్యత, ప్రవర్తన మనమే ఈ భారతంలో నిర్మాణం చేయాలి. అన్ని విషయాలలో మనమీ దేశాన్ని స్వతంత్రము చేయాలి.

నేను దేశం కోసం, నేను సమాజం కోసం అనే భావన మన ప్రతి పనిలో ప్రతిబింబించాలి. చదువుకొనే సమయంలో, ఆడుకొనే వేళలలో, ఇంటిలో ఉన్నప్పుడు, సమాజంలో సంచరిస్తున్నప్పుడు, మనం చేసే ప్రతి పనిలోనూ, నేను మహనీయుల పరంపరకు చెందినవాణ్ణి. ఈ పరంపరలో ఏమాత్రం లోపం రానియ్యను అనే భావన కనిపించాలి. మనస్సులో ఈవిధమైన అనుభూతి పొందడమే భూమి అంతర్

బాహ్యరూపాలలో రాష్ట్రీయుడు కావడం, రాష్ట్రీయ దేవత్వము మనలో నిర్మించుకోవాలి. స్వార్థం, లోభం, మోహం చివరకు మరణం కూడా రాష్ట్ర హితం ముందు తుచ్ఛంగా కనబడే స్వభావమే రాష్ట్రీయ స్వభావం. ఇటువంటి శీలము రాష్ట్రీయ శీలము. ఈ శీలము యొక్క తేజోప్రభావం అపరిమితం స్వతంత్ర సమర చిత్రం మనకీ తేజస్సును అందిస్తూంది.

భారత స్వాతంత్ర చరిత్ర ఉన్నత త్యాగాల వీరగాథ శ్రేష్ఠతమకర్తవ్య భావనల పుణ్య బలిదానాల గీత. నిరంతర తేజోమయస్ఫూర్తిసంజాత, ఖడ్గం, కమలం ఈ సంగ్రామ సంకేతాలు. వీటి ఉపాసనతో అనేక తరాలవారి కలలు రూపుదాల్చాయి. ఈ అజేయ ఖడ్గం, పుణ్య సలిలకమలాలే మన జాతిని పరమ వైభవ స్థితికి తీసికొనిపోగలవు. ఖండిత భారతాన్ని అఖండం చేయగలవు. సకల మానవులలో కర్తవ్యం కోసం కర్తవ్యం, శీలం కోసం శీలం అను మహత్తర ఆధ్యాత్మిక జీవన దృష్టిని ఉదయింపచేయగలవు.

భారతీయ స్వాతంత్ర్య సమరం ఈనాడొక మహత్తర విజయాన్ని సాధించి పూర్తైయింది. మాతృభూమి పూర్తిగా విముక్తమైంది. కాని అది విభజింపబడింది. అఖండ హిందూస్థానం ఖండింపబడిందని మనసు బాధపడుతుంది. పాకిస్తాన్ కంటే ముందు మనం బర్మా, సింహళ, నేపాల్‌లను పోగొట్టుకొన్నాము. స్వాతంత్ర్యం బలంమీద ఒకనాడు పోగొట్టుకొన్న ప్రదేశాలను మనం తిరిగి సంపాదించుకొంటాము. భారతదేశాన్ని తిరిగి అఖండం చేస్తాము. ఇప్పుడు జ్ఞాత- అజ్ఞాతులైన అమరవీరులకు నమ్రతా పూర్వకంగా అభివాదం చేద్దాము. వారి త్యాగంతోనే ఈ స్వాతంత్ర్యం రూపుదాల్చింది. వారికి సగౌరవంగా శ్రద్ధాంజలి ఘటిద్దాం.

మనదేశం స్వతంత్ర ప్రతిభతో పరమ వైభవ శిఖరానికి చేరుకొంటుంది. ప్రపంచానికి అజేయమైన శక్తిని, సచ్ఛీలాన్ని ప్రసాదిస్తుంది. 'కృణ్వంతో విశ్వమార్యమ్' అన్న మన ఆదర్శం సాకారమౌతుంది.

బంధువులారా! మన కోట్లకొలది కంఠాలతో భారతమాతకు జేజేలు చెబుదాం -

**భరతమాతకి జై !**

**సూక్తి**

ప్రజల ఇచ్ఛా శక్తులను సమన్వయ పరచి కలపటం ఏకశక్తిగా రూపొందించటం. ఇదే దేశ భవిష్యత్తుకు రాజమార్గం

- స్వామి వివేకానంద

# 2 అత్యాశ అనర్థదాయకం

**I. ప్రధాన విలువ**

*సంతృప్తిగా జీవించడం*

**II. ఉప విలువ**

*అత్యాశ, దురాశ*
*వినాశనానికి హేతువు అని గ్రహించడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- *ఆశకు, దురాశకు తేడా తెలుసు కోగలుగుతారు*
- *దురాశ దుఃఖానికి మూలమని అవగాహన చేసుకుంటారు.*

## IV. ఉపోద్ఘాతం

మానవుడు ఆశాజీవి. ఆశ అనేది లేకపోతే మానవ మనుగడేలేదు. అది అత్యాశగా, దురాశగా మారకూడదు. అందుకే ఆశకు హద్దు, కోరికలకు మితం ఉండాలన్నారు. అత్యాశ, దురాశ ఎప్పటికైనా దుఃఖాన్ని కలిగిస్తాయి.

దురాశ వలన కలిగే ఫలితమేమిటో తెలుసుకుందామా!

## V. విషయం

**సంఘటన :** ఒకసారి ఒక బాటసారి అడవిలో నడిచి వెళ్ళుతుంటాడు. రక్షించు! రక్షించు అనే ఆర్తనాదాలు వినిపిస్తాయి. అటువైపు చూస్తాడు. క్రూరమృగమైన ఒక పులి ఊబిలోపడి, బయటకు రాలేక అరుస్తుంటుంది. దగ్గరకు వెళ్ళి చూస్తే, అది పులి అని గమనిస్తాడు. దాన్ని రక్షిస్తే తనని భక్షిస్తుందని భావించి ముందుకు సాగిపోతుంటాడు. అప్పుడు ఆ పులి “ఓయీ! బాటసారీ! ఆగు! నేను ముసలిదానిని. ఊబిలో నుంచి బయటకు రాలేకపోతున్నాను. నేను ఏ హాని నీకు తలబెట్టను నన్ను రక్షించితే. ఈ స్వర్ణకంకణం నీకు ఇచ్చి, నాత్రోవన నేను వెళ్ళుతాను” అని బంగారు కంకణమును చూపించింది.

దురాశతో, బంగారు కంకణం వస్తుందనే ఆశతో బాటసారి ఆ పులిని బయటకు లాగుతాడు. బయటకు వచ్చిన మరుక్షణమే ఆ పులి బాటసారిని కబళించివేస్తుంది.

**జరిగిన కథ :** ఒక గ్రామంలో ఒక పెద్దాయన ఉన్నాడు. తనకున్న భూమికి ఇంకా వంద ఎకరాలు చేర్చాలని భావించాడు. ఫలానా ప్రాంతంలో భూమి చౌకగా దొరుకుతుందని తెలిసి వెళ్ళాడు. తాను అనుకున్న దానికన్నా ఎక్కువ ధర ఉందని భావించాడు. మారుమూల ప్రాంతాలకు కూడా వెళ్ళాడు. కాని అతను భావించిన చౌకధరకు భూమి లభించలేదు. తిరుగుతూనే ఉన్నాడు. ఇంతలో ఒక వ్యక్తి వచ్చి "అయ్యా! ఇంకాస్త ముందుకు వెళ్తే భూమి కారు చౌక. అక్కడకు వెళ్ళండి! అని సలహా ఇచ్చాడు. ఆ పెద్దాయన అక్కడకు వెళ్ళి విచారణ చేసాడు. అక్కడ ఎకరం వెల చాలా చౌక అనిపించింది. కొందామనుకున్నాడు. ఇంతలో మరోవ్యక్తి వచ్చి ఇంకా కొంచెం దూరం వెళ్ళితే, కావాల్సినంత భూమిని ఊరికినే ఆక్రమించుకోవచ్చునన్నాడు. అక్కడకు వెళ్ళాడు. అక్కడ ఒక వ్యక్తి కనిపించాడు. అతను 'అయ్యా! మీరు నిజంగా సేద్యం చేస్తారా?' అని అడిగాడు. అప్పుడు ఆ పెద్దాయన "ఎంత భూమినయినా సేద్యం చేసి, పంటలు పండిస్తాను" అని అన్నాడు. ఆ వ్యక్తి పెద్దాయనను తీసుకువెళ్ళాడు. భూమిని చూపించాడు. 'మీకు ఈ భూమిని ఇస్తాను కాని చిన్న షరతు' అన్నాడు. 'ఏమిటని' అని అడిగాడు పెద్దాయన. 'సూర్యోదయం నుండి సూర్యాస్తమయం లోపల ఎంత భూమిని చుట్టివస్తారో అంత భూమి ఊరికనే ఇస్తాను' అని ఆ వ్యక్తి చెప్పాడు. ఆ పెద్దాయన మరునాడు ప్రొద్దునే లేచాడు. ఏదైనా తింటే ఆలస్యం అవుతుందని భావించి, ఎక్కువభూమి చుట్టిరావాలని రంగంలోకి దిగాడు. పరుగెత్తడం మొదలు పెట్టాడు. సూర్యుడు అస్తమించబోతున్నాడు. వెళ్ళినచోట ఒక గుర్తు పెట్టాడు. తిరిగి బయలుదేరిన చోటికి చేరాలి గదా! ఇంకా వేగంగా పరుగెత్తుతున్నాడు. ప్రొద్దున నుంచి ఏమీ తినకపోవడంవల్ల చాలా అలసిపోయాడు. బయలుదేరిన ప్రదేశం చాలా కొద్ది దూరంలో ఉంది. కాని కళ్ళుతిరిగాయి. క్రిందపడ్డాడు, ప్రాణాలు విడిచాడు. భూమిని ఊరికనే ఇవ్వడానికి సిద్ధమైన వ్యక్తి ఇలా అనుకున్నాడు. "ఇప్పుడు ఈ పెద్దాయనకు ఎంత భూమి సరిపోతుంది. ఆరడుగులు చాలు కదా!" అని నిట్టూర్చాడు.

గమనించారా! పేరాశ ఎంత పనిచేసిందో! ప్రాణాలనే తీసింది. మానవుడు ఆశాజీవి కాబట్టి 'ఆశ' ఉండాలి. కాని ఆశకు హద్దు ఉండాలి. అది మీరితే పేరాశ అవుతుంది. ముదిరితే దురాశ అవుతుంది. చివరకు నిరాశే గతి అవుతుంది. ఈ వాస్తవాన్ని విస్మరించవద్దు! దురాశ, పేరాశలను పెంచుకొని నిరాశకు గురి కావద్దు! ఉన్న దానితోనే సంతృప్తి చెందండి! సంతృప్తిలోనే ఉన్నది ఆనందం అని మరచిపోకండి!

సంతృప్తి ఉన్నవాడే ధనవంతుడు. అసంతృప్తుడికి ఎంత ధనమున్నా బీదవాడే!

## VI. అభ్యాసాలు

**1. ఆలోచించండి - ప్రతిస్పందించండి.**

- దురాశంటే మీరేమనుకుంటున్నారు?
- దురాశ వలన దుఃఖంకలిగిన సంఘటనలు మీకు తెలిసినవి చెప్పండి?
- మీరు బాటసారి స్థానంలో ఉంటే ఏమి చేస్తారు?
- గ్రామ పెద్దాయన స్థానంలో మీరుంటే ఏం చేస్తారు?
- మనిషికి డబ్బు ఎంత అవసరం?

**2. ఆచరించండి - అనుభవాలు చెప్పండి.**

- పాఠశాల గ్రంథాలయంలోని దురాశ దుఃఖానికి సంబంధించిన కథల పుస్తకాలు చదవండి. మీకు కలిగిన అనుభవాల్ని చెప్పండి.
- అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి కారణం అవినీతి మరియు స్వార్థం. ఈక్రింది చర్యలు మన సమాజంలో ఎందుకు జరుగుతున్నాయి? కారణాలు చర్చించండి.
  - ✦ కల్తీ వ్యాపారం - పాలు కల్తీ, నూనె కల్తీ, మందులకల్తీ,
  - ✦ లంచాలు - ప్రతీ స్థాయిలో
  - ✦ ఎలక్షన్లలో డబ్బు పంపిణీ, మద్యం పంపిణీ
  - ✦ ఫ్యాక్టరీ కాలుష్యాలను గాలిలోకి, నదులలోకి వదలటం
  - ✦ రైతు దగ్గర రూపాయికి కొని బయట 10 రూ॥ అమ్మడం
  - ✦ అవసరం లేకున్నా డాక్టరు ఆపరేషన్ చేయడం.

## VII. తెలుసుకోండి

### ఏదీ నీవెంటరానపుడు నీకెందుకింత ఆశ?

గురునానక్ దగ్గరికి ఒక శ్రీమంతుడు వచ్చి స్వామీ! నాకు అపారమైన సిరి సంపదలున్నాయి. కానీ, మనశ్శాంతి మాత్రం లేదు. అందుచేత నిద్ర అనేది లేకుండా పోయింది ఆరోగ్యం కూడా క్షీణిస్తూ ఉంది. ఏదైనా మార్గం చెప్పండి అని మొరపెట్టుకున్నాడు.

అంతా విన్న నానక్‌గారు శిష్యునితో ఒక సూది తెప్పించాడు. దానిని శ్రీమంతుని చేతిలో పెట్టి, "నీవు మరణించాక దీనిని నీవు ఎక్కడికి వెళితే అక్కడికి తీసుకునిరా! నీవెక్కడంటే నేనక్కిడికి వచ్చి అడిగి ఈ చిన్న సూదిని తీసుకుంటాను." సరేనా! అన్నాడు.

శ్రీమంతుడు ఆశ్చర్యానికి లోనవుతూ-స్వామీ మరణానంతరం దీనిని నావెంట తీసుకుని ఎలా రాగలను? పోయేటపుడు ఏమీ వెంట తీసుకుని వెళ్ళలేం కదా? అన్నాడు.

సరే నాయనా! ఇంత చిన్న సూది కూడా నీవెంట రానపుడు, ఇన్నిన్ని బంగళాలు, పొలాలు, వాహనాలు, ఆభరణాలు, ఎందుకు సంపాదించినట్లు? ఒక వేళ నీ భార్యా - బిడ్డల సంతోషానికి కానీ, నీతృప్తి కోసమే కానీ సంపాదించి నట్లయితే మరి మనశ్శాంతి ఎందుకులేదు ? నిద్ర ఎందుకు రాలేదు? ఆరోగ్యం ఎందుకు బాగాలేదు. శ్రీమంతుడు సమాధానం చెప్పలేక మౌనంగా ఉండిపోయాడు. నాయనా! "భోగాలన్నీ రోగాలే, భోగం వదిలితే యోగమే" అన్నాడు.

మనిషికి పరిమితమైన కష్టార్జితమే నిజమైన సంపాదన. "పులిని జూచి నక్క వాత పెట్టుకున్నట్లు" ఇరుగు- పొరుగు వారిని చూచి నాకు ఇదిలేదు, అదిలేదు అని పోల్చి చూసుకుని, అసూయతో ఆశలు పెంచుకుని, వాటిని తీర్చుకోవడానికి అడ్డమైన గడ్డితింటూ, అనవసరమైన ప్రయాసలు పడుతూ, ఇతరులను కష్టాలలోకి నెడుతూ ప్రత్యక్షంగానో, పరోక్షంగానో చుట్టూ ఉన్న వాతావరణాన్ని కలుషితం చేస్తున్నారు.

మనిషికి తృప్తి అనేది తప్పక ఉండాలి. ఏది అవసరమో, ఏది అత్యవసరమో తెలుసుకుని జీవించాలి, తమ తాహతుకు తగిన ఆశలను సాకారం చేసుకునేటందుకు ధర్మ మార్గంలోనే కృషిచేస్తూ ఉండాలి.

- వందల కోట్లకు అధిపతివైనా ఒక్క నిమిషం ఆయుష్షును కొనలేవు.
- కోట్లకు వారసుడివైనా ఊపిరిపోగానే ఊరిబైటనే పారవేస్తారు.
- లక్షాధికారైనా, భిక్షాధికారైనా శ్మశానంలో ఇద్దరూ ఒకటే.
- వంద మంది వైద్యులు అందబాటులో ఉన్నా నీ పరలోక యాత్రను అడ్డుకోలేదు.
- ప్రపంచాన్ని జయించినా, మృత్యువును మాత్రం జయించలేవు.
- భోగలాలసులే సమాజ పీడకులు.
- ఎంత సంపాదించినా కూటి కొరకే, ఎలా బ్రతికినా కాటి వరకే.
- పరిమితంగా సంపాదించేది మనకోసం. అపరిమితంగా సంపాదించేది పరులకోసం
- ఉన్నదాని కంటే తక్కువగా కనిపించు - తెలిసిన దానికంటే తక్కువగా మాట్లాడు.
- అత్యాశ అజ్ఞానానికి హేతువు.

## అత్యాశ అనర్థదాయకం

స్వామి శ్రద్ధానంద తన శిష్యుడు ధర్మానందతో కలిసి ఒక ధనికుడి ఆహ్వానం మీద అతడి ఇంటికి వెళ్ళాడు. ఏదో బాధలో ఉన్నట్టున్నావని స్వామి అడిగాడు. వ్యాపారంలో అయిదుకోట్లు నష్టం వచ్చిందని వాపోయాడు ధనికుడు. అతడి శ్రీమతి నవ్వి అదేమీ కాదని అతడికి వాస్తవంగా అయిదు కోట్లు లాభం వచ్చిందని పదికోట్లు ఆశించి రానిదాన్ని నష్టంగా చెప్పకొంటున్నాడు అంది.

తిరుగు ప్రయాణంలో 'సిరిసంపదలతో తులతూగుతున్నా, ఇల్లు కళకళలాడుతున్నా ధనికుడి ముఖంలో నిస్పృహ. నిరాశ ఎందుకు కనిపిస్తున్నాయి గురువర్యా!' అని అడిగాడు ధర్మానంద.

స్వామి మందహాసం చేసి ఇలా చెప్పాడు. 'మనిషి అభివృద్ధిలోకి రావాలంటే ఒక గమ్యం ఉండాలి.

ఆశయం ఉండాలి. మంచిదే! దానికి అండగా చిరు ఆశ ఉండాలి. నీ ప్రయత్నమూ ఉండాలి. అప్పుడే పురోభివృద్ధి కలుగుతుంది. అందినదానితో తృప్తిపడాలి. దురదృష్టమేమంటే, అతడిలాంటివారు అలా దొరికినదాంతో తృప్తిపడరు. అది భగవత్ప్రసాదమని అనుకోరు. అదే వారి ఆశాభంగానికి మూలకారణం.

ఆశించింది అందనప్పుడు అంతా నష్టమనే అనిపిస్తుంది. ఆ ధనికుడు మన నుంచి ఆశించింది ఆ నష్టానికి సానుభూతి అలాంటి మూర్ఖులకు జీవితంలో సంతృప్తి ఇచ్చే సుఖం విలువ తెలియదు. రేపు మరో పదికోట్లు ఆయాచితంగా లభించినా ఆనందించడు. ఎంత దొరికినా అతడికి దొరకని దానిమీదే దృష్టి కాని, అతడి భార్య వివేకవంతురాలు. ఆమెకు అందినదానితో ఆనందించటం ఎలాగో తెలుసు. తన ఆనందాన్ని పలువురికి పంచి పెట్టడం ఇష్టం. ఆలాంటివారి ముఖంలో ఎప్పుడూ ప్రశాంతత, ప్రేమ, కరుణ, దానగుణం నెలకొని ఉంటాయి. ఒకరికి పెట్టడంలో ఉన్న పరమానందం తెలిసిన పుణ్యాత్మురాలు ఆమె. ఆ భవనంలో ఎన్ని సంపదలున్నా అతడు దుఃఖితుడు దౌర్భాగ్యుడు ఆమె సంతోషి. భాగ్యవంతురాలు!

'కేవలం దురాశేనా అతడి బాధ?' అని అడిగాడు ధర్మానంద. అతడి లాంటివారికి ఇంకో చిత్రమైన బాధ ఉంటుంది. వారికి దుఃఖపడటం అంటే మక్కువ. లాభాలు వచ్చినప్పుడు ఇతరుల అభినందనలు వారికి నచ్చవు. తక్కువ లాభాలు వస్తే ఇతరుల సానుభూతి కావాలి. తాము సంతోషంగా ఉంటే ఇతరులు ఎక్కడ అసూయ పడతారోననే చిత్రమైన బాధ వారిది కాస్త లోటు వస్తే చాలు ప్రపంచంలోని అన్ని బాధలూ తమ మీదకే వచ్చిపడినట్లు వాళ్ళు చెప్పుకొని వాపోతారు. తాము కష్టాల్లో ఉన్నప్పుడే మిత్రులు పలకరించవస్తారని... తాము తృప్తిగా బతుకుతుంటే దరిదాపులకైనా రారని భ్రమపడుతుంటారు. తాము సుఖంగా ఉన్నట్టు ఎవరికీ తెలియకూడదని తాపత్రయ పడుతుంటారు. ఆశాభంగాన్ని ప్రేమించనంతగా తృప్తిని భరించలేని అవివేకులు వారు....

'కష్టపడి సంపాదించినదానితో సంతుష్టుడివి కావాలి. అదే నీకు స్వర్గం. దురాశతో దేనికోసమూ పాకులాడకు. అది నీకు నరకం. నీ జీవితంలో శాంతి కలగాలంటే, నీ ముఖంలో అందరికీ ఆనందం కనిపించాలంటే ఆశాభంగానికి గురికాకు. నీవు పోటీ పడాల్సింది నీతోటి వ్యాపారస్తులతో కాదు. నీ మనసును పట్టిపీడిస్తున్న అత్యాశతో... అది అనర్థదాయకం!' అని స్వామి ఆ ధనికుడికి చేసిన బోధను మననం చేసుకున్నాడు ధర్మానంద.

**సూక్తి**

**ధర్మమార్గంలో, శ్రమతో సంపాదించింది మనకు తృప్తిని, సౌఖ్యాన్ని ఇస్తుంది. అధర్మమార్గంలో, పరులను పీడించి, ఇతరుల శ్రమను దోపిడి చేసి సంపాదించే, ధనం మన కుటుంబానికి వినాశహేతువు. మనకున్న దాంట్లో ఇతరులకు సహాయం చేస్తే తృప్తి, ఆనందం కలుగుతుంది. అందరం బాగుండాలి. అందరూ సంతోషంగా ఉండాలి.**

# 3 క్షమాగుణం

**I. ప్రధాన విలువ**

*శీల నిర్మాణం*

**II. ఉప విలువ**

*క్షమాగుణాన్ని కలిగి ఉండడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- క్షమాగుణాన్ని కలిగి ఉంటారు.
- క్షమాగుణంతో ప్రవర్తిస్తారు.

## IV. ఉపోద్ఘాతం

'క్షమ' అన్నది ఒక మంచి లక్షణం. తనకు ఎవరైనా దుఃఖం, కష్టం కలిగించినపుడు ప్రతీకారబుద్ధితో అపకారం చేయకుండడమే క్షమాగణం. తప్పుచేయటం మానవ సహజం. మనలో తప్పులు చేయనివారు ఉండరు. కలిసి బ్రతకటం సమాజంలో అవసరం కాబట్టి ఇతరుల తప్పులను క్షమించగలగాలి. క్షమాగుణంతో వ్యవహరిస్తే అశాంతికి తావుండదు. క్షమాగుణం యొక్క ఉదాత్తత ఏమిటో తెలియజేయడమే ఈ పాఠ్యాంశ ఉద్దేశం.

## V. విషయం

పాలస్తీనా, ఇజ్రయిల్ దేశాల మధ్య మిత్రత్వం, స్నేహభావం అంతగాలేవు. తరచు కలహించుకొంటూనే ఉంటారు.

ఒకసారి పాలస్తీనా దేశానికి చెందిన ఒక గర్భిణీ స్త్రీ తన ఇద్దరు పిల్లలతో కలిసి వస్తున్నది. ఎదురుగా ఇజ్రాయిల్ సైనికులు వచ్చారు. ఆమె కళ్ళముందే తన ఇద్దరు పిల్లలను అమానుషంగా చంపేశారు. అడ్డుకోవడానికి వచ్చిన ఆమెను కూడా గాయపరిచారు. దీంతో ఐదునెలల గర్భస్థ శిశువుకూడా చనిపోయింది. చావు తప్పిన ఆ స్త్రీ కొన్ని నెలల చికిత్స తరువాత కోలుకొని మామూలు మనిషైంది.

ఈసారి పాలస్తీనా సైనికులు చేస్తున్న దుర్మార్గం వల్ల ఓ చిన్నబిడ్డ మేడ మెట్ల మీద నుండి దొర్లుకుంటూ వస్తున్నది. ఇది ఆ స్త్రీ చూసింది. అలా దొర్లుకుంటూ వస్తున్నది తన పిల్లలను చంపిన ఇజ్రాయిల్ సైనికుని బిడ్డ. ఆ బిడ్డను కాపాడాలా? వద్దా అని ఆమె ఆలోచించలేదు. వెంటనే పరుగెత్తి ఆ బిడ్డను కాపాడింది. అప్పుడు చుట్టుపక్కల వాళ్ళు ఆమెను తిట్టారు. శత్రురాజ్యానికి చెందిన బిడ్డను కాపాడినందుకు అసహ్యించుకున్నారు. అప్పుడు ఆమె "నేను ఇజ్రాయిల్ వాళ్ళను ఎప్పుడో క్షమించేశాను. క్షమాగుణం ఒక ఔషధం లాంటిది. ఇతరులకు ఇచ్చేటప్పుడే మన మనసులోని గాయాలు వాటంతటవే మానిపోతాయని" వారితో చెప్పింది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. క్షమాగుణం అంటే ఏమిటి? దాన్ని ఎందుకు అలవర్చుకోవాలి?
2. కథలో "క్షమాగుణం ఔషధంలాంటిది. ఇతరులకు ఇచ్చేటప్పుడు మన మనసులోని గాయాలు మానిపోతాయని" అన్నది కదా! దీన్ని మీరు ఎలా సమర్థిస్తారు?
3. క్షమాగుణాన్ని చూపించాల్సిన సందర్భాలు చెప్పండి. అలాంటి సందర్భాలు మీకు ఎదురైతే ఎలా ప్రవర్తిస్తారు.
4. 'క్షమాగుణం' పాటించడం వల్ల ఏం జరుగుతుంది? పాటించకపోతే ఏమవుతుంది?
5. క్షమాగుణం అలవరుచుకోవడానికి మీరు ఏమి చేస్తారు?
6. క్షమాయా ధరిత్రి అంటే ఏమిటి ?

## (ఆ) ఆచరించండి - అనుభవాలు చెప్పండి

- "క్షమాగుణంతో ప్రవర్తించాల్సిన సందర్భాలు ఏమిటి? మీకు ఏమి ఎదురయ్యాయి? అప్పుడు ఏం చేశారు? ఏం జరిగిందో చెప్పండి.

## VII. తెలుసుకోండి

### క్షమాగుణం ఒక అద్భుత ఔషధం!

మహాత్ములయిన వారి స్వభావాన్ని గురించి "వారు ధనముంటే దానం చేస్తారు. త్యాగం చేస్తారు. శక్తి ఉంటే క్షమాగుణాన్ని కలిగి ఉంటారు. దుఃఖంలో దైన్యం లేకుండా ఉంటారు. సదాచారమును అనుసరిస్తున్నప్పుడు దంభం లేకుండా ఉంటారు". అని వర్ణింపబడింది.

**"విత్తే త్యాగః క్షమశక్తౌ, దుఃఖే దైన్య విహీనతా,**
**నిర్దంభతా సదాచారే, స్వభావో యం మహాత్మనాం"**

యతులు, సన్యాసులు శత్రువులు, మిత్రులను క్షమిస్తారు. అది వారికి భూషణము. "క్షమా శత్రౌచ మిత్రేచ యతీనామేవ భూషణం" "మానవులకు ఆభరణము రూపము, రూపమునకు ఆభరణము గుణము, గుణమునకు ఆభరణము జ్ఞానము, జ్ఞానమునకు ఆభరణము క్షమ"

**"నరస్యాభరణం రూపం, రూపస్యాభరణం గుణః,**
**గుణస్యాభరణం జ్ఞానం, జ్ఞాన స్యాభరణం క్షమా".**

"సహనం గుణవంతులకు బలమునిస్తుంది", క్షమా గుణవతాం బలం. అశక్తులైనవారికి సహనం, క్షమ ఉండక తప్పదు. అది వారికి ఉండవలసిన గుణమే అవుతుంది. శక్తి మంతులయిన వారు క్షమాగుణాన్ని కలిగి ఉంటే అది వారికి భూషణం అవుతుంది". "క్షమాగుణో హ్యాశక్తానాం శక్తానాం భూషణం క్షమా" "క్షమించే వారిని, సహించేవారిని చూసి లోకులు అసమర్థులని భావిస్తారు. అయినా క్షమయే బాగా ప్రకాశించే ఆభరణం ఉత్తమ వ్యక్తిత్వం కోరుకునే వారు క్షమాగుణాన్నే కలిగి ఉంటారు".

**"క్షమియించువారిగని, చా**
**లమి వెట్టుదురైననుం దలంప సమాన**
**క్షమయె కదుమెఱయు తొడవు**
**త్తమ రూపము గోరువారు దాల్తురుదానిన్"**

అని విదురనీతి. "సమర్థుడై యుండికూడా క్షమించేవాడే పుణ్యాత్ముడు".

తల్లిదండ్రులు పుత్రుల యెడల, భర్త భార్య యెడల, అత్త కోడలి యెడల, గురువు శిష్యుల యెడల, యజమానులు కార్మికుల యెడల, పరిపాలకులు ప్రజల యెడల క్షమాగుణంతో వ్యవహరిస్తే అశాంతికి తావే లేకుండా పోతుంది.

అయితే క్షమాశీలత అంటే అవతలి వ్యక్తిలో నేర ప్రవృత్తిని ప్రోత్సహించటం కానేకాదు. క్షమించటం అంటే అవతలివాడు పాపం చేస్తే ఆ పాపంలో మనం కూడా భాగస్వాములం కావటం కాదు. క్షమించటం అంటే అవ్యవస్థకాదు. సోమరితనం కాదు, అసమర్థతకాదు, అనుశాసన రాహిత్యం కాదు. అధర్మాన్ని పెంచి పోషించటం కాదు. స్వయంగా తాను ధర్మశీలుడైయుండి కఠినమయిన అనుశాసనాన్ని పాటించేవాడై యుండి, యోగ్యత కలిగిన వాడే క్షమించగల అధికారాన్ని కలిగి ఉంటాడు. అవతలి వారికి అనుశాసనం నేర్పగల స్థితిలో ఉంటాడు. తాను ఒంటినిండా బురద పూసుకున్నవాడు, ఎదుటి వ్యక్తి గుడ్డలను శుభ్రం చేయగలడా? తన దౌర్బల్యం కారణంగా ఇతరుల దోషాన్ని చూసి, సహిస్తే, అది క్షమాగుణం అనిపించుకోదు. "నేను

భ్రష్టుణ్ణి, నీవు కూడా భ్రష్టువిడికా" అంటే అది క్షమాగుణంకాదు. తన విషయంలో తాను వజ్రముకంటే కఠినంగా నియమాలను పాటించాలి. ఇతరుల విషయంలో కుసుమముకంటే మృదువుగా ఉండాలి. "వజ్రాదపి కఠోరాణి, మృదూని కుసుమాదపి", ఇదీ లోకోత్తర చరితుల లక్షణం.

## క్షమా కవచం

ఎదుటి మనిషి తెలియక చేసిన చిరు తప్పిదాన్ని గోరంతలు కొండంతలుగా కాక, కొద్దిపాటి మందలింపు మాటలతో వదిలేయడమే క్షమాగుణం ఇతరుల తెలియనితనాన్ని దొడ్డమనసుతో మన్నించడం ఉదాత్తమైతే, తన తొందరపాటును తానే తెలుసుకుని బేషరతు క్షమాపణ కోరే లక్షణం అంతకన్నా ఉత్తమం. ఉన్నతత్వాన్ని గుర్తుచేసుకుంటే ఆర్ద్రహృదయుడు జీమూతవాహనుడు, త్యాగభరిత దధీచి, మునీంద్రుడు, కరుణాంతరంగ బుద్ధదేవుడు – ఎందరు లేరు ఆదర్శచరితులు? 'క్షమయందే జగము నిలుచు'నన్న భాస్కర రామాయణ కర్త వాక్కులూ నవామృత గుళికలు. ఆ పురాణ కథనాన్ని పరిశీలిస్తే... అనుమానమే పెనుభూతంగా మారిన స్థితిలో సోదరుడగు సుగ్రీవుడితో తలపడ్డాడు వాలి. ఎక్కడినుంచో తోకచుక్కలా దూసుకొచ్చిన బాణం క్షణాల్లో అతడి గుండెను గుచ్చింది. విలవిల్లాడుతూనే చుట్టుపక్కల గమనించిన వానరరాజు, దగ్గరలోని చెట్టుచాటునుంచి కదిలివస్తున్న రామచంద్రుణ్ని తీవ్ర విభ్రాంతితో చూశాడు. 'నువ్వా రామా! నీకిది న్యాయమా, ధర్మమా?' అంటుండగానే 'వాలీ!' అన్న పిలుపు అణువణువునా తాకిందతణ్ని. దుష్టశిక్షణ, శిష్టరక్షణకు వధ తప్పలేదన్న రాముణ్ని చూస్తున్నంతసేపూ వాలిలో మరే తర్కానికీ చోటులేనంత ఆత్మానుభూతి! 'నా మూర్ఖత్వం అంతరించింది, క్షమించు నన్ను' అంటూ కన్నీటితో చేతులు జోడించి అర్థించాడా తుదిఘడియల్లో ఆ క్షణాన రామచంద్ర హృదయమంతా క్షమాప్రపూర్ణం.

'ఓర్పువంటిది నరునికింకొకటి లేదు' అన్నారు పానుగంటి. ఓరిమికి పేరొందిన సీత, ఆమె మాత భూదేవి నిరుపమాన శీల సంపన్నులు. భారతాన సత్యాదేవికి క్షమ, ప్రేమల అనుబంధాన్ని విశదపరచింది ద్రౌపది. భర్త హృదయసీమను సంప్రీతితోనే చేరగలమన్నది ఆమె మాట. పాండవుల అరణ్య, అజ్ఞాతవాసాలు వారి సహనశీలతకు ప్రతీకలు. పురాణకాలాల్లో విభిన్న వేళల్లో మునుల శాపాలు, ఆ ఆగ్రహాలు తీరాక తెలిపిన విమోచన మార్గాలూ క్షమతకు అక్షరసాక్ష్యాలే. క్షమాచరణే ధ్రువుణ్ని తారామండలాన నిలిపింది. హరిశ్చంద్రుణ్ని చరిత్ర ప్రసిద్ధుణ్ని చేసింది. రత్నగర్భ భరత భూమిని రాళ్ళుచేయాలని వచ్చి పరాజయం పొంది, పాదాక్రాంతుడయ్యాడో రాజు. 'ఎందులకింత కష్టపడి ఇచ్చటి భాగ్యము కొల్లగొట్టుటల్? అందరు వచ్చి మాకతిథులై కడుపార భుజింపరాదా!' అంటూనే దయాభిక్ష ప్రసాదించింది మహారాణి సంయుక్త. గౌతముడిని దారిలో అడ్డగించి గండ్రగొడ్డలెత్తాడు దుండగుడు అంగుళీమాలుడు. ఆ పరశుహస్తానికి దీటుగా శాంతిదాయక అభయహస్తం చూపాడా దయామయుడు. అప్పుడు తన కాళ్ళఎదుట జారిపడిన అతడి ఆయుధం వైపు స్వామి చూసిన జాలి చూపే క్షమాభిక్షకు సంకేతం. శిలువమీద నెత్తురు చిందించి మరీ

పాపుల పాపాలు బాపిన కృపానిధి ఏసు. సత్య ధర్మ శాంతి ప్రేమలతో సేవావారధికో రూపుదిద్దిన చల్లనితల్లి థెరిసా. మహనీయతకో రూపంగా వెలిగిన మహాత్ముడి క్షమాగుణ తత్పరతా నిఖిలలోక విదితమే. 'కల్లాకపటము లెరుగని మొగ్గల గిల్లి తెంపుతావెందుకు? నవ్వుతున్న చిన్నారి పువ్వులను నలిపి తుంపుతావెందుకు?' అనడంలోనూ ఆధునిక కవి గుండె తడి అంటుతుంది. ఆశావాదానికి పునాది. క్రోధాగ్ని నివారిణి, శాంతజీవనానికి ఆధారం, లోక వ్యవహారాల్లో ఘనవిజయ కారకం క్షమ ఒక్కటే. ఒక్క ముక్కలో చెప్పాలంటే, క్షమే దైవత్వం. క్షమించడమంటే మన మనసును మనం జయించడమే.

వ్యక్తి, కుటుంబం, సంఘం, జాతి, మొత్తం విశ్వమంతటినీ పదిలంగా నిలిపే ఆరోగ్యదాయిని క్షమకు మరో పేరే క్షాంతి. దానికి సమమైన తపస్సు ఇంకోటి లేదన్నారు పెద్దలు. పెద్దల సుద్దులెప్పుడూ పెరుగన్నం ముద్దలే. క్షమ అంటే పరిపక్వత. ధారణ చేసే ప్రతిఒక్కరికీ అదే అలంకారం. అన్ని మతాలూ చాటి చెప్పినట్లు 'క్షమ ఉన్న హృదయమే దైవమందిరం'. క్షమంటూ కనిపించని ఏ సాధనైనా జీవరహిత దేహంవంటిదే. మన్నింపు గుణం భారతీయ జీవనరీతికో సహజాభరణం. అన్ని కాలాల్లోనూ అందరినీ కలిపి ఉంచే అంతర్గత సూత్రమది. అంతమాత్రాన... క్షమించేయడమంటే ఇంకో దోషానికి అవకాశమివ్వడం కాదు, లోపాల బరువును మోసే బాధ్యత అంతకన్నా కాదు. వ్యక్తుల ప్రత్యేకతల్ని, వ్యవహార సరళి వైరుధ్యాల్ని అనుసంధానించే పవిత్ర క్రియ అది. అదో సహన స్వరూపం. వాల్మీకి అన్నట్టు 'లోక వశకరి' చిటికెడు క్షమ బోలెడంత పగనైనా చల్లార్చి ప్రేమమయంగా మారుస్తుంది. అలా అని అదేపనిగా తప్పులు చేసేవారికి క్షమాభిక్ష అడిగే అర్హత ఉండదు. జరిగిన అనుచితాలు మళ్ళీ జరగకుండా, మన్నించాలని అడిగే దుస్థితి పదేపదే ఎదురుకాకుండా చూసుకోవడమే విజ్ఞత. బుచ్చిబాబు తేల్చిచెప్పినట్లు 'కొన్ని పొరపాట్లు క్షమించరానివేమీ కావు. వాటిని కప్పిపుచ్చే ప్రయత్నాలే అస్సలు క్షమించలేనివి'. నైతిక పతనానికి ఎప్పుడూ ఎన్నడూ క్షమార్హత లేదు, ఉండకూడదు. అందరూ చెప్పుకోవాల్సిన సంకల్పం ఒక్కటే, మానవతను పెంచి పోషించే క్షమే సకల జాతులకీ రక్షాకవచం. ప్రతీకారం కాదు, మన్నించడంలోనే ఉంటుంది. మనిషితనం!

**సూక్తి**

క్షమ ధీరోదాత్తుని, ధైర్యవంతుని లక్షణం
ప్రతీకారవాంఛ వినాశకరం,
ఇది మనిషిని దహించివేస్తుంది.

క్షమాగుణం బలహీనత కాదు, క్షమించడానికి శిఖరమంత మనోబలం కావాలి.

# 4 మన ఆలోచనలకు పదునుపెడదాం

**I. ప్రధాన విలువ**

*జీవన నైపుణ్యాలు*

**II. ఉప విలువ**

*ఆలోచనా నైపుణ్యాలను కలిగి ఉండడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- *ఆలోచనా నైపుణ్యాల గురించి తెలుసుకుంటారు.*
- *ఆలోచనా నైపుణ్యాలు పెంపొందించుకుంటారు.*

## IV. ఉపోద్ఘాతం

ప్రతిరోజూ మన జీవితంలో ఎన్నో సమస్యలు ఎదురౌతూ ఉంటాయి. వాటిని పరిష్కరించుకోవడానికి మన మనస్సులో ఎన్నోరకాల ఆలోచనలు చేస్తాం. ఈ భూభాగం మీద సమస్త జీవరాశి నుండి మనిషి వేరుచేసి ప్రత్యేకంగా నిలిపేది ఈ ఆలోచనలే. ఆలోచించడంలో ఒక్కొక్కరిదీ ఒక్కోశైలి. ఈ భేదాల వలనే మనిషికి గుర్తింపు. మనిషి వ్యక్తిత్వంలో మార్పు కలుగుతుంటాయి. మనిషి మెదడుకు పదునుపెట్టే ఈ ఆలోచనలు సమస్యలను పరిష్కరించుకోవడానికే కాదు నూతన ఆవిష్కరణలకూ దారితీస్తాయి. ఇందుకు సమస్యల పట్ల తమదైన శైలిలో ప్రతిస్పందించడం, సమస్యల గురించి తార్కికంగా ఆలోచించడం, బహుకోణాల్లో ఆలోచించడం, సృజనాత్మకంగా ఆలోచించడం వంటి ఆలోచనా నైపుణ్యాలను పెంచుకోవాల్సిన అవసరం ఉంది.

## V. విషయం

### సంఘటన-I

రచ్చబండ దగ్గర అందరూ కూర్చొని ఉన్నారు. వార్తాపత్రిక చదువుతున్నారు. అందులో ఒక వ్యక్తి ఆ వార్తాపత్రికలో వచ్చిన ఒక వార్తను చదివి అందరికీ వినిపించాడు. త్వరలోనే ప్రతి గ్రామంలో ఒక ఫ్యాక్టరీని నెలకొల్పుతారట అని చదివి వినిపించాడు. అది విన్న గ్రామస్థులు ఒక్కొక్కరు ఒక్కోలాగా ప్రతిస్పందించారు. అందులో ఒకతను "పోనీలే ఇన్నాళ్ళకు పల్లెటూరికి ఫ్యాక్టరీలు వస్తున్నాయి. దీనివల్ల మన వాళ్ళకు ఉద్యోగాలు వస్తాయి" అన్నాడు. ఇంకొకతను "ఈ ఉద్యోగాలకు తగిన చదువులు మనవాళ్ళు చదివి ఉండాలికదా!" అన్నాడు. ఏ ఫ్యాక్టరీ పెడతారట, ఎక్కడ పెడతారట, ఎంతమందికి ఉద్యోగాలు వస్తాయోకదా! అన్నాడు. మరొకతను "ఫ్యాక్టరీల గోల మనకెందుకు ఇప్పుడు పెట్టమని ఎవరు అడిగారు? పచ్చగా ఉన్న ఊరు కాస్త కలుషితమై పోతుంది. ఇలా ఆ వార్తకు నలుగురూ నాలుగు రకాలుగా స్పందించారు.

### సంఘటన-II

ప్రభుత్వ పథకాలలో ఒకటి బ్యాంకు ఋణాలు మాఫీ చేస్తున్నాం అని ప్రకటించారు. ప్రజలంతా హర్షం వ్యక్తం చేశారు. ఈ ఋణమాఫీ లక్షరూపాయల వరకు ఉంటుందని తెలిపారు. పంటలు తుఫానుల వల్ల నష్టపోయిన రైతులకు ఈ ఋణమాఫీ వలన ఊపిరితీసుకున్నట్లు అయ్యింది. ప్రభుత్వం చాలా గొప్పది. ప్రజల కష్టాలను గుర్తించిందని రైతులన్నారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగస్థులు కొంతమందేమో ఇలా ఋణమాఫీ ద్వారా ప్రభుత్వానికి ఆర్థికభారం కల్గుతుంది. వీళ్ళు ఇచ్చినట్టే ఇచ్చి తర్వాత ఆ భారాన్ని పూడ్చడానికి పన్నులరూపంలో మనదగ్గరే వసూళ్ళు చేస్తారు. ఇంకొందరు వ్యాపారస్థుల లాంటివాళ్ళు ఇదిగో ఈ పథకంవల్ల ప్రతిఒక్కడూ బ్యాంకునుండి అప్పు తీసుకుని ఏదో నష్టమైందని చెప్పి అప్పు ఎగ్గొడతాడు అన్నారు. చదువుకునే విద్యార్థులు కొందరు యువకులు నిజంగా దీనివల్ల ఎంతమందికి మంచి జరుగుతుంది. ఈ పథకం ఒక రాజకీయ ఎత్తుగడ. అసలు నష్టపోయిన రైతులకన్నా మధ్యలో మోసగాళ్ళకే లాభం చేకూరుతుంది అన్నారు. ఇలా ఒకటే పథకం గురించి ఎన్ని కోణాల్లో ప్రజలు ఆలోచించారో చూడండి.

### సంఘటన-III

ఆ ఊర్లోవారందరూ నీటికోసం బోరునీటిపై ఆధారపడి బతుకుతున్నారు. ఎంతోకాలంగా అందరి దాహాన్ని తీర్చిన ఆ బావి ఇప్పుడు నీరుఉన్నా ఉపయోగకరం లేకుండా అయిపోయింది. అందుకు కారణం ఆ నీటిని తాగితే ఊర్లో అందరికీ ఏదోఒక అనారోగ్యం జరుగుతుందనే వదంతి వ్యాపించింది. దాంతో ఆ బావి మూతపడింది. ఇది ఆ ఊరికి కొత్తగా ఉద్యోగంపై వచ్చిన శ్రీనివాస్‌కు తెలిసింది. శ్రీనివాస్ కాలేజీలో లెక్చరర్. ఇన్నాళ్ళు ఉపయోగపడిన బావి అంత హఠాత్తుగా ఎందుకు నిరుపయోగంగా మారిపోయింది అని ఆలోచించాడు. ఆ బావి దగ్గరకు వెళ్ళి పరిశీలించాడు. బావి నీరు కలుషితమవడానికి కారణం ఏదో ఉంటుందని ఆ చుట్టుపక్కల పరిసరాలను గమనించాడు. ఆ బోరుబావికి 100 గజాల దూరంలో కొత్తగా ఫ్యాక్టరీ ఒకటి

కట్టారు. దానినుండి వచ్చే రసాయనాలన్నీ భూమిలోకి ఇంకి అవి బావినీళ్ళలో కలుస్తున్నాయని గమనించాడు. వెంటనే దీన్ని ఆ గ్రామస్థులకు తెలియజేశాడు. అందరూ కలిసి ఆ ఫ్యాక్టరీనుండి రసాయనాలను అలా నేలలో విడిచిపెట్టకుండా చర్యలు తీసుకోవాలని డిమాండుచేశారు. అంతేకాకుండా ఆ నీటిని శుభ్రపరచి వాడుకోవడం మొదలుపెట్టారు. కారణాలు వెతికి సమస్యను పరిష్కరించినందుకు శ్రీనివాస్‌ను అందరూ అభినందించారు.

**సంఘటన–IV**

ఆరోజు కవిత స్నేహితురాళ్ళు నలుగురు కలిసి రజని వాళ్ళ అత్తయ్య ఇంటికి వెళ్ళారు. ఆమె వీళ్ళకు పెయింటింగ్ నేర్పుతుంది. వీళ్ళు వెళ్ళేసరికి ఆమె ఏదోపనిలో ఉంది. తనపని అయ్యేవరకు పిల్లలను అక్కడ బల్లమీద ఉన్న వస్తువులను ఉపయోగించి ఏదైనా నమూనా తయారుచేయమంది. బల్లమీద వాటర్‌బాటిళ్ళు, బెలూన్లు, ఇసుక ఉన్నాయి – వాటితో ఏమి చేయాలా? అని, వారు ఆలోచించారు. బాటిల్ నిండా ఇసుక నింపారు. దానిలో పూలమొక్కను నాటుదామని తోటలోకి వెళ్ళారు. కాని కవిత ఆలోచన వేరుగా ఉంది. కవిత వాటర్‌బాటిల్‌ను సగానికి కోసింది. రెండింటికి బెలూన్‌లను మూతలా వచ్చేలా కట్టి – కొబ్బరిపుల్లలు తీసుకొని డ్రమ్‌లా వాయించింది. ఇంతలో రజనికి ఇంకో ఆలోచన వచ్చింది. తనుకూడా బాటిల్ కోసి మూతఉండే భాగాన్ని వెనక్కితిప్పి గరాటులా చేసింది. దాని మూతను ఒక బెలూన్‌తో మూసింది. బెలూన్ చివర చిన్నరంధ్రం చేసింది. బెలూన్‌లో కొంచెం ఇసుకపోసింది. గరాటునిండా మట్టినీళ్ళు పోసింది. అవి నెమ్మదిగా ఇసుకలోంచి బొట్టుబొట్టుగా కిందిడబ్బాలో పడసాగాయి. ఆ నీళ్ళు శుభ్రంగా ఉన్నాయి. చిన్నసైజు ఫిల్టర్ తయారయ్యింది.

## VI. (అ) ఆలోచించండి – ప్రతిస్పందించండి

1. పై సన్నివేశాల ద్వారా మీరు ఏమి గమనించారో చెప్పండి.
2. మొదటి సన్నివేశంలో ఒక వార్తపై ఎవరెవరు ఎలా స్పందించారు? మీరైతే ఎలా స్పందిస్తారు?
3. రెండవ సంఘటనలో ప్రభుత్వ పథకంపై మీ అభిప్రాయమేమిటి? ఎవరి సమాధానంతో మీరు ఏకీభవిస్తారు? ఎందుకు?
4. మూడవ సన్నివేశంలో శ్రీనివాస్‌లాగా సమస్య గురించి నిశితంగా మీరెప్పుడైనా ఆలోచించారా? అలా ఆలోచించడం వల్ల కలిగే ప్రయోజనమేమిటి?
5. రజని, కవిత, ఆమె స్నేహితురాళ్ళు ఒకే వస్తువులను ఉపయోగించి ఎవరి ఆలోచనలకు తగినట్టుగా రకరకాల వస్తువులను తయారుచేశారు కదా! ఇలా మీకు కొత్తవి తయారుచేయాలన్న ఆలోచన ఎప్పుడైనా వచ్చిందా? ఏంటది?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఏదైనా ఒక వార్తాపత్రికలోని సమస్యలను సేకరించండి. దానిపై మీరు ఏవిధంగా స్పందిస్తారో చెప్పండి.
- ఏదైనా ఒక పనిని లేదా రాయడాన్ని ఎప్పుడూ చేసేవిధంగా కాకుండా కొత్తగా ఆలోచించి చేయండి. మీ అనుభవాలు చెప్పండి.

**సద్భావనతో నిండిన మానవ సంబంధాల నిర్మాణం కొరకు శ్రద్ధ వహించాల్సిన విషయాలు :**

1. సందర్భోచితమైనప్పుడు చిరునవ్వుతో ఉండండి. దానికోసం ఖర్చయ్యేది ఏమీ లేదు. అది మీకు కొత్త స్నేహితులను తెచ్చిపెడుతుంది.
2. చిరునవ్వు పలికే మాటలు - స్వాగతం, దయచేయండి, ధన్యవాదాలు, మీరంటే నాకిష్టం వంటివి తరచూ ఉపయోగించండి.
3. ఎదుటివారిని వారి పేరుతో సంభోదించండి. అందరూ తమ తమ పేర్లను వినాలనుకుంటారు.
4. ఎదుటివారు చెప్పేది శ్రద్ధగా ఆలకించండి. ఇతరులు మిమ్మల్ని అర్థం చేసుకోవాలని తొందరపడక ఎదుటివారిని అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి.
5. ఎదుటివారు చెప్పేది ప్రేమతో, గౌరవంతో వినండి.
6. ఎదుటివారిని పొగడండి. మీరు కలుసుకునే వారిలో పొగడదగిన విషయాలను గమనించండి.
7. మనుష్యులందరూ పొగడ్తను కోరుకుంటారు. ఈ విషయంలో మీరు శ్రద్ధ వహించినట్లయితే -
8. కోపం తెచ్చుకోకండి. మీ శాంతాన్నే కాక, ఇంకెన్నిటినో కోల్పోతారు.
9. ఎదుటివారికి ప్రాధాన్యతను ఇచ్చి వారితో కొంత సమయం గడపండి.
10. అహంకారాన్ని విడనాడండి. ఇది సత్సంబంధాలను ఏర్పరచడంలో అతిపెద్ద అవరోధం.
11. మీ భావవ్యక్తీకరణ నైపుణ్యాలను పెంపొందించుకోండి. భావవ్యక్తీకరణకు, మానవీయ సత్సంబంధాలకు ప్రత్యక్ష సంబంధం ఉంది.

## VII. తెలుసుకోండి

వ్యక్తి జయాపజయాల వెనుక దాగివున్న సిసలైన అదృశ్యశక్తి ఆలోచన. ఆలోచనలనేవి అంతర్గత శక్తి స్వరూపాలు. వాటిని పదునైన అస్త్రంగా మలచి ప్రయోగించేవారు ఎప్పుడూ ఘనవిజయాలు సాధిస్తూనే ఉంటారు. ఆలోచనలు ఎంత శక్తివంతమైనవో అంత వినాశాత్మకమైనవి కూడా! విశేషం ఏమిటంటే ఆలోచనలను జాగ్రత్తగా అదుపుచేసి సక్రమ మార్గంలో మళ్ళించగల సామర్థ్యం కూడా ఆలోచనలకే ఉంది.

అమృతమైనా, విషమైనా మన ఆలోచనలనుండే పుడుతుంది. 'యద్భావం తద్భవతి' అటుంది భగవద్గీత. ఏది అనుకుంటే అదే జరుగుతుందని సారాంశం. మన ఆలోచనలనుబట్టే చేసే పనులుంటాయి. చేసే పనులనుబట్టే అలవాట్లు పుడతాయి. అలవాట్లను బట్టే వ్యక్తిత్వం రూపుదిద్దుకుంటుంది. అందువల్ల మంచి ఆలోచనలు అవసరం. ఇక్కడ మంచి ఆలోచనలు అంటే సానుకూలమైన ఆలోచనలని అర్థం. మానవ ప్రవర్తన అంతా ఈ కేంద్రబిందువు చుట్టూనే పరిభ్రమిస్తుంది. పాజిటివ్ ఆలోచనలు మంచి వ్యక్తిత్వాన్ని ప్రతికూలమైన ఆలోచనలు చెడు వ్యక్తిత్వాన్ని రూపుదిద్దుతాయి. మనలో చాలామంది అంటే నూటికి 80% మంది చేయకూడని ఆలోచనలతో తమ వ్యక్తిత్వాన్ని తామే కుంచింపచేసుకుంటారు. తమకు తామే విధించుకున్న అసమర్థతలో, చాలామంది తమ శక్తియుక్తులను వృథాచేసుకుంటారు.

కొత్త వ్యక్తిని కలవాలంటే భయం. కొత్తపని ప్రారంభించాలంటే భయం ఇంటర్వ్యూ కాల్ వచ్చిందంటే భయం. ఎవరైనా కొత్త వ్యక్తిని కలిస్తే, పని ప్రారంభిస్తే వైఫల్యం తప్పదేమో? ఇంటర్వ్యూలో వారు ప్రశ్నలు వేసి వేధిస్తారేమో? వంటి నెగటివ్ ఆలోచనలు వీరి భయానికి కారణం. నిజానికి ఏదైనా పని కొత్తగా ప్రారంభిస్తే వైఫల్యానికి ఎంత అవకాశం ఉంటుందో సాఫల్యానికి కూడా అంతే అవకాశం ఉంటుందన్న యదార్థాన్ని గుర్తించాలి.

ఏపనిలోనైనా విజయం సాధించాలంటే మన ఆలోచనల్లో స్పష్టత ఉండాలి. అంటే మనకేది అవసరమో, ఏది అనవసరమో గుర్తించగలగాలి. అప్పుడే సమస్యల్ని సులువుగా పరిష్కరించుకోగలరు. సమస్యను సమగ్రంగా విశ్లేషించగలరు. సమస్యల ప్రాధమ్యాల క్రమాన్ని నిర్ధారించుకొని ఎదురుగా ఉన్న సమస్యల్లో ఏది ప్రబలమైనది? దేనిని ముందుగా ఎదుర్కోవాలి? ఎదురుగా ఉన్న లక్ష్యాలలో ఏది కీలకమైనది? దేనిని ముందుగా సాధించాలి? అన్న దాన్ని నిర్ధారించుకోగలరు. కనుక ఆలోచనల్లో స్పష్టత సాధించడం విజయానికి మొదటి మెట్టు.

అనవసర ఆలోచనలతో సమయాన్ని వృథా చేసేవారు ఏదీ సాధించలేరు. వీరిలోని మానసిక ఒత్తిడికి,

అశాంతికి వీరి ఆలోచనలే కారణం. వాహనాన్ని పనిచేసే స్థితిలో ఉంచినప్పుడే అది చక్కగా పనిచేస్తుంది. వాడకుండా మూలనపడేస్తే ఎందుకూ పనికిరాకుండా పోతుంది. అలాగే మన ఆలోచనలను కూడా కండిషన్‌లో ఉంచాలి. అప్పుడే వ్యక్తిత్వం మంచి స్థితిలో ఉంటుంది. మంచిని ఆలోచించలేని వ్యక్తి మంచి చేస్తాడనుకోవడం హాస్యాస్పదం. మంచి ఆలోచనలను రప్పించుకోవడం కష్టం కానీ వాటితో జీవించడం సులభం. చెడ్డ ఆలోచనలను రప్పించుకోవడం తేలిక. కానీ వాటితో సహజీవనం చేయడం కష్టం. మరి మంచి ఆలోచనలు ఎలా వస్తాయి? మంచి వ్యక్తిత్వం ఎలా రూపుదిద్దుకుంటుంది? అనుకుంటే మన పరిసరాలే మంచి ఆలోచనలకు దోహదం చేస్తాయి. అంటే కుటుంబ వాతావరణం, పాఠశాల లేదా కళాశాల వాతావరణం, చదివే పుస్తకాలు, చూసే సినిమాలు, టి.వి. కార్యక్రమాలు ఇవన్నీ, మన ఆలోచనా సరళిని ఎక్కువగా ప్రభావితం చేస్తాయి.

మంచి, చెడ్డల సమాహారమే మానవ మూర్తిమత్వం. మెదడులో మంచి చెడు ఆలోచనల మధ్య నిరంతరం పోరు జరుగుతూ ఉంటుంది. మంచి ఆలోచనలు కనుక చెడు ఆలోచనలను జయిస్తే అది సవ్యమైన వ్యక్తిత్వం. అందుకు వ్యతిరేకంగా జరిగితే అది అపసవ్య వ్యక్తిత్వానికి దారితీస్తుంది. అందువలన ఆలోచనలలో సమూల మార్పు సాధించుకుంటే వ్యక్తిత్వంలో పరిణతి సాధించినట్లే. జీవితం విలువైనది, పరిమితమైనది. దీనిని అనవసర ఆలోచనలతో వ్యర్థం చేయకుండా అర్థవంతంగా తీర్చిదిద్దుకోవాలన్న వాస్తవాన్ని గుర్తించి, అనుక్షణం గుర్తుచేసుకుంటూ ఉంటే చాలు ప్రతికూల ఆలోచనలు వాటంతట అవే తొలగిపోతాయి. మనసు నిర్మలంగా ప్రకాశిస్తుంది.

**సూక్తి**

మనిషి స్వతంత్రంగా ఆలోచించి పరిశోధించటం వల్లనే ప్రపంచం ఇంత అభివృద్ధి చెందింది. ఎంత స్వేచ్ఛగా ఆలోచించగలిగితే అంత ప్రగతిని సాధించగలం. భూమి సమతలంగా ఉంటుందని, సౌరమండలానికి భూమే ప్రధాన కేంద్రమని ఒకప్పుడు ప్రపంచమంతా వాదించింది. ఆ వాదనను గెలీలియో, కోపర్నికస్ గుడ్డిగా నమ్మిఉంటే - భూమి గుండ్రంగా ఉంటుందని గెలీలియో, సూర్యుడు సౌరకుటుంబానికి ప్రధాన కేంద్రమని కోపర్నికస్ నిరూపించేవారా? కాబట్టి ప్రతిదాన్ని గుడ్డిగా విశ్వసించడం కంటే సొంతంగా ఆలోచించడమే గొప్ప లక్షణం. ఏళ్ళతరబడి నిరాధారమైన విశ్వాసాలను మనిషి సవాలు చేయటం వల్లనే ప్రపంచంలో గొప్పగొప్ప సత్యాలు ఆవిష్కృతమయ్యాయి. ఇది మనిషి స్వతంత్ర ఆలోచన ఫలితమే.

# 5 ఆదుకుందాం

**I. ప్రధాన విలువ**

*బాధ్యతలు నిర్వర్తించడం - కర్తవ్యపాలన*

**II. ఉప విలువ**

*ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రతిస్పందించడం.*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- మనిషికి అన్నీ అందించే ప్రకృతిపట్ల అవగాహనతో పాటు ప్రకృతిలో జరిగే వైపరీత్యాలు వలన నష్టం ఎవరికో తెలియజేయడం. అలాంటి పరిస్థితులలో మన బాధ్యతలను తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

**పరిచయం :** ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు తన వంతుగా ప్రతిస్పందించటం.

మానవుని జీవనానికి దేవుడిచ్చిన వరం ప్రకృతి, మానవుని మనుగడ ప్రకృతితో ముడిపడి ఉంది. ప్రకృతి మనకందించిన భూమి, నీరు, గాలి లేనిదే మానవునికి మనుగడలేదు. అయితే అప్పుడప్పుడు ఈ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రజల జీవనం అతలా కుతలం అవుతుంది. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు తోటి మానవులుగా బాధితులకు ఎటువంటి సహాయ సహకారాలందిస్తూ మన బాధ్యతను, కర్తవ్యాన్ని ఏవిధంగా నిర్వర్తించాలో తెలుసుకుందాం.

## V. విషయం

# ఒక్కసారి ఆలోచించండి

పచ్చటి చెట్లు, అందమైన సెలయేళ్ళు, కొండలు, గుట్టలు, నదులు, వాగులు, వంకలు, వర్షపుచినుకులు వీటిని చూసి ఆనందించని వారు ఉండరంటే అతిశయోక్తి లేదు. ప్రకృతిలోని నీరు, గాలి, ఇలాంటి సహజ వనరుల వల్లనే మన జీవనం కొనసాగుతున్నది. కంచెచేను మేసినట్లు ఈ ప్రకృతే మానవులపై కక్షగట్టితే ఏమవుతుందో ఆలోచించండి. ప్రకృతి సమతుల్యతతో ఉన్నప్పుడే దానివల్ల కలిగే ప్రయోజనాలు, మేలు మనకు చేకూరుతాయి. అలాకాకుండా ప్రకృతి సమతుల్యత దెబ్బతిని అసాధారణ పరిస్థితులు నెలకొన్నపుడు చోటు చేసుకొనే పరిణామాలనే ప్రకృతి వైపరీత్యాలు అంటారు. వర్షాలు పడాలి దీనివల్ల పంటలు పండుతాయి. తాగడానికి నీరు లభిస్తుంది. అలాకాకుండా వర్షాలు అత్యధికంగా పడితే ఏం జరుగుతుందో ఆలోచించండి! అట్లే భూమి స్థిరంగా ఉండాలి. ఆభూమిలోపలి పొరల్లో ప్రకంపనాలు చోటుచేసుకుంటే ఏం జరుగుతుందో తెలుసా? వర్షాలు అసలే కురవకుంటే ఏమవుతుంది? ఇలాంటి సందర్భాలలో మానవ జీవితాలు ఎలాంటి ఆటుపోట్లకు గురవుతాయో తెలుసా!

## వరదలు

అధిక వర్షాలు పడి నదులు, వాగులు, వంకలు, పొంగి పొర్లెత్తి ఉధృతంగా ప్రవహించి గ్రామాలను ముంచెత్తడం, తెలుసామీకు! 2009లో అధిక వర్షాలతో మన రాష్ట్రంలో కర్నూలు, మహబూబ్‌నగర్, కృష్ణాజిల్లాల్లో వరదలువచ్చి ప్రజలకు అపార నష్టాన్ని కల్గించాయి అర్ధరాత్రి ఇండ్లలో నీరు చేరడం, ఇంట్లోని వస్తువులు, ఆహారధాన్యాలు, సామగ్రి నీళ్ళలో కొట్టుకుపోవడం, ఒకవైపు కుండపోతవాన మరోవైపు ఇంటిని, ఇంట్లోని మనుషులను వస్తువులను ముంచెత్తుతున్న వరదలు అక్కడి ప్రజలకు ఉక్కిరిబిక్కిరి చేసాయి. ఈ వరదల్లో పిల్లలు, ముసలి వాళ్ళు, పశువులు ఇలా ఎందరో మృత్యువాత పడ్డారు. తాగడానికి నీళ్ళులేక, తినడానికి తిండిలేక, కట్టుకోవడానికి బట్టలు లేక అక్కడి ప్రజలు విలవిల లాడారు.

వరదలు లాగానే 2004 డిశంబర్‌లో అండమాన్ నికోబార్ దీవులు, మద్రాసు రాష్ట్రంలోని తీర ప్రాంతాలు మన రాష్ట్రంలోని ప్రకాశం జిల్లా మొదలగునవి సునామీవల్ల ఇదేవిధంగా తీవ్రంగా నష్టపోయాయి. ఉన్నట్టుండి సముద్రపు అలలు ఆకాశమెత్తులో ఉవ్వెత్తున ఎగిసిపడి తీరంలోని ఇండ్లను ముంచెత్తి ప్రకృతి విలయానికి కారణభూతమైనాయి.

## భూకంపాలు

2001 సం॥లో గుజరాత్‌లోని కచ్ ప్రాంతంలో అర్ధరాత్రి సంభవించిన భూకంపంవల్ల వేలాది ఇళ్ళు నేలమట్టమైనాయి. ఇళ్ళలోని ప్రజలు, జంతుజాలం అంతా కూడా ప్రాణాలు కోల్పోయారు. ఎక్కడ చూసినా స్మశాన వాతావరణం. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు, పిల్లలను కోల్పోయిన తల్లిదండ్రులు ఇలా కుటుంబాలు కకలావికలమై పోయాయి.

## కరువుకాటకాలు

ఈ మధ్యకాలంలో సంవత్సరాలతరబడి వర్షాలు కురవకపోవడంతో భూగర్భజలాలు అడుగంటి తాగడానికి కూడా చుక్క నీరు దొరకక, పంటలు పండక, నీరు, ఆహారంలేని పరిస్థితుల్లో కరువు కాటకాల బారిన పడిన గ్రామాలు చాలా ఉన్నాయి. అనంతపురం జిల్లాలో పిల్లాపాపలతో హాయిగా వ్యవసాయం చేసుకుంటూ ఉండే వేలాది రైతుకుటుంబాలు కరువుతాకిడికి విలవిలలాడి కట్టుకున్న ఇల్లు, పుట్టినగడ్డను వదిలిపెట్టి గుక్కెడు నీళ్ళు, గుప్పెడు మెతుకులకోసం వలస వెళ్ళారు. పదిమందికి అన్నం పెట్టే రైతన్నలు దినసరి కూలీలుగా మారారు. రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితుల్లో దుర్భర జీవితాన్ని గడుపుతున్నారు.

## ప్రజల స్పందన

మానవత్వం కల్గిన ప్రతిఒక్కరికీ కూడా పైన తెలిపిన సంఘటనలు వింటూంటే, చూస్తుంటే గుండె కరిగిపోతుంది. ఇలాంటి పరిస్థితుల్లో తోటి మానవులుగా ఆదుకోవడం మన కర్తవ్యం. ఆపద సమయంలో లక్షలాదిమంది ముందుకువచ్చి వీరందరికి, ఆపన్న హస్తాలనందించారు. వారధి నిర్మాణంలో రాముడికి ఉడుత సాయపడినట్లుగా జాతియావత్తు వీరికండగా నిలిచి ఎవరికి తోచినరీతిలో వారు సహాయ సహకారాలనందజేసారు. ఆపదలో ఉన్నవారికి సహాయపడడం. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం, దాహంతో ఉన్నవారికి నీళ్లివ్వడం కంటే మించినసేవ ఇంకొకటుండదు. “మానవ సేవయే మాధవ సేవ” తోటి మానవులకు సహాయ పడడంలో ఉన్న తృప్తి అమూల్యమైనది. అనిర్వచనీయమైనది. బాలలు కూడా ఎంతో మంది ఆనాటి పరిస్థితుల్లో ప్రకృతి వైపరీత్యాల బారినపడ్డ వారికి బాసటగా నిలుస్తూ చేయూత నందించారు. విరాళాలు సేకరించి పంపారు. కళా ప్రదర్శనలు నిర్వహించి డబ్బులుపోగు చేసారు. తాము చదువుకునే పాఠశాలల్లో ఆశ్రయం పొందిన బాధితులకు తమ ఇళ్ళ నుండి ఆహార పానీయాలు తెచ్చి అందించారు. కట్టుకోవడానికి, కప్పుకోవడానికి దుస్తులు, దుప్పట్లు అందించారు.

ఎంత చేసామన్నది ముఖ్యం కాదు సేవ చేయాలనే భావన కల్గిఉండడం, తోచిన సహాయ సహకారాలందించడం తోటి మానవులుగా మన కర్తవ్యాన్ని గుర్తించి స్పందించడం ముఖ్యం.

### VI. (అ) ఆలోచించండి – ప్రతిస్పందించండి

1. ప్రకృతి వైపరీత్యాలు ఎలా ఉన్నాయో విన్నారు కదా! మీరు ఎప్పుడైనా ఇలాంటివి జరిగినపుడు చూశారా? విన్నారా? అపుడు మీకు ఏమనిపించింది?
2. ఇలా ప్రకృతి వైపరీత్యాలు జరిగినపుడు ఎవరెవరు సహాయపడాలి. ఒక ఉదాహరణలతో చెప్పండి.
3. ప్రకృతి వైపరీత్యాలలో మీకు బాగా బాధకలిగించినవి ఏవో రాయండి. అటువంటి పరిస్థితులలో మీరు ఏం చేయగలరో తెల్పండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఒక గ్రామంలో / ఊరిలో భూకంపం వచ్చింది. జనమంతా సహాయంకోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళకి ఏఏ విషయాలలో సహాయం కావాల్సి ఉంటుందో ఒక లిస్ట్ తయారు చేయండి. మీరు, మీ స్నేహితులు వాటిని సేకరించడానికి ఎవరెవరు ఏ బాధ్యతలు తీసుకుంటారో రాయండి.
- భూకంపం / వరదలు/ కరువు ఇలా ప్రకృతి వైపరీత్యాల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు కదా! వీరికి సహాయం చేయడానికి ప్రజలనుండి ఏమి ఆశిస్తున్నారో ఒక కరపత్రం తయారు చేయండి ప్రదర్శించండి.

## VII. తెలుసుకోండి

మానవుని జీవనానికి దేవుడిచ్చిన వరం ప్రకృతి. మానవుని మనుగడ ప్రకృతితో ముడిపడి ఉంది. ప్రకృతి మనకందించిన భూమి, నీరు, గాలి లేనిదే మానవునికి మనుగడనే లేదు. అయితే అప్పుడప్పుడు ఈ ప్రకృతి వైపరీత్యాలు సంభవించినపుడు ప్రజల జీవనం అతలాకుతలం అవుతుంది. ఇటువంటి సంఘటనలు జరిగినపుడు తోటి మానవులుగా బాధితులకు మనం ఎటువంటి సహాయ సహకారాలందిస్తూ మన బాధ్యతను, కర్తవ్యాన్ని ఏవిధంగా నిర్వర్తించాలో తెలుసుకుందాం!

ఈ ప్రకృతి వైపరీత్యాల వలన భూకంపాలు, ఉప్పెనలు, వరదలు, తుఫానులు వంటివి సంభవించినప్పుడు అపారమైన పంట, పశు, ఆస్తి నష్టం, మొ॥వి జరిగి ప్రజలు ఇబ్బందులకు గురౌవుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా భూమి 'వేడెక్కటం' కారణంగా పెను వైపరీత్యాలు మొదలయి మనిషి మనుగడనే ప్రశ్నిస్తున్నాయి.

ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో, ఉత్తరాదికి భిన్నంగా తీవ్ర ఉష్ణోగ్రత కారణంగా వీపరీత గాడ్పులకు వందలాది మంది మరణిస్తున్నారు. సముద్రతీర ప్రాంతం విస్తరించివున్న మనరాష్ట్రం సహజంగా ఉప్పెనలు, వరదలు, సముద్రంలో ఆటుపోట్లు సృష్టించే భీభత్సాల తాకిడి ఎదుర్కోంటుంది.

మనదేశం వ్యవసాయంపై ఆధారపడుతుంది. వ్యవసాయం ప్రధాన వృత్తి ఆధారిత రాష్ట్రంలో, ప్రకృతి సమతూకం దెబ్బతినటంతో అకాల వర్షాలు, అతివృష్టి లేదా అనావృష్టి పేద రైతాంగాన్ని నిత్యం పీడిస్తూండడం వల్ల ఎంతోమంది వ్యవసాయదారులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

వైపరీత్య ప్రభావిత ప్రాంతాలలో సాధారణ పరిస్థితిని నెలకొల్పడానికి చేపట్టే చర్యల్లో ప్రభుత్వపరంగా అందించేటటువంటి సహాయ - సహకారాలు అత్యంత ప్రధానమైనవి. ఈవిధంగా నష్టపోయిన వారిని ఆదుకోవడానికి ఆయా దేశ ప్రభుత్వాలు బతికి ఉన్న నిరాధార కుటుంబాలకు ఆర్థికంగా ఆదుకోవటానికి నష్టపరిహారం చెల్లిస్తున్నాయి. ప్రకృతి వైపరిత్యాలను సాధ్యమైనంతవరకు నిరోధించే కార్యాచరణ చేస్తున్నాయి.

ఇటీవల ఒరిస్సాలో వచ్చిన వరదల సందర్భంగా కూడు, గూడు, బట్టలు కోల్పోయిన అభాగ్యులను ఆదుకునేందుకు ఎంతోమంది విద్యార్థినీ, విద్యార్థులు తాము దాచుకున్న డబ్బును, బట్టలను కూడా ప్రభుత్వానికి పంపించారు. అలాగే కార్గిల్ యుద్ధ సమయంలో కూడా విరాళాలు సేకరించి, తాము స్వయంగా డబ్బులిచ్చి తోడ్పడిన విద్యార్థులు కోకొల్లలు.

ఇలాంటి వైపరిత్య బాధితులకు మన వంతు బాధ్యతగా ఏం చేయాలి అంటే వైపరీత్య బాధితులకు

మన పాఠశాల నుండి తరగతి వారీగా మనకు తోచిన సహాయం మనం చేయాలి. మన బడినుండే కాదు గ్రామం నుండి, కూడా చేతనైనంత విరాళాలు సేకరించి బాధితులను ఆదుకోవాలి. పులిహోరా పాకెట్స్ అందజేయడం లేదా వంట సరుకులు పంపిణి చేయడం, కట్టుకోవడానికి గుడ్డలు సరఫరా చేయడం వంటివి మన వంతు బాధ్యతను వహించాలి. కావున ఇవే కాకుండా ఎవరైనా నిజమైన అవసరాలున్న మనుషులు మనకు తారసపడినప్పుడు వారికి సేవచేయడం మన కనీస బాధ్యత. మీరందరు కూడా మీ తోటి పిల్లలు ఎవరైనా కష్టాలలో ఉంటే ఆదుకుంటారు కదూ!

## సేవలు అపారం

దట్టమైన అడవి .. చుట్టూ ఎత్తైన కొండలు చిక్కుకున్న వేలాది మంది యాత్రికులు. తెగిపోయిన రహదారులు. ఎక్కడెక్కడ ఎవరున్నారో తెలియని పరిస్థితి. అంతా అయోమయం. అడవుల్లో చిన్న పిల్లలతో చిక్కుకున్న బాధితుల ఆర్తనాదాలు... ఈ పరిస్థితుల్లో సైన్యం పారా కమెండోలను రంగంలోకి దింపింది. శత్రువుకు తెలియకుండా రహస్యంగా ఆకాశ మార్గంలో దిగి అకస్మాత్తుగా విరుచుకుపడేలా కఠోర శిక్షణ పొందిన ఈ కమెండోలు తమ శక్తి సామర్థ్యాలను గతంలో అనేకమార్లు నిరూపించుకున్నారు.

వీరు ఇప్పుడు కేదార్‌నాథ్ వరద బాధితులను ఆదుకోవడంలోనూ ముందున్నారు. ఈ విపత్కర పరిస్థితిలో గౌచార్ కేంద్రంగా గాలింపులు మొదలుపెట్టిన పారా కమెండోలు వందలాది మందిని రక్షించారు. శక్తివంతమైన బైనాక్యులర్లు, అవసరం అయితే ఎక్కడంటే అక్కడే హెలికాప్టర్ నుంచి కిందకు దిగగలిగే సాధన సంపత్తితో ఉండే వారు, వారం రోజులు అహరహం శ్రమించారు. వందమంది కమెండోలు అక్కడ విధులు నిర్వహించి 'శెభాష్' అనిపించుకున్నారు.

**వరదలు - 2011 :** అది 1999 అక్టోబరు 29. ఒరిస్సాను అతలాకుతలం చేస్తూ అయిదువేల మందికిపైగా ప్రజల ప్రాణాలను బలిగొంటూ మహాతుఫాను విరుచుకు పడింది. తెల్లవారుజామున మూడున్నరకు ముంచుకొచ్చిన ఆ విలయం రాష్ట్రంలోని పది కీలకమైన జిల్లాల రూపురేఖలను పూర్తిగా మార్చివేసింది. ప్రమాదం వార్తలందిన మొదటి మూడుగంటల వ్యవధిలోనే సైన్యానికి చెందిన 'అస్సాం 5' బృందాలు మారుమూల ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయి బాధితులను ఆదుకోవడం మొదలుపెట్టాయి. ఆ వెనువెంటనే సకల సాధన సంపత్తితో మరో అయిదువేలమంది సిపాయిలు చేరుకుని పునర్‌నిర్మాణ పనులు ప్రారంభించారు. సైనిక వైద్యశిబిరాలు, రహదారి పునర్‌నిర్మాణ పనులు ప్రారంభించారు. సైనిక వైద్యశిబిరాలు, రహదారి పునర్ నిర్మాణ ఇంజినీర్లు కంటిమీద కునుకేయకుండా పనిచేసి ఒరిస్సాను ఒకదారికి తీసుకువచ్చారు. ప్రాణాలకు తెగించి లోతట్టు ప్రాంతాలనూ చేరుకుని సైన్యం ఆనాడు చేసిన సాహసోపేత విన్యాసం లక్షలమంది ప్రాణాలను నిలబెట్టింది.

**భూకంపం - 2011 :** గుజరాత్‌లోని భుజ్‌తోసహా అహ్మదాబాద్, అంజర్, బచావు, రాపార్, గాంధీదామ్ వంటి ప్రాంతాల కాలికింద నేల కంపించిన దారుణ తరుణం. 2001, జనవరి 26 గణతంత్ర సందర్భం! విషమ పరిస్థితి తెలిసి ఆకాశమార్గాన దూసుకొచ్చిన వాయుసేనకు ఆ ప్రాంతమంతా అణుబాంబు తాకిడికి గురైన దానిలా కనిపించింది. ఆర్మీ ప్రధాన కార్యాలయానికి సమాచారం చేరిన గంటల వ్యవధిలో భూకంపం బారినపడిన అన్ని పట్టణాలూ, పల్లెల్లో సహాయ సామగ్రితో సైన్యం చేరిపోయింది. శిథిలాలకింద చిక్కుకున్నవారిని ఆదుకొని వాయుమార్గాన పుణె, జామ్‌నగర్, ముంబాయి. వడోదర వంటి ప్రాంతాలకు తరలించారు.

గాయాలపాలబడిన వారికి మిలిటరీ వైద్యశాలల్లో తక్షణ సాయం అందింది. ఆ రకంగా ముప్ఫైవేల మందికి వైద్యసాయం అందించడంతోపాటు, తాత్కాలిక గుడారాలను ఏర్పాటుచేసి 24వేల మందికి ఆశ్రయం కల్పించారు.

**సునామి - 2004 : సునామీలో చేయూత :** సముద్ర మహోగ్ర రూపానికి పరాకాష్ట... సునామి. తమిళనాడు, కేరళ, పాండిచ్చేరి సహా అండమాన్ నికోబార్ ప్రాంతాలన్నీ డిసెంబరు 26, 2004న సునామి ధాటికి అతలాకుతలమైన సందర్భమది. ఊర్లకు ఊర్లే సముద్రం అడుక్కు జారుకున్న మహా విలయం అలాంటి పరిస్థితుల్లో మానవమాత్రుడు అడుగుపెట్టడానికి భయపడే ప్రాంతాల్లో భారతీయ సేన మొక్కవోని ధైర్యసాహసాలతో కర్తవ్య దీక్ష చేపట్టింది. త్రివిధ దళాల అద్భుత సమన్వయానికి సునామి సహాయక కార్యక్రమాలు ఓ మచ్చు తునక. అమేయ నైతిక స్థైర్యంతో మొత్తంగా 30వేలమందిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతోపాటు, 41వేలమందికి ప్రాణావసర వైద్యమూ అందించగలిగారు. ఆ తరువాత తొమ్మిదినెలల పాటు అదే ప్రాంతంలో ఉండి అత్యవసర సౌకర్యాలన్నింటినీ కల్పించిన తరువాత గానీ భారతీయ సేన కాలు బయట పెట్టలేదు.

**ప్రకృతి వైపరీత్యాలు :** 2011లో ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగిన నష్టం 380 బిలియన్ డాలర్లు దాటిందని అంచనా తేలింది. ఇంతకు ముందెప్పుడూ నష్టం ఇంత ఎత్తున లేదు. ఈ సంవత్సరం న్యూజిలాండ్, జపాన్‌లో వచ్చిన భూకంపాలు కారణంగా నష్టం మరీ మరీ పెరిగింది. మ్యూనిచ్ రే అనే రీ ఇన్స్యూరెన్స్ కంపెనీవారు 1980 నుంచి ప్రకృతి వైపరీత్యాల ప్రభావం గురించి సమాచారం సేకరిస్తున్నారు. 210 బిలియన్ డాలర్ల నష్టానికి దారి తీసిన జపాను భూకంపం, మనిషికి తెలిసిన వైపరీత్యాలన్నింటిలోనూ వెల గలదని వారు తేల్చారు. ఫుకుషిమా అణుకేంద్రం గురించిన లెక్కలు ఈ మొత్తంలో కలపలేదని వారు ప్రకటించారు.

గడచిన 30 సంవత్సరాలలో ప్రకృతి వైపరీత్యాల కారణంగా జరిగే నష్టాలు బాగా పెరిగినట్లు వీరి లెక్కలో తెలిసింది. 1980 నుంచి భూకంపాల సంఖ్య పెరగలేదు. కానీ వాటివలన నష్టం మాత్రం బాగా పెరిగింది. అంటే నగరాలు, జనావాస ప్రాంతాలు వాటి తాకిడికి ఎక్కువగా గురవుతున్నాయని అర్థం! వాతావరణ సంబంధమయిన వరదలు, కరువులు మాత్రం రానురాను ఎక్కువవుతున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణం తీరు మారుతుండడానికి, ఈ పెరుగుదలకూ సూటిగా సంబంధం ఉంది. ఎక్కువ చలి, వేడి, మంటలు మొదలయిన వైపరీత్యాల వల్ల కలిగే నష్టం ఒకే రకంగా ఉంటూ వస్తున్నది. వరదలు, తుఫానులు మాత్రం 30 సంత్సరాల క్రితంకన్నా ఎక్కువ నష్టాలను కలిగిస్తున్నాయి.

**సూక్తి**

ఇతరులు కష్టాల్లో ఉన్నప్పుడు మనం ఆదుకోవాలి. మనం కష్టాల్లో ఉన్నప్పుడు ఇతరులు సహాయం చేస్తారు. మానవుడు సంఘజీవి. సంఘజీవనంలో ఒకరికొకరు సహాయం చేసుకుంటారు. సహాయం ఎవరో చేస్తారులే మనకెందుకు అనుకోవడం బాధ్యతలనుంచి పారిపోవడం సరైంది కాదు. బాధ్యత వహించడం అనేది మంచి మనుషుల లక్షణం. మంచిగా బ్రతకడమే మానవ జన్మలక్షణం.

# 6 కాపాడండీ... కాపాడండీ...

**I. ప్రధాన విలువ**

*పొదుపు - ఆవశ్యకత*

**II. ఉప విలువ**

*ఇంధన వనరుల పొదుపుపై అవగాహన పొందడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ప్రకృతి సిద్ధంగా మనం పొందుతున్న ఇంధన వనరులను కాపాడుకోవాలని, వాటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవడం వల్ల భావితరాలవారికి వాటిని అందించ వచ్చని తెలియజేయడం.

**IV. ఉపోద్ఘాతం**

మనకు అనేక అవసరాలను తీర్చగలిగే శక్తి ఉన్న ప్రధాన వనరు ఇంధనం. ప్రాచీన కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు మనిషి ప్రకృతి నుండి తనకవసరమైన అనేక రకాల ఇంధనాలను పొందుతూనే ఉన్నాడు. కాని వాటిని పొదుపుగా వాడకపోవడంవల్ల పదేళ్ళ వరకు ఉపయోగపడుతుందనుకున్న ఇంధనాన్ని ఐదేళ్ళకే ఖర్చుచేయడం వల్ల నాలుగైదేళ్ళకాలానికి సరిపడ ఇంధనాన్ని వ్యర్థపరుస్తూ అవస్థలపాలౌతున్నాడు. బొగ్గు, డీజిల్, పెట్రోల్, కిరోసిన్, గ్యాస్ మొదలగు ఇంధనవనరులు మనకు అడుగడుగున ఉపయోగపడుతున్నాయి. ధనాన్ని బ్యాంక్‌లో నిల్వజేసుకొని మనకవసరమైనప్పుడు వాడుకున్నట్లే మన ఇంధన వనరులను కూడా అవసరాల మేరకే ఉపయోగిస్తే వాటి నిల్వలు మనకు ఉపయోగపడతాయి.

## V. విషయం

మానవులారా! మానవులారా! మమ్మల్ని కాపాడండీ... కాపాడండీ... మీరు మమ్మల్ని కాపాడితే మేం మిమ్ములను ఎప్పటికీ ఆదుకుంటూ మీకు సేవచేస్తూ ఉంటాం.

అయ్యో! అలా చూస్తారేంటండీ! మేమెవరమో మీకర్థం కావట్లేదా? అంతేలే! పేదలగుండెలు అని మీ శ్రీ శ్రీ గారన్నట్లు మీరు మమ్మల్ని గుర్తించలేరుకదా! మీకు అడుగడుగునా సేవచేస్తూ మీ కొరకు కాలిపోతున్న వాళ్ళం. మీ నిరుపయోగ, దురుపయోగ తత్త్వంవల్ల మీ మనుమలు, మనుమరాళ్ళకు సేవచేయడానికి మిగులక చచ్చేవాళ్ళం.

మీరు సైకిలు మోటార్లపై, ఆటోలలో, బస్సులో, రైళ్ళలో, విమానాల్లో వెళ్ళగల్గుతున్నారంటే, మీకవసరమైన విద్యుత్తు ఉత్పత్తి చేసుకోగల్గుతున్నారంటే, మీ ఇళ్ళలో, హోటళ్ళలో మీకవసరమైన ఆహారపదార్థాలు వండుకోగల్గుతున్నారంటే, మీ ఇళ్ళ దగ్గరకే మీక్కావల్సిన వస్తువులు చేరవేసే ట్రాలీలు, వ్యాన్‌లు, లారీలు మొదలగువంటివాటిని వాడగల్గుతున్నారంటే, ఇలా ఏ రంగంలోనైనా మీరు మమ్ములను ఏదో ఒక రకంగా వాడుతున్నారు. ఇప్పటికైనా గుర్తుకొచ్చామా? లేదా? ఔనౌను మీరనుకొనేది నిజమే. మా పేర్లు బొగ్గు, కిరోసిన్, గ్యాస్, డీజిల్, పెట్రోల్, ఆయిల్, డాంబర్ మొదలగువారం. మేమంతా అక్కాచెల్లెళ్ళ లాంటి వాళ్ళం. మేమంతా మీకు ఒక్కోరకంగా ఉపయోగపడుతున్నాం.

మా అమ్మ కడుపు భూమిలో ఎక్కడో దాగి ఉన్న మమ్మల్ని మీరు బయటకులాగి మీ ఉపయోగాలకొరకు వాడుకుంటున్నారు. మాకు దానివల్ల బాధలేదు. ఎటు దిరిగి మీలో కొంతమంది మమ్మల్ని దురుపయోగం చేసి, మా జీవితాలను వ్యర్థం చేస్తున్నారనే బాధ. మేమెలా దురుపయోగమై మీ తరతరాలకు అక్కరకు రాకుండా పోతున్నామో మీకు చెబుతాం. మీరు జాగ్రత్తగా విని మా బాధను అర్థం చేసుకొని తరతరాలకు ఉపయోగపడేలా ఆదరణ మొదలు పెట్టండి.

**పెట్రోల్ :** మీ జల్సాలకు, విలాసాలకు, షికార్లకు వాహనాల్లో నన్ను ఎక్కువ మొత్తంలో వృథా చేస్తున్నారు. అంటే మీ జల్సాల్లాంటి వాటిని నేను వ్యతిరేకమనికాదు. ఎంత అవసరమో ఏ మేరకు అవసరమో, ఎప్పుడు అవసరమో గుర్తించి నన్ను వినియోగించండి. నా ధరను మీరు తగ్గించే ప్రయత్నం చేయండి.

**డీజిల్ :** పెట్రోల్ చెప్పిన మాటను నేనూ సమర్థిస్తున్నాను. పెట్రోల్ కంటే కొంచె తక్కువ విలువ గలదాన్నైనప్పటికీ చాలా విరివిగా భారీ వాహనాలకు నా అవసరం ఉంటుంది. మీరు నన్ను వస్తువుల దొంగ రవాణా తదితరాలకు వాడటంవల్ల మీరు దురుపయోగం చేసినట్లే. విజ్ఞాన విహార యాత్రలో, తీర్థయాత్రలో సక్రమమైన సరుకు రవాణానో చేయడానికి నన్ను ఉపయోగించుకుంటే నా జన్మధన్యం.

**గ్యాస్ :** మీ నోట్లోకి బువ్వవస్తున్నదంటే కారణం నేనే. లేదా నా అక్కయ్యలు కట్టె, బొగ్గు, పిడక మొదలైనవారు. మీ ఇంట్లో, హోటళ్ళలో వంటలు వండేవారు కావలసిన అన్ని పదార్థాలను సిద్ధం చేసుకొనే మమ్మల్ని ఉపయోగించుకోవాలి. అంటే వంట మొదలు పెట్టడానికి ముందే వంటసామాగ్రి అంతా సిద్ధం చేసుకొని

మమ్ములను వెలిగించాలి. మీరు మమ్ములను ఒక్కక్షణం వృథా చేసినా మీ ఇంధన సంపద తరిగిపోయినట్లే, మీరు నష్టపోయినట్లే, మీ వారసులు అవస్థలపాలైనట్లే.

మమ్మల్ని కేవలం వంటకొరకే కాకుండా రవాణారంగంలోను, గృహరంగంలోను, విద్యుత్తు రంగంలోను, తదితర రంగాల్లో వాడుకుంటున్నారు. మరి ఇన్ని రంగాల్లో మీకు మేం సేవ చేయాలంటే మీరు మమ్మల్ని, మా ఉనికిని గుర్తించి వ్యర్థం చేయకుండా, చాలా పొదుపుగా వాడితేనే మీకు మీ మనుమల, మునిమనుమల కాలం వరకు మేం మిగిలి ఉంటాము.

**బొగ్గు :** మాచెల్లె చెప్పిన ప్రతి అక్షరం సత్యమే. నేను రవాణారంగం, విద్యుత్తు రంగంలోను ఉపయోగపడతాను. మీరు విద్యుత్తును వృథాచేసినా, రవాణా రంగాన్ని వృథాచేసినా నన్ను పరోక్షంగా మీరు చంపుతున్నట్లే. మీకో విషయం తెలుసా నేను కట్టె నుండి వచ్చినా, భూమి నుండి వచ్చినా మీరు వేసుకొనే బట్టల ఇస్త్రీ పెట్టెలో దగ్గర నుండి పవర్‌హౌస్‌ల వరకు నన్ను వాడుకుంటున్నారు.

**కిరోసిన్ :** ఈ మధ్య కాలంలో మీరు నన్ను ఎక్కువగా వాడటంలేదు అనుకుంటున్నారేమో! ఏదోరకంగా పరోక్షంగా అనేక కర్మాగారాల్లో నేను ఉపయోగపడుతున్నాను. ఆత్మహత్యలు చేసుకోవడానికి బస్సులను కాల్చటానికి రైళ్ళను తగలబెట్టడానికి, అడవులను కాల్చివేయటానికి మీరు నన్నుగాని, మా పెద్దక్క పెట్రోల్‌నుకాని వాడకూడదు. ఒక్కసారి ఆలోచించండి. ఎంత, ఎలా దురుపయోగం చేస్తున్నారో!

ఇలాగే మీరు ఇతర ఇంధన వనరుల గూర్చి ఆలోచించండి. మమ్మల్ని సద్వినియోగం చేయండి. మీ అవసరాలేంటో, అవి ఎంతమేరకు సత్యమైనవో ఆలోచించి వాడండి. పదిమందికి ఉపయోగపడే పనులకు మమ్మల్ని ఎక్కువగా ఉపయోగిస్తే మాకు సంతోషం. మీకు ఆనందం అందుకే మమ్మల్ని కాపాడండి... మీ మానవజాతి జీవితాలను ఆనందమయం చేసుకోండి.

**ముగింపు :** మీరుపయోగించే ప్రతి ఇంధన వనరుకు మీరు పెట్టే డబ్బును ఎంత ఆలోచించి ఖర్చు పెడతారో నిలువచేసుకుంటారో అలానే అంత కంటే ఎక్కువ ఆలోచన, శ్రద్ధలతో వాటిని వాడండి. సదుపయోగం చేయండి.

### ఇంధనవనరుల పొదుపు - తీసుకోవల్సిన చర్యలు

1. తక్కువ దూరాలకు వెళ్ళినప్పుడు, అనగా కూరగాయలకు బజారుకు వెళ్ళినపుడు నడిచే వెళ్ళాలి, లేక సైకిల్‌పై వెళ్ళాలి. స్కూటర్/సైకిల్ మోటారు వినియోగించ కూడదు.
2. గ్యాస్‌పొయ్యి వెలిగించి, తక్కువ మంటపై వంటచేయాలి. పదార్థాలను అతిగా ఉడికించినా, వేపుడు చేసినా, ఆ పదార్థంలో ఉన్న పోషకవిలువలు పోతాయి. రుచి తగ్గుతుంది. పైగా గ్యాసు కూడా ఖర్చవుతుంది. ఇంటిలో ఎక్కువ $CO_2$ చేరుతుంది.

3. ఇంధన సామర్థ్యం గల పొయ్యిలనే వాడాలి. వంటచెరుకు/కట్టెలను అదేపనిగా ఎక్కువగా మండించకూడదు.

4. అడవికి లేక చెట్లుఉన్న ప్రదేశాలలో నిప్పు/అగ్నిని ఉపయోగించకూడదు. సిగరెట్లు తాగి అలా వేస్తే అంటుకొని అడవిఅంతా తగలబడుతుంది. పర్యావరణానికి, అడవిలో ఉన్న జంతువులకు తీవ్రనష్టం కలుగుతుంది. అవి అన్నీ చనిపోతాయి.

5. ఒక్కరు లేదా ఇద్దరు వెళ్ళేటప్పుడు కారు ఉపయోగించకూడదు. ప్రజా రవాణా సాధనాలయిన బస్సు, రైలును ఉపయోగించుకోవాలి. ఒక్కొక్కరు ఒక్కోకారు బయటకు తీస్తే రోడ్డుపై ట్రాఫిక్ జామ్ అవుతుంది. వాతావరణ కాలుష్యం పెరుగుతుంది. ఇంధనం పొదుపుచేస్తే ఇంధనాన్ని సృష్టించినట్టే.

6. ఇంట్లో అవసరమైనపుడు, మనం ఉన్న రూమ్‌లో మాత్రమే బల్బును వెలిగించుకోవాలి. పడుకునేటప్పుడు తప్పక లైట్లను ఆర్పివేయాలి. ఇంధనసామర్థ్యం గల బల్బులనే వాడాలి.

7. పగటిపూట ఇంట్లో బల్బులు వేయరాదు. కిటికీలు తీసి సూర్యరశ్మి ద్వారా వెలుగు పొందాలి. బట్టలు ఆరవేయటానికి, ధాన్యాలు పొడిగా ఉంచటానికి ప్రకృతిసిద్ధమైన సూర్యకాంతిని వాడాలి.

8. ఇంట్లో చెట్లను పెంచడం ద్వారా ఎ.సి. అవసరం రాదు. ఒక్క చెట్టు 10 ఎ.సి. లకు సమానం.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. మనం ఇంధన వనరులను ఏ విధంగా దుర్వినియోగం చేస్తున్నాం?
2. ఇంధన వనరుల దుర్వినియోగం వల్ల మనకు కలిగే నష్టాలేవి?
3. ఇంధన వనరులన్నీ అయిపోతే మన పరిస్థితి ఎలా ఉంటుంది?
4. ఇంధనాలను మనం ఏ విధంగా పొదుపు చేసుకోవచ్చు?
5. "దేశం యొక్క ఆర్థిక పరమైన పెరుగుదల ఆ దేశ ఇంధన రంగంపై ఆధారపడి ఉంటుంది" విశ్లేషించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ఈ వారంలో ఇంధన వనరులను పొదుపు చేయడానికి మీ వంతు కృషి చేయండి. ఏం చేశారో చెప్పండి. ఇంధన పొదుపును కొనసాగించండి.

## VII. తెలుసుకోండి

మనం శ్రమించాలంటే శక్తి అవసరం. ఏ వస్తువు పనిచేయాలన్నా దానికి తగిన ఇంధనం కావాలి. పెట్రోల్ లేకపోతే బండి, బస్సు ఏదీ కదలదు. విద్యుత్ లేకపోతే టివి, మిక్సీ, రిఫ్రిజిరేటర్ ఏవీ పనిచేయవు. ఫ్యూయల్ లేక పోతే విమానం కూడా నడవదు. సిలిండర్‌లో గ్యాస్ లేకపోతే గుక్కెడు కాఫీ కూడా వెచ్చబడదు. పత్రహరితం కరువైతే మొక్కలు వాడిపోతాయి. వాటికదే ఇంధనం లాంటిది. దేశ ఆర్థికాభివృద్ధికి, పారిశ్రామిక ప్రగతికి ఇంధన వనరులు ప్రధాన పాత్ర వహిస్తాయి. ఇంధనం లేకపోతే బతుకు బండి ముందుకు సాగదు.

ప్రపంచ జనాభా రోజు రోజుకు పెరుగుతోంది. జనాభా పెరుగుదలతో పాటు ఇంధన అవసరాలూ పెరుగుతున్నాయి. విద్యుత్, గ్యాస్, పెట్రోల్, డీజిల్ లాంటి ఇంధన వనరులు మనకు రోజువారీ అవసరం. మన ఇండ్లలో వాడే దాదాపు అన్ని వస్తువులకు విద్యుత్ అవసరం. భూమినుండి త్రవ్వి తీస్తున్న శక్తి వనరుల పైనే మనం పూర్తిగా ఆధారపడి ఉన్నాం. భూమిలో కొద్ది పరిమాణంలో ఉన్న ఈ నిల్వలన్నీ కొంతకాలం తర్వాత తరిగిపోతాయి. ఆ తర్వాత మన పరిస్థితి ఏంటి? ఆర్థిక పరమైన పెరుగుదల, పునర్నిర్మాణ రంగం ముఖ్యంగా ఇంధనరంగంపైనే ఆధారపడి ఉన్నాయి. ఆర్థిక రంగంలో సరళీకృత విధానాల ద్వారా ఇంధనం డిమాండ్ అధికమైంది. డిమాండ్, సప్లైల మధ్య సమన్వయం కోసం తీసుకున్న వివిధ రకాల వ్యూహాలతో ఇంధనాన్ని పరిరక్షించడమే తక్షణ కర్తవ్యంగా మారింది.

ఇంధనం నేడు అత్యవసరం. ఇంధనాలను దుబారాచేస్తే డబ్బు దండగే కాకుండా అవి ఇంకెందరికో దొరక్కుండా పోయే అవకాశం ఉంది. ఇవి అమూల్యమైనవి కనుక వీటిని తక్కువగా, ఆచితూచి, ఆలోచించి ఉపయోగించడం మంచిది. ఇంధన పొదుపు అంటే వీలైనంత తక్కువ ఇంధనాన్ని ఉపయోగిస్తూ యధావిధిగా పని కొనసాగేలా చూడటమే. ఎక్కడా ఇంధనం వృథాకాకుండా జాగ్రత్తపడాలి.

బొగ్గు, కిరోసిన్, సహజవాయువు మొ။న సంప్రదాయ ఇంధన వనరులను ఒక్కసారే వాడగలం. ఇవి వేల ఏళ్ళ క్రితం జీవించి అంతరించి పోయిన చెట్లు మొదలైన వాటి ద్వారా భూగర్భంలో ఏర్పడిన శిలాజ ఇంధనాలు. ప్రస్తుతం ఎక్కువగా వాడుతున్న ఇంధన వనరులవే. వీటిని ఇలానే వాడుతూ పోతే కొంత కాలానికి పూర్తిగా అంతరించిపోతాయి. ఉదా॥ పెట్రోలు ధర రోజు రోజుకీ పెరిగిపోతుంది తప్ప తగ్గదు మనం వాడుతున్న రేటులో పెట్రోలు వాడుకుంటూ పోతే మరో 100 సంవత్సరాల్లో అంతా హరించుకు పోతుంది.

ఫ్యాక్టరీల్లో వీలైనంతగా ఇంధనాన్ని పొదుపు చేస్తూ, ఉత్పాదన పెంచుకునేందుకు ప్రయత్నించాలి. అనేక సంస్థలు నష్టాల్లో ఉన్నాయంటే, ఏకంగా మూత పడుతున్నాయంటే ఇంధన దుర్వినియోగమే ఒక

ప్రధాన కారణం. ఒక్క ఫాక్టరీల్లోనే కాదు మన చుట్టూకూడా ఎందరో పెట్రోల్‌ను వృధాగా ఖర్చు పెట్టేస్తుంటారు. మనం నడిచిపోగలిగిన దూరాలకు కూడా స్కూటర్లు ఉపయోగిస్తుంటారు. ఇక నిత్యం రోడ్లమీద బస్సులు, ఇతర వాహనాలు సిగ్నల్ పాయింట్ల వద్ద ఇతరత్రా ఆగినపుడు కూడా ఇంజన్ ఆఫ్ చేయక పోవడం చూస్తుంటాం. దానివల్ల ఎంత డీజిల్ లేదా పెట్రోల్ దండగ? పైగా అదనంగా కాలుష్యం. ఇండ్లలోనూ ఎంతో గ్యాస్ వృథా అవుతుంటుంది. మనం గదిలో లేకున్నా ఫ్యాన్లు, లైట్లు, ఏసీలు ఆన్‌లో ఉంటాయి.

ఇలా ఇంధనం వృథా అవడానికి మరో ముఖ్యకారణం చవకబారు యంత్రాలు. కొంత ఖరీదు ఎక్కువైనప్పటికీ మంచి మెషినరీ అమర్చుకోవడం వల్ల తక్కువ ఇంధనంతో పని పూర్తవుతుంది. కనుక ఏ విద్యుత్ ఉపకరణాలు కొన్ని '5' స్టార్ రేటింగ్ ఉన్నదాన్నే కొనడం మన ధర్మం.

ఇంధన పొదుపును పాటించడానికి, ఆవశ్యకతను తెలియజెప్పడానికి మనదేశంలో డిసెంబరు 14వ తేదీని "జాతీయ ఇంధన పొదుపు దినోత్సవం"గా గుర్తించి పాటిస్తున్నారు.

ఇంధనాలు అమూల్యమైనవి. ఆ వనరులను కాపాడుకోవడం మన బాధ్యత, వృథా చేసినందువల్ల అటు డబ్బు దండుగ, ఇటు ఇంధనం దొరకక పోయే ప్రమాదం. ఈ రెండింటిని మించిన మరో జటిల సమస్య వాతావరణ కాలుష్యం. ఇంధనాలను అతిగా ఖర్చుపెట్టడం వల్ల మొక్కలు, జంతువులు, ఇతర సహజ వనరులన్నీ దెబ్బతింటాయి. చెట్లు, జంతువులు లేకపోతే మానవ మనుగడే ప్రశ్నార్థకం అవుతుంది. నదీనదాలు ఎండిపోవడం ఓజోన్ పొరకు మరింత చిల్లులు పడటం లాంటి అనర్థాలతో కష్టాల ఊబిలో కూరుకు పోయినట్లవుతుంది మన పని. వాతావరణకాలుష్యం అతివృష్టి, అనావృష్టి, భూకంపాలు, మితిమీరిన ఎండలు లాంటి ప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలన్నిటికీ కారణమౌతుంది. కనుక ఎలా చూసినా ఇంధనాన్ని పొదుపు చేయడం మన కనీస ధర్మం.

**సూక్తి**

**ఇంధన వనరులను పొదుపు చేద్దాం. రేపటి తరాలకు అందిద్దాం.**

# 7 పోషక విలువలను కాపాడుకుందాం

**I. ప్రధాన విలువ**

*ఆరోగ్య విలువలు*

**II. ఉప విలువ**

*చక్కని ఆరోగ్యానికి పోషకాహారం, నీరు అవసరం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- పోషక విలువలు కలిగిన అన్ని ఆహార పదార్థాలను తినడం, పోషక విలువలను కాపాడుకోవడం.
- శరీర పోషణకు కావల్సినంత నీటిని తీసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

పిల్లలూ! మనం తీసుకొనే ఆహారం మన ఆరోగ్యాన్ని నిర్దేశిస్తుంది. అయితే మనం తినే ఆహారంలో ఉన్న పోషక విలువల్ని తెలుసుకోకుండా వాటిని వదిలిపెట్టి ఎటువంటి పోషక విలువలు లేని ఆహారాన్ని తింటున్నాం. వాటి వల్ల మనకు ఎటువంటి శక్తి రాకపోగా అనారోగ్యం మనల్ని వెంటాడుతోంది. అలాగే శరీరానికి సరిపడా నీటిని మనం తాగడం లేదు. కాబట్టి ఆహారపదార్థాలలో పోషక విలువల్ని కాపాడు కోవడం, సరిపడా నీటిని ఎలా తీసుకోవాలో తెలుసుకుందాం.

## V. విషయం

### సంఘటన-1

క్యారెట్టు కూర తనకిష్టం లేదని వేపుడు కూర చేస్తేనే అన్నం తింటానని లేకపోతే తిననని బాలరాజు అల్లరి చేస్తున్నాడు. అటుగా వచ్చిన మావయ్య అది చూసి బాలరాజుతో "సరే నీవు ఆకూర తినవద్దు. మీ అమ్మతో చెప్పి వేపుడు కూర చేయిస్తాను" అని చెప్పాడు. బాలరాజు సంతోషించాడు.

మన శరీరారోగ్యానికి అన్ని రకాల పోషకవిలువలు ఉన్న పదార్థాలు తినాలి. అది ఇష్టం. ఇది ఇష్టం లేదు అని కొన్ని పదార్థాలు మాత్రమే తింటే శరీరానికి తగిన శక్తి లభించదు. రుచికోసం తినడం అనేది కేవలం పొట్టనిండడానికే ఉపయోగ పడుతుంది. అన్ని రకాల వల్ల వాటిలో ఉండే పోషక విలువలు శరీరానికి సమపాళ్ళలో అందుతాయి. వేపుళ్ళు బాగా వేగడం వల్ల పోషకవిలువలు చచ్చిపోయి కేవలం పిప్పి మాత్రమే మిగులుతుంది. అదే తిని మంచి ఆహారం తీసుకున్నామని అనుకుంటున్నాం. శరీరానికి మేలు చేసే వాటిని తినడం ఎంతో మంచిది. కారెటు తింటే కంటిచూపు బాగుంటుంది అని పిల్లలిద్దరికి చెప్పాడు. బాలరాజు అల్లరి మాని క్యారెట్టు కూర తిన్నాడు. పోషక విలువలను గూర్చి స్నేహితులందరికీ చెప్తానని అన్నాడు.

### సంఘటన-2

మాధవి ఎప్పుడూ నీరసంగా ఉంటుంది. చురుకుదనం, ఉత్సాహం, మొదలైనవి ఆమెలో కనబడవు. అలాగని తిండి తినదా అంటే శుభ్రంగా ఆహారపదార్థాలను సమయానికి సరిగ్గానే తింటుంది. మరి ఎందుకని ఆమె అలా ఉంటుంది. ఆమెలో ఉన్నలోపం ఏమిటి? అనిపించి అమ్మ మాధవిని వైద్యుని వద్దకు తీసుకు వెళ్ళింది. డాక్టరు మాధవిని పరీక్షించి ఆమెలో రక్తహీనత కనబడుతుందని, రోగనిరోధక శక్తి తగ్గిందని చెప్తాడు. అది విన్న మాధవి వాళ్ళమ్మ తాను పిల్లకు అన్ని పదార్థాలు చక్కగానే పెడుతున్నాని అలాంటప్పుడు రక్తహీనత లాంటివి ఎందుకు కలిగాయని ప్రశ్నించింది. అప్పుడు డాక్టరు ఆమెతో "మనం వేళకు సరిగానే తింటున్నాం. అదొక్కటే సరిపోదు. మనం తినే ఆహారంలో పోషక విలువలు ఉంటాయి. కానీ వాటిని మనం నాశనం చేస్తున్నాం. ఉదాహరణకు కూరగాయలు ముక్కలుగా కోసి, ఉడికించి ఆ నీటిని పారబోసి ముక్కలతో కూరవండుతాం. కానీ ఉడికించినప్పుడు ఆ కూరల్లోని పోషకాలు నీటిలోకి వస్తాయి. ఆ నీటిని పారబోయడం వల్ల పోషకాలు పోతున్నాయి. అలాగే ఆకుకూరలను తరిగి కడుగుతుంటాం. దాని వల్ల పోషకాలు నశిస్తున్నాయి. ఆకుకూరలను ముందే శుభ్రంగా కడిగి తరుక్కోవాలి. బియ్యాన్ని కూడా ఎక్కువ సార్లు కడగడం వల్ల అందులోని పోషకాలు నీళ్ళతో పాటుగా వెళ్ళిపోతున్నాయి. అన్నం వండి గంజివార్చడం వల్ల అందులో ఉండే పోషకాలు బయటికిపోయి పిప్పిమాత్రమే మిగులుతుంది. ఫ్రిడ్జ్‌ల్లో ఎక్కువ రోజులు నిల్వ చేసిన పదార్థాలలో కూడా పోషకాలు ఉండవు. పండ్లను కూడా తరిగి ఫ్రిడ్జ్‌ల్లో పెడుతుంటారు. దాని వల్ల కూడా పోషకాలు ఆ పండ్లలో ఉండవు. ఇలా ఎన్నో రకాలుగా మనకు తెలియక ఆహార పదార్థాలలో పోషకాలను గుర్తించక కేవలం ఏదో తినేసి శక్తి రాలేదని బాధపడుతుంటాం. ఏదో భయంకరమైన వ్యాధి వచ్చిందని మనకి మనమే నిర్ణయించుకొని దిగులు పడతాం. ఒత్తిడికి లోనవుతాం. అందువల్ల పోషకాహారాన్ని సమతుల్యంగా తీసుకుంటూ, పోషక విలువల్ని కాపాడుతూ తింటే చాలా వ్యాధులను అరికట్టవచ్చు". అని వైద్యుడనగానే

తాను చేసినదేమిటో తెలుసుకొని ఇకనుండి పిల్లలకు చక్కని పోషకాహారం అందిస్తానని అమ్మ వైద్యునితో అంది.

## సంఘటన-3

తరగతిలోని పిల్లలు మాట్లాడుకుంటున్నారు. అందులో ఒక విద్యార్థి తాను ఉపవాసం చేసినప్పుడు ఏ పదార్థం తినలేదని అన్నాడు. మరొకడు తాను నీరు కూడా తాగలేదని అంటున్నాడు. అప్పుడే వచ్చిన టీచరు మాటలు విన్నది. "పిల్లలూ! మనం ఆడడానికి, పాడడానికి, చదువుకోవడానికి శక్తి కావాలి కదా!" అని అన్నది "అవును కావాలి" పిల్లలందరూ ఒక్కసారిగా అన్నారు. "అయితే మనకు శక్తి నిచ్చేది ఆహారం ఒక్కటే కాదు. నీరు కూడా". అంది టీచరు. పిల్లలు ఆశ్చర్యపోయారు. అప్పుడు టీచరు మాట్లాడుతూ "శరీరంలో నీరు లేకుండా ఏ పనులు జరుగవు. రక్తం తయారు కావడానికి, జీవ రసాయన క్రియలు జరగడానికి, ఆహారం జీర్ణం కావడానికి, మలిన పదార్థాలను చెమట, మల, మూత్ర రూపంలో విసర్జించడానికి నీరు అవసరం. శరీరానికి తగినంత నీరు తీసుకోకపోతే శరీరం "డీ-హైడ్రేషన్" కి (నీటిశాతం తగ్గడం) గురవుతుంది. శరీరం బరువు తగ్గిపోవడం, గుండెపని చేసే శక్తి తగ్గిపోవడం, రక్త ప్రసరణ తగ్గిపోవడం వంటి సమస్యలు వస్తాయి. అందువల్ల పరిశుభ్రమైన నీరు తీసుకోవాలి. చాలామంది ఆహారం తినడంలో శ్రద్ధ చూపిస్తారు కానీ నీరు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తారు. నీరు కూడా తగినంత తాగాలి. దానివల్ల పెరిగే పిల్లల్లో నూతన కణజాల నిర్మాణం బాగా జరుగుతుంది. చెమట, మల మూత్రాదుల వల్ల లోపించిన నీటిని తిరిగి భర్తీచేయవచ్చు. కాబట్టి ఉపవాసాల పేరున మేము నీళ్ళు కూడా తాగమని చెప్పుకోకుండా నీటి అవసరాన్ని గుర్తించి దాన్ని తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చు. అందుకే ఆహారం, పరిశుభ్రమైన నీటిని తీసుకోండి" అని టీచరు చెప్పింది. పిల్లలందరూ ఆసక్తిగా విని తాము తప్పకుండా నీటిని తీసుకుంటామన్నారు.

**మంచి ఆహారపదార్థాలు :-**

1. ఆయా ఋతువులు / కాలాలలో లభించే పండ్లు
2. బాదంపప్పు లేదా వేరుశెనగ
3. ఆకుకూరలు తక్కువ ఉడికించినవి లేక పచ్చివి
4. చేపలు
5. గుడ్లు
6. పాలు
7. చిలకడ దుంపలు / దుంపలు
8. మొలకెత్తే గింజలు
9. తృణధాన్యాలు - రాగులు, సజ్జలు, జొన్నలు, బొబ్బర్లు, అలసందలు వంటివి.
10. పప్పుధాన్యాలు : కంది, పెసర, మినప, శెనగ వంటివి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. మనం రోజూ ఎటువంటి ఆహార పదార్థాలను తీసుకుంటున్నాం. దాని వల్ల ఏం జరుగుతుంది?
2. పోషకాహారం అంటే ఏమిటి? దానిని ఎలా తీసుకోవాలి?
3. మీరు ఆహారపదార్థాలలోని పోషక విలువలను కాపాడడానికి ఏం చేస్తారు?
4. శరీరానికి నీరు ఎందుకు అవసరం. ఎటువంటి నీటిని తీసుకోవాలి?
5. పై మూడు సంఘటనల వల్ల మీరేమి గ్రహించారు?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- పోషకవిలువలు గల మొలకెత్తిన గింజలు రోజూ తినండి. ఆ గింజలను ఎలా మొలకెత్తించాలో తెలుసుకొని, రోజూ వాటిని తిని అవి తిన్నప్పుడు మీకేమి అనిపించిందో చెప్పండి.
- ఆహార పదార్థాలలో పోషకాలు నశించకుండా జాగ్రత్త పడండి. పోషకాలు నశించకుండా ఎలా వండాలో ఇంట్లో చెప్పండి. మీరూ చేయండి. ఆ తర్వాత కలిగిన మార్పు ఏమిటో చెప్పండి.
- మంచినీరు ఎప్పుడెప్పుడు తాగాలో, ఎంత తాగాలో తెలుసుకొని ఆచరించండి. మీ అనుభవాలను మిత్రులతో చెప్పండి.

## VII. తెలుసుకోండి

మొక్కలలో ఎన్నో రకాల పోషక పదార్థాలున్నాయి. పిండి పదార్థాలు, మాంసకృత్తులు, కొవ్వులు, విటమిన్లు, ఎంజైములు, ఖనిజాలు మొదలైనవి ఉన్నాయి. రోగనిరోధక శక్తిని కలిగించే రసాయనాలు (ఫైటో కెమికల్స్) ఉన్నాయని శాస్త్రజ్ఞులు కనుగొన్నారు. కూరగాయలు, ధాన్యాలు, పండ్లు, పప్పులు మొదలైన వాటి వాడకం వల్ల రోగనిరోధకత పెరిగి మధుమేహం, గుండె జబ్బులు, కేన్సరు వంటి రోగాలు రాకుండా నివారించవచ్చని శాస్త్రజ్ఞులు తమ పరిశోధనలో తేల్చారు. ఆహారపదార్థాలలోని పీచు (ఫైబర్) కొలెస్టరాల్ నియంత్రణకు సాయపడుతుంది.

పూర్వకాలంలో రైసుమిల్లులు లేని సమయంలో ప్రజలు వడ్లు దంచి పై పొట్టును మాత్రమే పోగొట్టి ఆ బియ్యాన్ని ఒక సారి కడిగి వండుకునేవారు. ఆ అన్నం 'బి' కాంప్లెక్సు విటమిన్లు ఎక్కువగా ఉండేవి. రక్తహీనత, నీరసం లాంటివి దరిజేరివికావు. ప్రస్తుతం బియ్యం పాలిష్ చేసి, సన్నబియ్యం తినడం వల్ల దానిలో పోషకాలు పోయి కేవలం బియ్యం మిగులుతున్నాయి. అన్నం వండి గంజి వార్చడం వల్ల ఇంకా మిగిలిన పోషకాలు ఏమైనా ఉంటే అవి కూడా పోయి పిప్పి మాత్రమే అన్నం రూపంలో మిగులుతుంది.

దానినే మనం తింటున్నాం. ముడిబియ్యం గంజి వార్చకుండా తినడం మంచిది. కుక్కర్లో వండడం మంచిదే. ఒక వేళ గంజిని పారబోసే బదులు రాగిమాల్ట్ లాంటి వాటిల్లో వాడడం మంచిది.

వివిధ రకాలైన ధాన్యాలను పిండి పట్టించి వాడుకుంటాం. పాతకాలంలో వీటిని తిరగలి రాయిలో విసిరి జల్లించకుండానే వాడేవారు. అందువల్ల అందులోని పోషకాలు ఉండేవి. జల్లించడం వల్ల దానిలో ఉండే పీచు పదార్థం పోతుంది. ఆధునిక కాలంలో పిండిమరలు వచ్చాయి. మెత్తగా పిండి పట్టించుకొని జల్లించకుండానే వాడుకోవచ్చు. రాగులు, జొన్నలు, పచ్చజొన్నలు, శనగలు, మినుములు, పెసలు, గోధుమలు, సజ్జలు, మొక్క జొన్నలు మొదలైనవాటిని ఏదో ఒక రూపం తీసుకొనేవారు.

అప్పటి కాలంలో తోటలో లేక ఇంటి పెరటిలో వేసిన ఆకుకూరలు, కాయగూరలు మొదలైన వాటిని తాజాగా కడిగి వండుకునేవారు. ఎరువులు వాడేవారు కాదు. ఆధునిక కాలంలో మురికి నీళ్ళతో, ఎరువులు విపరీతంగా వాడుతూ పండిస్తున్న కూరగాయలు, ఆకుకూరలు, పండ్లలో పోషకాలు కొంత మేరకు నశించి పోతున్నాయి. మరికొంత మన వాడకంలో నశించి పోతుంది.

ఇప్పటి వలె పదార్థాలను నిల్వ ఉంచుకొని తినేందుకు అప్పట్లో ఫ్రిడ్జ్‌లు లేవు. మంచి ఆహారం, తగినంత శ్రమ ఉండేది కనుక చక్కగా తినేవారు. నిల్వ ఉంచుకోనేంతగా మిగిలేది కాదు.

అలాగే కలుషితం కాని మంచినీరు తీసుకునేవారు. మన సంస్కృతిలో ఇంటికి వచ్చిన వారికి ముందుగా మంచినీళ్ళు ఇచ్చి అతిథి మర్యాద చేస్తాము. శరీరానికి కావలిసినంత నీరు అందించేందుకే ఈ మర్యాద. చాలా దూరం నడవడం వల్ల చెమటరూపంలో నీరు వెళ్ళిపోతుంది. దానిని తిరిగి భర్తీ చేస్తుంది ఈ పద్ధతి.

ఈ రోజుల్లో అనారోగ్యకరమైన కూల్‌డ్రింకులు ఇస్తున్నారు. దానినే గొప్ప మర్యాదగా భావిస్తున్నారు. కలుషిత నీటిని తాగుతున్నారు. మన ముందు తరాలవాళ్ళు ఆరోగ్యంగా దృఢంగా ఉండడానికి కారణం వారు చేసే శ్రమ, తీసుకొనే పరిపూర్ణ ఆహారం, నీరు. అందువల్లనే ఇప్పటివాళ్ళతో పోల్చి చూస్తే వారే ఆరోగ్యంగా, బలిష్టంగా కనిపిస్తారు. అందుకనే పెద్దలమాట చద్దిమాట" "పెద్దల బాట బంగారుబాట" అని గ్రహించాలి.

**పోషక విలువల్ని కాపాడుకోవడానికి ఇలా చేయండి!**

- కూరగాయల్ని పెద్ద ముక్కలుగా తరగాలి. అందంగా ఉండాలని సన్నగా తరగకూడదు.
- వంట చేసేటప్పుడు ఆవిరి పోకుండా పదార్థాలపై మూతలుపెట్టాలి. దానివల్ల ఆవిరి ద్వారా కరిగిన ఖనిజ లవణాలూ, విటమిన్లు బయటికి పోవు.
- మాడిన వంటలో పోషక విలువలు ఉండవు. అందుకని బాగా వేయించడం, మాడగొట్టడం చేయకూడదు.
- కూరగాయల్ని తరగక ముందే కడగాలి. తరిగిన తర్వాత నీళ్ళలో ఎక్కువసేపు ఉంచడంవల్ల విటమిన్లు ఖనిజ లవణాలు నీటిలో కరిగిపోతాయి.

- ఏ పదార్థాన్నైనా ఎక్కువ సేపు ఉడికించకూడదు. వీలైనంత తక్కువసేపు ఉడికించాలి. మగ్గుతుందని పొయ్యిమీద అలాగే ఉంచకూడదు.
- పప్పులను, మాంసాన్ని త్వరగా ఉడికించాలని సోడా ఉప్పు వేయరాదు. దానివల్ల వాటిల్లోని పోషకవిలువలు పోతాయి.
- ప్రెషర్ కుక్కర్ తక్కువ నీటితో, తక్కువ ఇంధనంతో ఉడకడానికి మంచి సాధనం కాబట్టి దానిని వాడాలి.
- బంగాళాదుంపలు, గోరు చిక్కుళ్ళు లాంటివి ఉడికించినప్పుడు ఆ నీళ్ళను పారబోయకుండా సాంబారు, రసం, పులుసు లాంటి వాటి తయారీలో ఉపయోగించాలి.
- విటమిన్లని నాశనం చేసే సువాసననిచ్చే ఎస్సెన్సులు (సింథటిక్ ఫ్లేవర్స్), రంగులు, నిలువ ఉండే పదార్థాలు (ప్రిజర్వేటివ్స్) వాడకూడదు.
- క్యారెట్లు, ముల్లంగి, కీరదోస, టమాటా లాంటివి పచ్చిగా తింటేనే మేలు.
- పండ్లను ముక్కలుగా కోసి నిల్వబెట్టి తినకూడదు.

## మీకు తెలుసా

- **విటమిన్ 'ఎ' :** ఇది చర్మం, కళ్ళు ఆరోగ్యంగా ఉండేలా చేస్తుంది. క్యారెట్లు, బొప్పాయి, ఆకుకూరల్లో 'ఎ' విటమిన్ ఎక్కువగా ఉంటుంది.
- **విటమిన్ 'బి' కాంప్లెక్సు :** పాలు, పాల ఉత్పత్తులు, మాంసం, గ్రుడ్డు, ధాన్యాలు, కూరగాయలలో ఉంటుంది. సరైన ఎదుగుదలకు, శరీర పనితీరుకు ఇది సహకరిస్తుంది.
- **విటమిన్ 'సి' :** నిమ్మ, నారింజ, ఉసిరి, మొదలైన సిట్రస్ జాతి పండ్లు, ఆకుకూరలలో ఉంటుంది. ఇది ఎముకలకు, దంతాలకు అవసరం.
- **విటమిన్ 'డి' :** చేపలు, కాలేయం, గుడ్డులోని పచ్చభాగం, మొదలైన వాటిలో ఉంటుంది. సూర్యకిరణాలు మన శరీరాన్ని తాకడం వల్ల కూడా ఈ విటమిన్ తయారవుతుంది. అందుకే సూర్యనమస్కారాలు చేసేవారు. అడ్డదిడ్డంగా ఎముకలు పెరిగేలా చేసే "రికెట్సు" అనే వ్యాధి రాకుండా చేస్తుంది.
- **విటమిన్ 'ఇ' :** వంటనూనెలలో ఇది లభిస్తుంది. ఇది కండరాల పనితీరుకు సహాయపడుతుంది.
- **విటమిన్ 'కె' :** ఆకుకూరల్లో లభిస్తుంది. అలాగే కాయగూరలు, చేపల్లో కూడా ఉంటుంది. ఇది దెబ్బలు తగిలినప్పుడు రక్తం గడ్డకట్టడంలో సహకరిస్తుంది.
- **నీరు :** రోజుకు కనీసం 8 నుండి 10 గ్లాసులు తాగాలి. నీరు రక్తశుద్ధికి ఉపయోగపడుతుంది. కిడ్నీలలో (మూత్రపిండాలు) రాళ్ళు ఏర్పడకుండా చేస్తుంది. శరీరాన్ని కాంతివంతం చేస్తుంది.

తెలుసుకోండి

## పోషక విలువల్ని కాపాడుకోవటం (Preserving Dietery Values)

పేద జనం బలమైన తిండి ఎటూ కొనలేరు, తినలేరు దొరికే ఆహారాన్నయినా బలోపేతంగా ఉండేట్టు చూసుకుంటే కొంతవరకు రోగాల్ని దూరంగా ఉంచవచ్చు.

మనం ప్రతిరోజూ తినే ఆహారపదార్థాలలో పోషక విలువల్ని కాపాడుకోవటానికి కొన్ని ముఖ్యమైన పద్ధతులున్నాయి.

1. పులియటం (Fermentation)
2. మొలకలెత్తటం (Germination)
3. మిశ్రమం చేయటం (Mixing)
4. వేయించటం (Frying)
5. ఉడికించటం (Boiling)

### 1. పులియటం (Fermentation)

పదార్థం పులియటాన్ని **"ఫెర్మెంటేషన్"** (Fermentation) అంటారు. "ఈస్ట్" అనబడు ఫంగస్, లాక్టోబాసిల్లస్ అనబడే మేలు చేసే బ్యాక్టీరియా ఆహారపదార్థాలు పులవటానికి సాయపడతాయి.

- పాలు కాచి తోడేసినప్పుడు, ఇడ్లీ, దోసెల పిండి రుబ్బి ఉంచినప్పుడు పులియటం అనే ప్రక్రియ జరుగుతుంది.
- ఈ ప్రక్రియలో ఆహారపదార్థాల్లోని చక్కెరపై చర్య జరిగి ఆల్కహాలు, కార్బన్ డై ఆక్సైడ్ వెలువడతాయి. **"లాక్టోస్"** (Lactose) అనే తియ్యని పదార్థం **"లాక్టిక్ యాసిడ్"** (Lactic Acid) గా మారుతుంది. దీనివల్ల **"బి"** కాంప్లెక్సుకు సంబంధించిన అనేక విటమిన్లు ఉత్పత్తయి, ఆహారానికి అదనపు పోషక విలువలు సమకూర్చుతాయి.
- కొంచెం ఉష్ణోగ్రత ఎక్కువ ఉన్నప్పుడు ఈ చర్య మరింత వేగంగా జరుగుతుంది. ఈస్టు, బ్యాక్టీరియా మరింత చురుకుగా పనిచేస్తాయి.
- దీంతో ఆ ఆహారానికి మంచి పోషక విలువలు రావటమే కాక, త్వరగా జీర్ణమయ్యే లక్షణం కలుగుతుంది.
- ఇడ్లీ, దోసె, ఊతప్పం, దిబ్బరొట్టె, పొంగనాలు, పునుగులు, జిలేబీ, మైసూరుబజ్జీ, నానరొట్టె ఈరకంగా తయారయ్యేవే! కాబట్టే రోగులకి ఇడ్లీ, నాన్‌రొట్టె (Bread) పెట్టమని చెప్తుంటారేమో!
- పులియటంలో తయారయిన ఎంజైములు తినే పదార్థాల కణాలను చిట్లగొట్టటంలో ముఖ్యపాత్ర తీసుకొని పిండిపదార్థాలూ, మాంసకృత్తులూ తేలిగ్గా జీర్ణం అయ్యేలా చేస్తాయి.
- ఈ ఎంజైములు శరీరానికవసరమైన విటమిన్లను తయారుచేస్తాయి.

- పులియబెట్టిన ఆహారపదార్థాలు మెత్తగా, స్పాంజిలా ఉంటాయి. పిల్లలూ, వృద్ధులూ, రోగులూ తినగలిగేలా ఉంటాయి. పెరుగు ఆకలిని పుట్టిస్తుంది.
- పెరుగులో ఉండే **లాక్టోబాసిల్లస్ క్రిములు - లాక్టిక్ యాసిడ్** (Lactic Acid) ని తయారుచేస్తాయి. ఇవి విషపూరితమైన క్రిముల పెరుగుదలనరికడతాయి.

## 2. మొలకెత్తడం (Germination)

- కొన్ని ఆహార ధాన్యాలు, పప్పుదినుసులు నీళ్ళలో నానబెడితే వాటి పోషక విలువలు పెరుగుతాయి. ఈ ప్రక్రియ (Process) కి కూడా అధిక ఉష్ణోగ్రత, తడి వాతావరణం అవసరం.
- పెరుగుతున్న మొలక అవసరాలను తీర్చటానికి అదనంగా కొన్ని విటమిన్లు ఉత్పత్తవుతాయి. చాలా రకాల ధాన్యాలు మొలకెత్తినప్పుడు వాటిలో **"థయమిన్"** (Thiamine)**, "నికొటినిక్ యాసిడ్"** (Nicotinic Acid)**, "రిబోఫ్లావిన్"** (Riboflavine) తరచుగా రెండింతలవుతాయి. విటమిన్ **"సి"** పదింతలు పెరుగుతుంది.
- దీనికి తోడు దానిలోనున్న ఖనిజము (ఇనుము) యొక్క కరుకుదనము తగ్గి శరీరానికి పోషకాలు ఎక్కువగా లభిస్తాయి.
- ముఖ్యంగా పప్పుల వంటి వాటిలో **"పోషక విరుద్ధమైన ధర్మాలు"** ఉంటాయి. అవి తగ్గిపోతాయి. మొలకెత్తడంలో కొన్ని భౌతిక ప్రయోజనాలు కూడా ఉన్నాయి. మొలకెత్తేటప్పుడు పప్పులుగాని, ఆహారధాన్యం గాని మెత్తగా వాని పైపొట్టు చిట్లి తెరుచుకుంటుంది. దీనివలన వండటం సులభమవుతుంది. త్వరగానూ ఉడుకుతుంది.
- పిండిపదార్థాలు, మాంసకృత్తులను తీసుకుపోయే కణాల గోడలు ఈవిధానంలో పగిలిపోతాయి. కనుక మొలకదేరిన పదార్థాలను జీర్ణింపచేసే శక్తి కూడా రెట్టింపవుతుందని నమ్ముతున్నారు.
- మెంతుల విషయంలో మొలకలెత్తటంలో మంచి ఫలితాలన్నిటితోపాటు వాటిలోని చేదుతనం కూడా చాలావరకు తగ్గుతుంది.

## మొలకెత్తించే విధానం (The Art of Sprouting) / (Sprouting)

- గోధుమ, సజ్జ, జొన్న, రాగి వంటి ఆహారధాన్యాలనూ; సెనగలు, పెసలు, ఉలవలు, బఠానీలు వంటి పప్పుదినుసులనూ మొలకలెత్తించవచ్చు.
- 100 గ్రాముల ధాన్యాలకు సాధారణంగా 50-100 సి.సి.ల నీళ్ళు పోసి 8-16 గంటలవరకూ నానబెడితే విత్తనాలు అన్ని నీళ్ళనూ పీల్చుకొని ఉబ్బుతాయి. అంతకన్నా ఎక్కువపోసి నానబెడితే నీళ్ళని వృథాగా వంచి పారబోయాల్సి వస్తుంది. నీళ్ళలో కరిగిన ఖనిజ లవణాలన్నిటినీ పోగొట్టుకుంటాం. అలా నానిన ధాన్యాన్ని సన్నని/పల్చని బట్టలో మూటగట్టి పళ్ళెములో పెట్టి

దానిపైన ఏదైనా గిన్నెను బోర్లించాలి. దీని తర్వాత 12-24 గంటల మధ్య ఎప్పుడయినా మొలకెత్తుతాయి.

- ఇంకొక పని కూడా చేయవచ్చు. నానిన ధాన్యాన్ని చిల్లుల గిన్నెలో పోసి సన్నటి బట్ట కప్పాలి. ఈ బట్ట ఎప్పుడూ తడిగా ఉండటానికి బట్ట కొసలు ధాన్యము పోసిన చిల్లుల గిన్నె క్రింద మరొక గిన్నె పెట్టి దానిలో ముంచాలి.
- ఇలా మొలకదేరిన ధాన్యాన్ని పచ్చివి అలాగే తినవచ్చు. నాగుల చవితికి మొలకెత్తిన సజ్జలు, శుభకార్యానికి నానబట్టిన శనగలు, నైవేద్యానికి వాడే వడపప్పు - ఇలా నానబెట్టి, మొలకెత్తించి తినటం మన పూర్వీకుల కాలం నుండి అలవాటయినదే!

**3. మిశ్రమం చేయటం (Mixing)**

- ఏ పదార్థాన్ని, ఆ పదార్థంగా విడివిడిగా తినటం కన్నా రెండు, మూడు లేదా ఎంత వీలయితే అన్ని ఎక్కువ పదార్థాల్ని **"మిశ్రమం"** (Mixing) చేసి తినటం వలన ఆ పదార్థం యొక్క పోషక విలువలు ఇనుమడిస్తాయి.
- ఈ మిశ్రమం అనేది ఉడికించటం, వేయించటం, కలిపి పొడి చేయటం, లేదా పచ్చివే తినటం - ఇలా ఏ రూపంలోనైనా ఉండొచ్చు.
- సిమెంటు, ఇసుక, నీరు విడివిడిగా ఉంటే లేని బలం అవి మూడూ కలిస్తే వస్తుంది. దానికే ఇటుకలు, రాళ్ళు, ఇనుము కూడా జతయితే బలం మరింత పెరుగుతుంది. అలాగే ఆహారపదార్థాల మిశ్రమం కూడా ఒకదానికొకటి కలవటం వలన బలవర్ధకంగా మారుతుంది.
- బియ్యానికి పెసరపప్పు చేర్చి వండే పులగం; బియ్యానికి రాగిపిండి చేర్చి వండే రాగిముద్ద; బియ్యం, శనగపప్పు, పాలు, చక్కెర/బెల్లం, జీడిపప్పులు, కొబ్బరి సుగంధ ద్రవ్యాలైన యాలుకులు, కుంకుమపువ్వు, పచ్చకర్పూరం అన్నీ చేర్చి వండే **"చక్కెరపొంగలి"** ఇవి పోషక విలువల్ని పెంచే ప్రక్రియతో తయారయ్యేవే!
- ఆడపిల్లలకి రక్తవృద్ధికి పెట్టే చిమ్మిరుండలు - వేయించిన శనగపప్పు, కొబ్బరి, బెల్లం కలయికతోనూ; బాలింతలకి, శుభకార్యాలకి వాడే సున్నుండలు వేయించిన మినుములు, బియ్యంపిండి, బెల్లం, నెయ్యి కలయికతోనూ; ఆకుకూరలు, కూరగాయల కలగలుపుతో తయారయ్యే పప్పు, సాంబారు, దప్పళం పులుసులు - ఇవన్నీ కూడా మిశ్రమాహారానికి ఉదాహరణలే!
- మొలకెత్తిన ధాన్యాన్ని తీసుకొని ఎండబెట్టి, తర్వాత దోరగా వేయించి పొడిచేసి "మాల్టు" (జావ) లకు వాడుకోవచ్చు. వేయించటం వలన ఒకలాంటి సువాసన కూడా వస్తుంది. **"హెల్తు డ్రింకు"** లన్నీ (హార్లిక్సు, బోర్న్‌విటా, బూస్ట్, మాల్టోవా లాంటివి) ఈ ఫార్ములాలోనే తయారవుతున్నాయి. అవి బలవర్ధకమైనవని చెప్పటానికి కారణం - ఒకటి మొలకెత్తిన ధాన్యం

వాడటం, రెండు రకరకాల ధాన్యాలు, చిరుధాన్యాలు (రాగులు, సజ్జలు, కొర్రలు, వరిగెలు, బార్లీ, యవలు, తైదలు, రై, ఓట్లు మొదలైనవి) మిశ్రమం చేయటం అనే అంశం ఉందిక్కడ; వేరుశనగ విత్తనాలు పాలపొడి లాంటి మాంసకృత్తులున్న పదార్థాలు కూడా కలపటం – వీటి కలయికతో తయారయిన ఏ పదార్థమైనా బలవర్ధకమే! అందుకే – **"బోర్న్‌విటా, హార్లిక్సు, బూస్టు... దాని పేరేదైనా సరే వేస్ట్ వేస్ట్ !"** – అని మనవి చేస్తున్నాం. ఖరీదు చాలా ఎక్కువ కాబట్టి.

## 4. వేయించటం (Fry)

- **"వేయించటం"** (Fry) వలన ధాన్యానికి మంచి సువాసన వస్తుంది. కఠినత్వాన్ని పోగొట్టుకుంటుంది.
- వేయించిన తర్వాత ఆయా పదార్థాల రుచి కూడా పెరుగుతుంది.
- శనగలు, బఠానీలు, వేరుశనగ విత్తనాలు, మొక్కజొన్నలు, జొన్నలు మొదలైనవి వేయిస్తే ఇష్టంగా తినటానికి సిద్ధపడతారు.
- వేసిన ధాన్యం పేలాలుగా మారి మృదువుగానూ, సులభంగా నమలటానికి వీలుగానూ తయారవుతుంది. పచ్చిశెనగపప్పును వేపినప్పుడు మృదువుగా, తేలికగా మారి వేయించిన శెనగపప్పు అవుతుంది. వీటిని **"పప్పులు"** అని రాయలసీమ జిల్లాల్లోనూ, **"పుటనాలు"** అని తెలంగాణా జిల్లాల్లోనూ పిలుస్తారు.
- పేలాలను పొడిచేసి దానికి బెల్లం, నెయ్యి కలిపితే తయారయ్యే **"పేలపిండి"** రుచి అద్భుతంగా ఉంటుంది. **"తొలిఏకాదశి"** పండక్కిది ఒకప్పుడు గొప్ప వంటకం.
- అయితే వేయించటం అనేది **"శ్రుతిమించితే"** పదార్థం పోషక విలువల్ని పోగొట్టుకోవటంతోపాటు ముడి బొగ్గు (కర్బనం) లా అవుతుంది. ఎంత మాడితే అంతమేరకు బొగ్గవుతుంది.
- అందుకే **"వేపుడు కూరలు"** చేయటం వీలయితే మానేయాలి. లేదా తగ్గించాలి.
- ఊర మిరపకాయల్ని నూనెలో వేసి కాల్చాక, కారం ఉండకపోవటానికి కారణం అవి మాడి కర్బనం (బొగ్గు) గా మారటమే!
- ఇలా కర్బనంగా మారేంతగా వేయించి తింటే క్యాన్సర్ రావటానికి అవకాశముంది.

## 5. ఉడికించటం (వండటం) (Boiling)

కొన్ని పదార్థాలు, ధాన్యాలు, పప్పుదినుసులు కఠినంగా, గట్టిగా ఉండి అలాగే తినటానికి వీలు కావు. అలా ఉన్నవాటిని శరీరానికి కావలసినంత తీసుకోలేము. కొన్ని పదార్థాలు కష్టపడి తిన్నా తేలికగా జీర్ణం కావు. కొన్ని పదార్థాలు మెత్తగా ఉన్నా అలా తినటం సాధ్యం కాదు. ఉదాహరణకి ఇడ్లీపిండి, దోశెలపిండి, పూరీలపిండి మెత్తగానే ఉంటాయి. వాటిని ఇడ్లీ, పూరీ, దోసెల్లా మార్చితే తప్ప తినలేము. దానికి **"వండటం"** లేదా **"ఉడికించటం"** (Boiling) అనేది చాలా అవసరం.

- వండటం వలన పదార్థం మెత్తగా, మృదువుగా మారుతుంది. రుచి పెరుగుతుంది. తేలికగా అరుగుతుంది.
- బియ్యం, పప్పు లాంటివి వండినప్పుడు వాటి పరిమాణం పెరగుతుంది.
- అయితే వండటంలో మెళకువలు పాటించకపోతే ఇక్కడ కూడా పోషక విలువలు పోతాయి.

**పోషక విలువల్ని కాపాడుకోవలసిన సందర్భాలు**

- కొన్ని పోషక పదార్థాలు ముఖ్యంగా విటమిను "సి" వండటంలోనూ, గాలీ, వెలుతురూ సోకటం చేత త్వరగా నశించిపోతాయి. అందుచే అలాంటి పోషక విలువలున్న కూరగాయల్ని, పండ్లని పచ్చివే తినటం మంచిది. క్యారెట్, ముల్లంగి, కీరదోస, దోస, టమాటా, పచ్చి మామిడికాయలు, చింతచిగురు, కొత్తిమీరా... ఇలాంటి వాటిని తరిగి పచ్చళ్ళలోగాని, విడిగా గానీ అలానే తినటం మంచిది.
- పచ్చి ఉల్లిపాయలు, పచ్చి కొబ్బరి, చిలకడదుంపలు లాంటి కొన్ని ఆహారపదార్థాలు కూడా వండకుండా తినటానికి వీలవుతుంది. అంటే తినమనేకదా!
- అన్నం వండే ముందు బియ్యాన్ని నానబెట్టి, కడిగి వంచి పారబోసి, ఆ తర్వాత వండే అలవాటుంది చాలామందికి. అలా నానబెట్టిన బియ్యం త్వరగా ఉడికి ఇంధనం ఆదా అయ్యేమాట నిజమేకాని, నానబెట్టినప్పుడు పోసిన నీళ్ళను పారబోయకూడదు. బియ్యంలో ఖనిజలవణాలూ, చక్కెరలూ అన్నీ అందులో కరిగి కలిసిఉంటాయి. పారబోస్తే కాలవ పాలవుతాయి.
- అన్నం గంజి వార్చి వండకూడదు. "అత్తెసరుతో" అన్నం ఇగరబెట్టటం వలన, పోషక విలువల్ని యథాతథంగా పొందగలుగుతాయి.
- కూరగాయలను వీలయినంత పెద్ద ముక్కలుగా తరగాలి. అందంగా ఉండాలని, ఆధునికత అంటే ఇదే కాబోలు అనుకొని సన్నగా తరగకూడదు.
- సన్నగా తరిగిన ముక్కలు ఉడికించేటప్పుడు ఎక్కువ పోషక విలువలను పోగొట్టుకుంటాయి. తినటానికి అంతంత నాజూకుగా కోయనక్కరలేదు.
- ఉడకటానికి ఎంత నీరు అవసరమయితే అంతే పోసి ఉడికించాలి. ఎక్కువ నీరు పోయటం, ఆ నీరంతా ఇగిరేదాకా పొయ్యిమీద ఉంచటం లేదా ఎక్కువయిన నీటిని వంచి పారబోయటం, గంజివార్చటం అన్నీ నష్టం కలిగించేవే!
- పాలిష్ తక్కువ ఉన్న బియ్యాన్ని ఎంచుకోవాలి. **"దంపుడు బియ్యం తినండి"** అంటే చెప్పినోడ్ని ఓ వెర్రివెంగళప్పని చూసినట్టు చూస్తారు. **"నేనేం బైతుననుకొంటున్నావా?"** అన్నట్టు ఓ చూపు విసుర్తారు కొందరు.

- తెల్లటి బియ్యం తినడం ఓ ఫ్యాషన్! ముతకబియ్యం తినడం నామోషీ!! అందుకే పాలిష్ **"తక్కువ"** బియ్యం అని జాగ్రత్తగా మనవిచేసేది!
- వంట చేసేటప్పుడు ఆవిరి పోకుండా అన్ని పదార్థాల మీదా మూతలుండాలి. ఆవిరి ద్వారా కరిగిన ఖనిజలవణాలూ, విటమిన్లూ బయటికి వెళ్ళిపోతాయి. వేపుడు కూరల్లాంటివి పొడిపొడిగా ఉండాలని ఇలా మూతపెట్టకుండా వండుతుంటారు. అది సరైనది కాదు.
- వీలయినంత సన్నని మంటమీద వంటచేయాలి. ఓ పెద్దమంటలో వండినప్పుడు ఎక్కువ పరిమాణంలో పోషక విలువలు కోల్పోయే అవకాశం ఉంది. మాడే అవకాశమూ ఉంది. మాడినా కూడా పోషక విలువలు పోయినట్టే! మాడటమంటే గిన్నెలో బొగ్గు మిగలటమే.
- తరిగిన కూరగాయల ముక్కల్ని ఎక్కువసేపు బయట ఉంచకూడదు. వెంటనే వండాలి. "సి" విటమిన్‌కి గాలిలో కలిసే స్వభావం ఉంది. కూర వండేముందు మాత్రమే ముక్కలుగా కోసుకోవాలి.
- కూరగాయల్ని తరగకముందే కడగాలి. తరిగిన తర్వాత నీళ్ళలో కడగటం వలన, ఎక్కువసేపు అలాగే ఉంచటం వలన విటమిన్లూ, ఖనిజలవణాలూ కరిగి నీళ్ళలో పోతాయి.
- ఏ పదార్థమైనా ఎక్కువసేపు ఉడికించకూడదు. వీలయినంత తక్కువసేపు ఉడికించాలి. ఇంకాసేపు ఉంచితే బాగా మగ్గుతుందని పొయ్యిమీద ఉంచరాదు.
- కందిపప్పు, మాంసము లాంటివి ఉడకలేదనో, త్వరగా ఉడకాలనో సోడా ఉప్పు (Baking Soda) వేస్తుంటారు. దానివలన కూడా పోషక విలువలు పోతాయి.
- దానికి బదులు ప్రెషర్ కుక్కర్‌లో ఉడికిస్తే – ఎలాంటి వస్తువులైనా ఉడుకుతాయి. ఆవిరి ద్వారా పోషక విలువలు పోకుండా ఉండటానికి, తక్కువ నీటితో ఉడకటానికి, తక్కువ ఇంధనంతో ఉడకటానికి **"ప్రెషర్ కుక్కర్"** (Pressure Cooker) మంచి సాధనం.
- బంగాళాదుంపలు, గోరుచిక్కుళ్ళు, చిక్కుళ్ళు లాంటివి ఉడికించినపుడు నీళ్ళను వంచి పారబోయకుండా తిరిగి ఆ నీళ్ళను సాంబారు, పులుసు (Soops) లాంటి వాటిని తయారు చేయటానికి ఉపయోగించాలి.
- విటమిన్లని ధ్వంసం చేసే **"సింథటిక్ ఫ్లేవర్స్"** (సువాసననిచ్చే ఎస్సెన్సులు), రంగులు, **"నిలవ ఉంచే పదార్థాలు"** (Preservative) వాడకూడదు. ఒక్కోసారి వీటి వాడకం ప్రమాదం కూడా.

**సూక్తి**

**అభివృద్ధి భవిష్యత్తుకు కొత్త అవకాశాలు కల్పించడమే కాదు. కొత్త నిబంధనలు కూడా విధిస్తుంది.**

# 8 మన ఆచారాలు

**I. ప్రధాన విలువ**

*సంస్కృతి సంప్రదాయాలు*

**II. ఉప విలువ**

*ఆచారాలు, వాటి శాస్త్రీయతను అవగాహన చేసుకోవడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- మన ఆచార వ్యవహారాలలో దాగియున్న శాస్త్రీయతను తెలుసు కొని వాటిని గౌరవించడం, కొనసాగించడం.
- మన సంస్కృతీ సంప్రదాయాల పరమార్థాలను పెద్దలను అడిగి తెలుసుకోవడం.

## IV. ఉపోద్ఘాతం

ప్రాచీన ఋషి పరంపర శాస్త్రీయమైన అనేక అంశాలను వారు శోధించి సాధించి మనకు అందించారు. అవి మనకు సంప్రదాయాలుగా ఆచారవ్యవహారాలుగా మిగిలిపోయాయి. మన పండుగలు, ఇంట్లో తులసి మొక్కను పెంచడం. గోవులను పూజించడం, నుదుట తిలకధారణ చేయడం, ఇంటిముందు పేడకళ్ళాపుచల్లడం, ముగ్గులు పెట్టడం, గుమ్మాలకు పసుపు రాయడం, చేతులకు గాజులు ధరించడం ఇటువంటి ఎన్నో సంప్రదాయాలను ఆచరించడం మనం చూస్తూ ఉంటాం. ప్రతి సంప్రదాయ, ఆచార వ్యవహారాల వెనుక ఒక శాస్త్ర బద్ధమైన విషయం ఉంది. ఆధునిక శాస్త్రవేత్తలు నిర్వహించిన పరిశోధనలు మన పెద్దలు చెప్పిన విశ్వాసాలు, నమ్మకాలు నిండైన శాస్త్రీయ సత్యాలని నిరూపించబడ్డాయి. కాబట్టి మనం ఆచరిస్తున్న ఆచార సంప్రదాయాలలో గల శాస్త్రీయతా అంశాలను గురించి తండ్రి, తాత, మనవరాలు, మధ్య జరిగిన ఈ సంభాషణలను వినండి.

## V. విషయం

"నాన్నా! నాన్నా! మేము తాతయ్య, నానమ్మల దగ్గరకు వెళ్ళి చాలా సంవత్సరాలయింది. సంక్రాంతి పండుగకు అక్కడికి తీసుకు వెళ్ళండి."

"అబ్బా! గొడవ చేయకండి. తీసుకొని వెళతాను గదా! రేపే మన ప్రయాణం అమ్మను కూడా సిద్ధం కమ్మని చెప్పండి.

"మా మంచి నాన్న"

"అన్నయ్యా! పల్లెటూరు చాలా బాగుంటుంది గదా! అక్కడ తాతయ్య చాలా కథలు చెబుతాడు. నానమ్మ మంచి మంచి పిండివంటలు చేసి పెడుతుంది.

"సరే... బయలుదేరదాం రండి.

"అమ్మయ్య, తాతయ్య ఊరు వచ్చేశాం"

"తాతయ్యా! నానమ్మా! మేం వచ్చేశాం."

"తాతయ్యా! ఏంటి ప్రతి ఇంటి ముందు పేడముద్దలు పెట్టారు? "అవి పేడముద్దలు కాదమ్మా! వాటిని గొబ్బెమ్మలు అంటారు. సంక్రాంతి పండుగకు నెల ముందు నుండి అందరూ ఇళ్ళ ముందు పేడతో చక్కగా కళ్ళాపిచల్లి ఆవు పేడ తెచ్చి గొబ్బెమ్మలు తయారు చేసి ముగ్గులలో పెట్టి ఆడుతూ పాడుతూ నృత్యాలు చేస్తారు. ఇది మన సంప్రదాయమమ్మా! రేపటి నుండి నీవు కూడా వేద్దువుగాని.

"నేనా... అబ్బో...! పేడతోనా ఛీఛీ...

"తప్పమ్మా! మా మంచి తల్లివి గదా! మనపూర్వీకులు ఈ సంప్రదాయాన్ని ఎందుకు పెట్టారో చెబుతావిను. ఆవు గోమాతగా మనకు ఆరాధ్యమైనది. ఆవుపాలు బలాన్నిస్తాయి. ఆవుపేడ, ఆవు మూత్రం క్రిమి సంహారిణి, ఔషధీగుణాలు కల్గి ఉంటాయి. ఇక ఆవుపాలు, ఆవుపెరుగు, ఆవునెయ్యి ఎంతో శక్తిని, పుష్టిని ఇస్తాయి. అందుకని ఆవుని మనం పూజిస్తాం "మరి ఆ గొబ్బెమ్మలపైన పసుపు, కుంకుమ ఎందుకు వేశారు?" పసుపు క్రిమిసంహారిణి. కుంకుమపూలు మంగళప్రదమైనవి. "ఆ ముగ్గులు ఇంటి ముందు రోజూ వేస్తారా! తాతయ్యా! మేమైతే పెయింట్‌తో ఒక్కసారే ముగ్గులు వేసేశాం. రోజూ ఇదొకపనా అని!"

"కాదమ్మా! ముగ్గులు ముంగిలికి అందం. ఆ ముగ్గు బియ్యపు పిండితోవేస్తారు. చీమలు వంటి క్రిములు అక్కడకు వచ్చి ఆ పిండిని ఆహారంగా తీసుకొని పోతాయి. ఇంట్లోకిరావు."

"అవునా తాతయ్యా!"

"ఇప్పుడు ఘాటైన సున్నంకలిపికాస్తున్నారు. దానితో క్రిమికీటకాలు చచ్చిపోతాయ్."

"అదీ నిజమేగా తాతయ్యా!"

"హాయ్... తాతయ్యా అవిగో గంగిరెద్దులు..."

"నీకు తెలుసా! చిన్ని"

"టీవీలో చూస్తాముగా తాతయ్య. ఇప్పుడు నిజంగా చూస్తున్నాం. అన్నయ్యా! రా! చూద్దాం!"

భలేగా ఉంది తాతయ్యా! నానమ్మ మాతో గంగిరెద్దు వాళ్ళకి బియ్యం పెట్టించింది.

అది మన సంప్రదాయం.

అలాగే కళ్ళకు కాటుక పెట్టుకుంటే కళ్ళకు చాలా మంచిది. కళ్ళ జోడు చిన్న వయసులోనే రాకుండా అడ్డుకోవడమేకాకుండా కళ్ళుచాలా అందంగా ఉంటాయి. అలాగే చేతులకు గాజులు ధరించడం అలంకరణకోసమే కాదు. గర్భాశయ నాడులను ఉద్దీపనం చేయడానికి ఉద్దేశించినవే గాజులు. ముంజేతికి మణికట్టుకు మధ్య ఉండే నాడులు గర్భాశయనాడులతో అనుసంధానమై ఉంటాయి. మణికట్టు నాడులు స్వల్పంగా ఒత్తిడికి గురువుతుంటే గర్భాశయ నాడులు కూడా అందుకు అనుగుణంగా ఉత్తేజితమవుతాయి. దానితో గర్భాశయం పని తీరు, కండరాల కదలికలు సవ్యంగా జరుగుతాయి. అందుకే ఆడపిల్లలు తప్పక చేతులకు గాజులు కూడా ధరించాలి.

"అలాగే తాతయ్యా మీరు చెప్పిన విసయాలను గుర్తుంచుకొని మన సంప్రదాయాలను ఆచార వ్యవహారాలను తప్పక పాటిస్తాను.

## VI. (అ) ఆలోచించండి – ప్రతిస్పందించండి

1. ఆచారవ్యవహారాలు అంటే మీరేమని అనుకుంటున్నారు?
2. మీ ప్రాంతంలో కనిపించే ఆచార వ్యవహారాలను చెప్పండి. వాటి శాస్త్రీయతను చర్చించండి.
3. ఆచారవ్యవహారాలను పాటించడం సమంజసమేనా? ఎందుకు?
4. మనదేశంలో వివిధ మతాలవారు సహజీవనం చేస్తున్నారు కదా! వివిధమతాల వారికి గల ఆచార వ్యవహారాలను వాటి వెనుకగల శాస్త్రీయతను గురించి చర్చించండి.
5. మీరు జరుపుకునే పండుగలేవి? వాటిని జరుపుకోవడంలో మీరు ఆచరించే సంప్రదాయాలను వివరించండి. వాటి వెనుకగల శాస్త్రీయతను చర్చించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంట్లో వారు అనుసరించే ఆచారవ్యవహారాలను ఆచరించండి. వాటి వెనుకగల శాస్త్రీయతను పెద్దలను అడిగి తెలుసుకోండి.
- ఆచారాలను వాటి వెనుక గల శాస్త్రీయతను తెలుసుకొని వాటిని ఆచరించినపుడు మీలో కలిగిన అనుభూతులను, అనుభవాలను చెప్పండి.
- మీ ఇంట్లో పాటించే ఆచారాల్లో శాస్త్రీయత ముందు నిలబడగలిగేవి, మూఢ నమ్మకాలుగా అనిపించేవి ఏవేవో జాబితాలు తయారు చేయండి.

### తెలుసుకోండి

మనదేశం సదాచార వ్యవహారాలకు పుట్టినిల్లు. అనాది కాలంనుండి శాస్త్రీయపరమైన అనేక ఆచారాలను పాటిస్తూ జీవనం కొనసాగిస్తూ ఉన్నారు. వంశపారంపర్యంగా వారసత్వంగా ఈ ఆచార వ్యవహారాలను పాటిస్తూ ఒక తరం నుండి మరొక తరానికి వీటిని అందజేస్తున్నారు. కాల క్రమంలో కొన్ని ఆచారాలు తప్పుడు అర్థాలకు దారి తీసి ఎన్నో సత్యాలు మూఢనమ్మకాలుగా చెప్పబడుతున్నాయి. ఆధునిక శాస్త్ర వేత్తలు నిర్వహించిన పరిశోధనల వల్ల మన పెద్దలు చెప్పిన విశ్వాసాలు, నమ్మకాలు నిండైన శాస్త్రీయ సత్యాలని నిరూపించబడినాయి. అందులో పండుగలు, తులసిమొక్కను ఇంట్లో పెంచుకోవడం, ఇంటి ముందు పేడ కళ్ళాపి చల్లడం, ముగ్గులు పెట్టడం, పండుగలలో ఇంటి ద్వారాలకు మామిడితోరణాలు కట్టడం, గడపలకు, కాళ్ళకు పసుపునురాయడం. సంక్రాంతి పండుగలలో ఇంటి ముందు ఆవు పేడతో చేసిన గొబ్బెమ్మలను పెట్టి ఆడుతూ, పాడుతూ నృత్యాలు చేయడం, ఆడపిల్లలు చేతులకు గాజులు ధరించడం, కాటుక పెట్టుకోవడం ఇలా అనేక ఆచార వ్యవహారాలున్నాయి. ప్రతి ఆచారం వెనుక ఒక శాస్త్రీయ పరమైన అంశం దాగుంది. అందుకే ఈ ఆచారాలలోని శాస్త్రీయతను తెలుసుకోవడం ద్వారా వాటిని ఆచరించడం మనందరి కర్తవ్యం.

మన సంప్రదాయంలో ఆడపిల్లలు బొట్టు పెట్టుకోవడం, గాజులు వేసుకోవడం, పూలు పెట్టుకోవడం చాలా ముఖ్యమైనవి. అన్నిటికీ శాస్త్రీయ ఆధారాలు కూడా ఉన్నాయి. ఉదాహరణకు స్త్రీలు, ఆడ పిల్లలు పూలు పెట్టుకొని ఇంట్లో తిరుగుతుంటే ఇల్లంతా చక్కని సువాసనతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఇంకా ఆరోగ్యపరంగా కూడా పూల వాసనలు ఎంతో ఉపయోగపడతాయని చెప్తున్నారు.

మరొకటి ఫంక్షన్‌లో తాంబూలం ఇవ్వడం మన సంప్రదాయం. వచ్చిన అతిథికి పసుపు, కుంకుమ, తాంబూలం అందించి ఆశీసులు అందుకునేవారు. అలాగే జన్మదినోత్సవాల శుభసమయంలో దీపాలు ఆర్పడం కాకుండా దీపాలను వెలిగించి పెద్దల ఆశీస్సులు తీసుకోవడం మన సంప్రదాయం. అలాగే వివిధ

పండుగలలో ఆ ఋతుధర్మాన్ని బట్టి పిండివంటలు చేసుకోవడం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా తగిన ప్రసాదాలను చేయడం వల్ల ఆరోగ్య సంబంధమైన ఇబ్బందులు రాకుండా ఉంటాయి.

అలాగే మన సమశీతోష్ణ ప్రాంతానికి తగిన విధంగా మనం మన సంప్రదాయ దుస్తులైన ధోవతి, పంచ, ఉత్తరీయం ధరించడం శ్రేయస్కరం. వివాహాల్లో వారివారి సంప్రదాయాలకు అనుగుణంగా క్రతువును జరిపిస్తూ వారసత్వంగా మన ఆచార వ్యవహారాలను తర్వాత తరాలకు అందించడం మన బాధ్యత.

మన భారతదేశం విభిన్న సంస్కృతులకు నిలయం. వివిధ మతాలవారు వారివారి ఆచారవ్యవహారాలను పాటిస్తూ సహజీవనం చేస్తుండడం మన దేశం యొక్క గొప్పదనం.

ముస్లిం మతస్తులు వారి మతానుగుణంగా ఆచార వ్యవహారాలను పాటిస్తూ ఉండడం మనందరికి తెలుసు. ముఖ్యంగా రంజాన్ మాసంలో ఉపవాసం ఉండడం తప్పనిసరి అని అల్లాహ్ దివ్యఖురాన్‌లో ఆజ్ఞాపించారని, ఉపవాసం ఉన్న ఏ వ్యక్తి అయినా అసత్యం పలికితే, వంచనకుపాల్పడితే దేవుడు అతడి ఉపవాసం పట్ల ఆసక్తి చూపడు అన్నారు మహాప్రవక్త మహమ్మద్. ఉపవాసం లోకుల మెప్పుకోసం కాదు అల్లాహ్‌కోసం.

రంజాన్ మాసంలోని రోజా (ఉపవాస వ్రతదీక్ష) లో ఒకరు మరొకరికి సహాయకులవుతారు. ముస్లిం సమాజం సమస్తం ఈ మాసంలో ఒకే విధంగా ఒకే ఆరాధనలో స్థిర సంకల్పంతో లీనమవుతుంది. దైవభక్తిలో జ్ఞానవిభవంతో తిరుగులేని పుణ్య సాధనకు ఉపవాస వ్రతాన్ని రమ్‌జాన్‌లో విధిగా పాటించడం ఉత్తమ సంప్రదాయం.

అలాగే క్రైస్తవులు వారివారి ఆచారాలను పాటిస్తూ సహజీవనం చేయడం మన దేశ గొప్పదనం. వారి వారి మతాలలోని వివిధ ఆచారాలలో దాగియున్న శాస్త్రీయతలను తెలుసుకొని వాటిని ఆచరించడం అభినందనీయం.

ఏ వ్యక్తి ఐనా వారి వారి ఆచార వ్యవహారాలను తెలుసుకొని వాటి వెనుక గల శాస్త్రీయతను గుర్తించి వాటిని తర్వాతి తరాలకు అందజేయడం మన కర్తవ్యం. మన బాధ్యత.

**సూక్తి**

**అన్నింటికంటే ముఖ్యసాధన స్వార్థాన్ని జయించటం**

# 9 భూకాలుష్యాన్ని నివారిద్దాం

**I. ప్రధాన విలువ**

*పర్యావరణ పరిరక్షణ*

**II. ఉప విలువ**

*భూకాలుష్య నివారణ గురించి అవగాహన కలిగించడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- భూమి ఏవిధంగా కాలుష్యమౌతుందో అవగాహన చేసుకోగలుగుతారు.
- భూకాలుష్య నివారణకు తమ వంతు కృషిని చేయ గలుగుతారు.

## IV. ఉపోద్ఘాతం

ప్రాణులన్నీ జీవించేది భూమిపైనే. భూమి ద్వారా మనం ఆహారాన్ని పొందుతున్నాం. భారతీయ జీవన విధానంలో ప్రకృతి సమస్తమూ మాతృభావనతో ఆరాధించబడింది. అందుకే భూమిని భూమాత అన్నారు. ఇది మట్టి ముద్ద కాదు. ఔషదులకు, వివిధ ఖనిజములకు, వన సంపదలకు, పర్వత శ్రేణులకు, జలసంపదలకు నిలయమైనది.

భూమిలో జీవముంటేనే అది మిగతా జీవులకి ఆహారాన్ని పుట్టించే మొక్కల్ని, చెట్లని పోషించగల్గుతుంది. మంచి మట్టి చిన్న గింజను మహావృక్షంగా పుట్టించగలుగుతుంది. గొప్ప శక్తి గలిగిన భూమిని మనం రకరకాల వ్యర్థాలతో సారాన్ని కోల్పోయేలా చేస్తున్నాము. భూమి కాలుష్యమయమైతే మానవ మనుగడ ప్రశ్నార్థకమౌతుంది.

## V. విషయం

- ఒక గ్రామంలో గోపాలం అనే రైతు ఉండేవాడు. ఆధునికి వ్యవసాయ పద్ధతుల్ని అవగాహన చేసుకొని, రసాయన ఎరువుల్ని పురుగు మందుల్ని వాడకుండా సేంద్రియ ఎరువులు వాడుతూ పంటలు పండించేవాడు. పంట మార్పిడి విధానాన్ని అనుసరిస్తూ, పంట దిగుబడిని పెంచుకొనేవాడు. పశువుల పేడ చెట్ల ఆకులతో, వానపాముల సహకారంతో తయారు చేసిన ఎరువులు కావడం వలన వ్యవసాయ ఖర్చు తగ్గేది. తాను పండించిన పంట సహజమైనది కాబట్టి పట్టణాల నుంచి ఇతర ప్రాంతాల నుండి వచ్చి కొని, తీసుకుపోయేవారు. దీనివలన తాను పెట్టిన పెట్టుబడికి, పడినశ్రమకు మంచి లాభం వచ్చేది. గోపాలం పండించిన పంట రుచికరమైనదిగాను, బలవర్థకమైనదిగాను ఉండేది.
- మరొక గ్రామంలో నిరంజనయ్య అనే రైతు ఉండేవాడు సేంద్రియ ఎరువులు తయారు చేసే ఓపిక లేక, రసాయనిక ఎరువులు, పురుగుమందులు తీసుకొనివచ్చి వాటితో పంటలు పండించేవాడు. పంటదిగుబడి ఎక్కువ రావటం వలన లాభాలు కూడా బాగానే వచ్చాయి. కొన్ని సంవత్సరాలకు ఆ భూమిలో పంటలు పండించేందుకు ఎక్కువ ఎరువులు అవసరం ఏర్పడింది. భూసారం తగ్గు ముఖం పట్టింది. రాను రాను పెట్టుబడి ఎక్కువై లాభాలు తగ్గుతూ వచ్చాయి.
- వనస్థలి అనే గ్రామం వన్య ప్రాణులతో, కొండలతో, సేలయేరులతో ప్రకృతి అందాలతో రమణీయంగా ఉండేది. ప్రజలు ప్రశాంతంగా, ఆనందంగా, ఆరోగ్యంగా జీవించేవారు.

  ఆ గ్రామానికి నీటివసతి ఎక్కువగా ఉండడం, రవాణాసౌకర్యాలు, భూమి ధర తక్కువ ఉండటం వలన అనేక పరిశ్రమలు అక్కడికి తరలి వచ్చాయి. తమ భూమికి మంచి ధర పలుకుతుందని, తమ పిల్లలకు ఉద్యోగాలు వస్తాయని, తాము ఆర్థికంగా ఎదుగుతామని అక్కడి ప్రజలు పరిశ్రమలు రావటానికి వ్యతిరేకించలేదు.

  ఇప్పుడు వనస్థలి గ్రామం ఎన్నో పరిశ్రమలతో కిక్కిరిసిన జనాలతో, ఎన్నో వాహనాలతో, సందడిగా ఉంది. కొండలు చదును చేయబడినవి. చెట్లు నరికి వేయబడినవి. వన్య ప్రాణులు కనిపించకుండా పోయాయి. నదులు, సేలయేరులు చెరువులు, పరిశ్రమలు వదిలిన రసాయనాలతో నిండి పోయాయి. గ్రామమంతా చెత్త చెదారాలతో నిండిపోయి, భరించలేని వాసనలు వెదజల్లుతుంది. తాగడానికి మంచినీరు లేకుండా పోయింది. మిగిలిన భూముల్లో పంటలు పండటంలేదు. ప్రతి ఇల్లు రోగాలలో, రొప్పులలో నిండి పోయింది. గతంలోని ఆనందమైన ప్రశాంతమైన జీవితం కరువైంది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. భూమికాలుష్యం అంటే ఏమిటి?
2. గోపాలం పంటలు పండించే విధానాన్ని బట్టి మీరు ఏమి గ్రహించారు?
3. నిరంజనయ్య పంట పొలం సారం కోల్పోవడానికి కారణాలు ఏమై ఉంటాయి?
4. భూమి కాలుష్య నివారణకు మనమేం చేయాలి?
5. భూమిని ఎందుకు రక్షించుకోవాలి?
6. భూమిలో వానపాములు నత్తగుల్లలు ఉండకపోవడానికి కారణాలు ఏవి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ గ్రామంలోని రైతులను కలవండి. వారు ఏఏ ఎరువులు పంటలు పండించడానికి వాడుతున్నారో తెలుసుకోండి. గతంలో కంటే ఇప్పుడు పంటలో సారం, రుచి ఎలా ఉన్నాయో అడిగి తెలుసుకోండి. మీ అనుభవాల్ని చెప్పండి.

### తెలుసుకుందాం

### మీ చెంతనే తారక మంత్రం!

అధ్యయనం చేసే కొద్దీ జరుగుతున్న ప్రకృతి వినాశనం అంతులేనిదిగా అవగతమవుతుంది. ఈ గాలి కలుషితమయింది, ఈ నేల కలుషితమయింది. ఈ నీరు కలుషితమయింది........ ఈ జాబితా యిలా పెరుగుతూ వస్తున్నది. అవసరం కొద్దీ, ఆశకొద్దీ అభివృద్ధి పేర, రక్షణ పేర మనం ప్రకృతి ప్రసాదించిన కనీస అవసరాలను మనమే కలుషితం చేశాం.

మీకు గుర్తుండే ఉంటుంది. ఇంతవరకు ఐదుసార్లు ప్రకృతి వినాశకాలు సంభవించాయి. ఈ ఐదూ కూడా కేవలం ప్రకృతి కారణంగానే సంభవించాయి. అయితే ప్రస్తుతం ఆరవ వినాశనం నడుస్తోంది. ఈ సారి దీనికి కర్త, కర్మ, అంతా మనిషే! ప్రకృతిని ఎవరూ పరిరక్షించాల్సిన పనిలేదు. దాని రక్షణ అది చూసుకోగలదు. అయితే దాన్ని విచ్ఛిన్నం చేస్తే ఫలితం ప్రకృతి వినాశనం అని మనకు అనిపించవచ్చు. కానీ అది మన వినాశనమే అనేది మరిచిపోతున్నాం. ప్రకృతిని కలుషితం చేశామంటే,

మనల్ని మనం కలుషితం చేసుకోవడమే! అలాగే ప్రకృతిని కాపాడుకోవడమంటే మనలను మనం కాపాడుకోవడమే. ఈ చిన్న కిటుకు తెలుసుకుంటే అదే తారక మంత్రం కాగలదు. కానీ ఎవరికి వారు "ఏముందిలే..... నేను చేసేదెంత" అని ఆలోచిస్తే ఏమవుతుంది? అటువంటి అర్థరహిత ఆలోచనా క్రియా ఫలితమే నేడు మనం అనుభవిస్తున్నాం. అందుకే "థింక్ గ్లోబల్లి.... యాక్ట్ లోకల్లి" అని అంటారు. అంటే "ప్రపంచ స్థాయిలో సమస్యను అర్థం చేసుకో, వ్యక్తిగత స్థాయిలో పరిష్కారాలు ప్రారంభించు" అని.

ఒకటి గుర్తుంచుకోవాలి. ఈ పరిసరాల్లోనే, ఈ పర్యావరణంలోనే, ఈ ప్రకృతిలోనే మన శరీరం ఉంది. ఇందులోనే మన మనుగడ సాగుతోంది. పర్యావరణంలో, ప్రకృతిలో వచ్చే మార్పులకు అతీతంగా మన శరీరాలను మనం దాచుకోలేం, కాపాడుకోలేం. అందుకే మనం పర్యావరణాన్ని నాశనం చేశామంటే మన ఆరోగ్యాన్ని మనం నాశనం చేసుకున్నామని అర్థం. అందుకే మంచి పర్యావరణానికి ప్రతీక మంచి ఆరోగ్యం. మరోలా చెప్పాలంటే మీరు పర్యావరణాన్ని కలుషితం చేస్తే, పర్యావరణం మిమ్ములను కలుషితం చేస్తుంది. అందుకే మన ఆరోగ్యం చెడిపోని రీతిలో మనం పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి. అంటే మరో సమస్య రాకుండా జాగ్రత్తపడాలి.

మీకు సందేహం వచ్చి ఉండవచ్చు – ఎంతసేపు సమస్య గురించి తీవ్రంగా, విశదంగా చర్చించడమే గానీ పరిష్కారం గురించి చెప్పరే? – అని, అవును నిజమే! మనం పడబోతున్న పాతాళం లోతు ఎంత ఉందో విశదంగా తెలిస్తే, దానివల్ల రక్షించుకోవడానికి మన ప్రయత్నం కూడా అంతే తీవ్రంగా, గట్టిగా ఉంటుంది, ఈ సమస్యకు రెండు రకాల పరిష్కారాలున్నాయని పర్యావరణవేత్తలంటున్నారు.

మనం కేవలం చిన్న చిన్న గ్రామాల్లో జీవించామనుకోండి, వాడే ఎరువులు రసాయన ఎరువులు కాకుండా, జీవన ఎరువులు అనుకోండి, పరిశ్రమలు కూడా కుటీర పరిశ్రమలే అనుకోండి – అపుడు కాలుష్యానికి అవకాశం ఉండదు. కాబట్టి కాలుష్యాన్ని తగ్గించాల్సిన అవసరం లేదు. అందువల్ల మౌలిక స్థాయిలోనే కాలుష్యానికి కళ్ళెం వేయడం వల్ల తర్వాత బాధపడాల్సిన అగత్యం ఉండటం.

మరో రకంగా చెప్పాలంటే ఎవరి బాధ్యతను వారికి తెలియచెప్పడం. ఒక ఉదాహరణ – గోవాకు ఎంతోమంది విదేశీ యాత్రికులు వచ్చి, అక్కడ బీచ్‌లో కాలం గడుపుతారు. మనకు సందేహం రావచ్చు. అక్కడే ఉన్న సముద్ర తీరాల్లో వారు విహరించవచ్చు గదా, యింత దూరం ఎందుకు రావడం అని, మీ సందేహం కరెక్టే. అభివృద్ధి చెందిన దేశాల్లో సముద్ర తీరాన్ని కలుషితం చేస్తే చాలా ఎక్కువగా టాక్స్ కట్టాలి. దానికన్నా చౌకగా లభ్యమయ్యే వర్ధమాన దేశాల్లో విహరించడం తేలిక, లాభదాయకం అని వారి ఆలోచన.

మనం విదేశీమారక ద్రవ్యం కోసం మన సుందర తీరాల్ని మనమే కాకుండా, ధనం గుంజి వారి ద్వారా కలుషితం చేసి - చివరకు మనం కాలుష్యంలో జీవిస్తున్నాం. అందుకే ఎవరయితే కాలుష్యం చేస్తారో వారే దానికి విరుగుడు చూడాలి. పరిశ్రమలు కాలుష్యాలను ఊరిలోకో, కాలువలోకో, నదిలోకో వదలకూడదు. ఆదాయం గడించే పారిశ్రామిక వేత్తే దాన్ని కూడా పరిహరించాలి. అలాగే పర్యావరణాన్ని ఎవరు కలుషితం చేస్తే వారే బాధ్యత వహించాలి.

అంతేకాని కాలుష్యాన్ని, చెత్తను ఉత్పత్తి చేసే సంపద సంపదగాదు. నాశనమయిన పర్యావరణంలో ధనికుడి జీవితం, పేదవాడి జీవితం - రెండూ ఒకటే! అందుకే మనం ఉత్పత్తి చేస్తున్నదేమిటి? దాన్ని ఉత్పత్తి చేయడం అవసరమా? సహజంగా నాశనమయి, ప్రకృతిలో కలిసేవాటిని తయారుచేసుకోవాలా లేదా విషం చిమ్మి, విషం నింపేవాటికి వాకిలి తెరవాలా? అని ఆలోచించుకోవాలి. గత 50 సం॥ పారిశ్రామిక ఉత్పత్తి ఒక్కటే, అంతకు ముందు సకల మానవాళి సాధించిన పారిశ్రామిక ఉత్పత్తికన్న అధికం. అంటే అదే స్థాయిలో కలుషితాలు, మలినాలు తయారుచేసుకున్నాం. అంతేకాదు టెక్నాలజీ మీదున్న గుడ్డినమ్మకం, భౌతికవాదం మీదున్న తీరని మక్కువ కలిసి భయానక నగర అరణ్యాలను తయారుచేశాయి. సాటిమనిషి గురించి ఆలోచించే ధోరణి సన్నగిల్లినపుడు ఇంకేం జరుగుతుంది?

**సూక్తి**

**సృష్టిలో ఉన్న అన్ని జీవరాసుల మనుగడకు ఆధారమైన పంచభూతాలలో ఒకటైన భూమి అతిముఖ్యమైనది. భారతీయ సంస్కృతిలో భూమిని తల్లిగా భావించారు. తల్లి అంతటి, గౌరవాన్ని భూమికి ఇచ్చి 'భూమాత' అంటున్నాం. భూమాతను అపహాస్యం చెయ్యవద్దు, గౌరవిద్దాం, పూజ్య భావనతో చూద్దాం.**

# 10 కారణాలు తెలుసుకుందాం

**I. ప్రధాన విలువ**

*శాస్త్రీయ దృక్పథం*

**II. ఉప విలువ**

*కార్యకారణ సంబంధాలను తెలుసుకోవడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- వివిధ అంశాలు అవి ఎలా పనిచేస్తున్నాయో, ఎందుకు పని చేస్తున్నాయో తెలుసుకోవడానికి ప్రయత్నం చేయడం ద్వారా కార్యాకారణ సంబంధాలను గుర్తించగలుగుతారు.
- 'ఏది ఎలాంటి ఫలితాన్ని ఇస్తుందో' అర్థం చేసుకుని ప్రవర్తించగలగుతారు.

## IV. ఉపోద్ఘాతం

ఏ పని చేయడానికైనా ఒక కారణం ఉంటుంది ఒక కార్యం జరిగిందంటే దానికి కారణమైన అంశాలు ఏవో ఉండే ఉంటాయి. దానిని తెలుసుకునేందుకు ప్రయత్నించడం ఎంతో అవసరం. కార్యానికి, ఫలితానికి గల సంబంధం గుర్తించేటపుడు దానికి గల కారణాలు తేటతెల్లమవుతాయి. ఒక సంఘటన జరిగిందంటే, అది ఎందుకు జరిగిందో తెలుసుకోవాలంటే కారణాలను విశ్లేషించాలి. ఇందుకు నిశిత పరిశీలన, ఆలోచన, పరిశోధన అవసరమవుతాయని కింది సన్నివేశాలలో మనం పరిశీలించవచ్చు.

## V. విషయం

### సన్నివేశం - 1

"దేవుడు వర్షం కురిపిస్తాడు కదా తాతయ్యా! అని అమాయకంగా అడిగాడు అఖిల్. "లేదురా! వర్షం కురవడానికి వేరే కారణాలు ఉన్నాయి" అని తాతయ్య చెప్పగానే "... తాతయ్యా అదేంటో చెప్పవా?" అని ఆత్రుతగా అడిగే సరికి "సరేనంటూ" చెప్పసాగాడు తాతయ్య, వర్షం పడకముందు ఏమి జరుగుతుందో ముందు తెలుసుకోవాలి. చెరువులు, కుంటలు, సముద్రాలు, నదులలోని నీరు ఎండకు వేడియై ఆవిరవుతుంది. ఆవిరైన నీరు మేఘాలుగా ఏర్పడుతాయి. ఆ మేఘాలు గాలికి చల్లబడి వర్షంగా కురుస్తాయి. ఇంకా చెప్పాలంటే ఈ మేఘాలు గాలికి కదులుతూ ఉంటాయి. ఎక్కడైతే వృక్షాలు ఎక్కువగా ఉంటాయో వాటి ఆకర్షణ చేత ఆ ప్రాంతాల్లో వర్షాలు ఎక్కువగా కురుస్తాయి. "ఇప్పుడు చెప్పు అఖిల్ వర్షం కురవడానికి ఏమి కారణాలు అని తాతయ్య అడగగానే చెరువులు, కుంటలు, సముద్రాలు, నదులు, ఎండ, గాలి అని వెంటనే చెప్పాడు.

### సన్నివేశం - 2

ఊళ్ళో వాళ్ళందరికీ ఆ గుహ అంటే చాలా భయం, అందులో దయ్యం ఉంటుందని అటువైపు ఎవరూ వెళ్ళేవారు కాదు. కానీ, గుహలో నిజంగా ఏముందో తెలుసుకోవాలని బయలు దేరాడు రంగయ్య. అతను చాలా ధైర్యవంతుడు. తెలివైన వాడు. ఒక కాగడా వెలిగించుకొని గుహలోకి ప్రవేశించాడు. కొంత లోపలికి వెళ్ళేసరికి అతనికి రెండు దారులు కనిపించాయి. ఒక దారిలో కొన్ని అడుగులు వేసాడోలేదో ఊపిరి పీల్చుకోవడం కష్టంగా అనిపించింది. కాగడా వెలగడం నెమ్మదిగా తగ్గిపోసాగింది. ఓహో ఈ దారిలో ఇంకాస్త లోపలికి పోతే గాలి వచ్చే అవకాశం ఏమాత్రం ఉండదు. అందుకే కాగడ వెలగకుండా తగ్గిపోతోంది అనుకుంటూ గబ గబా బయటకి వచ్చాడు. రెండోదారిలో నడవడం మొదలు పెట్టాడు. తనకు గాలి పీల్చుకోవడానికి, కాగడా వెలగడానికి ఏదీ ఇబ్బంది కలుగలేదు. అంటే ఈ దారికి అవతలవైపు గుహ తెరుచుకొని ఉంటుంది. అందుకే గాలివస్తోంది. అనుకుంటూ ముందుకు నడిచాడు. కొంతదూరం నడిచేసరికి బయటి వెలుతురు గుహలో పడడం గమనించాడు. తన ఆలోచన సరిపోయిందనుకుంటూ గుహలో నుండి బయటకు వచ్చాడు. అందరూ ఆశ్చర్యంతో రంగయ్యను చూసాడు. గుహలో ఏ దెయ్యం లేదని, బంగారం, వజ్రాలు ఇదంతా అబద్ధమనీ చెప్పాడు. మరి అంత మంది ఎందుకు చనిపోయారని ఊరివారంతా అడిగారు. గుహలో రెండు దారులున్నాయనీ ఒక దారిలో లోపలికి పోతే అక్కడ గాలి అందదు. కాబట్టి గాలి అందక పోవడం వల్లే అటు వెళ్ళినవారంతా చనిపోయి ఉంటారని చెప్పారు. అదా సంగతి అని ఊరి వాళ్ళంతా హాయిగా – ఊపిరి పీల్చుకున్నారు. కారణం తెలియకపోవడం వల్ల వాళ్ళంతా అన్యాయంగా చచిపోయారుకదా అని బాధపడ్డారు. వెంటనే గ్రామస్థులు ఆదారిని మూసివేశారు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై సంఘటనల ద్వారా మీరు ఏం గ్రహించారు?
2. వర్షం పడటానికి గల కారణాలను తెలుసుకున్నారు కదా! ఇలా కారణాలు తెలుసుకున్న తర్వాత మిమ్మల్ని ఆశ్చర్యపర్చిన సంఘటన/ సందర్భం ఏమైనా ఉందా! ఉంటే దాని గురించి రాయండి.
3. కొన్ని పనులు జరగటానికి ఏదో ఒక కారణం మాత్రమే కాకుండా చాలా ఎక్కువ కారణాలు పనిచేస్తాయి. మీ తరగతిలో ఎవరైనా సరిగా బడికి రాకపోవడానికి కారణాలు సేకరించి రాయండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- ప్రతి పని జరగటానికి ఏదో ఒక కారణం ఉంటుంది కదా! ఇద్దరు చొప్పున జట్టుగా ఏర్పడండి. ఒకరు ఒక పని చెప్పండి మరొకరు ఆపని జరగడం వెనుక దాగివున్న కారణాలు చెప్పండి.

### తెలుసుకోండి

ప్రకృతి ఎంతో అందమైనది కదా! దీనిలో జరిగే ప్రతి పని తనలో దాగున్న రహస్యాల్ని కనుగొనమంటూ మనకు సవాలు విసురుతుంది. కారణాన్ని కనుగొనడం ద్వారా మనం దాని గురించి అర్థం చేసుకో గలుగుతాం ఎందుకు? ఏమిటి? ఎలా? అని ప్రశ్నించడం ద్వారా మనం కార్యకారణ సంబంధాలను తెలుసుకోగలుగుతాం.

నిశితంగా పరిశీలిస్తే కారణాలు కనుగొనడానికి మనకు బోలెడన్ని ప్రశ్నలు రోజువారీ జీవితంలో ఎదురవుతూనే ఉంటాయి. మంటపైకి ఎందుకు మండుతుంది? ఆకులు ఎందుకు పసుపు రంగుగా మారుతాయి? గుడ్డులో పిల్ల ఎలా 21 రోజుల తర్వాత మాత్రమే బయటకి వస్తుంది? కడుపునిండా నీళ్ళు తాగితే ఆకలి ఎందుకు తీరదు? వినాయకుడు పాలు తాగడం నిజమేనా?, అమ్మవారి పొక్కులు, మశూచి వ్యాధులు వేపాకుతో నయమవుతాయా?, పిడుగు ఎందుకుపడుతుంది? ఇలా ఎన్నో సమస్యలు మన చుట్టూ కనిపిస్తూనే ఉంటాయి. వాటికి జవాబులు వెతకడమే సైన్స్, విజ్ఞాన శాస్త్ర ఫలితాలు మనకు ఎంతో మేలు చేస్తాయి.

ఎక్కడో వేలమైళ్ళ దూరంలో ఉండే వారితో మాట్లాడగల్లుతున్నాం టి.వి, కెమెరా, బైకు, ఫోను ఇలా

ఎన్నో కనుగొన్నాం. వీటన్నింటికి మూలం కార్యకారణ సంబంధాన్ని గుర్తించడమేనన్నమాట. రక్తంలో హిమోగ్లోబిన్ ఉంటుందనే కారణం వల్ల రక్తం ఎర్రగా కనబడుతుంది. పొట్టలో జీర్ణరసాలు ఉండటం వల్ల తిన్న ఆహారం జీర్ణమవుతుంది. అంతెందుకు ఎవరైనా నీ పట్ల దురుసుగా ప్రవర్తించారనుకోండి. అప్పుడు మీకు కోపం వస్తుంది. ప్రేమగా మాట్లాడారనుకోండి సంతోషం కలుగుతుంది. కోపం రావడానికి కారణం ఏమిటి? అని ఆలోచిస్తే మనం ఏమి చేయాలో కూడా అర్థం చేసుకోగల్గుతాం. అంటే మనచుట్టూ జరిగే ప్రతి పని వెనకాల ఒక కారణం ఉంటుందన్న మాట. జరిగిన ఫలితానికి కారణాలు ఏమిటో వెతకడమే శాస్త్రవేత్తలు చేసేపని. ఉడుకుతున్న అన్నం గిన్నె మీద మూత ఎగిరి పడటం చూసిన ఒకరు ఆవిరితో రైలు ఇంజనును కూడా నడపవచ్చు అని కనుక్కున్నారు. వీళ్ళంతా ప్రకృతిలో జరిగే విషయాలకు కారణాలను ఎంతో జాగ్రత్తగా పరిశీలిస్తారు. ఒక్కొక్క గుండీకి నాలుగు గానీ, రెండుగానీ రంధ్రాలు మాత్రమే ఎందుకుంటాయి. ఒకటే ఉండవచ్చు కదా! ఆలోచించండి. కారణాలు తెలుసుకుంటూ పోతుంటే ఎన్నెన్నో కొత్తకొత్త ఆవిష్కరణలు జరుగుతూ ఉంటాయి. జరిగే సంఘటనకు, ఎందుకు ఇలా జరుగుతుందని ఆలోచించడం ద్వారా కారణాలను తెలుసుకోగలం. ఇది మానవ జిజ్ఞాసకు సంబంధించింది. ఈ మనుష్యులలో ఉన్న ఈ స్వాభావిక జిజ్ఞాసే అని విజ్ఞానపరమైన ఆవిష్కరణకు మూలమైనది.

**సూక్తి**

**జిజ్ఞాసను పెంచి పోషించటం, అన్వేషించడం, ప్రేరేపించడం, ఆలోచింప చేయడం, తద్వారా సమస్యలను పరిష్కరింపచేయడం అనేదే విద్య మరియు అభ్యసనం. అభ్యసనం ఆలోచనల ద్వారానే సాధ్యపడుతుంది. తక్కువ ఆలోచించటం అంటే తక్కువగా నేర్చుకోవడమే.**

# 11 జీవించు - జీవించనివ్వు

**I. ప్రధాన విలువ**

న్యాయం

**II. ఉప విలువ**

తాము జీవిస్తూ ఇతరులు జీవించేలా చూడడం

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- కలిసి జీవించడంలో ఉన్న ఆనందాన్ని తెలుసుకోగలరు.
- ఇవ్వడం, తీసుకోవడంలో ఉన్న సహకార గుణాన్ని అలవర్చుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

ఆదిమ కాలంలో మానవుడు “వేట” ప్రధాన వృత్తిగా చేసుకొని జీవించాడు. వేటలో ఎవరికి ఏ జంతువు చిక్కినా దాని మాంసాన్ని అందరూ సమానంగా పంచుకొని బ్రతికేవారు. నాడు ఉన్న సమిష్టి జీవనం నేడు సమాజంలో కనిపించడంలేదు. మనుషుల్లో స్వార్థగుణం పెరిగిపోయింది. ఎవరికేమైతే నాకెందుకులే అనే ధోరణి కనిపిస్తోంది. చాలా తక్కువ మంది మాత్రమే ఎదుటి వారి కష్ట సుఖాలలో భాగస్వాములయ్యే వారున్నారు. ఒకసారి ఈ సన్నివేశాలను పరిశీలిద్దాం.

## V. విషయం

### సన్నివేశం - 1

గ్రామంలో వేసవికాలం కాబట్టి నీటి ఎద్దడి ఉంది. బావులన్నీ ఎండిపోయాయి. గ్రామానికంతటికి ఒకే బోరు బావి పనిచేస్తుంది. ఉదయం 3 గంటల నుండే నీటిని పట్టుకోవడానికి జనం బారులు దీరేవారు. రోజూ వారి పనులన్నీ వదిలిపెట్టి ఇదే నిత్య కృత్యం అయ్యింది.

అయితే మరో బోరుబావి ఆగ్రామంలోని భూస్వామి ఇంట్లో ఉంది. ఆ బోరు బావిని కేవలం తన కుటుంబం మాత్రమే వినియోగించుకునేవారు. ఇతరులను ఎవరిని అక్కడ నీటిని పట్టుకోనిచ్చేవారుకాదు. ఆ భూస్వామి గ్రామంలో వస్తూపోతూ ఉన్నప్పుడు గ్రామంలోని బోరుబావి వద్ద ప్రజలు పడుతున్న కష్టాలను చూసేవారు కానీ, ఎవ్వరికీ తన ఇంట్లో నీటిని మాత్రమే పట్టుకోనిచ్చేవారు కాదు.

### సన్నివేశం - 2

వర్షాకాలం రాగానే కరంజి గ్రామంలోని ప్రజలకు కునుకుఉండదు. ఎందుకంటే ఆ ఊరి పక్కనుండే ప్రవహిస్తున్న పెన్‌గంగా నదికి ఎప్పుడు వరద వస్తుందోనని భయపడుతూనే ఉంటారు. అనుకున్నట్లే ఒక రోజు అర్థరాత్రి భారీ వర్షాలకు వరదనీరు గ్రామంలోకి వచ్చి చాలా ఇళ్ళలోని వస్తువులన్ని కొట్టుకు పోయాయి. ఆహార దాన్యాలు, బట్టలు, వస్తువులు ఇలా అన్ని వరదకు కొట్టుకుపోయాయి. ఒట్టి చేతులతో వారంతా దీనంగా ఎదురు చూస్తున్నారు.

పక్కనే ఉన్న సాంగిడి గ్రామంలోని పాఠశాలలో ప్రార్థనా సమావేశంలో ప్రధానోపాధ్యాయుడు రవీందర్ వరదకు నష్టపోయిన గ్రామస్తులకు మన వంతుగా సహాయం చేయాలని చెప్పగానే, పిల్లలందరూ తమకు తోచిన వస్తువులు, కొందరు బియ్యం, కొందరు బట్టలు మరికొందరు డబ్బులను ఇలా అందరూ తలాఒకటి తీసుకు వచ్చారు. పిల్లలు తెచ్చిన వాటినన్నింటిని ఎడ్లబండిపై వేసుకొని వీరంతా కలిసి ఆ ఊరికి వెళ్లి బాధితులకు పంచారు. వాళ్ళకు మేమున్నామనే భరోసా ఇచ్చారు. అంతేకాదు వాళ్ళకు కావలసిన సహాయ సహకారాలను వారితోబాటు ఉంటూ అందించారు. అలా ఎక్కడినుండో వచ్చి ఇక్కడివాళ్ళతో కలిసిపోయి చేసిన సహాయానికి ఆ ఊరివాళ్ళందరూ కృతజ్ఞతలు చెప్పడమే కాకుండా సాంగిడి గ్రామానికి వెళ్ళడం వాళ్ళ పనులలో, పెళ్ళిళ్ళలో, పండుగలలో తమకు తోచిన సహాయం చేయడం వంటివి చేశారు. త్వరలోనే ఆ రెండు గ్రామాలలో స్నేహం పెరిగిపోయింది.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. కలిసి జీవించడం అంటే ఏమిటి? దీనికి మనమేమి చేయాలి?
2. గ్రామంలోని భూస్వామి గ్రామ ప్రజలకు నీటిని ఇవ్వకపోవడం సరైందేనా? ఎందుకు?
3. మీ ప్రాంతంలో కలిసి జీవించే కుటుంబాలు తెల్పి, అవి ఎలా ఉన్నాయో చెప్పండి.

4. పాఠశాలలోని విద్యార్థులందరూ వారికి తోచిన సామాగ్రిని తీసుకువచ్చి వరదగ్రామంలో ఎందుకు పంచాలనుకున్నారు?
5. ఒకరి కొకరు సహాయం చేసుకోవడమంటే ఏమిటి? మనపై ఆధారపడే ఇతర జీవులు ఏవి? వాటి పట్ల మన ప్రవర్తన ఎలా ఉండాలి.
6. మీ గ్రామంలో ఎవరికీ సహాయం చేయని వారు ఎవరైన ఉన్నారా? వరిని చూస్తే నీకెలా అనిపిస్తుంది.
7. నీవెప్పుడైనా మనుషులకు / జంతువులకు సహాయం చేసిన సందర్భాలున్నాయా? వారికి ఎలాంటి సహాయం చేశారు?
8. మనిషికి స్వార్థం, లోభగుణం పెరిగిపోతే ఏమవుతుంది?
9. సమసమాజం అంటే ఏమిటి? అది ఎలా సాధ్యమవుతుంది? చర్చించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంట్లో గాని మీ స్నేహితులతో గాని ఒకరి కొకరు సహకరించుకున్న సందర్భాలు ఏమిటో తెలుసుకొని చర్చించండి.

### తెలుసుకోండి

సమాజంలో నివసించే మనమంతా ఒకరి మీద ఒకరం ఆధారపడి బతుకుతున్నాం. అంటే సమాజంలో మనమొక్కరమే కాదు, మనలాంటివారు సమస్తజీవరాశి కూడా బతుకుతోంది. మన జీవనం ఇతరులపై, ఇతర జీవరాశులపై ఆధారపడి ఉన్నప్పుడు మనమెలా జీవిస్తున్నామో ఇతర జీవాలు కూడా అలాగే జీవించాలను కోవడం ధర్మం.

కాని నేటి పరిస్థితులను గమనిస్తే ఎక్కడ చూసినా విపరీతమైన స్వార్థం నేనొక్కడినే బాగుంటేచాలు, నా కుటుంబం ఉన్నతంగా ఉండాలి. ఎవరి గురించి నాకెందుకు అనే విపరీత ధోరణి రోజు రోజుకు పెరిగిపోతుంది. ఎదుటివారిని దోచుకోవడం, దేశ సంపదను దోచుకోవడం, ఎదుటి వారి పట్ల దయా, కరుణ, జాలీ లేకుండా అన్యాయంగా ప్రవర్తించడం సమాజంలో నేడు నిత్యకృత్యంగా మారింది.

ఈ భూమి మీద పుట్టిన ప్రతి జీవి సమానంగా బ్రతికే హక్కు కలిగి ఉంది. మరి అందరూ సమానంగా సంతోషంగా బతుకుతున్నారా? ఈ అసమానతలకు కారణాలేంటీ? అందరూ సంతోషంగా జీవించాలంటే ఏమి జరగాలి? అనే ప్రశ్నల గురించి మనం ఆలోచించాలి.

ప్రతీజీవి స్వేచ్ఛగా జీవించడం, తన అవసరాలు తీర్చుకోవడం కోసం జీవించడం, ఆనందంగా జీవించడం వంటివి కోరుకుంటాయి. ఇది జరగటానికి ఒకరికొకరు సహకరించుకోవాలి. మనం ఎలా జీవిస్తున్నామో మనతోపాటు ఇతరులు కూడా అలాగే జీవించాలనుకుంటాయన్న జ్ఞానం, స్పృహ మనం కలిగి ఉండాలి. అప్పుడే సమానత్వం, న్యాయపరమైన జీవన విధానం సాధ్యమవుతుంది.

# 12 ప్రశాంత కుటుంబం

**I. ప్రధాన విలువ**

*శాంతి, అహింస, సౌందర్యాత్మక స్పృహ*

**II. ఉప విలువ**

*శాంతి - ప్రశాంత కుటుంబం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- కుటుంబంలో ప్రశాంతమైన జీవన విధానాలను తెలుసుకుంటారు.
- శాంతిగా ఉండగల్గుతారు

**IV. ఉపోద్ఘాతం**

"తన కోపమె తన శత్రువు తన శాంతమే తనకు రక్ష" అన్నారు. శాంతంగా ఉంటే అది మనల్ని రక్షించడమే కాకుండా దేనినైనా సాధించేటట్లు చేస్తుంది. కుటుంబంలో నివసించేవారు కోపాలతో, కొట్లాటలతో కాక ఒకరికొకరు సహకరించుకుంటూ ప్రశాంత వాతావరణంలో బతికితే ఆ కుటుంబంలో సుఖశాంతులు పెరుగుతాయి. మంచి కుటుంబమని సమాజంలో కూడా పేరు తెచ్చుకుంటారు. శాంతి, అశాంతికి గురయ్యే సంఘటనలను చూడండి.

## V. విషయం

### కుటుంబం - 1

అది మహేష్ వాళ్ళ కుటుంబం. అందులో వాళ్ళ అమ్మ, నాన్న, చెల్లి, నాయనమ్మ, తాతయ్య ఉంటారు. మహేష్ వాళ్ళ అమ్మకు నాయనమ్మకు అసలుపడదు. ఏ పని చేసినా ఇద్దరూ గొడవ పడడమే ఎప్పుడూ తప్పులెంచడమే. మహేష్ వాళ్ళనాన్న అందరూ తను చెప్పినట్టే నడచుకోవాలంటాడు. వాళ్ళ తాతయ్య ఏవైనా చెప్పబోతే విసుక్కుంటాడు. 'నీకు తెలీదులే' అంటాడు. తన మాట లెక్కచేయడని తాతయ్యకు కోపం. ఆ కోపాన్ని మహేష్ మీద ప్రదర్శిస్తుంటాడు. అరుస్తాడు. ఇల్లంతా గొడవ గొడవ పెద్ద పెద్దగా అదుచుకుంటూ ఉంటారు. ఒక్కరికీ సహనం లేదు. వీళ్ళ కుటుంబ గొడవలతో చుట్టుపక్కల జనం కూడా వీళ్ళ ఇంటికి రావాలంటే భయపడతారు. ఇష్టపడరు. ఈ కుటుంబంలో ప్రతిఒక్కరు తాము ఏమి చెయ్యాలో ఆలోచించక వేరే వారు ఏమి చేయాలో ఆశిస్తుంటారు. ఈ ఆశించినది జరగనప్పుడు కోపాలు వస్తాయి.

### కుటుంబం - 2

అది వల్లభ వాళ్ళు కుటుంబం. వాళ్ళ ఇంట్లోకూడా అమ్మ, నాన్న, అన్నయ్య తాతయ్యా. నానమ్మ ఉంటారు. వల్లభ వాళ్ళ అమ్మ, నాన్న, వాళ్ళ నానమ్మ, తాతయ్యలను చాలా ప్రేమగా చూసుకుంటారు. వాళ్ళు చెప్పిన మాటలను గౌరవిస్తారు. తాతయ్య చెప్పే కథలంటే వల్లభకు చాలా ఇష్టం. తాతయ్య, నాయనమ్మకు కావలసిన చిన్న చిన్న పనులు వల్లభ వాళ్ళ అన్నయ్యా ఇద్దరూ చేస్తారు. ఎప్పుడూ తిట్టుకోవడం గాని ఒకరి మీద ఒకరు చెప్పుకోవడం కాని ఆ కుటుంబంలో కనిపించదు. ఏ పని చేసినా అందరూ కలిసి ఆలోచించి ఒకమాట అను కొని చేస్తారు. పెద్దవాళ్ళను గౌరవించడమేకాదు పిల్లల మాటలకు విలువ ఇస్తారు. వాళ్ళ అలా అరమరికలు లేకుండా సంతోషంగా ఉండడం చూసిన చుట్టుపక్కల వాళ్ళంతా కుటుంబం అంటే అలా ఉండాలి. అనే వాళ్ళు. అందరు బాధ్యతలను తీసుకుంటారు. ఒకరిమీద వెయ్యరు. పెద్దలంటే గౌరవం చూపిస్తారు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. రెండు కుటుంబాలు గురించి విన్నారు కదా! ఎవరి కుటుంబం ప్రశాంతంగా ఉంది? ఎందుకు?
2. మీ ఇంట్లో పై కుటుంబాలలో పోలిస్తే ఎలా ఉంటుంది? దానికి కారణమేమిటి?
3. కుటుంబం ప్రశాంతంగా ఉండాలంటే ఎవరెవరు ఎలా ప్రవర్తించాలి?
4. ప్రశాంతంగా కుటుంబం ఉంటే కలిగే ప్రయోజనాలు ఏమిటి?

5. కుటుంబం ప్రశాంతంగా లేకపోతే ఏమి జరుగుతుంది?
6. మన పని మనం చేద్దాం - ఎదుటివారినుంచి ఆశించకుంటే శాంతి లభిస్తుంది. చర్చించండి.
7. శాంతికి చిహ్నం పావురం - ఎందుకు? ఆలోచించండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- గొడవలు నష్టాన్ని కలుగజేస్తాయి. శాంతి, సహనం, ప్రేమ, మంచిని పెంచుతాయి. దీన్ని దృష్టిలో పెట్టుకొని శాంతి సందేశాలు, నినాదాలు తయారుచేయండి.

## తెలుసుకుందాం

### శాంతి పిలుపు

'కష్టపెట్టటం' బాధాకరమనే విషయాన్ని అందరూ గుర్తించలేరు. కాని, కష్టపడటం బాధాకరం అనే సత్యం వంటబట్టని వారుండరు. నిజానికి ఇవి రెండు విషయాలు కావు. విషయ ప్రధానంగా చూసినా కష్టం ఒక్కటే. కష్టపడేవాడెవరైనా ఆ వ్యక్తి మనిషే ఒక్కడే లేదా ఒక్కతే. బాధ అనేది సుఖంగా భరించబడినది కాదు. గాయం మచ్చను ముద్రిస్తుందని ఖచ్చితంగా చెప్పలేము. బాధ మాత్రం గుండెపై చెదరని ముద్రను వేస్తుందని గంటకొట్టి మరీ చెప్పొచ్చు. గుండెకు తెలియకుండా గండికొట్టేవి బాధలు. బ్రతుకంతా వీడని నేస్తంలా వెంటాడే బాధల పురాణాన్ని స్పష్టంగా అర్థం చేసుకోకపోతే, జీవితంలో ప్రతివిషయం అస్పష్టంగా, అయోమయంగా గోచరిస్తుంది. ఈ విధమైన బ్రతుకు చీకటికి చుట్టమే గాని వెలుగుకు బంధువు కాలేదు ఎందుకు పుట్టామో తెలుసుకొనే సత్తా అందరి సొత్తు. కాకపోయినా ఆలోచిస్తే, ఎలా పుట్టామో సులభంగా తెలుసుకోవచ్చు. తల్లి బాధపడితేనే నేను బయట పడ్డాను. మరొకరిని బాధపెట్టటం లోనే నాబ్రతుకు శ్రీకారం చుట్టింది.

ఆ తరువాత...? నేను పెరగటానికి ఎందరో కష్టపడ్డారు. ఇదంతా నాకు తెలిపి జరగలేదు. కాని, పెరుగుతూ తిరుగుతూ తెలిసో, తెలియకో, ఇతరుల్ని ప్రయత్నపూర్వకంగా బాధించే నిర్వాకానికి ప్రతి మనిషి సిద్ధపడతాడు. ఇంతకీ వడ్లగింజలో బియ్యపు గింజలా తేలేదేమిటి? ఒక వ్యక్తి బాధపడటం. ఒక వ్యక్తి ... ఒక వ్యక్తి.... ఒక వ్యక్తి .. ఒకే వ్యక్తి. ఆ వ్యక్తి ఎవరు? నీవు కష్టపెట్టే మరోకరు కావచ్చు. మరొకరు కష్టపెట్టే నీవుకావచ్చు. మొదటి విషయంలో మచ్చపడేది వేరొక గుండెపై అనుకుంటే, రెండవ విషయంలో ఆ మచ్చను ధరించేది నీగుండె. నా గుండె ఎవరి గుండె అయినా గుండె ఒక్కటే. ఇలా ఓటికుండల లాగా పగిలిన గుండెలు ప్రోగయిన కుటుంబంగాని, సమాజం గాని, దేశం గాని, సంస్థ గాని - బ్రతికితే

బ్రతకవచ్చునేమోగాని బట్టకట్టి భవ్యంగా జీవించలేదు. అమాయకమో, అజ్ఞానమో, ఏదయితేనేమి మరొకరిని తెలిసో తెలియకో బాధించటం బ్రతుకులో భాగమై పోయింది. బాల్యం నుండి ఇదే ఆట. ఈగను కొట్టి చంపటం, తూనీగనుపట్టి తోకవిరచటం, ఒకరిని గిల్లటం, మరొకరిపై బురద చల్లటం. ఇవన్నీ మరొకరిని బాధించే కార్యాలు. ఎవరూ చెప్పకుండా వంటపట్టిన వినోదాలు, ఒకనాడు పసితనంలో కదిలిన ఈ వినోదాలే మరోనాడు విరబూసిన బ్రతుకులో వెదజల్లబడే వికారాలు,

ఇంతకీ, చెప్పొచ్చిందేమిటంటే – పిండుకొంటే పాలొస్తాయి. గుండెల్ని పిండుకొంటే నీళ్ళొస్తాయి. కన్నీళ్ళొస్తాయి. మరొకరిని బాధించటంలో మన బాధ కూడా మనకుంటుంది. అనే సత్యాన్ని వంటపట్టే వరకు ఆలోచించాలి. అంతేకాదు. నీ గుండెను పిండే కార్యం కూడా ఎంత మంచిదయినా దానిని త్యజించటమే త్యాగం. ఇతరులకు కాంతినిచ్చి తాను కాలి కనుమరుగయ్యే 'క్రొవ్వొత్తి కవులకు కథావస్తువైతే, తాను వెలుగుతూ వెలుగునిస్తూ, తనలో వెలుగులారని భానుడే మనకు మిత్రుడు. అతడు మనకు కథా వస్తువు కాదు. కథానాయకుడు. ఇది బోధపడితే మన జీవిత కథ ఒక మలుపు తిరుగుతుంది. సుఖానికి పిలుపునిస్తుంది. శాంతికి తలుపు తడుతుంది. ఇప్పటివరకు తెలియక ఎందరినో బాధించాము. ఇక తెలిసిన వారమై, తెలివిగల వారమై ఎవరినీ బాధించకుండా (సాధ్యమైనంతవరకు) జీవిద్దాం. అంతేకాదు. ఇంతవరకు తెలియక మనం కొనితెచ్చుకొని బాధలననుభవించాం. ఇక మీదట బాధలు అంటకుండా గుండెల్ని కాపాడుకుంటాం. జీవితం చాలా విలువైంది. అనే వాక్యం పెద్ద విలువైనది కాదు. విలువను జీర్ణించుకుని బ్రతికితే జీవితం ఎలా విలువైనదో తెలుస్తుంది. ఇలా బ్రతికే జీవితము భవ్యము. ఇలా బ్రతికేవాడే ధన్యుడు. అతడే భక్తుడు. యస్మాత్ న ఉద్విజతే లోకః లోకాత్ న ఉద్విజతే చయః

ఎవరి వలన లోకానికి ఉద్వేగము లేదో, లోకము వలన ఎవనికి ఉద్వేగముండదో, భయముండదో, బాధలుండవో – అతడే భక్తుడని భగవద్గీత భవ్య సందేశం. ఇది ఆదేశం కాదు. నిర్దేశం కాదు. సందేశం. దేశ కాల పరిస్థితులు మారినా మారిపోని సందేశం. సందేశాలను విని సంబరపడితే లాభముండదు. సంబరంతో సందేశాలను బ్రతుకులో సందర్శిస్తేనే సమదర్శనం సమ్యక్ దర్శనం.

**సూక్తి**

**ఎక్కడ శాంతి ఉంటుందో అక్కడ ఉద్వేగాలు ఉండవు, మనుషులు ప్రశాంతంగా ఉంటారు.**

# 13 శ్రమను పంచుకుందాం!

**I. ప్రధాన విలువ**

*శ్రమ విలువ*

**II. ఉప విలువ**

*శ్రమ విభజన - శ్రమ దోపిడి*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- శ్రమను పంచుకొని సమగౌరవభావాన్ని కల్గిఉండడం.
- శ్రమ దోపిడి గురించి అవగాహన పరచడం.
- శ్రమను గౌరవించే సంస్కృతిని నెలకొల్పగల్గడం.

## IV. ఉపోద్ఘాతం

భారత రాజ్యాంగం స్వేచ్ఛా స్వాతంత్ర్య హక్కు, జీవించేహక్కులతో పాటు ఎవరు ఏ పనైనా చేసుకొని జీవించే హక్కును మనందరికీ ఇచ్చింది. దీని ప్రకారం ప్రజలకు హాని కల్గించకుండా ఎవరు ఏ పనైనా చేసుకొనవచ్చు. కానీ ఇప్పటికీ మన సమాజంలో కొన్ని దుస్సాంప్రదాయాలు నెలకొని ఉన్నాయి. శ్రమ విభజన పేరుతో కొన్న పనులు కొందరే చేయాలి. ఈ పనులు ఆడవారుచేసేవి, ఇవి మగవారు మాత్రమే చేసేవంటూ ఇచ్చే వేతనాలలో కూడా తేడాలను కనబరుస్తున్నారు. ఆడవాళ్ళకి తక్కువ వేతనాలు, మగవారికి ఎక్కువ వేతనాలు చెల్లించడం మనం రోజూ చూస్తూనే ఉన్నాం. అంతేకాదు శ్రమ చేసేవారికి తక్కువ వేతనాలు కార్యాలయాలలో పనిచేసే మేధో శ్రామికులకు ఇబ్బడి ముబ్బడిగా జీతాలు చెల్లిస్తున్నారు. వాస్తవంగా మానవ మనుగడ పనితో ముడిపడి ఉంది. పనివల్లనే ఎన్నో ఆవిష్కరణలు జరిగాయి. పని లేకుంటే ఒక్క పూట కూడా మానవ మనుగడ కష్టం. ఆ పనిని సమభావనతో పంచుకొని శ్రమను గౌరవించాలి. శ్రమను దోచుకోవడం మహాపాపం. ఈ దోపిడీ సంస్కృతి అంతరించి పోవాలి.

పిల్లలూ! అసలు ఈ సమాజంలో ఏ ఏ రకాలుగా శ్రమను దోచుకొంటున్నారో ఈ సంఘటనలు వినండి.

## V. విషయం

### సంఘటన - 1

ఒక భవన నిర్మాణం జరుగుతుంది. అందులో 100మంది ఆడ, మగ కూలీలు పనిచేస్తున్నారు. అందరూ పనిచేసే సమయం ఒకటే, పనికూడా ఒక్కటే. కానీ ఆడవారికి 200/- రూపాయలు ఒకరోజు కూలీగా చెల్లిస్తున్నారు. మగవారికి 400/-రూ చెల్లిస్తున్నారు? ఇది సమంజసమేనా?

### సంఘటన - 2

రాజయ్య ఇంట్లో ఆడవాళ్ళు వంటవండడం. ఊడ్చడం, బట్టలుతకడం ఇలాంటి పనులన్నీ ఆడవాళ్ళే చేస్తారు. మగవాళ్ళు మార్కెట్టుకు పోవడం, వచ్చినవాళ్ళతో మాట్లాడడం, ఇంట్లోకి కావలసినవి తెచ్చిపెట్టడం వంటి పనులు చేస్తారు.

### సంఘటన - 3

ఒక కర్మాగారం ఉంది. దానిలో 200మంది కార్మికులు పనిచేస్తున్నారు. కర్మాగార యాజమాన్యం వీరందరికీ అరకొర జీతాలు చెల్లిస్తున్నారు. వీరిచే తయారుకాబడిన వస్తువులను, సామగ్రిని అధిక ధరలకు అమ్ముకొంటూ అధిక లాభాలు గడిస్తున్నారు. వస్తువులు తయారుచేసిన కార్మికులకు అరకొర జీతాలు ఇస్తూ వారి సేవలను వాడుకొంటున్నారు.

### సంఘటన - 4

అది ఒక ప్రైవేటు పాఠశాల. 25 మంది ఉపాధ్యాయులు అందులో పనిచేస్తున్నారు. ఆ పాఠశాలలో చదివే విద్యార్థులనుండి పాఠశాల యాజమాన్యం వేలకొలది ఫీజుల రూపంలో డబ్బులు వసూలు చేస్తున్నారు. కాని పాఠాలు చెప్పే ఉపాధ్యాయులకు మాత్రం తక్కువ జీతాలు చెల్లిస్తున్నారు. ఫీజుల ద్వారా అధిక మొత్తంలో ధనాన్ని పోగుచేసుకుంటున్నారు.

### సంఘటన - 5

రైతులు ఎంతో శ్రమకోర్చి పంటలు పండిస్తున్నారు. పొలం యజమాని పొలాలను కౌలుకు ఇచ్చి రైతులు పంట పండించిన తర్వాత వారికి తక్కువ గింజలు ఇచ్చి తన ఇంటికి ఎక్కువ తీసుకుపోతున్నాడు.

### సంఘటన - 6

రైతులు రెక్కల కష్టం మీద వివిధ పంటలు పండిస్తున్నారు. పంట చేతికొచ్చిన తర్వాత మార్కెట్టుకు తీసుకెళ్ళి అమ్మబోతే కిలో 5రూపాయల మాత్రమే కొంటున్నారు. మార్కెట్టులో వినియోగదారుడుకొంటే ఒక కిలో 20రూ. లకు అమ్ముతున్నాడు. దీనివల్ల రైతుకు రావాల్సిన 15 రూలు వినియోగదారుడికి లాభం రావడంలేదు. పండించిన రైతుకు లాభం చేకూరడం లేదు. మధ్యలో దళారులు ఈ సొమ్మంతా దోచుకుంటున్నారు.

### సంఘటన - 7

ఒక వ్యాపారంలో అందరూ కలిసి ఎవరికి ఏపనివస్తే ఆ పని చేస్తారు. అందరూ కలసి పెట్టుబడులు పెడతారు. చివరకు వచ్చే లాభాలను కూడా అందరూ సమానంగా పంచుకుంటారు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పిల్లలూ! పై సంఘటనలు అన్నింటినీ విన్నారు కదా! వీటి నుండి మీరేమి గమనించారో చెప్పండి.
2. మన ప్రాంతాలలో శ్రమ విభజన ఎలా ఉన్నది? కుటుంబంలో శ్రమ విభజన ఎలా ఉంది?
3. మేలు శారీరక శ్రమ చేసేవారికా? మేథో శ్రమ చేసినవారికా ఎవరికి ఎక్కువ మేలు జరుగుతున్నది? ఇది సమంజసమేనా? ఎందుకు?
4. అందరినీ సమదృష్టితోనే పనిలో చూస్తున్నామా? ఎందుకు?
5. "పనివిభజన అంటే కొన్ని పనులు కొందరే జేయడం" అనే విభజన సరయైనదేనా?
6. అందరూ అన్ని పనులు విభజించుకొని చేస్తే ఫలితాలు ఎలా ఉంటాయి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంట్లో ఎవరెవరు ఏఏ పనులు చేస్తూ ఉన్నారో గుర్తించండి. అందరూ అన్ని పనులు విభజించుకొని చేయండి. అలా చేయడం వల్ల అందరు పొందిన అనుభూతులను అడిగి తెలుసుకొని చెప్పండి.
- మీ కుటుంబంలోని సభ్యుల శ్రమ విభజన గమనించండి. ఏఏ సమయంలో ఎవరెవరు ఏఏ బాధ్యతలు నిర్వహిస్తున్నారో గుర్తించి పట్టికను పూరించండి.

| కుటుంబ వ్యక్తులు | ఉదయం 5గం॥-7గం॥ | 7గం॥-10గం॥ | 11గం॥-1గం॥ | 2గం॥-6గం॥ | 6గం॥-9గం॥ |
|---|---|---|---|---|---|
| అమ్మ | | | | | |
| నాన్న | | | | | |
| నానమ్మ | | | | | |
| తాతయ్య | | | | | |
| అక్క | | | | | |
| అన్న | | | | | |
| చెల్లి | | | | | |
| తమ్ముడు | | | | | |
| నువ్వు | | | | | |

1. పై పట్టికను బట్టి ఎవరు ఎక్కువ పని చేస్తున్నారు?
2. ఎవరు ఎక్కువ బాధ్యతలు తీసుకుంటున్నారు?
3. ఎవరు ఇంకా ఏమేమిచేస్తే బాగుంటుంది?
4. మీ ఇంట్లో శ్రమ విభజన సరిగానే ఉన్నదా లేక మారాలా? మారితే ఎలా మారాలి?

## తెలుసుకోండి

శ్రమ విభజన అంటే పనిని పంచుకోవడం. మన సమాజంలో పనిని పంచుకోవడంలో రెండురకాలు కన్పిస్తాయి.

**1వ రకం :** ఈ పనిని వీళ్ళే చేయాలి. అనే వివక్షాపూరిత సంస్కృతిని అనుసరించేవారు. ఇది చాలా అశాస్త్రీయమైనది.

**2వ రకం :** తరతమ భేదాలు లేకుండా అందరూ భాగస్వాములై ఎవరికి చేతనైన పనిని వారు చేసుకుంటూ పోవడం. మన దగ్గర ఎక్కువగా మొదటిరకమైన విష సంస్కృతి ఎక్కువగా కనిపిస్తుంది. రెండోది ఎక్కువగా కన్పించదు. దీన్ని గురించి ఎక్కడా ప్రశ్నించడం గానీ, పరిశీలించడం గానీ ఈ కోణంలో ఆలోచించడంగానీ జరగడం లేదు. ఈ మార్పుకు మనమే శ్రీకారం చుట్టాలి.

పనిచేసేవాళ్ళు ఎవరైనా గొప్పవాళ్ళే. పనిచేసే వాళ్ళున్నందు వల్లనే ఈ రోజు మనం ఆనందంగా జీవించగల్గుతున్నాం. దీని వెనుక ఎందరి కృషో దాగివుంది. మనం వేసుకునే బట్టలు వెనుక ఎంతమంది శ్రమ దాగుందో. మన డబ్బుల వల్లనే వచ్చింది అనుకుంటాం కానీ అక్కడ ఉత్పత్తి చేసిన వారి, నేసేవారి, కుట్టిన వారి శ్రమ, ఎంతో కృషి దాగి యుందన్న సత్యం మనం మరువకూడదు. ఉత్పత్తి లేనపుడు డబ్బులు పెట్టినా అవి దొరకవు. అంటే రైతులు పంటలు పండించకుంటే మానవులకు మనుగడేలేదు. రైతు శ్రమను గుర్తించాలి. అలాగే మనం పాదరక్షలు ధరిస్తున్నామంటే చర్మకారుల కృషిని, వారి శ్రమను గుర్తుంచుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. శరీరక శ్రమ జేసే వారున్నందువల్లనే ఈ అవసరాలన్నీ తీరుతున్నాయి. ఎవరి స్థాయిలో వారు పనిచేయడం వల్లనే మనుగడ సాగించగల్గుతున్నాం. మొదటి సంఘటనలో భవన నిర్మాణంలో వివక్షతను పాటిస్తూ ఆడవారికి, మగవారికి ఇచ్చే వేతనాలలో వ్యత్యాసాన్ని చూపుతున్నారు. మగవారితో సమానమైన గంటలు పని చేస్తున్నా శ్రమవిభజనలో లింగ వివక్షతను చూపుతున్నారు. శ్రమ దోపిడి కొనసాగిస్తున్నారు.

శ్రమను పంచుకోవడంలో అసమానతలను పాటిస్తున్నారు. ఒక కుటుంబంలో పనులు చేస్తున్నప్పుడు ఈ పనిని వీళ్ళే చేయాలి అనే విష సంస్కృతిని అనుసరించడం బాధాకరం. ఇది అశాస్త్రీయం. తరతమ భేదాలు లేకుండా అందరూ భాగస్వాములయ్యేలా ఎవరికి చేతనైన పనిని వారు చేసుకుపోయే సంస్కృతిని పెంపొందించాలి.

ఇకపోతే శ్రమను దోచుకోవడం వారసత్వ సంపదగా భావిస్తూ సమాజంలో అసమానతలను సృష్టిస్తున్నారు. ఒక కర్మాగారంలో పనిచేసే కార్మికులకు అరకొర జీతాలు చెల్లిస్తూ అధిక లాభాలను యజమానులు గడిస్తున్నారు. ప్రైవేటు పాఠశాలల్లో తక్కువ జీతాలు ఉపాధ్యాయులకిస్తూ ఫీజులరూపంలో అధిక లాభాలు సంపాదిస్తున్నారు. అలాగే రైతులు శ్రమ కోర్చి పండించిన పంటలకు గిట్టుబాటు ధరలు ఇవ్వకుండా అతి తక్కువ రూపాయలకు పంటలను మధ్య దళారులు కొని అధిక ధరలకు వినియోగదారులకు

అమ్ముతున్నారు. దానివల్ల రైతుకుగానీ, వినియోగదారునికి గానీ లాభం జరగడంలేదు. ఈ విధంగా రైతుల శ్రమను దోచుకుంటున్నారు.

ఈవిధంగా ప్రతి రంగంలో ఎక్కడచూసినా దోపిడీ దారుల రాజ్యం పెచ్చుమీరి పోతున్నది. దానివల్ల అశాంతి అసమానతలు పెచ్చుమీరి పోతున్నాయి. ఈ సంఘటనలన్నీ దోపిడికి నిలువెత్తు నిదర్శనం. ఈ శ్రమదోపిడిని అరికట్టవలసిన బాధ్యత మనందరిపై ఉంది.

పని సంస్కృతిని గౌరవిస్తూ శ్రమను పంచుకోవడంలో అసమానతలను తొలగించుకోవాలి. నేడు సమాజంలో శ్రమదోపిడికి గురవతున్న వర్గాల్లో చేనేత కార్మికులు కూడా ఉండడం మనందరికీ సిగ్గుచేటు. "ఎక్కడైతే పేదల పట్ల ప్రేమ స్వచ్ఛంగా ఉంటుందో... సేవాభావంతో కూడా ఉంటుందో... అక్కడ భగవంతుడు ఉంటాడు. చరఖా మీద నేను వడికే ప్రతి నూలుపోగులో దేవుడిని చూస్తాను". అని మహాత్మాగాంధి అన్నారు. చేనేత వృత్తిని దైవంగా భావించే గాంధీజి కార్మికుల దుస్థితిని చూస్తే కంటతడి పెట్టేవారు. గ్రామీణ భారతాన్ని కుదిపేస్తున్న చేనేతల సంక్షోభాన్ని గట్టెక్కించే చేతులే కరవవుతున్నాయి.

"నా ద్వేషం బ్రిటీషు వాళ్ళపై కాదు, దోపిడీ పీడనల వలస పాలనపై" అని స్వాతంత్ర్య లక్ష్యాన్ని సూటిగా ప్రకటించారు – మహాత్మాగాంధి. స్వరాజ్యం సాధించుకున్న భారతావని పేదరికాన్ని దాని కవలలైన ఆకలి, అనారోగ్యాల్ని అంతం చేసి సురాజ్యాన్ని స్థాపిస్తామని జాతినేతలు ఆనాడు వాగ్దానం చేశారు. కోట్లాది. ప్రజల అవసరాలను తీర్చగల భారతమాత నేడు వందల మంది దురాశపరులు జాతి వనరులను కైంకర్యం చేస్తుంటే రెండుపూటలా తిండిలేని యాభైకోట్ల మందిని చూసి బాధతో రోదిస్తోంది.

తెల్లదొరల స్థానాన్ని భర్తీ చేసిన నల్లదొరల దోపిడీ పీడనలు ఢిల్లీనుంచి గల్లీ దాకా పాకాయి. అవినీతి అంతకంతకూ వటవృక్షంలా పెరిగిపోతూ పేదల పాలిట శాపంగా మారుతోంది. ప్రతి యేటా లక్షలకోట్లరూపాయల కుంభకోణాలు వనరుల దోపిడీల వల్ల దేశం అతలాకుతలం అవుతోంది. దీనివల్ల దోపిడీదారులు కోట్లకు పడగలెత్తుతుంటే పేద వాళ్ళు పేదవాళ్ళగానే మిగిలిపోతున్నారు.

అవినీతి అంతానికి ప్రతి ఒక్కరూ స్పందించాల్సిన అవసరం ఉంది. 'వ్యక్తికి బహవచనం శక్తి' అన్న స్పృహతో శ్రమ దోపిడి లేని సమాజానికి ప్రతినపూనడం ప్రతి ఒక్కరి కర్తవ్యం. 'అడ్డగోలుగా గడ్డిమేసినవాడు వాడి పాపానవాడు పోతాడులే" అనే ఉదాసేన వైఖరి ప్రజాస్వామ్య వ్యవస్థకు కీడు కలిగిస్తుంది. సమాజంలో ఒక పౌరునిగా సామాజిక స్పృహతో శ్రమదోపిడి లేని సురాజ్యం కోసం మనవంతు కృషి మనం చేయాలి. దోపిడిరాజ్యానికి చరమగీతం పాడాలి.

**సూక్తి**

**మనం చేస్తున్న పనిలోనే కాదు. మనం ఆలోచిస్తున్న దానిలో మనం అర్థం చేసుకున్న దానిలో మన హుందాతనం ఉంటుంది.**

# 14 సమాజ సేవ

**I. ప్రధాన విలువ**

*సేవాభావం*

**II. ఉప విలువ**

*సమాజానికి సేవచేయడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- సేవాభావాన్ని అలవర్చుకుంటారు.
- సమాజానికి మేలు చేసే పనులు చేస్తారు.

## IV. ఉపోద్ఘాతం

సమాజం నాకేమిచ్చింది అని కాకుండా సమాజానికి నేనేమిచ్చాను అని ప్రతి ఒక్కరూ ఆలోచించ గలగాలి. సమాజం ద్వారా మనం ఎన్నో ప్రయోజనాలను పొందుతున్నాము అలాగే మనము కూడా సమాజానికి సేవ చేయాలి. సమాజసేవ అంటే మరేమిటో కాదు తోటివారికి సహాయం చేయడం ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం. విపత్తులు సంభవించినపుడు మనవంతు సహాయం అందించడం ప్రజలకు మేలు చేసే కార్యక్రమాలలో పాలు పంచుకోవడం. స్వార్థం పెరిగిపోతున్న ప్రస్తుత సమాజంలో రేపటి పౌరులుగా ఎదుగుతున్న విద్యార్థులలో సేవాభావాన్ని పెంపొందించడం మన తక్షణ కర్తవ్యం.

## V. విషయం

### సంఘటన - 1

గాంధీజీ సామాజిక దృక్పథం కలిగినవారు కాబట్టే గాంధీజీ సమాజంలోని అందరి గురించి ఆలోచించారు. అతను కుష్ఠువ్యాధితో బాధపడుతున్న రోగులను సమాజం దూరంగా ఉంచడాన్ని గమనించారు. వారు కూడా మనలాంటి వారేనని, వారుకూడా సమాజ పౌరులని చాటారు. వారితో కల్సి ఉంటూ వారికి సపర్యలుచేసేవారు. వారికి వైద్యసేవలు అందిస్తూ, ఓదార్చుతూ వారితో గడిపారు. దీనులలోను, దుఃఖితులలోను, వ్యాధిగ్రస్థులను అతను దేవుని దర్శించగలిగారు. అలాంటివారికి సేవచెయ్యడమే దైవకార్యంగా ఆయన భావించారు, అంటరానితనాన్ని అమానుషంగా పరిగణించి, దానిని రూపు మాపడానికి ప్రయత్నించారు.

### సంఘటన - 2

మదర్ థెరిస్సా చిన్నప్పుడు (12 సంలలోనే) తను బడికి వచ్చే మార్గమధ్యంలో ఒక ముసలాయన జ్వరంతో బాధపడుతూ కనిపించాడు. ఆయనను గురించి ఆ త్రోవలో వచ్చేపోయేవాళ్ళు ఎవరూ పట్టించుకోలేదు. ఆయన ఆస్పత్రికి పోయే స్థితిలో లేడు. ఆయన బాధ చూచి ఆయనను ఆస్పత్రిలో చేర్చి బడికి వెళ్ళింది.

మదర్ థెరిస్సా చిన్నప్పట్నుంచి దైవభక్తి గలది. దీన జనులకు సాయపడాలనే తపన. అందుకై క్రైస్తవ మిషనరిగా ప్రజాసేవ చెయ్యాలని కఠిన నియమాలతో మఠకన్యగా దీక్ష తీసుకుంది. నగరాల్లో ఒక ప్రక్క అతివిలాసంగా లెక్కలేనంత ధనంతో తులతూగేవాళ్ళూ – మరోక ప్రక్క కటిక పేదరికంలో తినడానికి తిండి, కట్టుకోడానికి గుడ్డ, ఉండడానికి ఇల్లు లేక బాధపడే వాళ్ళుంటారు. అలాంటి దీనజనుల బాధలు మదర్థెరిస్సా మనస్సును కలిచివేశాయి. వాళ్ళను ఆదుకోవాలని ఆమె తపన. అందుకే నిశ్చయించుకొంది 'పరులసేవే పరమ ధర్మం' అని.

కలకత్తానగరం మోతిజీల్ అనే ప్రాంతంలో పేదలు అధికంగా ఉంటారు. అపరిశుభ్రత, అనారోగ్యం, దారిద్ర్యం వంటి అవలక్షణాలన్నీ అక్కడే ఉంటాయి. అలాంటి వారికి ఒక చిన్న పాఠశాలను స్థాపించింది. చదువుతోపాటు ఆరోగ్యం గురించి, పరిశుభ్రతను గురించి చెప్పేది. ఆరోగ్యమే మహాభాగ్యం గదా! బడిలేని సమయంలో ఆమె ఆ పరిసరాల్లో పూరిగుడిసెల్లో, గోడల నీడల్లో, చెట్ల కింద కాపురాలుంటున్న వాళ్ళ దగ్గరకి వెళ్ళి, వారితో ప్రేమగా, అనురాగంతో మాట్లాడేది. వాళ్ళను ఓదార్చేది. అనేక విషయాలు చెప్పేది. ఆమె వాళ్ళకు దైవం. ఆమె ఇలాంటి అనాథలకు అభాగ్యులకు సేవచేయడానికి ఒక 'మిషనరీస్ ఆఫ్ ఛారిటీ' అనే సంస్థను స్థాపించింది.

ఒకరోజు మదర్ కలకత్తారోడ్డు వెంట వెళ్తూ ఒక పండు ముదుసలిని చూసింది. ముసలితనానికి తోడు అనారోగ్యం. ఆయనకు ఎవరూ లేరు. చావలేక, బ్రతకలేక కొట్టుకొంటున్నాడు. దగ్గరలోనే ఒక ఆస్పత్రి ఉంది. ఐనా అతని బాధను ఎవరూ పట్టించుకోవడంలేదు. మదర్ ఆ దృశ్యాన్ని చూసి కంట తడిపెట్టింది. వెంటనే ఆస్పత్రికి వెళ్ళి డాక్టర్లకు వృద్ధుడి బాధను వివరించింది. ముసలివగ్గు ఎలాగూ చనిపోతాడు; ఆయన్ని ఎవరూ బ్రతికించలేరు. కనుక ఆ ఆస్పత్రిలో చేర్చుకోవడం ఎందుకూ? అని డాక్టర్లు అన్నారు. కాని మదర్

మందులు తెచ్చి, అతనికి ఇవ్వాలని యత్నించింది. అంతలోనే అతని ప్రాణం అనంత వాయువుల్లో కలిసిపోయింది. ఈ సంఘటన ఆమెను కలిచివేసింది. ఎంతో దుఃఖించింది. కన్న బిడ్డలు సైతం కన్నెత్తి చూడని వృద్ధులకు ఆశ్రయం ఇస్తూ, ఆదరిస్తూ నిర్మల్ హృదయ్‌ను స్థాపించింది. ఇప్పటికీ దిక్కూ మొక్కూలేని ముసలి వాళ్ళు అక్కడకు చేరుతుంటారు. అక్కడి సేవకులు ఆ మసలివాళ్ళకు ప్రేమ, అనురాగం పంచుతారు.

మరొకరోజు దిక్కులేని ఒక చిన్నపాప ఏడ్చి, ఏడ్చి సొమ్మసిల్లి ఏడ్చే ఓపిక లేక వెక్కిళ్ళుపెడుతూ ఉంది. అటుగా వెళ్ళే జనం ఎవరూ ఆ పాపను పట్టించుకోవడంలేదు. మదర్ థెరిస్సా పాపను చూసి ఆమె వద్దకు పరుగు పెట్టింది. పాపను అక్కున చేర్చుకొని కన్నీళ్ళు తుడిచి ఆహారం ఇచ్చింది. ఆశ్రమానికి తెచ్చింది. ఇలాంటి అనాథ శిశువులు ఎందరో! వీళ్ళు ఎందుకు అనాథలుగా మారుతున్నారు? వీళ్ళపట్ల సభ్యసమాజం ఎలా ప్రవర్తిస్తుంది? అని ప్రశ్నించుకొని వీరి కోసం ఒక 'శిశుసదన్' నేలకొల్పింది. ఎంతో మంది పిల్లలు ఇందులో చేరి చక్కగా చదువు సంధ్యలు నేర్చి, మంచి మనుషులుగా జీవితం గడుపుతున్నారు.

మానవుల్ని పట్టి పీడిస్తున్న భయంకరమైన వ్యాధి కుష్టు. కుష్టు సోకినవాళ్ళను బంధువులు దగ్గరకు రానిచ్చేవారుకాదు. వారికి తగిన చికిత్స దొరికేది కాదు. ఇలాంటివాళ్ళ బాధలు ఆమె కళ్ళారా చూసి, చెవులారా విని తీవ్రంగా ఆలోచించింది. కుష్టు వ్యాధిగ్రస్తులకు చికిత్స, సేవ చేయడానికి శాంతి నగరం అనే సంస్థను స్థాపించింది. ఇలా ఇలాంటి ఎన్నో సంస్థలను స్థాపించి ఎందరికో ఆశ్రయం ఇస్తుంది.

మదర్ థెరిస్సా నిరాడంబరంగా ఉంటుంది. ఆమె చెప్పేది తక్కువ. చేసేది ఎక్కువ. తక్కువగా మాట్లాడు. ఎక్కువగా పని చెయ్యి. అనే సూక్తిలో ఆమెకు నమ్మకం. "ప్రార్థించే పెదవుల కన్నా సేవించే చేతులు మిన్న" అనేది ముమ్మాటికి నిజం.

## సంఘటన - 3

రాగం తీస్తూ పద్యం పాడితే ఎంతో వినసొంపు... నటించేది ఏ పాత్రలోనైనా ఆకట్టుకునే స్వరూపం, హావభావం... వీక్షించే ప్రేక్షకుడు ఎంతసేపైనా ఆసక్తిగా అలాగే ఉండిపోవడం ఆయన ప్రత్యేకత. రంగస్థలంపై అరుదైన కళాప్రతిభ చూపుతూ ఆర్తులపాలిట సేవానిరతి ప్రదర్శిస్తున్న ఉన్నత వ్యక్తిత్వం ఈయన సొంతం. నెల్లూరు జిల్లా ఆత్మకూరు మండలం మహిమలూరు గ్రామానికి చెందిన పుట్టుబోయిన సుబ్బరాయుడు పౌరాణిక, సాంఘిక నాటకాల్లో వివిధ పాత్రల్ని పోషిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. నాటకరంగానికి నేటి ఆధునిక సమాజంలో ఆదరణ కరవవుతున్నా సాటి కళాకారులందరినీ ఓ గూటికి చేర్చి వారిలో ఉన్న ప్రతిభాపాటవాల్ని వివిధ సందర్భాల్లో ప్రదర్శించేలా సహకరించడం సుబ్బరాయుడి మంచి వ్యక్తిత్వానికి నిదర్శనం. ఇందుకోసం వెంకటేశ్వర నాటక కళా మండలిని స్థాపించారు. కళాప్రగతి మ్యూచువల్ ఎయిడెడ్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీని ఏర్పాటు చేసి అధ్యక్షులుగా వ్యవహరిస్తున్నారు. ఈ సంస్థతో కళాకారులందరికీ పక్కా గృహవసతి చేకూరాలని తనవంతుగా తోడ్పడుతున్నారు.

నాటకరంగంతోపాటు సమాజ సేవలో కూడా తానున్నానంటూ ముందుకురావడం సుబ్బరాయుడి దినచర్యగా ఉండటం విశేషం. ఈయన స్వగ్రామమైన మహిమలూరు పంచాయతీకి గతంలో ఉపసర్పంచ్‌గా,

వాటర్‌షెడ్, విద్యాకమిటీలకు చైర్మన్‌గా, రైతుమిత్ర కన్వీనర్‌గా సేవలందిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ బెస్త సంక్షేమ సంఘం నెల్లూరు జిల్లా అధ్యక్షునిగానూ వ్యవహరిస్తున్నారు. బిసి సంక్షేమ సంఘ జిల్లా ఉపాధ్యక్షుడిగా కూడా కొద్దిరోజుల క్రితం నియమితులయ్యారు. ఉపాధికోసం చిన్న దుకాణం నడుపుతున్నా ఇటీవల గ్రామంలో నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహించి ఇరవై మందికి కంటి ఆపరేషన్లు చేయించడంలో ప్రత్యేక కృషి చేశారు. ఎన్నెన్నో సేవా కార్యక్రమాల్లో పాలుపంచుకుంటున్నారు.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. పై మూడు సంఘటనల గురించి విన్నారు కదా! వీటి గురించి మీరు ఏమి తెలుసుకున్నారు?
2. సమాజసేవ చేసేవారిని చూసినప్పుడు మీకేమనిపిస్తుంది.
3. ఎందుకు సమాజసేవ చేయాలో చెప్పండి
4. మీరు ఇలాంటి సేవలు చేశారా? ఎలా చేశారు? ఎప్పుడు చేశారు?
5. మీ స్నేహితులలో సేవాభావం ఉన్నవారి పేర్లు చెప్పండి. వారిని ఎలా అభినందిస్తారు?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంటి పక్కన గాని, బయటగాని ఎవరైనా కష్టాలో ఉన్నప్పుడు నీవు వారికి ఎలాంటి సహాయం చేస్తావు.
- నీవు, మీ స్నేహితులందరు కలిసి ఒక అనాథాశ్రమానికి వెళ్ళి వారికి ఎవరెవరు ఎలాంటి సహాయ - సహకారాలు అందిస్తున్నారో ఒక లిస్టు తయారుచేయండి.

### తెలుసుకోండి

వ్యక్తుల సమదాయన్నే సమాజం అని అంటాం. సహకారం అంటే సహాయపడడం. ఈ రెండు పదాలు కలిపి సమాజ సహకారం అని అంటున్నాము. వ్యక్తులు సమాజసహకారం లేకుండా జీవించడం సాధ్యం కాని పని. మానవుడు స్వతహాగా సంఘజీవి. ఈనాడు వ్యక్తి తాను అనుభవిస్తున్న అనేక సౌకర్యాలు - సదుపాయాలు తిండి, బట్ట, ఇల్లు, వాహనాలు, పొలాలు అన్నీ కూడా సంఘంలో అనేక రంగాల్లో శ్రమించడం వల్ల, పని చేయడం వలన మనకు సమకూరినవి. అలాగే ఏ కార్యము విజయవంతం చేయాలన్నా సమాజ సహకారం అవసరం.

ప్రజలకు మేలు చేయాలని ఎన్ని మంచి పనులు చేసినప్పటికి ఆ పనుల వల్ల తమకేం ప్రయోజనం

అనుకోకూడదు. ఇతరుల సహకారం లభించనిదే ఆ పనులు విజయవంతంకావు. ఈ సమాజం ద్వారా మనం జీవిస్తున్నాం. పరస్పర సహాయ సహకారాలు లేకుంటే మనిషి మనుగడలేదు. ఈ విషయాన్ని మనం గ్రహించాలి. మనకు ఎన్నో విధాలుగా సహకరిస్తున్న ఈ సమాజం నాది – దీని బాగుకోసం నేను ప్రయత్నిస్తాను అని ప్రతి ఒక్కరు అనుకోగలగాలి. ఈ సమాజంలో రోగార్తులు, దీనదళితులు, నిరక్షరాస్యులు మొదలైనవారు ఎందరో ఉన్నారు. వారికష్టాలను తీర్చడానికి మనం ప్రయత్నించాలి. అలాంటి వారిని మనం ఆదుకోవాలి. ప్రతివ్యక్తి ఈ సమాజ ఋణం తీర్చుకోవాల్సిందే. అది సేవద్వారానే తీర్చుకోగలం.

అంటే ఆకలైన వారికి అన్నం పెట్టాలి. దిక్కులేని వారికి శరణాలయాలు కట్టాలి. రోగికి వైద్యసేవలు అందివ్వాలి. వికలాంగులకు కృత్రిమ అవయవాలను ఇవ్వాలి. "దేశమంటే మట్టి కాదోయ్ దేశ మంటే మనుషులోయ్" మనుషులకే మనం సేవ చేయాలి. అవసరాన్ని గుర్తించి సేవ చేయాలి.

మన ఇల్లు కూడా సమాజమే. బడి కూడా సమాజమే. ఇల్లుకన్నా, బడికన్నా సమాజం మరింత పెద్దది. అది ఒక పెద్ద ఇల్లు, బడి అందుకనే ఒకప్పుడు మన పెద్దలన్నారు బాగా ఆలోచించగలిగిన వాళ్ళకి ప్రపంచమంతా ఒకే కుటుంబమని. సమాజంలో మంచితనం ఉంటుంది సమాజమంటూ లేకుండా ఉంటే ఎలా ఉంటుంది. ఆ పరిస్థితిని ఊహించడం కష్టం – అందుకే మనం సమాజానికి ఋణపడి ఉన్నాం.

మనపాఠశాలను, ఊరిని పరిశుభ్రంగా ఉంచటం కూడా సమాజసేవయే చెట్లునాటడం సమాజసేవ. చదువురాని పెద్దలకు చదువుచెప్పటం సమాజసేవ. వ్యసనపరుడు కాకుండా ఉండటం సమాజసేవ ఒక్కమాటలో చెప్పాలంటే నీకోసం కాక ఇతరుల మేలు కోసం చేసే ఏపనైనా సమాజ సేవనే.

నిరుపేదలకు, నిజమైన అవసరమున్న మనుషులకు ఎటువంటి ప్రతిఫలాన్ని ఆశింపక, మనకు చేతనైన సాయం చేయడమే సమాజసేవ. సమాజసేవలు అందించడానికి మన పూర్వీకులు ఎందరో ప్రయత్నించి సఫలీకృతులైనారు. వారిని గూర్చి తెలుసుకొని మనం కూడా ప్రేరణ పొందాలి.

సూక్తి

## మానవసేవయే మాధవ సేవ

నరుడు మెచ్చెనేని నారాయణుడు మెచ్చు
దీనులందు దేవ దేవుడుందు;
మానవార్చనంబె మాధవార్చనమురా
లలితా సుగుణ జాల! తెలుగుబాల!

భావం : నీ సాటిమానవుడు నిన్ను మెచ్చుకోవాలి. అపుడు దేవుడు కూడా మెచ్చుకొంటాడు. దీనుల పట్ల దయ కలిగి ఉండాలి. దేవుడు ఎక్కడోలేడు దీనులలోనే ఉంటాడు. మానవత్వం కలిగి మానవసేవ చేయటమే అసలైన దైవారాధన అవుతుంది.

దీనుల్ని ఆదుకోవడమే దైవత్వం.

# 15 వివక్షత

**I. ప్రధాన విలువ**

*సమానత్వం, సోదరభావం, స్త్రీల పట్ల గౌరవభావం*

**II. ఉప విలువ**

*వివక్షత ఉండకూడదని గ్రహించడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- వివక్ష చూపకూడదని తెలుసుకుంటారు.
- వివక్షతను గుర్తించే ప్రశ్నించగలుగుతారు.

**IV. ఉపోద్ఘాతం**

మనందరము మానవులమైనప్పటికీ అందరమూ ఒకే విధంగా లేము. కొందరు ధనికులు, కొందరు పేదవారు, కొందరు తెల్లగా, కొందరు నల్లగా, కొందరు తెలివిగా, కొందరు మందబుద్ధులుగా ఉంటారు. అందర్నీ సమానంగా చూసే మానవహక్కులు ప్రకటించబడి అంగీకరింపబడ్డాయి. ఎటువంటి తప్పుచేయని మనుష్యుల హక్కులను ఉల్లంఘించడమంటే వారి పట్ల వివక్షత చూపడమే. కేవలం కులం, మతం, లింగం, శరీరఛాయ, తెలివితేటలు మొదలగు అంశాలనుబట్టి వివక్షత చూపడం న్యాయం కాదు. మన కళ్ళ ఎదుట జరుగుతున్న వివక్షత చూపబడుతున్న కొన్ని సంఘటనలను మనం పరిశీలిద్దాం.

## V. విషయం

### సంఘటన - 1

అరుణ తల్లిదండ్రులు చాలా పేదవారు. అరుణ అన్నను, తమ్ముడిని ఇద్దరినీ బడికి పంపిస్తున్నారు. అరుణను కూడా కొద్దికాలం బడికి పంపి, ఇంట్లో పనికి యిబ్బంది కలుగుతుందని బడి మాన్పించివేశారు. ఆమె తాను కూడా బడికి వెళ్ళి చదువుకుంటానని అన్నది. ఆమె నాన్న 'నువ్వు బడికి వెళ్తే ఇంట్లో పనెవరు చేస్తారు. ఆడపిల్లవు. నువ్వు చదువుకుని ఉద్యోగం చెయ్యాలా? ఊళ్ళేలాలా? నోరుమూసుకుని పడివుండు' అన్నాడు.

### సంఘటన - 2

రామాపురం గ్రామంలో శ్రీరామనవమి జరుగుతున్న సందర్భంగా భగవంతుని దర్శనం కోసం భక్తులందరూ నిలబడ్డారు. దర్శమైన తర్వాత భోజన కార్యక్రమం ఏర్పాటుచేసారు. ఆ గ్రామస్థులు జంగయ్య, మల్లమ్మ నెమ్మదిగా నడుచుకుంటూ వెళ్ళి భోజనానికి కూర్చోబోతే 'వద్దు వద్దు మీకు ఇక్కడ కాదు. వేరే డేరా వేశాము వెళ్ళి అందులో కూర్చోండి' అనడంతో ఆ వృద్ధ దంపతులు ఆ డేరాలోకి వెళ్ళగా అక్కడంతా తమ కులస్థులే ఉండటం చూశారు. "రోజులు మారాయి. మనుషులంతా సమానంగా చూడబడుతున్నారు అని అంటున్నారు, కానీ రోజులేం మారలేదు." అనుకుంటూ అన్నం తినడం మొదలు పెట్టాడు.

### సంఘటన - 3

మలేషియాలో ఉద్యోగం పేరు చెప్పి పెద్దమొత్తంలో డబ్బు గుంజి మలేషియా తీసుకొని వెళ్ళి అక్కడ చైనా ఏజంటుకు మన రాష్ట్ర యువకులను కొందరిని అమ్మివేసారు. వారు 40మంది యువకులను ఒకే గదిలో బంధించి కనీసం మంచి భోజనం కూడా పెట్టలేదు. నిలదీసిన ఆ యువకులను జాలి, దయ, కరుణ లేకుండా కొట్టి తిండి కూడా పెట్టకుండా చిత్ర హింసలకు గురి చేసారు. రోజుకు 12 నుంచి 15 గంటలు పని చేయమని బలవంతపెట్టారు.

### సంఘటన - 4

సీతానగరం గ్రామంలో ఆ రోజు గ్రామ అభివృద్ధి గురించి ఏర్పాటు చేసిన సమావేశంలోకి కలెక్టరుగారు ముఖ్య అతిథిగా వస్తున్నారు. వేదికకు ముందు ఏర్పాటుచేసిన కుర్చీలలో అదే గ్రామానికి చెందినవారు కూర్చుని ఉన్నారు. ఇంతలో మరికొందరు వచ్చి ముందువరుసలో కూర్చొని వున్నవారికి 'ఈ కుర్చీలు వేసింది మీ కొరకు కాదు. మీరు వెళ్ళి వెనుకకు వెళ్ళి ఒక ప్రక్కగా నిల్చోండి. అని అనగానే వారు విస్తుపోయి లేచి వెళ్ళి దూరంగా నిలబడ్డారు. వారిని వెనుకకు వెళ్ళి నిలబడమని చెప్పడానికి కారణమేమయి ఉంటుందను కుంటున్నారు?

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. అరుణ అన్న, ఆమె తమ్ముడు ఇద్దరూ బడికి వెళ్తుంటే, ఆమె మాత్రమే చదువు మానివేసి ఎందుకు ఇంటి పనిచెయ్యాలి.
2. జంగయ్య, మల్లమ్మ భోజనానికి ప్రత్యేక డేరా లోకి ఎందుకు పంపబడ్డారు? వివక్ష ఎక్కడ ఎలా ఉందో చర్చించండి.
3. జంగయ్య, మల్లమ్మను దేవుని గుడిలోకి వెళ్ళనిచ్చి ఉంటారా?
4. సమస్యలు సాధించకపోవడానికి గల కారణాలు ఏమిటి?
5. మనుషులంతా సమానమే చర్చించండి.
6. వివక్షలకు కారణాలు ఏమిటి?

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మీ ఇంట్లో చుట్టుపక్కల వారిని గమనించండి. కిందివారు సమాన గౌరవం, అవకాశాలు పొందుతున్నారా లేదా రాయండి. వేటిలో పొందుతున్నారో రాయండి.

| సభ్యులు | గౌరవం | అవకాశం | ఎక్కువ/తక్కువ | ఏ విషయంలో పొందుతున్నారు? కారణం |
|---|---|---|---|---|
| బాలికలు | | | | |
| బాలురు | | | | |
| స్త్రీలు | | | | |
| పురుషులు | | | | |
| డబ్బున్నవారు | | | | |
| డబ్బులేనివారు | | | | |
| చదువుకున్నవారు | | | | |
| చదువుకోనివారు | | | | |
| పల్లెటూరివాళ్ళు | | | | |
| పట్టణవాసులు | | | | |
| అధికారులు | | | | |

## తెలుసుకుందాం

భారత భూభాగంలో నివసించే ప్రజలందరికీ సమాన హక్కులున్నాయి. అంటే దీని అర్థం చట్టం దృష్టిలో అందరూ సమానులే. అయితే అందరూ సమానంగా ఈ హక్కులను అనుభవిస్తున్నారని మన భావించలేం. ఎందుకంటే ఒకరి హక్కులపై మరొకరు పెత్తనం చేయడంగానీ లేదా వారిహక్కులను అనుభవించకుండా వేరొకరు అడ్డుకోవడం గానీ చేసినట్లయితే ఆ హక్కుదారులు వివక్షతకు గురి అయినట్లే. మన సామాజిక, మత, రాజకీయ రంగాలలో స్త్రీలు వివక్షకు గురి అవుతున్నారు. దీనినే లింగ వివక్షత అంటారు. మనం స్త్రీ, పురుష వివక్షత లేకుండా ఇద్దరినీ సమానంగా చూడగలగాలి. అదే దక్షిణాఫ్రికా వంటి దేశాలలో తెల్లవారు నల్లవారికి బానిసలుగా చూస్తుంటారు. దీనిని 'జాతి వివక్షత' అని అంటారు. ఇటువంటి వివక్షతకు వ్యతిరేకంగా నెల్సన్ మండేలా వంటి వారెందరో పోరాటం చేసి సఫలీకృతులైనారు.

1950 వ సంవత్సరములో భారత రాజ్యాంగము ద్వారా అంటరాని తనము నిషేదించినా దళితుల పట్ల వివక్ష ఇంకా తీవ్రంగా కొనసాగుతుంది. దీనినే కులవివక్షత అంటారు. ప్రభుత్వము ఆదాయాలలో గల అసమానతలను తగ్గించుటకు, సదుపాయాలు, అవకాశాలు ఇవ్వడంలో గల అసమానతలను తొలగించడానికి కృషిచెయ్యాలి.

కేవలం చట్టాలను జారీ చేయడం ద్వారా వివక్షతను నిరోధించలేము. సమానత్వం అనే భావన మన సంస్కృతిలో ఒక ప్రధాన అంశంగా తీసుకురావాలి. కులతత్వం అనేది పూర్తిగా అణిచివేయబడాలి. ఆర్థికంగా సాంస్కృతికంగా - సామాజికంగా సమానహక్కులు అందరూ అనుభవించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. స్త్రీ విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలి. మానవుల మధ్య అసమానతలను సృష్టించే వివిధ రకాల వివక్షతలను మనం సమీక్షించుకోవాలి. భవిష్యత్ ప్రపంచం వివక్షతలేని ప్రపంచంగా చూడాలని కోరుకుందాం.

## సమానత్వం

ఈ దేశంలో ఉన్న ప్రజలందరు స్వేచ్ఛ, సమానత్వం కలిగి ఉండడానికి రాజ్యాంగం ద్వారా ఆశించి అమలుచేయడం జరుగుతుంది. వీటి ద్వారా ప్రతి పౌరుడు గౌరవప్రదమైన జీవితం గడపడానికి వీలుంటుంది.

చట్టం దృష్టిలో అందరూ సమానులే. తప్పుచేస్తే శిక్షలు అందరికీ ఒకేలాగే ఉంటాయి. పౌరులంతా ఏ ఉద్యోగానికైనా (కులం, మతం, లింగ భేదాలకు అతీతంగా) వారి వారి శక్తిసామర్థ్యాలకు అనుగుణంగా పొందడానికి అర్హులే.

ప్రతి పౌరుడు సమాన హోదా మరియు అవకాశాలు కల్గిఉన్నాడు. ఏవిధంగా కూడా కులం, మతం, లింగం ఆధారంగా వివక్ష ఉండకూడదు.

**సూక్తి**

అందము స్త్రీకి గర్వాన్ని కల్గిస్తుంది. సుగుణములు కీర్తిని కల్గిస్తాయి.
శీలము దైవత్వమును ఆపాదించును.

# 16 దేశ సంస్కృతిని కాపాడడం

**I. ప్రధాన విలువ**

*జాతీయభావన, దేశభక్తి*

**II. ఉప విలువ**

*దేశ సంస్కృతి గొప్పదనాన్ని గుర్తించడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- దేశ సంస్కృతి గొప్పదనాన్ని తెలుసుకుంటారు.
- దేశ సంస్కృతి పట్ల గౌరవభావం, దేశభక్తి పెంచుకుంటారు.

## IV. ఉపోద్ఘాతం

భారతదేశం ప్రపంచ దేశాలన్నింటిలో తనదైన వైవిధ్యంతో పేరు ప్రతిష్ఠలు గడించడమే గాక, ప్రపంచం నలుమూలల్లో నివసించే ప్రజలు భారతీయ సంస్కృతి వైపు మొగ్గు చూపుతూ సంప్రదాయాలను పాటించాలనుకోవడం గమనిస్తే మన దేశ సంస్కృతి ఎంత గొప్పదో మనకు అర్థం అవుతుంది. వేదకాలం నుండి నేటి వరకు భారత ప్రజల జీవన శైలిలో సంస్కృతి అంతర్భాగంగా కొనసాగుతున్నది. అంతేకాదు భారతీయ సంస్కృతి ఎన్నో దేశాలవారికి ఆదర్శంగా నిలిచింది. అటువంటి మన సంస్కృతి గొప్ప దనాన్ని తెలుసుకోవడం, గౌరవించడం భారతీయులందరూ పాటించి తమ దేశంపట్ల భక్తిని చాటాలి. భారతీయులు ఏ దేశంలో ఉన్నా వాళ్ళ సంస్కృతిని చాటి చెప్పేలా ప్రవర్తించిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. వాటిని గమనిద్దాం.

## V. విషయం

### సంఘటన - 1

బిస్మిల్లాఖాన్ భారతదేశ ప్రముఖ షెహనాయ్ విద్వాంసుడు. ఆయన కచేరీలు భారతదేశంలోనే గాక ప్రపంచదేశాలలో ప్రజలు ఆదరించారు. ఆయన మీద అభిమానంతో విదేశీయులు "మీకు కోరినంత డబ్బు ఇస్తాము మీరు ఇక మా దేశంలోనే ఉండండి భారతదేశానికి పోకండి' అని అడిగారు. అందుకు బిస్మిల్లా ఖాన్ భారతదేశం నాకు జన్మనిచ్చిన మాతృభూమి. అక్కడ ఎన్నో మతాలవారు కలిసిమెలసి బతకడం ఆనందంగా జీవించడం వంటి గొప్ప సంస్కృతి ఉంది. నా దేశంలో నేర్చుకున్న ఈ విద్య మీ అందరినీ ఆదరించింది. అందుకు కృతజ్ఞతలు నా దేశం నుండి నన్ను వేరుగా చూడలేను" అన్నాడు.

### సంఘటన - 2

విదేశీ పర్యాటకులు మన దేశానికి వచ్చారు. వాళ్ళ పాపికొండలు చూడడానికి బయలుదేరారు. ఆ సంవత్సరం గోదావరికి పుష్కరాలు అందరూ నది ఒడ్డున స్నానాలు చేసి నదిలో పసుపు, కుంకుమ, పూలు చల్లి దండం పెట్టి పూజలు చేస్తున్నారు. వీళ్ళూ వాళ్ళతో కలిసి పూజలు చేశారు. కొంతదూరం వెళ్ళాక ఒక గిరిజన గ్రామంలో దిగారు. అక్కడ గిరిజనులు ఒక పెద్ద పాము పుట్టకు పూజ చేస్తున్నారు. పాము తినడం కోసం పాలు, గుడ్లు తీసుకొచ్చి భక్తిశ్రద్ధలతో పూజ చేస్తున్నారు. ఇంకొక చోట చెట్టుకు పూజ చేయడం చూశారు. ఇలా ప్రకృతిని గౌరవించి పూజించడం, చెట్లను దేవతాభావంతో చూడడం వారిని ఆశ్చర్యపరిచింది.

### సంఘటన - 3

ప్రతాప్‌కు తమిళనాడు రాష్ట్రంలోని మధురైలో ఉద్యోగం వచ్చింది. ప్రతాప్‌కు తమిళ భాష రాదు. అందరూ కొత్తవారు. ముందు ఆఫీసులో ఒకతను ఫ్రెండు అయ్యాడు! అతను తమిళవాడే. అతను 'మా ఇంటికి రండి' అని ప్రతాప్‌ను ఇంటికి తీసుకెళ్ళాడు. ప్రతాప్ ఇంట్లోకి వెళ్ళగానే వాళ్ళ నాన్న, అమ్మ, భార్య పలకరించిన తీరు, అన్నం పెట్టి ఆదరించిన తీరు చూసే సరికి ఆనందంతో కళ్ళల్లో నీళ్ళు తెరిగాయి. వాళ్ళు ఎవరో అంతకుముందు పరిచయం లేదు అలా తనని మంచిగా చూసుకోవడం ఆప్యాయంగా మాట్లాడడంతో ప్రతాప్ ఆనందానికి అవధులు లేకుండా పోయింది.

### సంఘటన - 4

రామయ్య వాళ్ళది పెద్ద కుటుంబం. రామయ్య అమ్మ, నాన్న, తాతయ్యతో బాటు మామయ్య, తమ్ముడూ, మరదలు, అన్న, వదిన, వాళ్ళ పిల్లలు ఇలా మొత్తం ఇంట్లో 24 మంది ఉన్నారు. ఆ ఇంట్లోకి వెళితే చాలు ఇల్లంతా మనుషులతో కళకళలాడుతూ పండుగ వాతావరణం కనిపిస్తుంది. ఇంట్లో అంతమంది ఉన్నా ఎవరికీ ఏమి కష్టం ఉండదు. ఎవరి బాధ్యతలు వాళ్ళు నిర్వహిస్తారు. అందరికన్నా వయసులో పెద్దవాడైన రామయ్య వాళ్ళ తాత సాంబయ్య మాట అంటే తిరుగేలేదు. చాలా గౌరవం. ఆయన కొన్ని కట్టుబాట్లు పెట్టాడు. అందరూ కలిసి భోజనం చేయడం అందులో ఒకటి. పిల్లలు, పెద్దలు, ముసలివాళ్ళతో ఉన్న రామయ్య ఇల్లు ఆ ఊరికే ఆదర్శం.

## ఇది మన సంస్కృతి

- మాతృదేవోభవ
  పితృదేవోభవ
  ఆచార్య దేవోభవ
  అతిథి దేవోభవ
  అంటూ తల్లి, తండ్రి, గురువు, అతిథులను దైవసమానులుగా భావిస్తాం.
- పంచభూతాలైన గాలి, నీరు, నేల, ఆకాశం, అగ్నిలను పవిత్రంగా భావించి పూజిస్తాం.
- కుటుంబంలోని వారినందరినీ గౌరవిస్తాం, వినయంతో ఉంటాం. కలిసిమెలిసి జీవిస్తాం.
- స్త్రీలను గౌరవిస్తాం.
- వివాహ బంధాన్ని గౌరవిస్తాం.
- ఇతర జీవరాశులను, చెట్లను దేవతామూర్తులుగా భావించి పూజిస్తాం. సముచిత స్థానాన్ని ఇస్తాం.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. ఎంతో డబ్బు ఇస్తామన్న బిస్మిల్లాఖాన్ భారత్‌ను వదిలి వెళ్ళడానికి ఇష్టపడలేదు కదా! దీనిపై మీ అభిప్రాయం చెప్పండి.
2. విదేశీపర్యాటకులు మన వాళ్ళు ప్రకృతిని పూజించడం చూసి ఆశ్చర్యపోయారు కదా! అసలు ప్రకృతిని మనం ఎందుకు పూజిస్తాం.
3. కొత్త ప్రాంతానికి వెళ్ళిన ప్రతాప్‌ను అక్కడివాళ్ళు ఎలా ఆదరించారు. అలా ఆదరించడం వల్ల ఏం జరిగింది. ఆదరించకపోతే ఏమై ఉండేది.
4. రామయ్య వాళ్ళ కుటుంబం మన దేశంలో చాలా రాష్ట్రాలలో ఉన్నారు. అలా అందరం ఒకే కుటుంబంగా ఉమ్మడిగా బతకడం ఎలా ఉంటుంది?
5. ఏ దేశానికి లేని ప్రత్యేకతలు భారతదేశానికి ఉన్నాయి. మనం వేసుకునే దుస్తులు, తినే ఆహారం, జరుపుకునే పండుగలు ఇలా రకరకాల వైవిధ్యం. ఇలాంటివి మీరు మరికొన్ని చెప్పండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- మన దేశ సంస్కృతిని ప్రతిబింబించే అంశాలను దృష్టిలో పెట్టుకొని దాన్ని కాపాడుకోవడానికి మీరైతే ఏం చేస్తారు?

## తెలుసుకుందాం

ఒక ప్రాంతంలో నివసించే ప్రజలు ఎలాంటి ఆచార వ్యవహారాలు, అలవాట్లు, విశ్వాసాలు, నియమాలు, రీతి, నీతి సంప్రదాయాలతో జీవిస్తున్నారో తెలిపేదే సంస్కృతి.

ఏదేశంలోనైనా, ఏ ప్రాంతలలోనైనా సంస్కృతీ సంప్రదాయాలు అనేవి ఆ ప్రాంత ప్రజల అనుకూలతలకు, ఆరోగ్యానికి, ఆనందానికి, స్వేచ్ఛకు, భద్రతను కల్పిస్తూ తరతరాలకు వారసత్వంగా అందజేస్తూ ఉంటాయి. అంటే అనాది నుండి ఆలోచనలు ఒకరినుండి ఒకరికి సంక్రమిస్తూ, కాపాడబడుతూ కొనసాగుతూ ఉంటాయి. ప్రకృతి ననుసరించి సహజమైన జీవన విధానమే సంస్కృతి.

భారతదేశ సంస్కృతిలోని గొప్ప విషయం ప్రకృతిలో అంతర్భాగమైన మానవులు ప్రకృతి వల్లనే బతుకుతున్నారు కాబట్టి ఆ ప్రకృతిని తల్లిగా భావించి కృతజ్ఞతలు తెలియజేసుకోవడం మన సంస్కృతి. భారతదేశ సంస్కృతి జీవిస్తూ, జీవించనిచ్చేది. సృష్టిలో సకల చరాచర, జీవకోటి సుఖశాంతులతో వర్ధిల్లాలన్నది భారతదేశ సంస్కృతి లక్ష్యం. అందుకే భారతీయులు అనాదిగా వ్యవసాయం చేస్తూ ఆహారాన్ని పండించి, తాము తింటూ, సాటి మానవులకు, సాటి జీవులకు, పశుపక్ష్యాదులకు, క్రిమికీటకాలకూ ఆహారాన్ని పంచిపెట్టే సంస్కృతి గలవారు.

దీనికి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింస, సహనం, సౌభ్రాతృత్వం, సమానత్వం, త్యాగం విశ్వ శ్రేయస్సు వంటి విలువలు ప్రజలు కలిగి ఉండడమే పునాది. ఇందులో స్వార్థానికీ, హింసకు, దోపిడీకి, దురాక్రమణకు తావు ఉండకూడదు.

సమాజశ్రేయస్సే దేశఔన్నత్యమే ధ్యేయంగా మన సంస్కృతి నుండి మనం గ్రహించుకున్న విలువలు ఎన్నో. వివిధ సంస్కృతులకు నిలయమైన మన దేశంలో వేదాలు, ఉపనిషత్తులు, పురాణాలు, సాహిత్యం, ఆధ్యాత్మిక చింతన పెంచుతూనే సమాజంలో ఏవి మంచి, ఏవీ చెడు విచక్షణను తెలుసుకొని మంచి నడవడి కల్గిన వ్యక్తులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేసింది. మన భారత సంస్కృతి మనకే పరిమితం కాలేదు ప్రపంచంలోని

అన్ని దేశాల వారి దృష్టిని ఆకర్షించింది. మన సాహిత్యాన్ని వారి భాషలోకి అనువదించుకొని మన సంస్కృతిని అనుసరించేలా చేసింది.

మన పండుగలు, మన కళలు, మన వివిధ వృత్తులు, వృత్తి నైపుణ్యాలు, మనం పాటించే కుటుంబ విలువలు, మన మానవ సంబంధాలు వారసత్వ గుణగణాలు ప్రపంచానికీ ఆదర్శమైనాయి.

సమాజం శాంతి సౌఖ్యాలతో ఉండాలన్నా సంస్కృతిని కాపాడుకుంటూ సామాజిక స్పృహతో జీవించడం అవసరం. భిన్న సంస్కృతులకు నిలయమైన మనదేశంలో కట్టుబాట్లు, ఆచారాలు వ్యక్తుల ప్రవర్తనలను నియంత్రించేవే కాకుండా వ్యక్తుల మధ్య సంబంధాలను పటిష్టపరుస్తాయి. అందుకే వివిధ సంప్రదాయాలు ఆచారాలు మనిషి జీవితంలో ప్రధానమైన పాత్ర పోషిస్తున్నాయి. ఈ కట్టుబాట్లు, విధి విధానాలు, సామాజిక, నైతిక, ధార్మిక విలువలే అసలైన జీవన విధానం ఇవి లేకపోతే మనం సమాజంలో బతకడం కష్టమౌతుంది. సంస్కృతిలో భాగమైన వివాహ నియమాలు, కుటుంబ నియమాలు, సామాజిక నియమాలు, వ్యక్తి నియమాలు పాటించకపోతే సమాజంలో అశాంతి, అల్లకల్లోలం చెలరేగుతుంది. సంస్కృతిని కాపాడుకోవడం, నిలబెట్టుకోవడం వల్ల మనుషుల జీవితాలలో గందర గోళం తొలగి సంతోషం, ఉత్సాహాన్ని కలిగించి గౌరవప్రదమైన రీతిలో సంబంధాలు పటిష్టమౌతాయి.

ఒకరి సంస్కృతిని మరొకరు గౌరవించడం, కలిసిమెలసి సోదరభావంతో మెలగడం, ఇతర మతాలను గౌరవించడం వారి పండుగలలో పాల్గొనడం, సహకరించుకోవడం, అందరూ ఒకే జాతిగా మెలగడం, దేశభక్తిని చాటడంలో, జాతీయ భావనను చూపడంలో కలిసికట్టుగా సాగడం మన భారతదేశ సంస్కృతికి అద్దం పట్టే అంశాలు.

**సూక్తి**

**మేరు పర్వతమంత మేధాశక్తికన్నా కాస్తంత సహనశక్తి మిన్న**

# 17 అన్ని మతాలను గౌరవించడం

**I. ప్రధాన విలువ**

*లౌకికతత్వం - మత సామరస్యం*

**II. ఉప విలువ**

*అన్ని మతాలను గౌరవించడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- అన్ని మతాల పట్ల గౌరవభావం కలిగి ఉండడం.

## IV. ఉపోద్ఘాతం

మతం ఒక జీవన విధానం. మానవ జీవితాన్ని ఉన్నతమైనదిగా నిలబెట్టడానికి మతాలు ఏర్పడ్డాయి. ఏ మతమైనా మనిషికి నైతికతను, సామాజిక సంబంధాలను, మానవత్వాన్ని పెంచే బోధలను, మంచి పనులను, మంచి నడవడిని బోధిస్తాయి. వేరొక మతంపైన ద్వేషం నేర్పవు. ఎవరికైనా మతాభిమానం ఉండడం సహజమే. కాని అది మతదురభిమానంగా మారి మతోన్మాదానికి దారి తీయకూడదు. ఏమతంలోనైనా మౌలికంగా ఉన్నది మానవత్వమే. అత్యున్నత మానవత్వమే దైవత్వం. అందుకే అన్ని మతాలను గౌరవించాలి.

## V. విషయం

### సంఘటన

రామనాథశాస్త్రి, డా॥ అబ్దుల్ కలాం ఇద్దరూ మంచి మిత్రులు స్కూల్లో ఇద్దరూ ఒకే బెంచీలో ప్రక్కప్రక్కనే కూర్చునేవారు. అవి వారు 5వ తరగతి చదువుచున్న రోజులు. ఒకరోజు వారి క్లాసుకు కొత్త మాస్టారు వచ్చారు. వీరిద్దరిని చూసారు. రామనాథశాస్త్రి సనాతన హిందూమతంలోని బ్రాహ్మణకుటుంబానికి చెందినవాడు. డా॥ కలాం సంప్రదాయ ముస్లిం కుటుంబంలోనివాడు. వీరిద్దరూ అలా కలిసి పక్కనే కూర్చోవడం

నచ్చని ఆ కొత్తమాస్టారు డా॥ కలాంను వెనుక బెంచీలో కూర్చోమన్నారు. డా॥ కలాం గారు అలాగే వెళ్ళి కూర్చున్నాడు. దానితో రామనాథశాస్త్రి ఏడ్చాడు. ఇంటికి వెళ్ళి తండ్రి లక్ష్మణ శాస్త్రికి జరిగిదంతా చెప్పాడు. లక్ష్మణశాస్త్రి కోపంతో ఆ ఉపాధ్యాయుడిని ఇంటికి పిలిచి నీవు అమాయకపు పిల్లల మనసులో మత ద్వేషం నేర్పుతున్నావా? నీ ప్రవర్తన బాగాలేదు. జరిగిన దానికి క్షమాపణ చెప్పమని డా॥ కలాం, రామనాథశాస్త్రి ఎదుటే చెప్పాడు. ఆ ఉపాధ్యాయుడు లక్ష్మణశాస్త్రిలో ఉన్న మానవతా విలువలు అర్థంచేసుకొని తన తప్పును ఒప్పుకొని లక్ష్మణశాస్త్రి మార్గంలోనే నడిచాడు.

## లౌకికతత్వం

భారతదేశం మతప్రమేయం లేని రాజ్యం. ఏ ఒక్క మతానికి చెందినది కాదు. మన దేశంలో అన్ని మతాలు సమానంగా ఆదరించబడ్డాయి. వివక్షత అనేది ఉండదు. మతాలకు అతీతంగా ప్రతి మనిషికి, కుటుంబానికి మంచి జరగాలన్నది లౌకికతత్వ భావన. ప్రజలంతా సామరస్యంతో ఉంటూ ఒకరి మతంలో ఇంకొకరు జోక్యం చేసుకోకుండా గౌరవంగా ఉండాలన్నదే లౌకికతత్వ ఆశయం. మతాలకు, కులాలకు అతీతంగా పౌరులంతా కలిసి శాంతితో కలిసి బతకాలని రాజ్యాంగం యొక్క ఆశయం. అన్ని మతాల వారికి సమానంగా గౌరవం, సమాన అవకాశాలు మన రాజ్యాంగం ద్వారా కల్పించబడ్డాయి.

### లౌకిక రాజ్యంలో పౌరుని బాధ్యతలు

- పౌరులు, ప్రార్థన సమావేశాలలో, దేవాలయలలో, రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వగూడదు.
- మతానికి సంబంధించిన విషయాలలో రాజకీయ వ్యక్తులు జోక్యం చేసుకోకూడదు.
- మతాలకు, కులాలకు అతీతంగా ప్రతి పౌరుడు కనీస పౌరహక్కులు అనగా సమన్యాయం, స్వేచ్ఛ, సమానత్వం కలిగిఉండడానికి, పొందడానికి కృషి చేయాలి.

## VI. (అ) ఆలోచించండి - ప్రతిస్పందించండి

1. లక్ష్మణశాస్త్రి ప్రవర్తించిన తీరు సరైనదేనా? ఎందుకు చెప్పండి.
2. అన్ని మతాలను గౌరవించడం అంటే ఏమిటో వివరించండి. ఎందుకు గౌరవించాలో చెప్పండి.
3. మతవిద్వేషాలు ఎందుకు కలుగుతున్నాయో చెప్పండి.
4. అన్ని మతాల పట్ల నీవు ఎలా గౌరవభావాన్ని ప్రదర్శిస్తావో తెల్పుము.
5. “మానవత విలువలు కలిగినదే మతం” దీనిని సమర్థిస్తూ మాట్లాడండి.

## (ఆ) ఆచరించండి - అనుభవాలను చెప్పండి

- "అన్ని మతాల వారిని నీతో సమానంగా చూడు అప్పుడు నీకు కల్గిన అనుభూతి ఏమిటో చెప్పండి.
- వివిధ మతాలకు చెందిన మంచి సూక్తులను సేకరించండి. వాటిని ఆచరించండి. అప్పుడు మీకు ఎలా అనిపించెందో చెప్పండి.

### తెలుసుకుందాం

శ్లో॥ "ఆహారనిద్రాభయమైధునాని
సామన్యమేతత్పశుభిర్నరాణాం
జ్ఞానమ్ నరేణామధికోవిశేషో
జ్ఞానేనహీనః పశుభిస్సమానః"

– ఉత్తర గీత.

ఈ సృష్టిలో గల సకల జీవరాసులలో మానవ జీవితము అత్యుత్తమము సర్వ శ్రేష్ఠమనియు ఆహార నిద్రాభయ సంతానాది ప్రక్రియలు మానవులకు పశు పక్ష్యాదులకు సమానమేయనియు కేవలము జ్ఞానము ఒక్క మానవులకు ఉన్నదనియు పై శ్లోకము ద్వారా స్పష్టమగుచున్నది. జ్ఞానమనగా విజ్ఞత వివేకములతో కూడియుండిన సద్బుద్ధి సహిత సదాచారము అని చెప్పబడుతూంది. అంతటి మహోన్నతమైన మానవజీవితము నిరుపయోగము కారాదు. జన్మ చరితార్థము చేసుకోవాల్సిన క్రియ ప్రతివారియందున్నది.

మతాన్ని మనిషి తయారు చేసాడు. మనిషిని దైవం తయారుచేసాడు మనిషి ఉత్తమ మనుగడకు మానవత్వం ముఖ్యంకాని మతం కాదు. మతం మనిషిని ఉన్నతునిగా తీర్చిదిద్దేది. మానవతావిలువలను పెంచునట్టిది గాని త్రుంచునట్టిది కాదు. మంచిని పెంచునది చెడును దూరంగా ఉంచేది మతం. మనిషి ఏ మతము (ధర్మము) నైననూ స్వీకరించి ఆచరించవచ్చును కాని అది వేరొకరి మతము లేక ధర్మమునకు ఆటంకముకారాదు.

మత సహనము సర్వులకు సర్వదాశ్రేయోదాయకము. మతం పేరుతో కలహించడం, విధ్వంసకార్యములు చేయడం వంటివి జాతికి అవమానకరమైనవి. మన స్థాయిని అంతస్థుని దిగజారుస్తాయి. కావున ప్రతివారును మత సహనాన్ని కలిగిఉండాలి.

"సత్యం, అహింస, శాంతి, ధర్మం మున్నగు సద్గుణాలు మానవుని మహనీయునిగా మారుస్తాయన్న" – బుద్ధుని సందేశం సర్వులకు శిరోధార్యమైయున్నది.

"నేను మందిరంలో లేను, మసీదులో లేను, కాశీలో లేను, నీవు నిజమైన భక్తుడవైతే నిమిషంలో నీముందుంటాను". అన్న కబీరువాణి స్మరణీయమైనది.

ఈశ్వరుడొక్కడే యనియు అతనిని ఏ పేరుతో పిల్చినా పిలవవచ్చునియు మానవులంతా అతని సంతానమనియు, హెచ్చు తక్కువ భావాలుండరాదనియు, సమానత్వము, సర్వ భూతసమాదరణము వాంఛితములని, గురునానక్ వాణి.

వేరు వేరు స్థానములలో పుట్టిన నదులన్నియు చివరకు సాగరములో కలియునట్లు వేరు వేరుగ వ్యవహరింపబడు మతములు ధర్మములు ఆచరించు మానవులు చివరకు ఒకే పరమాత్మను చేరుకొందురు. ఏమతము శ్రేష్టముగాని, నీచముగాని కాదు. మానవజాతి ఒక్కటే" అని ప్రబోధించిన స్వామి వివేకానందుల వారి సందేశము జాతి కొసంగబడిన అమూల్య వరము.

"ద్వేషములవలన ద్వేషము పెరుగుతుంది. ప్రేమ ద్వారానే ద్వేషము దూరమౌతుంది. మనము ప్రాణులన్నిటిని సానుభూతితో చూడాలి, ప్రేమాదరణములను తోటి మానవులకు పంచాలి. శత్రువుని కూడ ప్రేమతో చూడవలెనని" – ఏసు ప్రభువు యొక్క సందేశము.

"సారే జహాసే అచ్చా, హిందూ సితాహమారా, హమారా! మజహబ్ నహీ సిఖాతా ఆపస్‌మే భైర్‌రఖనా!" అన్నమహ్మద్ ఇక్బాల్ గారి ప్రఖ్యాత దేశభక్తి గీతంలో ఏమతమూ మనలో మనకి వైరాన్ని కలిగించే విధంగా నేర్పలేదని కమనీయంగా మత సమాదరమును చూపారు. తద్వారా లోకానికి హితవును, మానవతా మతమును బోధించారు.

మనిషిని ఉన్నతునిగా మనీషిగా మార్చేది మతం కాదు. మానవత్వం ఒక్కటే. నిజముగా ఆధ్యాత్మిక చింతనాతత్పరత ద్వారా చిత్తేకాగ్రత కలిగిన సాధకునకు దేవుడిని అంతటా అన్ని వేళలా చూడగలిగిన శక్తి, సుహృద్భావము, సంయమనము ఏర్పడును.

సత్ సాంగత్యము, సదాచారము సద్గ్రంధపఠనము, సత్‌శీలము, సంయమనము, సాధుత్వము, సమత, మమత మానవత మున్నగు సద్గుణ సంపదలు అన్ని మతాలలో ఉన్నవే. ఆ భావనలు అర్థం చేసుకొంటే అన్ని మతాలను గౌరవ భావంతో చూడగలుగుతాము.

**సూక్తి**

**వేల అవరోధాలను అధిగమించినప్పుడే సౌశీల్య నిర్మాణం సాధ్యమౌతుంది.**

# 18 హక్కులను తెలుసుకోవడం

**I. ప్రధాన విలువ**

*ప్రజాస్వామ్య విలువల పట్ల గౌరవం*

**II. ఉప విలువ**

*హక్కులతో బాటు మన బాధ్యతలు తెలుసుకోవడం, పాటించడం*

**III. ఆశించిన ఫలితాలు/లక్ష్యాలు**

- ప్రజాస్వామ్యంలో ప్రశ్నించే హక్కు తెలుసుకొనే హక్కు, స్వేచ్ఛగా మాట్లాడేహక్కు, సమాన అవకాశాలు ఏవేవి మనకు ఉన్నాయో తెలుసుకోవడంతోబాటు మన బాధ్యతలు కూడా తెలుసుకున్నప్పుడే సమాజ అభివృద్ధికి తోడ్పడిన వాళ్ళమౌతామని తెలియచేయడం.

## IV. ఉపోద్ఘాతం

మన దేశం ప్రజాస్వామ్యదేశం. ఈ దేశంలో ప్రజలకు రాజ్యాంగం కొన్ని హక్కులను ఇచ్చింది. స్వేచ్ఛగా బతకడానికి, అవసరాలు తీర్చుకోవడానికి, సమస్యలను పరిష్కరించుకోవడానికి ఈ హక్కులు ఉపయోగపడతాయి. వీటికి చట్టభద్రతకూడా ఉంటుంది. మరి ఈ హక్కులను పొందినప్పుడు మన వంతు ఏ బాధ్యతలను మనం నిర్వర్తించాలి? తద్వారా సమాజ శ్రేయస్సుకు మనవంతు కృషి ఎలా చేయాలి? అనేది మనకు మనం వేసుకోవాల్సిన ప్రశ్న, ఆలోచించాల్సిన విషయం.

## V. విషయం

### "ఇలా చేయవచ్చు"

ఇది ఒక ప్రముఖ దినపత్రికలో వచ్చిన వార్త. సామన్యుడు తలచుకుంటే ఏమైనా చేయగలడు. పాలనా యంత్రాంగంలోని అలసత్వాన్ని తొలగించగలడు. ఎన్నో అద్భుతాలను సృష్టించగలడు; సమాజంలో ఎన్నో మార్పులను తీసుకురాగలడు.

సమాజంలో అనేక సమస్యలు చాలా మందిని ఆలోచింపజేస్తాయి. తమవంతుగా ఏదైనా చేస్తే బాగుంటుందన్న ఆలోచననూ కలిగిస్తాయి. అయితే ఊపిరి సలపని పనుల్లో పడి ఆ ఆలోచనను అంతటితో వదిలేస్తారు. ఎందుకుంటే సమస్య పరిష్కారానికి నాలుగుచోట్లా తిరగాలి. నలుగురినీ కలవాలి, తగినంత సమయం వెచ్చించాలి. దాంతో మనకెందుకొచ్చిందీ గొడవ అనుకుని ఆ విషయం అంతటితో మర్చిపోతారు. కాని ఎక్కడికి తిరగనవసరం లేకుండా అందుబాటులో ఉన్న కంప్యూటర్‌లోనే క్లిక్ చేయడం ద్వారా మార్పునకు మీరూ కారణం కావచ్చంటే అంతకన్నా కావల్సింది ఏముంటుంది? అనిఅంటారు. అదే ఈ - పిటిషన్ (e-petition) దీని ద్వారా మార్పులో భాగస్వాములౌతున్న వారెందరో! కొన్ని సంఘటనలు వినండి.

### సంఘటన-1

మధ్యప్రదేశ్‌కు చెందిన 42 దళిత కుటుంబాల వారు కేవలం వారం రోజుల్లో ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా తమ కోటాను పొందగలిగారు. రెండేళ్ళుగా న్యాయం జరగని ఆ కుటుంబాలకు ఈ ఆన్‌లైన్ పిటిషన్ సౌకర్యం వల్ల వారం రోజుల్లోనే అనుకూల ఫలితాన్ని పొందగలిగారు.

### సంఘటన-2

రాజస్థాన్‌లోని కరౌలి జిల్లాలో ఉన్న అయిదు ఆస్‌బెస్టాస్ ఫ్యాక్టరీల వల్ల చుట్టుపక్కల ప్రజలు తీవ్రమైన కాలుష్యంతో బాధపడుతున్నారు. సామాజిక కార్యకర్త అనిత వీటిని మూసివేయాలని సంబంధిత అధికారులను కలుసుకొని విన్నవించారు. ఒకటికాదు రెండుకాదు కొన్ని నెలలు అధికారుల చుట్టూ కాళ్ళరిగేలా తిరిగారు. అయినా వాళ్ళ నుంచి ఎలాంటి స్పందనా రాలేదు. సమాచార హక్కు చట్టం ద్వారా ఫ్యాక్టరీల యజమానులు ఎలాంటి అనుమతులూ తీసుకోకుండానే వీటిని ప్రారంభించారని ఆమె తెలుసుకుంది. దాంతో ఆన్‌లైన్ ద్వారా పై అధికారులకు దాదాపు 4,000 మంది సంతకాలు చేసిన పిటిషన్లను పంపించారు. స్పందించిన అధికారులు వెంటనే చర్చలకు పిలిచారు. ఫలితము ప్రజలకు అనుకూలంగా వచ్చింది. తీవ్రకాలుష్యానికి కారణమౌతున్న ఫ్యాక్టరీలను మూసివేయాలని నిర్ణయం తీసుకున్నారు. కొన్ని నెలలుగా కానిపని కేవలం 45 రోజుల్లో పూర్తయ్యింది.

### సంఘటన-3

ముంబైకి వంద కిలోమీటర్ల దూరంలో ఉన్న వెన్‌గనిలో దాదాపు మూడు వందల అంధ కుటుంబాలు నివాసముంటున్నాయి. రోజువారి పనులు కోసం మీరంతా రోజూ ముంబైకి వెళ్ళివస్తుంటారు. రైల్వేట్రాక్స్

మీద బ్రిడ్జ్ లేకపోవడంతో అంధులు ఎన్నో అవస్థలు పడుతున్నారు. ఇటీవల జరిగిన ప్రమాదంలో ఓ అంధురాలు కాలును కోల్పోయింది. ఆమె దీనావస్థకు కదిలిపోయిన ఒక వీడియో వాలంటీర్ ఈ - పిటిషన్ వేశారు. స్పందించిన అయిదువేల మంది వెంటనే సంతకాలు చేశారు. దాంతో ఎలాంటి జాప్యం లేకుండా సెంట్రల్ రైల్వే నుంచి ట్రాక్‌పైన బ్రిడ్జ్ నిర్మాణానికి వెంటనే అనుమతి లభించింది.

ఈ - పిటిషన్ ఎలా చేయాలంటే...

ఇందుకోసం www.change.org అనే వెబ్‌సైట్‌లోకి వెళ్ళి పిటిషన్‌పైన సంతకం చేయాలి. అలా చేసిన వెంటనే సంబంధిత అధికారికి ఈ - మెయిల్ వెళుతుంది. ఒక పిటిషన్ పైన ఏడువేలమంది సంతకం చేసినట్లయితే ఏడువేల ఈమెయిళ్ళు అధికారికి చేరుతాయి. ప్రజలు మార్పుకోరుకొనే అంశమైతే నిరంతరంగా ఈమెయిళ్ళు చేరుతూనే ఉంటాయి. దాంతో అధికారులకు ఆ అంశంపైన ఇక జాప్యం చేయడానికి వీలుండదు. వెంటనే స్పందించి నిర్ణయం తీసుకోకతప్పని పరిస్థితి ఎదురౌతుంది.

### "చట్టాలు - సామాన్యుడికి చుట్టాలు"

ప్రజాస్వామ్యం దేశంలో సామాన్య ప్రజానీకానికి ఉపకరించే ఎన్నో చట్టాలు ప్రాణం పోసుకున్నాయి. వీటిలో ప్రజాజీవితంలో ప్రభావం చూపినవీ ప్రజాస్వామ్య వ్యవస్థపట్ల నమ్మకాన్ని పెంచినదీ చాలానే ఉన్నాయి. వాటిలో కొన్నింటిని చుద్దాం.

**1986 వినియోగదారు విజయం :**

వినియోగదారుల పరిరక్షణ చట్టం ద్వారా జాతీయ వినియోగదారుల వివాద పరిష్కార కమీషన్ ఏర్పాటైంది. జాతీయస్థాయిలో, రాష్ట్రస్థాయిలో, జిల్లాస్థాయిలో, తాలూకాస్థాయిలో ఇలా ప్రతి అంచెలో వినియోగదారుడు తనకు జరిగిన అన్యాయాల్ని, మోసాల్ని, ఉత్పత్తులూ సేవల్లోని లోపాల్నీ ధైర్యంగా ఫిర్యాదు చేసే అవకాశం కలిగింది. సామాన్యుడికి ప్రశ్నించడం నేర్పిన చట్టం ఇది.

**1989 పద్దెనిమిదేళ్ళకే ఓటు :**

స్వాతంత్ర్యం సాధించి నాలుగు దశాబ్దాలు దాటింది, అక్షరాస్యత పెరిగింది. ప్రజల్లో చైతన్యం అధికమైంది. యువతీ యువకులు వివేచనతో నిర్ణయాలు తీసుకోగల స్థాయికి ఎదిగారు. అరవై ఒకటో రాజ్యాంగ సవరణ ద్వారా ఓటుహక్కు వయస్సు 21 నుండి 18 కి తగ్గించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. ఓటుహక్కు ద్వారా ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడానికి, సమస్యలపై స్పందించడానికి అవకాశం లభించింది.

**1992 గ్రామ స్వరాజ్యం :**

73వ రాజ్యాంగ సవరణ ద్వారా... పంచాయితీ పాలనలో మహిళలకూ ప్రాతినిధ్యం లభించింది. మూడింట ఒకటోవంతు పదవులు వారికే పంచాయితీకి రాజ్యాంగ ప్రతిపత్తి వచ్చింది. మునుపటితో పోలిస్తే నిధుల కేటాయింపూ పెరిగింది. గ్రామస్వరాజ్యం అంటే ఇదేగా! దీనికి కొనసాగింపుగా పట్టణ ప్రాంతానికి సంబంధించి 74వ రాజ్యాంగ సవరణ చేశారు.

**2005 సమాచార హక్కు చట్టం :**

చిన్న దరఖాస్తు చాలు... పక్షవాతంతో చచ్చుబడిన ప్రభుత్వ ఫైళ్ళకు కదలిక వస్తుంది. తహసీల్దారు ఆఫీసు మొదలు రాష్ట్రపతి భవన్ దాకా... ఏ ప్రభుత్వ కార్యాలయానికీ మినహాయింపు లేదు. చచ్చినట్టు సమాచారాన్ని కక్కాల్సిందే. చిన్న అర్జీతో దర్జాగా నిలదీయవచ్చు.

**2006 హక్కులకు పెద్దదిక్కు మానవహక్కుల బిల్లు :**

ప్రతి మనిషికీ స్వేచ్ఛగా గౌరవంగా బతికే హక్కుంది. చివరికి, ప్రభుత్వమైనా దాన్ని హరించలేదు. కన్నకొడుకులనుంచి ఖాకీలదాకా ఎవరు ఆ హక్కును ఉల్లంఘించినా కన్నెర్రజేయాల్సిందే. మానవహక్కుల బిల్లు-2003 కొన్ని సవరణలతో చట్టంగా రూపొందింది. రాష్ట్రస్థాయిలోనూ మానవహక్కుల కమీషన్ వ్యవస్థ ప్రాణం పోసుకుంది. మానవహక్కుల ఉద్యమంలో ఇదో మలుపు.

**2010 చదువుకునే హక్కు :**

బడివయసు పిల్లలంతా బడిబాట పట్టాల్సిందే. ఆరునుంచి పద్నాలుగేళ్ళ పిల్లలకు ఉచిత నిర్బంధ విద్యను అమలుచేస్తూ ప్రభుత్వం చట్టాన్ని చేసింది. చిన్నారుల జీవితాలను మార్చగల నిర్ణయం ఇది.

**2013 అత్యాచార నిరోధక చట్టం :**

నిర్భయ పాశవిక అత్యాచారం పాలకుల్లో కదలిక తీసుకొచ్చింది. ఇలాంటి దురదృష్టకర సంఘటనల్లో బాధితురాలు మరణించినా, అచేతనురాలైనా నేరస్థులకు మరణశిక్ష విధిస్తూ కేంద్రప్రభుత్వం ఆర్డినెన్స్ జారీచేసింది. మహిళలపై జరిగే అన్నిరకాల దాడులూ ఈ పరిధిలోకి వస్తాయి.

## VI. ఆలోచించండి - ప్రతిస్పందించండి

**(అ) కింది ప్రశ్నలకు ఆలోచించి సొంతమాటల్లో సమాధానాలు రాయండి.**

1. సమాజంలోని సమస్యలను పరిష్కరించడానికి మనం ఏమేమి చేయవచ్చు?
2. నాకెందుకని అనిత అనుకొని ఉంటే కాలుష్య ఫ్యాక్టరీ మూతపడేదా? దీని గురించి మీ అభిప్రాయం రాయండి.
3. సమస్య మనది కానప్పుడు ఇతరుల సమస్యను కూడా తనదిగా భావించిన వీడియో వాలంటీర్ గురించి చదివినప్పుడు మీకెలా అనిపించింది.
4. పాఠంలో చదివినటువంటి సమస్యలే కాకుండా మీ చుట్టూ ఎన్నో సమస్యలను చూస్తుంటారు. దినపత్రికలలో చదువుతుంటారు వాటిపట్ల మీ స్పందన ఏంటి?
5. మనకేమేమి హక్కులున్నాయో మీకు తెలుసా? సమాజ శ్రేయస్సుకోసం మనం నిర్వర్తించాల్సిన బాధ్యతల గురించి మీ అభిప్రాయాలు చెప్పండి, రాయండి.

**(ఆ) ప్రశ్నించండి :**

మీరు గుర్తించిన ఒక సమస్యను రాయండి. బాధ్యతగల పౌరునిగా ఆ సమస్యపట్ల ఎవరిని ఎలా ప్రశ్నిస్తారో ప్రశ్నలు రూపొందించండి.

**(ఇ) కింది అంశాలను చదవండి. మీరు చేసేవాటికి '✓' పెట్టండి. చేయని వాటికి '×' పెట్టండి.**

1. నా చుట్టూ ఏం జరుగుతుంది? ఏ సమస్యలున్నాయో గమనిస్తాను. ( )
2. ఇతరులకు కష్టాలొచ్చినప్పుడు నేనేం చేయగలనో ఆలోచిస్తాను. ( )
3. నా ఒక్కనివల్ల ఏమౌతుంది అనుకుంటాను. ( )
4. నా హక్కులను తెలుసుకొని బాధ్యతగా వ్యవహరిస్తాను. ( )
5. ఎవరి కష్టం గురించి వాళ్ళే ఆలోచించుకోవాలి, నాకనవసరం అనుకుంటాను. ( )
6. సమాచారాన్ని తెలుసుకోవడానికి ప్రశ్నిస్తాను. ( )
7. పని సాధించేవరకూ నా ప్రయత్నం ఆపను. ( )
8. హక్కుల గురించి నాకు తెలిసిన విషయాలను తోటివారికి చెప్తాను. ( )
9. సమాజంలోని సమస్యల గురించి ఇప్పుడుకాదు, పెద్దయ్యాక ఆలోచిస్తాను. ( )
10. మానవ హక్కులు పరిరక్షించడానికి నావంతు బాధ్యతను నిర్వర్తిస్తాను. ( )

**(ఈ) మీరు విన్న, మీకు తెలిసిన, మీ చుట్టూ చూసిన సమాజంలో ఎన్నోరకాల సమస్యల గురించి వింటూ ఉంటారు. ప్రజలకు ఇబ్బంది కల్గించేవి ఏవో, మీరు కోరే మార్పులు ఏంటో పట్టికలో రాయండి.**

| నేను గమనించిన సమస్యలు | నేను కోరే మార్పులు |
|---|---|
| 1. | |
| 2. | |
| 3. | |
| 4. | |
| 5. | |

**(ఉ) మీరు ఈ పాఠం ద్వారా ఏఏ విషయాలను గ్రహించారో దీని ద్వారా మీలో కలిగిన మార్పును మీ మాటలలో రాయండి.**

మానవ హక్కులు ఏవేవి ఉన్నాయో దానితోబాటు మీ బాధ్యతలేంటో ఒక పట్టిక తయారుచేయండి.

తెలుసుకుందాం

## 4–ఏ భాగము

## ప్రాథమిక కర్తవ్యాలు (Fundamental Duties)

[Part 4-A is inserted by 42nd Amdt. Act, 1976]

**ఆర్టికల్ 51–ఏ : ప్రాథమిక కర్తవ్యాలు :** ప్రతి పౌరునికి అది లక్షణాలు ఉండాలి.

(ఎ) రాజ్యాంగమునకు బద్ధుడై వుండుట, దాని ఆదర్శాలను, సంస్థలను, జాతీయ పతాకమును, జాతీయ గీతమును గౌరవించుట;

(బి) జాతీయ స్వాతంత్ర్యపోరాటమునకు స్ఫూర్తినిచ్చిన ఉన్నతాదర్శములను మనస్సుయందుంచుకొని వాటిని అనుసరించుట;

(సి) భారత సార్వభౌమత్వం (Sovereignity), ఐక్యత (unity), అఖండతను (integrity) సమర్థించుట; మరియు సంరక్షించుట (to uphold and protect).

(డి) దేశమును రక్షించుట మరియు కోరినపుడు జాతికి సేవచేయుట;

(ఇ) భారత ప్రజల మధ్య మత, భాష, ప్రాంతీయ, వర్గవైవిధ్యములను అధిగమించి, సామరస్యమును, సోదర భావమును పెంపొందించుట, స్త్రీల గౌరవం తగ్గించు ఆచారములను విడనాడుట;

(ఎఫ్) మన ఉమ్మడి సంస్కృతినీ, సుసంపన్న సంప్రదాయాలను గౌరవించి రక్షించుట;

(జి) అడవులు, సరస్సులు, నదులు, అడవి జంతువులతోసహా ప్రాకృతిక పరిసరాలను కాపాడి అభివృద్ధి చేయుట; మరియు సమస్త జీవుల యెడల కరుణార్ద్రత కలిగివుండుట;

(హెచ్)శాస్త్రీయ దృక్పథాన్ని, మానవతావాదాన్ని, జిజ్ఞాసను, సంస్కరణతత్వాన్ని పెంపొందించుకొనటం;

(ఐ) ప్రజల ఆస్తిని సంరక్షించుట, హింసను విడనాడుట;

(జె) ప్రయత్నాలు, సాధనల ఉన్నత స్థాయిలను నిరంతరం అందుకొనునట్లుగా వైయక్తిక, సమష్టికార్య రంగాలన్నింటిలో శ్రేష్ఠతకోసం, కృషిచేయుట ప్రాథమిక కర్తవ్యమై ఉండవలెను. [Inst. by the Const. (42nd Amendment) act, 1976 Sec. 11 w.e.f. 3-1-1977]

(కె) ఆరు నుండి పద్నాలుగు సంవత్సరముల వయస్సు కలిగిన బాలునికి లేదా బాలికకు తల్లి తండ్రి లేదా సంరక్షకునిగా ఉన్న వ్యక్తి తన బిడ్డ లేదా సందర్భానుసారము తన సంరక్షితునికి (dependent) విద్యార్జనకు అవకాశములు కల్పించవలెను.

[Inst. by the Const. (86th Amendment) Act, 2002]

## 51–ఎ ఆర్టికల్‌పై వ్యాఖ్యానము

1976 లో 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా "ప్రాథమిక విధులు" అను పేరుతో కొత్త అధ్యాయాన్ని భారత రాజ్యాంగంలోనికి ప్రవేశపెట్టడం జరిగింది. 51–ఏ అధ్యాయం, ప్రాథమిక విధులను పేర్కొంటున్నది. ఈ ప్రాథమిక విధులు కూడ, రాజ్య విధానానికి (State Policy) సంబంధించిన ఆదేశిక సూత్రాలు మాదిరిగానే, న్యాయస్థానాల ద్వారా అమలుపరచబడునవి కావు.

ఈ విధుల నిర్వర్తించినందున వర్తించబడు శిక్షలు, దండనలు గురించి, రాజ్యాంగం మౌనం వహించింది. ఈ విధులను ఉల్లంఘించుట శిక్షార్హమని పేర్కొను శాసనాలు ఉంటే తప్ప, ప్రాథమిక విధులను నిర్వర్తించకుండా ఉల్లంఘించిన వారిని దండించడానికి వీలులేదు.

ఉదాహరణకు భారత రాజ్యాంగములో "ప్రాథమిక విధులు" పేర్కొనిన ఫలితంగా "జాతీయ గౌరవాల"ను అగౌరవపరచుటను నివారించు చట్టం, 1971 "వన్యప్రాణి రక్షణచట్టం," 1972 "నీటి కాలుష్య (నివారణ, నియంత్రణ) చట్టం," 1974 వంటి కొన్ని సాధారణ శాసనాలు, చేయడం ద్వారా కొన్ని ప్రాథమిక విధుల అమలుకు శాసనిక ప్రతిపత్తిని కల్పించడం జరిగింది.

కొందరు రాజ్యాంగ నిపుణులు, ప్రాథమిక విధులు ఆచరణరీత్యా సాధ్యం కానట్టి "సైద్ధాంతిక నైతిక విలువలని" (moral homilites and platitudes) అవి విషయరీత్యా అస్పష్టమైనవని, వాటికి స్థిరమైన అర్థాన్ని ఇవ్వలేరని (They are so vague in their content, no solid meaning can be attached to them) అభివర్ణించారు. మామూలు వ్యక్తి నడవడి ఎలా ఉండాలో వాటినే ఆ విధులు ఉటంకిస్తున్నాయి. కాబట్టి వాటిలో ప్రత్యేకత అంటూ ఏమీ లేదన్నారు. దేశంలోని నాగరిక సమాజంలోని, ప్రతి పౌరుడు ఈ విధులను నిర్వర్తించడం తన బాధ్యతగా కలిగిఉన్నాడని అభిప్రాయపడ్డారు.

అయితే, అప్పటి భారత ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ 42వ రాజ్యాంగ సవరణ చట్టం ద్వారా వీటిని భారత రాజ్యాంగములో ప్రవేశపెట్టారు. రాజ్యాంగంలో వీటిని చేర్చడాన్ని సమర్థిస్తూ, హక్కులు సులువుచేయడం మాత్రమే కాకుండా, రాజ్యాంగ సమతుల్యతను సాధించడానికి (not to rights, but to establish a democratic balance) ఇవి కావాలని అన్నారు. ఆదేశిక సూత్రాలు, (రాజ్యాన్ని), ప్రభుత్వాన్ని ఉద్దేశించగా, ప్రాథమిక విధులు వ్యక్తిని ఉద్దేశిస్తున్నాయి. (Directive Principles were addressed to the State whereas Fundamental duties were addressed to the citizen. Both of them do not have any legal sanction for the enforcement). ఈ రెండింటి అమలుకు శాసనిక అధికారం లేదు. పౌరుడు ప్రాథమిక హక్కులను సాధించుకొంటూనే, రాజ్యాంగంలోని 51-ఏ ఆర్టికలులో నిర్దిష్టపరిచినట్లు దేశంపట్ల తనకు గల కొన్ని విధులు/కర్తవ్యాలను నిర్వర్తించవలసిన బాధ్యతలు కలిగివున్నాడని గమనించుకోవాలి.

ఈ విధులు, అమలుపరచదగినవి కానప్పటికీ, రాజ్యం (ప్రభుత్వం) ఈ విధులలో వేటినైనను నిర్వర్తించడాన్ని ఉల్లంఘించు ఏదేని కార్యం లేదా ప్రవర్తనను నిషేధించు శాసనం చేయవచ్చును. ప్రపంచంలోని అనేక దేశాలు, తమ రాజ్యాంగాల్లో ప్రాథమిక విధులను చేర్చాయి. జపాను, సోవియట్ యూనియను, చైనా, జర్మనీ, ఇటలీ, పోలాండు, హంగేరీ మొదలగునవి దీనికి ఉదాహరణలు.

**సూక్తి**

సంస్కారములేని ప్రవర్తన వాసన లేని పూవుతో సమానం.

# అనుబంధం

1. శ్లోకాలు
2. పద్యాలు
3. పాటలు, గేయాలు
4. కథలు
5. స్ఫూర్తిదాతలు

# శ్లోకాలు

1 శ్లో॥ **ధర్మేచార్థేచ కామేచ, మోక్షేచ భరతర్షభ ।**
**యదిహాస్తి తదన్యత్ర యన్నేహాస్తిన తత్క్వచిత్ ॥**

భావం : భరతశ్రేష్ఠుడా! ధర్మ, అర్థ, కామ, మోక్షములనే చతుర్విధ పురుషార్థములను బోధించే యిందులోని వచనములే సమస్త యితర గ్రంథములలోనూ ఉన్నవి. దీనిలో లేనివి మరి యెచ్చటను లేవు. కావున దీనిని తప్పక చదువుము.

2 శ్లో॥ **న శరీరమల త్యాగాత్, నరో భవతి నిర్మలః ।**
**మానసేతు మలే త్యక్తే తతో భవతి నిర్మలః ॥**

భావం : శారీరక మలినములను తొలగించుకొనుట వల్లనే మనుజుడు నిర్మలుడుగాడు. మనోమాలిన్యములు తొలగించు కొన్ననే అతడు నిజముగా నిర్మలుడు అగును.

3 శ్లో॥ **హితం మితం చ భుంజీత, న భుంజీతామితం హితమ్ ।**
**హిత మిష్టం చ భుంజీతే, త్యేష ధర్మ స్సనాతనః ॥**

భావం : హితమైన పదార్థాలనే తినాలి. అవైనా మితంగానే తినవలె. హితవైనవే ఐనా అమితంగా తినవద్దు. హితవైనవి ఇష్టంగా ఉన్నంత వరకే తినవలెను. ఇదే సనాతనమైన ధర్మము.

4 శ్లో॥ **ఈర్ష్యా భయక్రోధ పరిప్లుతేన, లుబ్ధేన రుగ్దైన్య నిపీడితేన ।**
**విద్వేషయుక్తేన చ సేవ్యమానం, అన్నం న సమ్యక్పరిపాకమేతి ॥**

భావం : ఈర్ష్య, భయము, కోపము, లోభము, రోగము, దైన్యము, ద్వేషము. ఇవి మనసులో భోజన సమయమున ఉంచుకొన్నచో తిన్నది సరిగా జీర్ణముగాక విషతుల్యమవుతుంది. నిర్మలమైన మనసుతో నిశ్చింతగా సంతోషముగా భోజనము చేయవలెను.

5 శ్లో॥ **ఏక ఏవ న భుంజీత, యదిచ్ఛేత్సిద్ధి మాత్మనః ।**
**ద్విత్రిభిర్బహుభి స్సార్థం, భోజనం తు దివానిశమ్ ॥**

భావం : ఆయురారోగ్య భాగ్యములను ఉపేక్షించువాడు తానొక్కడే భోజనము చేయక మరో యిద్దరు ముగ్గురినైన పంక్తిని భుజింప చేయుచుండవలెను. గృహస్థు యీ రీతిగ పగలు, రాత్రి కూడా చేయవలెను.

**6 శ్లో॥ తదేవ యుక్తం భైషజ్యం, యదారోగ్యాయ కల్పతే ।**
**స ఏవ భిషజాం శ్రేష్ఠో, రోగేభ్యోయః ప్రమోచయేత్ ॥**

**భావం :** ఏది ఆరోగ్యము నిచ్చునో అదే మంచి మందు. రోగము నుంచి విముక్తిని గావించిన వారే వైద్య శ్రేష్ఠులు.

**7 శ్లో॥ పండితైః సహ సాంగత్యం, పండితైః సహ సంకథా ।**
**పండితైః సహ మిత్రత్వం, కుర్వాణో నాఽవసీదతి ॥**

**భావం :** పండితులతో సాంగత్యం, వారితో సంభాషణము, స్నేహము చేయువారు. యెన్నటికిన్నీ చెఱపు నొందురు.

**8 శ్లో॥ హస్తస్య భూషణం దానం, సత్యం కంఠస్య భూషణమ్ ।**
**శ్రోత్రస్య భూషిణం శాస్త్రం భూషణైః కిం ప్రయోజనమ్ ॥**

**భావం :** దాన గుణమే చేతికి అలంకారం. సత్యము పలుకుటే కంఠాభరణము. శాస్త్ర చర్చలే వీనులకు నగలు. యివిగాక యితర నగలు బరువు చేటునకే గాని వేఱుగాదు.

**9 శ్లో॥ అన్నదానాత్పరం దానం, విద్యాదాన మతః పరం ।**
**అన్నేన క్షణికా తృప్తిః యావజ్జీవం చ విద్యయా ॥**

**భావం :** అన్నదానము ఉత్కృష్టమైనదే కాని దాని కంటెనూ విద్యా దానము గొప్పది. అన్నము వలన క్షున్ని వారణయై క్షణికమైన తృప్తి కలుగునే, కాని విద్య వలన అజ్ఞాన తమస్సు విడిపోయి. జీవితమంతయును సుఖశాంతులు లభిస్తాయి. కదా.

**10 శ్లో॥ క్లిశ్యన్న పి చ మేధావీ, శుద్ధం జీవన మాచరేత్ ।**
**తేనేహ శ్లాఘ్యతామేతి, లోకే భృశ్చన హీయతే ॥**

**భావం :** మేధావియైనవాడు ఎన్ని కష్టములు పడినను శుద్ధమైన నడవడిని, జీవనమును కలిగి యుండవలెను. దాని వల్లనే అతడు ప్రతిష్ఠనొందును.

# పద్యాలు

1. వాసనలేని పూవు బుధ వర్గములేని పురంబు, నిత్యవి
శ్వాసము లేని భార్య, గుణవంతుడు గాని కుమారుడున్, సద
భ్యాసము లేని విద్య పరిహాసము లేని ప్రసంగ వాక్యమున్
గ్రాసము లేని కొల్వు కొఱగానివి పెమ్మయ సింగధీమణీ !

– పెమ్మయ సింగరాజు

2. పండుతులైన వారు దిగువం దగనుండగ నల్పుడొక్కడు
ద్దండత పీఠమెక్కిన బుధ ప్రకరంబుల కేమియెగ్గగున్
కొండొక కోతి చెట్టు కొనకొమ్మల నుండగ క్రింద గండభే
రుండ మదేభ సింహ నికురుంబములుండవె చేరి భాస్కరా !

– మారద వెంకయ్య

3. ఒకచో నేలను బవ్వళించు, నొకచో నొప్పారు పూ సెజ్జపై,
నొకచో శాకము లారగించు, నొకచో నుత్కృష్ట శాల్యోదనం
బొకచో బొంత ధరించు నొక్కక యెడన్ యోగ్యాంబర శ్రేణి లె
క్కకు రానీయదు కార్యసాధకుడు దఃఖంబున్ సుఖంబున్ మదిన్

– ఏనుగు లక్ష్మణ కవి

4. చదువన్ నేర్తురు పూరుషుల్ వలెనె శాస్త్రంబుల్ పఠింపించుచో
అదుమున్ నేర్తురు శత్రుసేనల ధనుర్వ్యాపారముల్ నేర్పినన్.
ఉదితోత్సాహము తోడ నేలగల రీ యుర్విన్ ప్రతిష్ఠించుచో
ముదితల్ నేర్వగ రాని విద్యగలదే ముద్దార నేర్పించినన్

– చిలకమర్తి. లక్ష్మీనరసింహం.

5. మానవ జీవితంబు సుకుమారము స్వార్థ పరార్థ సౌఖ్య సం
ధానముతో మదిన్ దనుపు తత్పరమార్థము స్వార్థ వృత్తియం
దైనను కేవలైహిక సమావృతి రాజస, తామసాంక మా
మౌనులు, ముక్తికె నడచు మార్గము, స్వార్థమ సాత్త్వికంబగున్.

– గడియారం వెంకటశేష శాస్త్రి.

6. ఎవ్వారి రణగాథ లింత రచింప, స
త్కవుల కలాలు సార్థకత నందు;
ఎవ్వారి జయగాథ లించుకపాడ, గా
యకుల కంఠములు ధన్యత గడించు;
ఎవ్వారి రూపు లొక్కింత రూపింప, శి
ల్పుల కళాకృతి మహోజ్వలత గాంచు;
ఎవ్వారి పదధూళి రవ్వంత సోకిన
భూదేవి నిలువెల్లు పులకరించు.
నభము మార్మగు విజయ దుందుభులు వారు;
త్యాగ ధనులైన సత్యవర్తను వారు;
జాతి రత్నాలు వారు, శాశ్వతులు వారు
పావనులు వారు; ధన్యజీవులు వారు.

– కరుణ శ్రీ.

7. తల్లి గర్భము నుండి ధనముఁ దేఁ డెవ్వఁ డు
వెళ్ళి పోయెడినాడు వెంటరాదు.
లక్షాధికారైన లవణ మన్నమె కాని,
మెఱుఁగు బంగారంబు మ్రింగబోఁడు
విత్తమార్జన ఁజేసి విఱ్ఱ వీఁగుడె కాని,
కూడఁబెట్టిన సొమ్ము గుడువ బోఁడు
పొందుగా మఱుఁగైన భూమి లోపలఁ బెట్టి
దాన ధర్మము లేక దాఁచి దాఁచి
తుదకు దొంగల కిత్తురో? దొరల కవునొ ?
తేనె జుంటీగ లయ్యవా తెరువరులకు ?
భూషణ వికాస! శ్రీ ధర్మపుర నివాస
దుష్ట సంహార ! నరసింహ దురితదూర !

– శేషప్ప కవి.

8. ధరణిలో వెయ్యేండ్లు తనువు నిల్వఁగఁ బోదు,
ధనమెప్పటికి శాశ్వతంబుగాదు.
దార సుతాదులు తనవెంట రాలేరు,
భృత్యులు మృతిని ఁ దప్పించ లేరు.
బంధుజాలము తన్ను బ్రతికించు కొనలేరు,
బల పరాక్రమమేమి పనికి రాదు,
ఘనమైన సకల భాగ్యం బెంతఁగల్లియు
గోచి మాత్రం దైన ఁ గొంచుఁ బోఁదు.
వెఱ్ఱికుక్కల భ్రమలన్ని విడిచి నిన్ను
భజన ఁ జేసెడి వారికి బరమ సుఖము, భూ
షణ వికాస! శ్రీధర్మ పుర నివాస
దుష్ట సంహార ! నరసింహ ! దురిత దూర !

– శేషప్ప కవి.

9. ముసుగులు వేసుక మురిపించె మనసుల
పనులెన్ని చేసిన ఫలితమేమి?
మనసు కల్మషమైన మనయంతరంగాన
అను మానమును ద్వేష మంకురించు.
కక్ష్య కార్పణ్యము కలుగగ యితరుల
కోపమసూయలతో కుళ్ళబొడుచు
వేర్వేరు బ్రతుకున వెఱ్ఱెత్తు రుజలతో
నిలయమై పోతాయి కలియ బోసి
నిర్మలంబగు మనసుకు నిలకడుండు
నిలకడ గల మనస్సుకు నిగ్రహంబు
నిగ్రహమును కలిగిన వాడె నిండు మనిషి
నిత్య సత్యంబు లిదినేడు నిక్కమార్య.

– సమ్మెట గోపాలకృష్ణ

10. మనసు నదుపుపెట్టు మమకారమును వీడు
    మానవత్వమునకు మచ్చపడదు.
కష్టసుఖాలను కలిమిని లేమిని
    ఒకే విధములనియు, నోర్చుకొనుము
ఓటమ్మి వెరువక ఓర్మి ప్రదర్శించి
    అడుగు ముందుకు వేసి అనుసరించు
పురుషోత్తముండగు, పూజనీయుండగు
    స్థితప్రజ్ఞుడును వాడె క్షితినిలోన
గొప్ప యనిపించుకోవటం గొప్పకాదు
లోపలను దిద్దుకొనుటలోనె గొప్ప
గతముకంటె నుత్తమముగా బ్రతుకగొప్ప
నిత్య సత్యంబు లివినేడు నిక్కమార్య

– సమ్మెట గోపాలకృష్ణ

*దృఢసంకల్పం, పవిత్ర ఆశయం తప్పక సత్ఫలితాలను ఇస్తాయి.*
*వీటిని ఆయుధాలుగా గ్రహించినవారు అన్ని విఘ్నాలను ఎదుర్కొని*
*నిలువగలుగుతారు.*

*అసత్యమైన దానికి దూరంగా ఉండు.*
*సత్యాన్నే అంటిపెట్టుకొని ఉంటే విజయం సాధించగలం.*
*ఆలస్యమైనప్పటికీ విజయం సాధించే తీరుతాం.*

*– స్వామి వివేకానంద*

## పాటలు

### ఇల్లలుకుతూ అలుకుతూ

ఆంధ్రప్రదేశ్ అవతరణోత్సవ దినాన
అబద్ధం ఆడటానికి నోరు రాక
అంతా క్షేమంగా వున్నామని చెప్పలేక
అటూ ఇటూ వూగిసలాడుతూ
అల్లుకు వచ్చిన గీతం వినండి
నిజానికి కాలం మన మీద యింకా
కారాలు మిరియాలు నూరుతూనే వుంది
కఠినంగా కరిచింది కాలం మనల్ని
అందరి మనసుల్ని అడ్డఅడ్డంగా విరిచింది
ఐక్యతా లత అల్లుకున్న అందాల పూల పందిరి మీద
అంగుళానికి అరడజను వంతున
గొంగళీ పురుగులు ప్రాకుతున్నాయి.
వాటి పీడ పడలేక తోటంతా
పీకేద్దామంటున్నారు కొందరు!
చుక్కల లోకం లోకి ఎక్కాలని
వేసిన నిచ్చెన్లు విరగ్గొట్టారు కొందరు
కూచున్న కుర్చీ కుషన్లలో
గుండు సూదులు గ్రుచ్చి వెళ్ళారు కొందరు
వానదేవుణ్ణి రమ్మని టెలిగ్రాం పంపితే
వరద దేవుడొచ్చి కూర్చున్నాడు
పైర గాలిని రమ్మని కబురు చేస్తే
తుఫాను గాలులు తొంగి చూశాయి.
కూలిపోయిన నిరుపేదల గుడిశెలు
కాలిపోయిన గ్రామీణుల జీవితాలు
హృదయం దహించుకు పోయే
విషాద సంఘటనలు ఒక వైపు

కొండ అడ్డు తగిలి రెండుగా చీలుతానంటున్న ప్రవాహం
కక్షలూ కార్పణ్యాలు ముఠాలు ప్రాంతీయ తత్వాల ప్రభావం
మనసులు చెదిరి మనుషులందరూ చెదిరి
తొలగి దూరంగా పోతున్న దృశ్యాలు ఒక వైపు
ఏం చెప్పను నాదేశపు శోభ!
మనసులు మారడం లేదు
మాకేమిటి లాభమనీ
మాట మారడం లేదు
ఆంధ్రులెవరో అరవలెవరో అసలే తెలీదు నాకు
తెలుగు వారికి యీ మధ్య పుట్టిన తెగులేమిటో తెలీదు నాకు
అనైక్యత బీజాలు నాటిన వారికి నికరంగా వచ్చిన
ఆదా ఎంతో తెలీదు నాకు
చరిత్రను వెనక్కు మళ్ళింప జూస్తున్న వారి
చేతుల్లో ఎంత బలముందో తెలీదు నాకు
ఇల్లలుకుతూ అలుకుతూ ఈగ తన పేరు తాను మరిచిపోయినట్లు
ఇటీవల మన తెనుగువాండ్లు తమ ఊరూ పేరూ మరచిపోయి
ఊరేగారు వీధుల వెంట!
అవును ప్రజలు నిజంగా నిద్రపోతున్నారు
చైతన్యం చంద్రమండలానికి వలస పోయింది
మనిషి కత్తికి పదును పోయింది
చరిత్ర పొలంలో నాట దలచుకున్న
పైరుకు అదును పోయింది!
పామరుడు పొదలో పొంచి కూచున్నాడు
పాములా కాటేస్తాడు బహువరాకే!
తెల్లవారకుండా సూర్యుడికి మబ్బులు అడ్డు వస్తున్న
బడాబడా ఖామందులు బహుపరాకే!

# పురాతన భరత భూమి

నేను పుట్టిన నేల తల్లికి
నిండుగా కై దండ లిడుదుము
తల్లి గుండెల పరిమళములను
తమ్ము లందరి కందజేతును
భరతమాతను చెరువు చేసే
దుష్టులను దునుమాడి గెలుతును
దేశమాత సమగ్ర సౌష్ఠన
రూపమును కాపాడ నిలుతును
మానవతనీ మంట కలిపే
మత దురంతము నతికరింతును
వర్తమాన చరిత్ర తలపై
గత పిశాచిని తొలగ ద్రోతును
నేలతల్లి తనూజలందరు
అన్నతమ్ముల ఆత్మబంధము
పెనచి ఒకటై సంపదల సృజి
యించు మంచికి పోరెదన్
లేమి నలిగే పేదలను, ధన
బలము గల పీడకులు దోచని
సర్వ స్వతంత్ర సమాన ధర్మము
విలసిలగ పోరాడెదన్
శ్రామికుల హాలికుల నొక్కటి
చేసి, నూతన జన స్వామ్యము
ఈ పురాతన భరత భూమిని
సర్గ తుల్య మొనర్చెదన్

– అనంత్స సోమసుందర్

# ఉగ్రనేత్రం తెరిచి ఉరికింది తెలుగు

కడలి అంచులు దాటి కదిలించి తెలుగు
ఎదల లోతులు మీటి ఎగిసింది తెలుగు
ఇటు మలేషియ నుంచి అటు అమెరికా వరకు
నలుదిశల గొంతుకల పలికింది తెలుగు
పెనుయెడారులలోన ఇసుప దారులలోన
పలుకు పలుకున జీవమలికింది తెలుగు
ఎక్కడున్న ఎన్ని చిక్కులున్న సరే
తలఎత్తి నిలువుమని తెలిపింది తెలుగు.
ఏ భాష వెణుకైన ఏ మాన చినుకైన
తనలోన కలుపుకుని తరలింది తెలుగు
బరిగొొదిగి పోతన్న బరవళ్ళతో సాగి
హమ్మంటు వేమనగ ఉరిమింది తెలుగు
అభినయానికి హృదయ మర్పించుకొని కూచి
పూడియే నాడిగా ఆడింది తెలుగు
సంగీతమే జీవసంపుటీగ త్యాగయ్య
ప్రతిపదంలో కరిగి పాడింది తెలుగు
పల్లె పాటలలో ప్రబంధ నాటికలలో
కలికి బయ్యారాలు చిలికింది తెలుగు
స్వాతంత్ర్య సమరాన స్వచ్ఛందగతులీన
ఉగ్రనేత్రం తెరిచి ఉరికింది తెలుగు
శాంతికి కపోతమై క్రాంతి జలపాతమై
నిత్యవర్ధిష్ణువై నిలిచింది తెలుగు

– సి. నారాయణరెడ్డి

# నేలతల్లి - ఔన్నత్యం

ఎంత చల్లనిదమ్మ ఈ నేలతల్లి
ఎంత చక్కనిదమ్మ నను గన్నతల్లి - 2

పచ్చపచ్చని పట్టు చీరల్ని కట్టింది
పండుటాకుల వంటి రవికెల్ని తొడిగింది
కొండ కోనలనేమో కొప్పునా ముడిసింది
పొద్దు పొడుపూనేమో ముద్దాడబోతోంది ॥ఎంత॥

ఎండల్లో ఎండింది వానల్లో తడిసింది
ఎండ వానల్లోన ఎగిసిపడి నవ్వింది
సంద్రాలు మీటింది కొండంత ఎగిసింది
ఇసుక తెమ్మెరలపైన దోబూచులాడింది ॥ఎంత॥

వానజల్లుకి నీ ఒల్లు కదిలిందమ్మ
నల్ల మబ్బుల్లోన నెలలు పడ్డాయమ్మ
రుతువు రుతువుకు నీవు బాలింతవోయమ్మ
రతనాల పంటంట నీ కడుపు పంటమ్మ ॥ఎంత॥

గింజ గింజకు వెయ్యి గింజల్ని పొదిగావు
తాత ముత్తాతలకు తల్లి నీవైనావు
జన్మ జన్మకు నీవు జన్మనిచ్చినావు
చనిపోతె గుండెల్లో చితి పేర్చుకున్నావు ॥ఎంత॥

ఆకాశమే నీకు ఆపద్భందువంట
చుక్కలన్నీ నీకు అక్కాచెల్లెల్లంట
చందమామా నీకు చిన్నితమ్ముడంట
సూర్యుడేమో నీకు చుక్కాని అవునంట ॥ఎంత॥

# ఉరికే తల్లి గోదారి

**(కలిసి పాడుదాం గేయ సంపుటి, రచయిత : అమృతకూరి)**

గలగలమనుగానంతో ఉరికే తల్లి గోదారీ
జలజల మని సాగే నీ పరుగులెచటికో తెలపాలి

1. తళ తళ మను తరగల నాట్యాలతో
తేలియాడు తెలినురగల సొగసుతో
కొండా కోసం నడుమ ఒయ్యారాలే పోతూ
భూమాత గుండెలు తడిపే - పచ్చ పచ్చని సిరులే ఇస్తూ
ఉరికే తల్లి గోదారీ - నీ పరుగులెచటికో తెలపాలీ ॥ఎంత॥

2. పాపికొండలే - నీ పరుగులాపలేక
పాయలై దారి ఇచ్చే పాదరసపు తునకా
పాలపిట్టలే సఖులై పాడుతూ రాగా
పరవళ్ళతో ఉరవళ్ళతో ప్రాణసఖుని చేరా
ఉరికే తల్లి గోదారీ - నీ పరుగు లెచటికో తెలపాలీ ॥ఎంత॥

*అఖండమైన ఉత్సాహం, అపరిమితమైన ధైర్యం, అప్రతిహతమైన శక్తి...*
*అన్నింటినీ మించి పరిపూర్ణ విధేయత - ఈ లక్షణాలే ఒక వ్యక్తినిగాని,*
*ఒక దేశాన్నిగాని పునరుజ్జీవింప చేయగలవు.*

*- స్వామి వివేకానంద*

# చదవాలీ - బంగారు తల్లీ బాగుగా

(కలిసి పాడుదాం గేయ సంపుటి, రచయిత : అమృతకూరి)

చదవాలీ - చదవాలీ - బంగారు తల్లీ బాగుగా
చదివీ సరిదిద్దాలీ - తన ఇంటినంతా స్వర్గంగా ॥చదవాలీ॥

1. ఎంత చదువు చదివినా - ఏమున్నది ఘనతా
కుండ కడిగి వండకుండ - జరుగునా వనితా
అని గేలి చేయువారలెల్ల నోళ్ళు వెళ్ళబెట్టగా
ఆడపిల్ల చదవాలీ చదువులమ్మ సాక్షీగా ॥చదవాలీ॥

2. లాలియంటూ ఊయలూపు రతనాల చేతులే
ఏలగలవు రాజ్యాలే - ఎక్కువగా చదివితే
ఉద్యమించి ఉరికితే - ఊపగలవు లోకాలే
పిడికిలి బిగియించితే - చేరగలవు లక్ష్యాలే ॥చదవాలీ॥

3. మల్లెపువ్వు పాదుకంతా - సువాసనలను చల్లినట్లు
చిన్ని దివ్వె ఇంటి కంత - చిరువెలుగులు చిమ్మినట్లు
అమ్మాయి చదివి అమ్మాయితే - ఆ అమ్మ చదువు వెలుగయితే
ఆ వెలుగులోని నడుచు ఇల్లు నందన వనమేగదా? ॥చదవాలీ॥

*శీల సంపదను వృద్ధిచేసి, మనోబలాన్ని పెంపొందించి బుద్ధిని వికసింపజేసి, స్వశక్తిలో విశ్వాసాన్ని పెంచే విద్యే మనకు కావలసింది.*

# భావి పౌరులు

భారతదేశపు భావిపౌరులం భవితవ్యానికి భాగస్వాములం
బాధ్యతనెరిగి బ్రతికేవాళ్ళం భావితరానికి పునాదిరాళ్ళం - 1
కార్మిక కర్షక శ్రామికజీవులు మనదేశానికి వెన్ను పూసలు
వారి రక్షణే దేశరక్షణ వారి పరిశ్రమే మన జీవనము
విజ్ఞానానికి ఉపాధ్యాయులు ప్రజాసేవకై ఎన్ జీవోలు - 2
ఐకమత్యతకు నాయకత్వము వారి పరిశ్రమ దేశపురోగతి - 2
స్వార్థపరులకు సాయపడుటకై సమ్మెలు, సవాళ్ళు చేయం - 2
ప్రతి పనికోసం ప్రభుత్వ మనక ప్రజాశక్తి కలుపుట న్యాయం
సోమరితనమునకు సమాధి కట్టి సహకారముతో సాధన చేసి - 2
స్వాతంత్ర్యాన్ని నిలబెడతాం సమసమాజం స్థాపిస్తాం ॥భారత॥

మనం మనం ఒక తల్లి బిడ్డలం అనం అనం నేనూ నాదని - 2
పదం పదం కలుపుదాం ప్రగతి పథంలో పయనిద్దాం
తరం తరం కలవాలని నిరంతరం నిలవాలని
వేద్దాం పదండి వెలుగుబాటకు కదలని చెదరని పునాదిరాళ్ళు ॥భారత॥

వందేమాతరం

*గమ్యం తెలియక, నియంత్రణ లేని మనస్సు మనల్ని పతనం చేస్తుంది. నిగ్రహంతో, లక్ష్యంవైపు సాగిపోయే మనస్సు విజయం శిఖరాలను అధిరోహింపజేస్తుంది.*

**- స్వామి వివేకానంద**

# స్వాతంత్ర్యపతాక

ఎగురవే వినువీధి ఎగురవే జండా
శాంతి దూతగ నేడు - జాతీయ జండా
యుగ యుగంబుల జగతి నెగురవే జండా
సౌఖ్య ప్రదాతగా స్వాతంత్ర్య జండా

భారతీయుల మహా పోరాట ఫతితమా
వీరయోధుల రక్త ధారలకు చిహ్నమా
శాంతి మాత అశోక ధర్మచక్రము దాల్చి
శాంతి నిల స్థాపించ నరుదెంచితివి నీవు ॥

పెను తుఫానుల నెన్ని పెనవేసుకొన్న
దనుజులందరుగూడా, నినుదింపకున్న
కడ భారతీయుండు పడిపోవు దనుక
గగనాన ధ్రువ తార కరణి విల్చెదవు ॥ఎగురవే॥

*భూనభోంతరాల్లోని ఏ శక్తీ సత్యం, పవిత్రత, నిస్వార్థం అనే సుగుణాలతో జాజ్వల్యమానంగా ప్రకాశించే వారి నీడనైనా తాకలేదు. విశ్వమంతా ఒక్కటై ఎదిరించినా, వారు ప్రతిఘటించగలరు.*

**- స్వామి వివేకానంద**

# ప్రపంచ శాంతి

ప్రశాంత హృదయ స్పందనం
ప్రపంశాంతికి ఆభరణం
ప్రజాజీవన సుందర ప్రాంగణం
పవిత్రమౌన బంగారు దేవళం॥
అగ్రరాజ్యాల యుద్ధోన్మాదం
అహంకారుల మారణహోమం
అణుబాంబు యుద్ధాల ఆర్భాటం
ఆపివేయాలి శాంతిదళం॥
ప్రేమామృత వాక్కుల తోరణం
పుధమిలోన కాంతికిరణ:
ప్రవక్తల పవిత్ర ప్రబోధం
పాటించుటయే మన ధర్మం ॥
సౌశీల్యం సౌహార్ధాల పరమార్థం
సకలజనుల సౌభాగ్యం
విశ్వజననీన దివ్యసందేశం
విశ్వశాంతికి మహోదయం ॥
నిబుధులశాంతి సందేశం
విపులపై వర్థిల్లాలి నిరంతరం
విశ్వ శ్రేయస్సు సాధనయే మన లక్ష్యం
విజయభేరి మోగించాలి మన మందరం ॥
ఓం శాంతి

– సరికొండ జనార్ధనరాజు

*వేయి ఓటములనైనా ఓర్చుకొని, పట్టువదలకుండా ప్రయత్నించినప్పుడే సద్గుణాలను, శీలసంపత్తిని సమకూర్చుకోగలం.*

# వేద వేదములన్ని తరచీ

తెలుగు తల్లికి మంగళమ్! మా
కల్పవల్లికి మంగళమ్!
కొలుసు మా యద నిలుచు మా
రాజ్ఞీమ తల్లికి మంగళమ్!
ప్రాతకొత్తల కౌగిలింతల
ప్రసవమగు బంగారు కాంతుల
భావికాల స్వర్గమచురుచు
ప్రౌఢ ప్రతిభకు మంగళమ్!
నాగరికతను వలచి మెచ్చిన
నాడు నాడులు తరలివచ్చిన
భోగభాగ్యము లందజూపే
రాగ రహితకు మంగళమ్!
వేద వేదములన్ని తరచీ
వార భేదములన్ని మరచీ
స్వాదు ధర్మ, పథమ్ముపరచు
విశాలశాలకు మంగళమ్!
నాక మందిన పగటివేళ
నరకమంటిన కాకురేల
ఏక గతి తెలుగమ్మ నడిపిన
ఏకమంతకు మంగళమ్!

**– దేవులపల్లి కృష్ణశాస్త్రి**

*బలాన్ని స్మరించడమే బలహీనతల నుండి బయటపడే మార్గం, కానీ బలహీనులమని బాధపడడం కాదు.*

## కథలు

# 1. సహాయం శాశ్వత బంధం

"ఇతరులు సంతోషంగా ఉండాలని మీరనుకొంటే చేతనైన సహాయం చేయండి" ఇవి దలైలామా విలువైనమాటలు ఎంత నిజం అనేది అనుభవంలోకి వస్తేనే అర్థమౌతుంది.

పనిమనిషి కూతురికి పుస్తకాలు, పెన్, పెన్సిళ్ళు కొనుక్కోడానికి ఇచ్చి "ఇతరులకు నేను ఎంతో సహాయం చేస్తాను తెలుసా?" అంటూ మన గురించి మనమే చెప్పుకుంటాం. అయితే ఈ సహాయం కేవలం పని మనిషి పని ఇంకాబాగా చేయాలి. తొందరగా సరిగ్గా చేయాలని మనమిచ్చే లంచం – అంతే.

ఇలా అంటున్నారని మీరు చేస్తున్న చిన్న చిన్న సహాయాన్ని ఆపకండి ఎలాంటి ప్రతిఫలాపేక్ష లేకుండా సహాయపడితే అంతులేని ఆనందాన్ని మీరు అనుభవించడానికి సాధ్యమౌతుందని ఖచ్చితంగా చెబుతున్నాను.

నేను, నా భార్య పిల్లలు అనుకొనేవాళ్ళు చాలామంది ఉన్నారు "ఈ రోజుల్లో మన మధ్యతరగతి కుటుంబీకుడినైన నాకు ఎలా సహాయపడడానికి వీలౌతుంది అని కొందరు అడగవచ్చు.

మనస్సుంటే మార్గం ఉంటుంది. ఒక సినిమా చూస్తే అయ్యే నలభైరూపాయలతో ఒక పేదామెకు చీరకొనివ్వవచ్చును. ఒక ఉదాహరణ చెబుతాను. సహాయపడాలనే భావన ఉండే ఏదో ఒక విధంగా సాయపడవచ్చు.

మీరు ఇతరులకు సాయపడితే దేవుడు మీకు సాయపడతాడనే ఈ కథను చదివితే తెలుస్తుంది. కృష్ణ ముప్ఫై రెండేళ్ళవాడు. చిన్న వయసులోనే ఎన్నో కష్టాలుపడ్డాడు బాగా బతికి చెడిన కుటుంబానికి చెందిన ఆయన ఒక మెకానిక్ షాపులో చిన్న ఉద్యోగం చేస్తూ రోజుకు 12గం॥లు పనిచేసేవాడు.

ఒక రోజు రాత్రి అతని యజమాని అతణ్ని టిఫిన్ తెమ్మన్నాడు రిపేరికి వచ్చిన ఒక ఆటోలో బయలుదేరాడు. జోరుగా వర్షం కురుస్తోంది. కొంత దూరం వెళ్ళేటప్పటికి ఒక పెద్దాయన చేతిలో పెట్టె బేడా పట్టుకొని పూర్తిగా తడిసి కనిపించాడు. ఆటో ఆపి 'ఏం సార్ ఏమైంది?" అని కృష్ణ అడిగాడు. ఆయన బాధతో "నేను ప్రయాణం చేస్తున్న బస్సు పాడైంది. అందరూ దొరికిన బస్సులను పట్టుకొని వెళ్ళిపోయారు. నాకు ఏవాహనం దొరకలేదు" అన్నాడు.

కృష్ణ ఆ ముసలాయనపై జాలిపడి " ఈ దారిలో మీ కెలాంటి వాహనాలు దొరకవు. రండి నా ఆటో ఎక్కండి. దారిలో ఏదైనా టాక్సీ దొరికితే ఎక్కి ఇంటికి వెళ్ళరుగాని" అని చెప్పి, టాక్సీలుండే చోటికి తీసికెళ్ళి టాక్సీ ఎక్కించాడు. ఆముసలాయన "ఏమీ అనుకోవద్దు" అంటూ కొన్ని రూపాయలు అతని చేతిలో పెట్టబోతే కృష్ణ చేతిని వెనక్కు తీసుకొన్నాడు.

"డబ్బెందుకిస్తారు? ఇలాగే మానాన్నగారికి తెలియక పోయినప్పుడు ఎవరో ఒక అపరిచితుడు సహాయం చేసాడనే మాట గుర్తుకువచ్చి నిస్సహాయంగా రోడ్డులో నించున్న మిమ్మల్ని ఇక్కడకు తీసుకొని వచ్చి సాయపడ్డాను. ఈ సహాయాన్ని గుర్తుంచుకొని మీరు వేరెవరికైన అవసరమొస్తే సాయపడండి". అంటూ ఆటో ఎక్కి వెళ్ళిపోయాడా ఆ కలియుగ కృష్ణుడు.

ఇక జాగ్రత్తగా ఇల్లు చేరతాననే ధైర్యం ఆమనిషికి టాక్సీ ఎక్కిన తరువాత కలిగింది. ఆకలి అనిపించింది, టాక్సీ డ్రైవర్‌తో "నేను తిండితిని నాలుగైదు గంటలైంది. ఆకలిగా ఉంది, తల తిరుగుతోంది ఏదైనా హొటలుంటే అక్కడికి తీసుకెళ్ళమని" చెప్పాడు. ఇక్కడ అలాంటి హొటళ్ళు లేవని చెప్పి డ్రైవరు టాక్సీ నడుపుతూ వెళుతుంటే ఒక గుడిసెలో ఒకామె ఇడ్లీలు వండుతూ కనిపించింది. టాక్సీని ఆపమన్నాడు.

"ఇలాంటి చోటా మీరు తినేది!" అంటూ అసహ్యించుకొంటున్న వాడి మొఖాన్ని గమనించక టాక్సీదిగి ఆమె ఇచ్చిన ఇడ్లీలను గబగబ తిన్నాడు. తరువాత "ఎంతివ్వాలని" అడిగాడు. ఆమె "ఎనిమిది రూపాయలు" అంది. వెంటనే వెయ్యిరూపాయల నోటును ఇచ్చిన అతనితో "అంత చిల్లర ఎక్కుడ్నుంచీ తెచ్చేది" అని అంది.

"నీవు నాకు చిల్లర ఇవ్వాల్సిన పనిలేదు. నాకు అవసరం కలిగినప్పుడు ఒక అపరిచిత వ్యక్తి సాయపడ్డాడు. ఇప్పుడు ఆకలితో ప్రమాదస్థితిలో ఉన్న నాకు ఆకలి తీర్చి కాపాడావు. ఇది నేను నీకిస్తున్న ఇడ్లీల ఖరీదుకాదు. నాకృతజ్ఞతను తెలుపుకొనే విధం ఇది. మంచంలో మీ అబ్బాయి అనుకొంటా జ్వరంతో బాధపడుతున్నాడు వాడికి మంచి డాక్టరు దగ్గర వైద్యం చేయించు" అంటూ మళ్ళీ టాక్సీ ఎక్కి వెళ్ళిపోయాడు ఆపెద్దాయన.

ఆ మనిషి వెళ్ళిన వైపు చూస్తూ నిలబడ్డ ఆమెముందు ఆటోవచ్చి ఆగింది. ఆటోలో మనిషి క్రిందకు దిగడానికి కూడా వీలులేకుండా ఆమె "ఏమండీ పిల్లాడికి విపరీతమైన జ్వరం వైద్యానికి డబ్బు లేదని బాధపడ్డారు. దేవుడే మనకు సాయం చేశాడు. ఎవరో ఒక పెద్దాయన టాక్సీలో వచ్చి ఇడ్లీతిని వెయ్యిరూపాయలు ఇచ్చి వెళ్ళాడు పదండి డాక్టరు దగ్గరుకు వెళ్ళి పిల్లాడికి వైద్యం చేయిద్దాం" అంటూ ఆత్రంగా, ఉత్సాహంతో చెప్పింది.

ఆశ్చర్యంతో, సంతోషంతో ఆమెముందు నిలబడింది మరెవరో కాదు మెకానిక్ కృష్ణ.

*ఆటపాటల్లో, వేషభాషల్లో, సుఖదుఃఖాల్లో అన్ని దైనందిన అలవాట్లలో నీతి తప్పని ధీరులై జీవించండి. అలాంటి ఆదర్శంతో జీవితాన్ని నిర్మించుకుంటే ఇతరులు కూడా మిమ్మల్ని అనుసరిస్తారు.*

# 2. ఏది సంతోషం ?

సూఫీ సాహిత్యంలోంచి ఒక కథ. ఒక రోజు ముల్లానజురుద్దీన్ దిగాలు పడి కూర్చుని వున్నాడు. అప్పుడతణ్ణి చూడటానికి వచ్చిన అతని ప్రియమైన మిత్రుడు, "ఎందుకిలా దిగులుగా ఉన్నావు?" అనడిగాడు. అందుకు ముల్లా భోరుమని ఏడుస్తూ "నా మామ తన యావదాస్తినీ నాకు రాసిపెట్టి నెల క్రితం చనిపోయాడు. అది తలుచుకుని ఏడుస్తున్నాను" అన్నాడు.

"మీ మామ నాకు బాగా తెలుసు. ఆయనకి ఎనభైయేళ్ళుకదా. ఆ వయసులో మరణం సహజమే ఎవరికైనా. అందుకింత బాధ పడటం దేనికి? నిజానికి ఆస్తి అంతా నీకు దక్కినందుకు నువ్వెంతో సంతోషించాలి" అని అనునయించే ప్రయత్నం చేసాడు ఆ మిత్రుడు.

"నా బాధ నీకు తెలియదు మిత్రమా. పోయిన వారమే లక్షరూపాయలు విలువ చేసే తన సొత్తు నా పేర రాసి పెట్టి నా బాబాయి కూడా చనిపోయినాడు" అని ఇంకా పెద్దగా ఏడ్వ సాగాడు ముల్లా.

మిత్రుడు అయోమయంలో పడినాడు. "మీ బాబాయి కూడా నాకు బాగా తెలుసు. ఆయనకు ఎనభైఅయిదేళ్ళు ఆస్తి దక్కిందని సంతోష పడకుండా ఇట్లా ఏడుస్తున్నావే నీకేమైనా పిచ్చి పట్టిందా?" అన్నాడు మిత్రుడు చిరాగ్గా.

"ఇప్పుడు నాకు మరింత దిగులుగా ఉంది. నూరేళ్ళు నిండిన మా తాత రెండు లక్షలకు పైగా విలువగల ఆస్తిని నా పేర రాసేసి నిన్ననే కన్ను మూశాడు." అని చెప్పాడు ముల్లా. ఆ స్నేహితుడికి మండి పోయింది. నువ్వెందుకిట్లా ఏడుస్తున్నావో నాకేమీ అర్థం కావటం లేదు. అన్నాడు తలపట్టుకుని.

కళ్ళు తుడుచుకుని ముల్లా ఇలా అన్నాడు – "సంపన్నులైన నా మామ, బాబాయి, తాత ముగ్గురు చచ్చిపోయారు కదా ఇక మీదట నాకు ఆస్తి రాసి పెట్టి చనిపోవడానికి వేరే బంధువు లెవరు లేరు!"

ఈ కథలో ఒక చక్కని సందేశం దాగివుంది. మన సంతోషానికీ, తృప్తికీ ఎల్లలు ఏర్పరచుకోవడం మన చేతుల్లోనే ఉంది. ఆ హద్దులు మీరితే ఎటువంటి సంతోషమైనా మనిషికి తృప్తి నివ్వలేదు. చిల్లిపడిన బానలో ఎన్ని నీళ్ళు పోసినా నిలవనట్లే తృప్తి చెందలేని స్వభావం కలిగిన మనుషులకి ఏ సంతోషమూ దక్కదు. వారి మనసెప్పుడూ అసంతృప్తితోనే నిండి ఉంటుంది. తన దగ్గర లేని దాన్నిగురించి చింతిస్తూ వుంటారు. చిల్లిని బాగు చేస్తే కుండ నిండుతుంది కదా. అదే విధంగా మన మనసులోని లోపాన్ని సరిదిద్దు కున్నప్పుడు మనలో సంతోషం వెల్లి విరుస్తుంది.

'ఇది లేకపోతే నేను సంతోషంగా ఉండలేను' అని కొన్ని అనవసరమైన కోరికల్ని కోరుకుంటాం మనం అదే మనలోని లోపం.

కొంతమంది యువకుల దృష్టిలో సంతోషమంటే అమెరికాకు వెళ్ళడానికి వీసా దొరకడమే. అంటే వీసా దొరికే దాకా నా సంతోషాన్ని వాయిదా వేస్తున్నాను అనే కదా అర్థం. అవును. భవిష్యత్తులో జరగబోయే ఒక విషయం మాత్రమే సంతోషం కలిగిస్తుందనే భ్రమలో పడిగాపులు కాస్తూ ఇప్పుడు లభ్యమయ్యే ఆనందాన్ని ఓటికుండలోని నీళ్ళ వలె వృథా చేసుకుంటారు ఈ రకం మనుషులు.

ఈ మాదిరి 'బ్లైండ్ స్పాట్' మనస్తత్వంగల యువకులు అమెరికా వెళ్ళడానికి వీసా దొరికినా సంతోషంగా వుండలేరు. వీసా చేతికందిన మరుక్షణమే ఇంతటితో అయిపోయిందా? అమెరికాలో నాకు ఉద్యోగం దొరుకుతుందో లేదో అని చింతించటం మొదలెడతారు.

సరే – అక్కడ ఉద్యోగం కూడా దొరికింది. అప్పుడైనా వీరు తృప్తి పడతారా అంటే లేదు. "గ్రీన్ కార్డు దొరికే దాకా నాకు నిద్ర పట్టదు. సంతోషంగా ఉండలేను" అంటారు. సరేనండీ ఆ గ్రీన్ కార్డు కూడా దొరికిందనుకుందాం. అప్పుడేమంటారంటే "ఈ అమెరికాలో ఏం సంతోషం ఉందిని, తల్లిదండ్రులు, తోబుట్టువులు, స్నేహితులు, బంధువు లందరితో కలిసి ఇండియాలో ఉండటంలోనే అసలైన సంతోషం ఉంది" అని ఏడుస్తుంటారు.

ఇంకొందరున్నారు వారి దృష్టిలో సంతోషం అంటే అదేదో అంగట్లో అమ్మే పదార్థం లాంటిదనే భావన అవును. వారికి సిగరెట్లు, మధుపానం – ఇలాంటివే సంతోషకారకాలు. ఈ సందర్భంలో రమణ మహర్షి చెప్పిన కథ ఒకటి గుర్తొస్తున్నది.

ఒక సంపన్నుడి యింట ఒక కుక్కని పెంచుతున్నారు. వేళ తప్పకుండా దానికి మంచి తిండిపెడుతున్నారు. అయినా దానికి తృప్తి లేదు. ఆ యింటి నుంచి బయటపడి రోడ్డెక్కింది ఆ శునకం. చెత్తా చెదారం తిని త్వరలోనే శుష్కించిపోయింది. ఆఖరికి వీధి కుక్కలతో పోరాడే శక్తిని సైతం కోల్పోయిన ఆ కుక్కకి ఎంగిలాకులు కూడా దక్కలేదు. చివరికి ఎండిపోయిన పాత ఎముక ముక్క ఒకటి దొరికింది దానికి. సారమంతా పోయి పెంకు తునకలాగుంది ఆ ముక్క. కాని అది గ్రహించలేని ఆ తెలివి మాలిన శునకం గట్టిగా పళ్ళతో ఆ ఎముకని కొరకసాగింది. కుక్క చిగుళ్ళ నుంచి నెత్తురు కారింది. ఆ నెత్తురు ఎముకలోంచే వస్తున్నదని భ్రమపడిన కుక్క మరింత ఆవేశంలో ఎముకని కొరకడం ప్రారంభించింది. అప్పుడు అటుగా వెళుతున్న ఒక బాటసారి ఆ కుక్కని చూసి, "ఒసే, బుద్ధిలేని శునకమా! అది ఎండి పోయిన ఎముక ముక్క. నువ్వు రుచిగా ఉందనుకుని నాకుతున్న రక్తం ఆ ఎముకలోదికాదు. అది నీ నోరు చీలి కారుతున్న నెత్తురు" అని వివరించాడు. అప్పుడా కుక్క బాటసారిని చూసి హేళనగా నవ్వి "ఇంతకాలం దాకా నాకు నెత్తురు రుచి ఎటువంటిదో తెలీదు. ఈ ఎముక ముక్కని కొరికిన తరువాతే ఆ రుచి తెలిసింది. అందుచేత ఈ రక్తం ఎముకలోంచే ప్రవిస్తున్నది. నువ్వు నన్ను మభ్య పెట్టలేవు" అని మరింత ఆబగా ఎముకని కొరక సాగింది.

తమని తాము వంచించుకుంటూ భ్రమలకి లోనై ఎండమావుల వంటి సుఖాలని వెదుక్కుంటూ పరిగెడుతుంటారు చాలామంది. దీనినే Dog's Logic అంటాము.

మీరే ఆలోచించండి. ఎండిపోయిన ఎముకని కొరకడంలో ఆకుక్క పొందిన ఆనందానికి, సిగరెట్లు, మద్యపానం వంటి మత్తు పదార్థాలు సేవించి తమని తాము నాశనం చేసుకుంటూ కొందరు పొందుతున్న ఆనందానికీ ఏమైన తేడా ఉన్నదా?

# 3. ప్రత్యుపకారం

అది ఒక సింహపు గుహ. అంతా గంభీరంగా అంధకారమయముగా ఉంది. అందులోనే ఒక బొరియను ఏర్పరచుకుని ఒక చిట్టెలుక కూడా ఉంటున్నది. సింహం వేటాడి తెచ్చిన జంతువుయొక్క ఎముకలకు అంటివున్న మాంసం ఆ చిట్టెలుకకు ఎక్కువే. సింహం అడవిలోకి పోయిన తరువాత ఆ చిట్టెలుక తన బిలంనుండి బయటకు వచ్చి ఎముకలకు అంటివున్న మాంసాన్ని కొరికి తిని కడుపు నింపుకుంటూ వుంటుంది. అలా కొంత కాలానికి ఆ ఎలుక బాగా లావుగా అయింది కూడా.

ఒకనాడు రెండు ఝాములవేళ సింహం నిద్రపోతున్నది. అప్పుడే ఎలుకకు బాగా ఆకలివేయగా అది బిలంనుండి బయటకు వచ్చి తనపొట్ట నింపుకుంది. సింహానికి దగ్గర దగ్గరగా వుండటం వల్ల క్రమేణ దాని భయం దూరం కాసాగింది. కడుపు నిండటం వల్ల అది ఆటవిడుపుగా సింహం మీద ఎక్కింది. కోమలమైన దట్టమైన సింహం శరీరం దానికి బాగా నచ్చింది. అది దాని కాళ్ళమీద, వీపుమీద, మెడమీద, ముఖంమీద యిటూ అటూ పరుగెత్తసాగింది.

ఆ హడావిడిలో సింహానికి మెలకువ వచ్చింది. అది పంజా ఎత్తి ఎలుకను పట్టుకుంది. గద్దిస్తూ, “అరే! నువ్వు నా శరీరం మీద ఏమిటీ కోలాహలం చేస్తున్నావు”! అంది.

ఆ చిట్టెలుక భయంతో వణికిపోయింది. ఎట్టకేలకు ధైర్యాన్ని కూడగట్టుకుని, “ప్రభూ! నిజంగా నావల్ల మహాపరాధమే జరిగింది. సత్వ సమర్థులైన మీరు నాకు ప్రాణదానం చేస్తే శక్తి వంచన లేకుండా మీ సేవ చేసుకుంటూ పడివుంటాను” అన్నది.

సింహం నవ్వుతూ ఆ చిట్టెలుకను విడిచిపెట్టి పో, మృగరాజునైన నాకు నువ్వు చేసే సేవ ఏముందిలే. కాని నిన్ను మాత్రం క్షమిస్తున్నాను” అని అన్నది.

విధివిధానాన్ని తిలకించండి. ఒక జంతు ప్రదర్శనశాల వారికి సజీవంగా వుండే సింహం కావలసి వచ్చింది. వారు అడవిలో పన్నిన వలలో సింహం చిక్కుకొని భయంకరంగా గర్జించసాగింది.

సింహం అత్యంత శక్తివంతమైన జంతువు. అది మాటిమాటికి పంజాతో దంతాలతో ఆ వలను ముక్కలు చేయాలని ప్రయత్నించసాగింది. ఎగిరి వలతో సహా పారిపోవాలని కూడా ప్రయత్నిందచింది. కానీ ఆ వల సామాన్యమైనది కాదుకదా, “సింహాన్ని చిక్కించుకోవాడానికి వాడే వల ఎక్కడైనా బలహీనంగా వుంటుందా.” సింహం ఎంత గింజుకున్నా ఫలితం లేకపోయింది. సింహం యొక్క గోళ్ళనుండి, నోటినుండి రక్తం స్రవించసాగింది. అయినా అది తన ప్రయత్నం మానలేదు. సింహం అలసి సొలసి కదలజాలనిదై పోయింది.

అడివి రాజైన సింహం వలలో చిక్కుకుని గర్జిస్తున్నది. అది గతంలో ఎన్నడూ ఎవరికీ భయపడలేదు. ఎవరూ ఎప్పుడు సింహాన్ని బంధించలేదు. వలలో చిక్కుకొనీ వుండటం వల్ల దానికి మహాబాధగా ఉంది.

ఆ సింహం అరుపులను చిట్టెలుక పసిగట్టింది. అది పరిగెత్తుకు వచ్చి "ప్రభూ మీరు మౌనంగా ఉండండి. గర్జించడం వల్ల దూరంగా పోయిన వేటగాళ్ళు పరిగెత్తుకు వచ్చే అవకాశం ఉంది. వాళ్ళు వస్తే నేను భయపడిపోతాను. ఇప్పుడు నేను ఈ వలను కొరికివేస్తాను" అన్నది.

సింహం మౌనం వహించింది. వల చాలా గట్టిగా వుంది. చిట్టెలుక వలను గట్టిగా కొరుకుతూవుండంటం వల్ల దాని దంతాలనుండి రక్తం కారసాగింది. అయినా ఎంతో శ్రమపడి ఎలుక దానిని కొరికి వేసింది. సింహం ఎంతో సంతోషపడి ఎలుకకు కృతజ్ఞతలు తెలియజేసింది. అప్పుడు ఎలుక "నా ప్రాణ దాతకు యీపాటి సేవచేయగలగటం నా అదృష్టం" అని అన్నది.

నీతి : ఉపకారికి ప్రత్యుపకారం జరిగితీరుతుంది.

*పరాజయాలను పట్టించుకోకండి, అవి సర్వసాధారణం,*
*అవే జీవితానికి మెరుగులు దిద్దేవి. ఓటమి లేని జీవితం ఉంటుందా?*

*లక్ష్యంపై ఉన్నంత శ్రద్ధాసక్తుల్ని, లక్ష్యసాధనలో సైతం చూపించాలి,*
*విజయ రహస్యమంతా ఇదే.*

*- స్వామి వివేకానంద*

# 4. ఉపకారం

ఆఫ్రికా చాలా పెద్దదేశం. అక్కడ మహారణ్యాలు, వాటిలో సింహం, వ్యాఘ్రం, భల్లూకం వంటి క్రూరమృగాలెన్నో ఉన్నాయి. చర్మంకోసం చాలామంది అక్కడ సింహాలను వేటాడుతూ ఉంటారు.

వేసవిలో ఏనుగులు దాహం తీర్చుకునే నిమిత్తం వెళ్ళే దారులలోనే వేటగాళ్ళు పెద్ద పెద్ద గోతులు తీస్తుంటారు. ఆ గోతులకు నలువైపులా ఆకులు అలములతో కప్పి ఉంచుతారు. ఆపైన గోతిని చిన్న చిన్న కర్ర ముక్కలతో, కొమ్మలతో, రెమ్మలతో మూసి ఉంచుతారు. పాపం ఏనుగులు ముందుకు చూస్తూ దూసుకుపోతూ ఆ పైకప్పు మీద కాలు వేయడంతో గోతిలోకి పడిపోతాయి. ఏనుగులను పట్టుకునేవారు తమ పెంపుడు ఏనుగుల సహకారంతో ఆగోతికి మరోవైపు దారిచేసి ఆ ఏనుగును పట్టి పైకి తీసుకు వస్తుంటారు.

అలా పట్టిన ఏనుగును చాలాకాలం తిండి తిప్పలు లేకుండా ఉంచి బలహీనంగా చేసివేస్తారు. ఆ పై గోతినుండి పైకి తీసేవేళలో అది ఎట్టి కోలాహలం చేయకుండా సునాయాసంగా బయటకు వస్తుంది. ఆకలితో గిలగిలలాడుతున్న ఏనుగుకు ఆహారం యివ్వడానికి ఓ వ్యక్తి వెడతాడు. ఆహారం యిచ్చే వంకతో వెళ్ళే ఆ వ్యక్తి పదేపదే రావడం వల్ల ఏనుగు అతణ్ణి గుర్తుపడుతుంది. క్రమక్రమంగా అతడే దానికి అన్ని విద్యలు నేర్పుతూ ఉంటాడు. క్రమశిక్షణ పూర్తి అయిన తరువాత దానిని విక్రయిస్తారు.

ఎన్నో పర్యాయాలు ఏనుగులను పట్టుకోవడానికి త్రవ్వే గోతులలో అడవి జంతువులు రాత్రివేళల్లో పడిపోతుంటాయి. ఏనుగులను పట్టేవారు ఒకసారి వాటికోసం ఆఫ్రికా అరణ్యంలో ఒక పెద్ద గోతిని త్రవ్వి అన్ని యేర్పాట్లు చేసి ఉంచారు. రాత్రివేళ ఒక సింహం అందులో పడిపోయింది. ఒక చిన్న జంతువును వేటాడుతూ పరిగెడుతూ సింహం పొరపాటున ఆ గోతిలో పడిపోయింది.

వేటగాడొకడు ఆ దారినే పోతున్నాడు. గోతిలో చిక్కుకున్న మృగరాజును వాడు చూశాడు. వీరులైన వారు కష్టాలలో చిక్కుకున్న వారిని హింసించరు సరికదా పాపం! సింహం మాటి మాటికీ పైకి ఎగురుతూ ఉంది. కాని, ఆ గోతికి నలువైపుల పాతబడిన సూదిమొనలవంటి మొనలుగల కర్రలు గుచ్చుకుని వేదన పడుతున్నది. దానితో అది మరల గోతిలో పడిపోతున్నది. వేటగాడు ఓ త్రాటికి రెండు కర్రలు కట్టి చెట్టు ఎక్కేశాడు. చెట్టుమీద నుండి త్రాటిని గొయ్యిలోకి వేశాడు. సింహం ఆ త్రాటి సహాయంతో పైకి చేరింది. బ్రతుకుజీవుడా అనుకొని చుట్టూ చూసింది. దానికి ఎవరూ కనిపించలేదు. తలపైకెత్తి చూస్తే తాడు పట్టుకొన్న మనిషి కనిపించాడు. కృతజ్ఞత ఉట్టిపడే చూపులతో ఒకసారి అతనివైపు చూసి సింహం అడవిలోకి వెళ్ళిపోయింది.

## 5. "జీవితం కరిగిపోయే మంచు ఉన్నదాంట్లో నలుగురికీ పంచు!"

పూర్వం రంతిదేవుడనే రాజుండేవాడు. ఆయన తన సంపదనంతా లేదనకుండా పేదలకు దానం చేసి చేసి, చివరకు తానే నిరుపేదగా మారిపోయాడు. అయినా ధైర్యం విడువక ఎక్కడైనా కాలం గడుపుదామని బయలుదేరి, అడవిలో కాలక్షేపం చేయసాగాడు. చాలా రోజులు అతనికి తిండి నీరు లభించలేదు. తర్వాత ఒకరోజు ఉదయమే నెయ్యి, పాయసం, నీరు లభించాయి. అమితానందంతో భుజించడానికి సిద్ధం కాగా

'అయ్యా! ఆకలితో ఉన్నాను. కొంచెం తినడానికేదైనా ఉంటే ఇవ్వండి!" అంటూ అప్పుడే ఒక బాటసారి అక్కడ ప్రత్యక్షమయ్యాడు.

రంతిదేవుడు ఏమాత్రం సంకోచించకుండా తనకు దొరికిన ఆహారం, నీరులోనుంచి సగభాగం ఆ బాటసారికిచ్చాడు. అతడాఆహారాన్ని తృప్తిగా భుజించి వెళ్తుండగానే మరొక బాటసారి వచ్చి, 'ఆకలిగా ఉంది. అన్నంపెట్టుమని జాలిగా అడిగాడు. రంతి దేవుడు మిగిలిన దానిలో సగం అతనికిచ్చాడు. అతడు కూడా ఆ ఆహారంతో తృప్తి చెంది వెళ్ళాడు.

'ఇక తిందా'మని రంతి దేవుడు సిద్ధపడగానే ఒక దరిద్రుడు కుక్కల గుంపును వెంటబెట్టుకుని 'ఆకలి! ఆకలి!' అంటూ కేకలు వేస్తూ వచ్చాడు. మిగిలిన ఆహారమంతా అతనికిచ్చి పంపించివేశాడు. 'తనకు నీరు మాత్రమే మిగిలింది. అదే భగవంతుడు తనకిచ్చిన మహాప్రసాద'మని మనసులోనే భావించి, ఆ నీటిని త్రాగబోయాడు. సరిగ్గా అదే సమయానికి ఒక దీనుడు "అయ్యా! దాహంతో నా ప్రాణం పోయేటట్లున్నది దాన్ని నిలబెట్టే భారం నీదే" అంటూ అతని ముందు వాలాడు.

"అయ్యా! ఈ నీళ్ళు మాత్రమే నావద్ద ఉన్నాయి. ఇవితాగి నీ దాహం తీర్చుకో! సాటి మనిషి ఆపదలో ఉన్నప్పుడు చేయగల్గినంత సహాయం చేయడంలో ఉన్న తృప్తి ఎంతో గొప్పది. నాకు ఆ దేవుడే దిక్కు" అంటూ హృదయపూర్వకంగా అతనికి తన వద్ద గల నీరంతా పోశాడు రంతిదేవుడు.

అప్పుడు అంతవరకూ అతని వద్ద ఆహారమడిగిన వారంతా దేవతల రూపంలో ప్రత్యక్షమయ్యారు. "నీ దానగుణాన్ని పరీక్షించేందుకే మేం వచ్చాం. బ్రహ్మాది దేవతలను నీవు సంతోషింపజేశావు. నీదాన గుణం ఎంతో గొప్పది. నీకీర్తి చిరస్థాయిగా నిలుస్తుంది!" అని ఆశీర్వదించి, 'ఏం కావాలో కోరుకో'మ్మన్నారు.

రంతి దేవుడు వాళ్ళనేమీ కోరకుండా, భగవంతుడ్ని స్మరిస్తూ ఇతరులకు సహాయం చేయడంలోని తృప్తి, ఆనందం మరెక్కడా లేదని తన్మయుడైపోయాడు.

# ౬. గాడిద తోక

ఒక ఊరిలో అలేము అనే ధనవంతుడైన వ్యాపారి ఉండేవాడు. అతడు ఎంతో ఉత్తముడు. గ్రామంలోని పేదసాదలకు ఎల్లప్పుడు సహాయం చేసేవాడు. తన ఇంటికి వచ్చిన అతిథులను ప్రేమతో ఆదరించేవాడు. అతని వద్ద చాలా బంగారం ఉండేది. ఆయన బంగారాన్ని బ్యాంకులో దాచుకోక ఒక చెక్కపెట్టెలో పెట్టి తన మంచం క్రింద దాచి ఉంచేవాడు. ఇంట్లో ఒంటరిగా ఉండటం వల్ల ఎక్కడికైనా వెళ్ళాల్సి వచ్చినప్పుడు పెట్టెకు తాళం వేసేవాడు.

ఒకరోజు అలేము పనిమీద పొరుగూరుకు వెళ్ళాల్సి వచ్చింది. తన పొట్టి గుర్రాన్ని ఎక్కి బయలుదేరి వెళ్ళాడు. అవకాశం కోసం ఎదురు చూస్తున్న అదే గ్రామంలోని ఒక వ్యక్తి తాళం పగులగొట్టి మొత్తం బంగారాన్ని దొంగిలించాడు. అలేము రెండు రోజుల తర్వాత తిరిగి వచ్చి పగిలిన తాళాన్ని చూసి ఇంట్లోకి ఎవరో వచ్చారని తెలుసుకున్నాడు. లోపలికి వెళ్ళి చూశాడు. తను దాచుకున్న బంగారమంతా దొంగల పాలు కావడంతో లబో దిబోమంటూ గుండెలు బాదుకుంటూ. “అయ్యో! నా బంగారమంతా దోచుకుపోయారు...” అంటూ ఏడవసాగాడు.

అలేము గ్రామంలో అందరిని విచారించి చూసాడు. కాని ఎలాంటి సమాచారము దొరకలేదు. చివరకు సర్పంచ్ వద్దకు వెళ్ళాడు. గ్రామంలోని తెలిసిన వ్యక్తి తన బంగారాన్ని దొంగిలించాడని అనుమానంగా ఉందని చెప్పాడు. సర్పంచ్ కొంతసేపు ఆలోచించి, దొంగను పట్టుకుని అతని బంగారాన్ని తిరిగి ఇప్పిస్తానని వాగ్దానం చేశాడు.

మరునాడు సర్పంచ్ అలేము గ్రామానికి వెళ్ళాడు. అక్కడ ఒక గుడారం వేయించి దానిలోపల ఒక గాడిదను కట్టించాడు. ఎవరికి కనబడకుండా ఆ గాడిద తోకకు సీసా అత్తరు పూసి గ్రామస్తులందరిని సమావేశపరిచాడు.

“ఎవరో మన అలేము ఇంట్లో లేనిది చూసి అతని బంగారాన్ని దొంగిలించారు. ఆ దొంగ గ్రామంలోని వాడేనని నాకు సందేహంగా ఉంది. వీరంతా ఒకరొకరుగా గుడారములోకి వెళ్ళి గాడిద తోకను ముట్టుకొని రావాలి. ఎవరైతే దొంగతనం చేశారో అతను తోకను ముట్టగానే గాడిద ఒండ్ర పెడుతుంది”. అని తెలిపాడు.

ఒకరొకరుగా వెళ్ళి గ్రామస్తులందరూ గాడిద తోకను ముట్టుకుని వచ్చారు. గాడిద ఓండ్రపెట్టక పోవడంతో దొంగ తమ గ్రామంవాడు కాదని భావించి అంతా ఊపిరి పీల్చుకున్నారు. కాని సర్పంచ్ వాళ్ళందరిని ఒక వరుసలో నిలబెట్టి ఒకటి ఒకటిగా అందరి చేతుల వాసన చూడసాగాడు. చేతుల వాసన చూస్తూ చూస్తూ హఠాత్తుగా ఒక వ్యక్తిని పట్టుకుని, ‘దొంగతనం నీవే చేసావు!’ అన్నాడు.

అతడు ఒక్కసారిగా భయపడ్డాడు. వెంటనే మళ్ళీ కోలుకుని “ కాదు కాదు, నేను దొంగను కాను. నేను తోకను ముట్టుకుంటే గాడిద ఓండ్ర పెట్టలేదు.” అన్నాడు.

"నీవు అబద్ధమాడుతున్నావు. నిజానికి నువ్వుగాడిద తోకను ముట్టుకోనేలేదు."

"కాదు, నేను దాని తోకను ముట్టుకున్నాను."

"గాడిద తోకకు నేను ముందుగానే అత్తరు పూసాను. నీవు తోకను ముట్టుకుని ఉంటే అందరి చేతుల లాగే నీ చేతుల్లో కూడా అత్తరు వాసన వచ్చేది. "సర్పంచు మళ్ళీ అన్నాడు," మీరందరు మీమీ చేతులు వాసన చూడండి, అలాగే ఇతని చేతులను కూడా."

అందరు తమ తమ చేతులను వాసన చూసుకోగా అత్తరు వాసన వచ్చింది. కాని ఆవ్యక్తి చేతుల వాసన చూస్తే అత్తరు వాసన రాలేదు.

దొంగ తాను దొరికి పోయానని, ఇంకా బుకాయించి లాభం లేదని తెలుసుకున్నాడు. తన తప్పును ఒప్పుకోవడమే, మంచిదని నిశ్చయించుకున్నాడు. తాను దోచుకున్న అలేము బంగారాన్ని తిరిగి ఇచ్చి వేసాడు.

అలేము సంతోషముతో సర్పంచుకు, గ్రామస్తులకు ఒక మంచి విందును ఏర్పాటుచేసాడు.

## 7. నేరానికి శిక్ష

ఏసు క్రీస్తు కాలంలో ఎవరైనా తప్పు చేస్తే, గ్రామపెద్దలు పంచాయితీ చేసి తప్పు చేసిన వారిని శిక్షించేవారు.

ఒక దినం ఏసు క్రీస్తు తన బోధనలను ప్రచారం చేస్తూ ఒక గ్రామం చేరుకున్నారు. ప్రజలకు ఏసుక్రీస్తుపై ఎనలేని గౌరవం ఉండేది. ఆ దినం గ్రామ పంచాయితీ పెద్దలు ఒక నేరాన్ని విచారణ చేయవలసి వచ్చింది.

నేరస్తురాలు ఒక స్త్రీ. ఆమె చేసిన నేరం దొంగతనం. ఆనాడు దొంగతనానికి శిక్ష రాళ్ళతో కొట్టి చంపాలని. అదే నిర్ణయించారు గ్రామపెద్దలు.

ఆ సమయంలో ఏసు ప్రభువు ఆ గ్రామంలో బస చేస్తున్నందు వలన ఆ స్త్రీని ఏసు ప్రభువు ఎదుటకు తీసుకొని వెళ్ళి, తమనిర్ణయాన్ని క్రీస్తుకు తెలియజేశారు. ఆ స్త్రీ తలవంచుకొని నిలబడివుంది.

కరుణామయుడగు ఏసు హృదయం ద్రవించింది. పంచాయితీ పెద్దమనుషుల నుద్దేశించి ఏసు ఇలా అన్నాడు. "మీ నిర్ణయం బాగా ఉంది. మీలో పవిత్ర హృదయంగలవాడు. తప్పు చేయనివాడు ముందుగా ఈమెను రాయితో కొట్టండి."

పంచాయితీ పెద్దలు అవాక్కు అయినారు. ఎవరికివారు తమ్ముతాము ఆత్మ పరీక్ష చేసుకున్నారు. ఒకరొకరు వెళ్ళి పోయారు. ఆఖరకు ఆ ఒక్క స్త్రీయే మిగిలింది.

అప్పుడు క్రీస్తు "అమ్మా! ఇక మీదట ఇటువంటి దొంగ వృత్తి మానుకో" నిజాయితీగా జీవించు. కష్టపడి పనిచేయడంలోనున్న తృప్తిని అనుభవించు అని అన్నాడు. ఆనాటినుండి ఆ స్త్రీ తన ప్రవర్తన మానుకుంది.

# 8. కార్గిల్ వీరుడు ఇంద్రజిత్

అది జూన్ 28వ తేదీ. కాశ్మీర్‌లోని కుప్వాడా సెక్టార్ లోని ఎత్తైన పర్వతాలు. గుల్వాడా పర్వతాలపై చొరబాటు దారులు ఉన్నారని తెలిసి వారిని ఏరి వేయటానికి సరిహద్దు రక్షణ దళం 129 బెటాలియన్ కంపెనీ ఇంద్రజిత్ నేతృత్వంలో ముందుకు కదిలింది.

"గులామ్‌రిజ్" కు దగ్గరగా ఉన్న కొండమీద అనేక మంది చొరబాటుదారుల గుంపు చేరిందని రేడియో సందేశాలద్వారా తెలిసింది. ఇంద్రజిత్ వెంటనే కొంత మంది జవానులను వెంట బెట్టుకొని అక్రమ చొరబాటుదారులను చుట్టు ముట్టటానికి ముందుకు సాగాడు. శ్రీ ఎస్.పి.ఎస్. చౌదరితో బాటు నిటారు గుట్టలను కూడా అధిగమించి వారి వెనుకవైపు నుండి పైకి చేరాడు.

శత్రువులను చుట్టుముట్టే ప్రయత్నం చేస్తున్నంతలో వారి బంకర్ల నుండి దూసుకు వస్తున్న బుల్లెట్లలో ఒక్కటి జవాను శ్రీ విరాంజ్ అశోక్‌ను తీవ్రంగా గాయపరచింది. రక్తం ఓడుతున్న అతడు 50 అడుగుల లోతైన గుంటలో పడిపోయాడు. ఇంద్రజిత్ మ్రోగుతున్న తుపాకుల నుండి వస్తున్న బుల్లెట్లకు జంకకుండా ముందుకు దూసుకు పోతున్నాడు. ముందు నుండి కాల్పులు జరుపుతున్న మన జవానులు అప్పటికే సగం మంది చొరబాటు దారులను చంపివేశారు.

అనుకోకుండా ఎడమవైపున ఉన్న ఒక కొండపై దాగుకొని ఉన్న చొరబాటుదారులు ఇంద్రజిత్ చౌదరీలును బుల్లెట్లతో గాయపరిచారు. ఇంద్రజిత్‌కు భుజం పైన కాళ్ళపైన బుల్లెట్ గాయాలయ్యాయి. గాయాలు బాధిస్తున్నా లెక్కచేయక తన జవానులను ఉత్సాహపరుస్తూ శత్రువులు పీచ మణచటంలో నిమగ్నమయ్యాడు.

ఇంద్రజిత్ వెంట ఉండి శత్రువులతో పోరాడుతున్న కులదీప్ అనే జవాను గాయపడిన ఇంద్రజిత్‌ను సురక్షిత ప్రదేశానికి చేర్చాలని అనుకున్నాడు. కానీ ఇంద్రజిత్ అట్లా గాయాలతోనే రెండున్నరగంటలు శత్రువులతో పొరాడి, శత్రువులు బంకర్లను ఎన్నో ధ్వంసం చేశాడు. చివరకు శరీరంలో రక్తమంతా పోవటంతో ఇంద్రజిత్ వీరమరణం పొందాడు.

*అత్యున్నతమైన లక్ష్యాన్ని చేపట్టండి.*

*దాన్ని సాధించేందుకు మీ జీవితాన్నంతా ధారపోయండి.*

*– స్వామి వివేకానంద*

# ౨. గొప్ప ధర్మాత్ముడు

ఓ రాజుకు నలుగురు కొడుకులుండేవారు "ఎవ్వడైతే సర్వాధికుడైన ధర్మాత్ముణ్ణి వెతికి తీసుకువస్తాడో అతడికే రాజ్యాధికారం యీయబడుతుంది." అన్నాడు. రాకుమారులు నలుగురూ గుఱ్ఱాలెక్కి నాలుగు దిశలకూ బయలుదేరారు.

కొన్నాళ్ళు గడిచాయి. పెద్దకొడుకు తిరిగి వచ్చి తండ్రికి ఎదురుగా ఓ శేఠ్‌ను నిలబెట్టి "ప్రభూ! ఈ శేఠ్‌గారు సర్వదా వేలాది రూపాయలు దానం చేస్తుంటారు. వీరు ఎన్నో ఆలయాలు కట్టించారు. చెరువులు తవ్వించారు. చలివేంద్రాలు ఏర్పాటుచేశారు. తీర్థక్షేత్రాలలో వీరు ఎన్నోవ్రతాలు కొనసాగిస్తుంటారు. నిత్యం పురాణ శ్రవణం చేస్తుంటారు. గోపూజలు చేస్తుంటారు. ప్రపంచంలో వీరిని మించిన గొప్ప ధర్మాత్ముడెవడు ఉండడు". అన్నాడు.

"ఈయన నిశ్చయంగా ధర్మాత్ముడే" అని రాజు పలికి ఆ శేఠ్‌ను సత్కరించి పంపివేశాడు.

రెండవ కొడుకు ఓ బక్క చిక్కిన వృద్ధుని తీసుకు వచ్చి " ప్రభూ! ఈయన దేశంలోగల అన్ని పుణ్యక్షేత్రాలు కాలినడకన వెళ్ళి వచ్చాడు. సదా చాంద్రాయణ వ్రతం చేస్తుంటారు. అసత్యానికి భయపడతారు అన్ని రకాల పూజలు చేస్తారు. ఈ విశ్వంలో వీరిని మించి సర్వశ్రేష్ఠ ధర్మాత్ములెవరూ మరిలేరు." అన్నాడు.

రాజు ఆ వృద్ధునకు నమస్కరించి అధిక దక్షిణలిచ్చి వీరూ మంచి ధర్మాత్ములే అంటూ పంపివేశాడు.

మూడవ కొడుకు వచ్చాడు. అతనితో కూడ ఓ స్వామీజీ ఉన్నాడు. ఆ స్వామీ జీవిస్తూనే కళ్ళు మూసుకొని కూర్చొండి పోయాడు. చిరిగిన బట్టలతో అస్థి పంజరంలా ఉన్న ఆకారంతో ఆయన కనిపిస్తున్నాడు. అందరూ కూర్చొన్న తర్వాత మూడవ కొడుకు. ప్రభూ! వీరు ఎంతగానో నేను ప్రార్థించగా యిక్కడకు విచ్చేశారు. వీరు మహాతపస్వులు వారానికి ఒక్కసారి మాత్రమే క్షీరపానం చేస్తారు. ఎండాకాంలో అగ్ని మధ్యలో ఉంటారు. చలికాలంలో నీళ్ళలో నిలబడతారు. సదాభగవంతుని ధ్యానంలో ఉండే వీరికి మించిన ధర్మాత్ములు లభించడం దుర్లభమే. అన్నాడు రాజుగారు ఆస్వామీజికి సాష్టాంగ ప్రణామం చేసి వారి ఆశీస్సులు అందుకొని వీడ్కోలు పలికాడు. ఆపై వీరూ ధర్మాత్మలే అన్నాడు.

అందరి తరువాత చిన్న కొడుకువచ్చాడు. అతనితో మాసిన బట్టలు కట్టుకున్న పల్లెలో నివసించే ఓరైతు ఉన్నాడు. దూరం నుండియే రాజుకు దండాలు పెడుతూ భయపడుతూ వచ్చి నిలబడ్డాడు. అన్నలు ముగ్గురూ తమ్ముని అమాయకత్వానికి నవ్వుకున్నారు. అప్పుడు చిన్నవాడు "ప్రభూ! ఓ కుక్కకు గాయం తగిలింది. ఇతడది చూసి దాని గాయం కడిగాడు. అంతే నేనతణ్ణి తీసుకు వచ్చాను ఇతడు ధర్మాత్ముడవునో కాదో మీరే నిర్ణయించండి."

రాజు అడిగాడు, "ఏమయ్యా! నువ్వు ఏం ధర్మం చేస్తుంటావు?" రైతు పలికాడు "ప్రభూ! నేను చదువుకున్న వాణ్ణికాదు. నాకు ధర్మం అంటే ఏం తెలుస్తుంది. ఎవరైనా జబ్బుపడితే సేవ చేస్తాను. ఎవరైనా యాచిస్తే గుప్పెడు మెతుకులు పెడతాను."

ఆ మాటలు విన్న రాజు "ఇతడే అందరి కన్నా గొప్ప ధర్మాత్ముడు. అసత్యమాడక పోవడం, గోపూజ చేయడం, తీర్థయాత్రలు చేయడం, వ్రతాలు చేయడం, తపస్సు చేయడం అవశ్యమైనధర్మమే. కానీ ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం, రోగులకు సేవ చేయడం. కష్టంలో ఉన్న వారికి చేయూత నివ్వడం సర్వాధికమైన ధర్మం. ఇతరులకు సహకరించే వారికి దేవదేవుని సహాయం ఎల్లవేళలా ఉంటుంది. పరోపకారాన్ని మించిన పరమ ధర్మంలేదు" అని అన్నాడు.

## 10. ఆటో డ్రైవర్ నిజాయితీ

ఏలూరు పట్టణములో నరేష్ అనే అతడు ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. అతనికి తల్లి, తండ్రి, భార్య ఒక కుమార్తె ఉన్నారు. సంపాదన చాలక అవస్థలు పడుతుండేవారు.

తల్లి అనారోగ్యము, తండ్రిసంపాదన అంతంతమాత్రమే. అయినా నీతి తప్పక వచ్చే సంపాదనతో తృప్తిగా జీవిస్తున్నారు. ఒకరోజున అతని ఆటోలో అశోక్‌నగర్‌కి స్టేషన్ నుండి ఎక్కారు. వారు ధనవంతులు. నగలుగల బ్యాగ్ ఆటో వెనుక భాగములో పెట్టి దిగిపోయారు. ఇంటికి వచ్చి భోజనము చేస్తుండగా కూతురు ఆటో ఎక్కి ఆడుకుంటూ ఆబ్యాగ్‌ను చూసి ఇంటిలోనికి తెచ్చింది. బ్యాగ్‌లో తినే ఆహారపదార్థము లేమైనా వున్నాయెమో అని జిప్ వూడదీసి చూస్తే దాంట్లో బంగారు ఆభరణాలు, డబ్బు ఉన్నాయి. వెంటనే తల్లి తండ్రులకు చెప్పింది.

నరేష్ వెంటనే భోజనము ముగించుకొని పోలీస్‌స్టేషన్ వెళ్ళి బ్యాగ్ విషయము చెప్పి, వారి ఇంటి గుర్తులు చెప్పాడు. పోలీస్ వారితో కలిసి ఆ ఇంటికి వెళ్ళి విషయము చెప్పగా, వారు బ్యాగ్ తమదేనని ప్రయాణబడలికలో గమనించలేదని చెప్పారు. ఆటో డ్రైవర్ నిజాయితీకి సంతసించి పదివేల రూపాయలు ఇచ్చి. తమ పిల్లల్ని రోజు ఆటోలో స్కూల్‌కి తీసుకొని వెళితే నెలకు 500/- లు ఇస్తామని చెప్పారు. ఆ విధముగా చేసి తన సంపాదన పెంచుకున్నాడు. అంతేగాక ఆ వీధిలోని పిల్లల్ని స్కూల్‌కు తీసికెళ్ళి తన సంపాదన పెంచుకొని తన తల్లి ఆరోగ్యము బాగు చేయించుకొని సుఖముగా ఉన్నాడు. 'నిజాయితీగా ఉంటే ఎప్పటికైనా మంచి రోజులు వస్తాయి', అని గ్రహించి నిజాయితీగా ఉండటం పిల్లలు అలవరచుకోవాలి.

## 11. నిజమైన మైత్రి పరహితాన్నే కోరుతుంది

అదొక విశాలమయిన ఊరు. ఆ ఊరి పేరు రామాపురం. రామాపురంలో ఒక వీధిలో వేణు, విశాల్ అనే ఇద్దరు మంచి మిత్రులు ఉండేవారు. ఒకే వీధిలో ప్రక్క ప్రక్క ఇళ్ళలో ఉండటం, చిన్నతనంనుంచి కలిసే పెరగడం వారిద్దరినీ మంచి మిత్రులని చేసింది.

వారిద్దరి మైత్రి ఎంతగా పెరిగిందంటే ఏ ఒక్కరోజు ఎవరిని చూడకపోయినా రెండోవాడికి అస్సలు మనసు స్థిమితపడేది కాదు. ఒకరంటే ఒకరికి ప్రాణం. అలాంటి వీరిద్దరూ అదే ఊర్లోఉన్న ఒకే పాఠశాలలో 7వ తరగతి చదువుతున్నారు.

అన్నిరంగాల్లోనూ వీరిద్దరూ ప్రథమస్థానంలో ఉంటూండేవారు. ఏ పోటీ పరీక్షలో అయినా ఒకరిది ప్రథమస్థానమైతే మరొకరిది ద్వితీయస్థానము. వీరిద్దరూ ఎవరి పుట్టినరోజొచ్చినా రెండవవారికి తప్పక బహుమతి అందించేవారు. అంతేకాదు ఎవరికి ఏ బహుమతి కావాలో స్వతంత్రించి అడిగిపుచ్చుకొనేంత చనువుకూడా ఇరువురిలో ఉండేది.

ఎంతటి స్నేహితులైనా ఎవరి సహజగుణాలు వారివి. ఎవరి ప్రతిభలు వారివి. అన్నిరంగాల్లో యథాతథంగా ఇరువురూ సమానంగా ఉండలేరు కదా! అలానే వేణు, విశాల్‌ల ఇద్దరిలో విశాల్‌కు మాత్రం చిత్రలేఖనంలో మార్కులు బాగా వచ్చేవి. వేణు ఎంత ప్రయత్నించినా విశాల్‌తో సమానంగా బొమ్మలు వేయలేకపోయేవాడు.

ఒక సంవత్సరం వేణు పుట్టినరోజు వచ్చింది. పుట్టినరోజు వస్తోందంటే విశాల్‌ని తనకి ఏ బహుమతి కావాలో ముందే చెప్పే వేణు ఈసారి విశాల్‌ని బహుమతి గురించి అడగలేదు. దానికి కారణం నాలుగు రోజుల క్రితం వీళ్ళ తరగతి టీచర్ సరిగ్గా వేణు పుట్టినరోజునాడే "చిత్రలేఖన పోటీ" ఉన్నట్లుగా ప్రకటించారు. దాంతో 'వేణు' నేను 'విశాల్' కన్నా బొమ్మలు బాగా వేయలేను కాబట్టి నాకు ప్రథమ బహుమతి రాదు అనే దిగులుతోనే గడిపేశాడు.

నిజమైన మిత్రుడు స్నేహితునియొక్క మనసులోని విషయాలను కూడా గ్రహించి ఆ మిత్రుడి బాధను కూడా తొలగించగలుగుతాడు.

వేణు విచారాన్ని పసిగట్టాడు విశాల్. వేణు మాత్రం ఆరోజు తన పుట్టినరోజు అన్న విషయాన్నే మర్చిపోయాడు. కారణం ఆరోజు చిత్రలేఖన పోటీయే పదే పదే మనసులో మెదులుతూ ఉండటంవల్ల. ఆరోజు వేణు తల్లి అతనికి తలంటుపోసి, కొత్త బట్టలు వేసేదాకా తన పుట్టినరోజు జ్ఞాపకమేలేదు. సరే! అమ్మ ఇచ్చిన మిఠాయిలు తీసుకొని విశాల్ దగ్గరికి రోజూలాగే వెళ్ళాడు. విశాల్‌తో పాటు వాళ్ళ ఇంట్లో అందరికీ మిఠాయిలు పంచాడు. కాని విశాల్‌ని అడగవలసిన బహుమతి సంగతి అడగలేదు. విశాల్‌కి వేణుకి మనసులో ఉన్న విచారము అర్థమయింది. ఇద్దరూ కలసి పాఠశాలకు వెళ్ళారు.

కొన్ని క్లాసులు అయినతరువాత చిత్రలేఖన పోటీ ప్రారంభమయింది. వేణు తన సాధనచేసిన చిత్రాన్ని వేశాడు. వేస్తున్నంత సేపూ తనకు బహుమతి ఎలాగూ రాదు అనుకుంటూనే ఉన్నాడు. పరీక్షా సమయం అయిపోయింది. వేణు తను వేసిన చిత్రాన్ని మరోసారి చూసుకుని తన పేరు వ్రాసి ఇచ్చేంతలో విశాల్ వచ్చాడు. "ఒరేయ్ వేణూ! నీ పేపరు కూడా నేనే ఇస్తాను. ఇలా తే!" అంటూ పేపరు తీసుకున్నాడు.

వేణు "ఒరేయ్ విశాల్ నేను ఇంకా దానిమీద నా పేరు రాయలేదురా!" అని కంగారుగా అన్నాడు.

"అయినా, నీ పేరు నాకు తెలీదా ఏంటి?" అంటూ ఓ నవ్వు నవ్వి! "నేను రాసి ఇస్తాన్లే" అంటూ పేరు రాసి క్లాసు మాష్టారుకి పేపరు ఇచ్చేశాడు విశాల్.

ఆరోజు సాయంత్రమే చిత్రలేఖన పరీక్షా ఫలితాలు బహుమతులు కూడా!

అన్ని తరగతులు పూర్తయిన తరువాత సాయంత్రం పాఠశాల ప్రధానాధ్యాపకులవారు బహుమతులు ప్రకటిస్తూ వేణుకు చిత్రలేఖనంలో ప్రథమ బహుమతి వచ్చినట్లు ప్రకటించారు. వేణు బహుమతి తీసుకోవడానికి వేదిక మీదకి వెళ్తూ విశాల్‌కేసి చూశాడు. విశాల్ చిరునవ్వు నవ్వుతూ చప్పట్లు కొడుతున్నాడు. బహుమతి తీసుకున్నాక కూడా వేణూకి నమ్మశక్యం కాలేదు.

తిరిగి వచ్చిన వేణుకు విశాల్ ఒక "డ్రాయింగు బుక్" ను ఇస్తూ "ఒరేయ్! ఇదిగో నీ పుట్టినరోజు బహుమతి" అంటూ ఇచ్చాడు.

వేణు ఆనందానికి అవధుల్లేవు. చిత్రలేఖనంలో ప్రథమస్థానం రావడం, విశాల్ డ్రాయింగ్ బుక్ ఇవ్వడం ఒక్కసారి విశాల్‌ని కౌగిలించుకుని "విశాల్ నాకు ఈవేళ ఎంత ఆనందంగా ఉందో చెప్పలేను" అంటూ భుజాలు పట్టుకు ఊపేశాడు.

స్నేహితుని యొక్క ఆనందాన్ని చూసి మరింత మురిసిపోయాడు విశాల్. వీరిద్దరి ఆనందాన్ని దూరం నించి గమనిస్తున్న వాళ్ళ క్లాస్‌టీచరు మాత్రం వీరి మైత్రి మరింత పెరగాలని మనసులోనే ఆశీర్వదించారు.

కారణం విశాల్ చేసినపని టీచరు కనిపెట్టారు గనుక. అది వేణు వేసిన బొమ్మకు విశాల్‌పేరు రాసి, విశాల్ వేసిన చిత్రానికి వేణు పేరు రాసి విశాల్ రెండు పేపర్లు టీచరుకు అందించడం.

స్నేహము కోసం వేణు పుట్టినరోజునాడు అతనికి ప్రథమ బహుమతి వచ్చేలా చేయాలని విశాల్ చేసిన త్యాగం క్లాస్ టీచరుకు నచ్చింది.

మనసులోనే మరోమారు అభినందించారు వీరిద్దరినీ.

నిజమైన మైత్రి ఎదుటివాడి మనసులోని బాధలను గ్రహించేట్లు చేస్తుంది. వారి సమస్యలే తన సమస్యలైనట్లు భావించడమే కాకుండా తను వెనుకనుండి మిత్రుని ఉన్నతినే చూడాలని కోరుకుంటుంది. తన మిత్రుని సంతోషమే తన సంతోషంగా భావించేట్లు చేస్తుంది. మనమూ మంచి మిత్రుల్లా ఉండే ప్రయత్నం చేద్దాం.

## స్ఫూర్తి దాతలు

# 1. దాశరథి కృష్ణమాచార్య

తెలంగాణా ప్రజల కన్నీళ్ళను "అగ్నిధార" గా మలిచి నిజాం పాలనమీదకు ఎక్కుపెట్టిన మహాకవి దాశరథి కృష్ణమాచార్య. 'దాశరథి'గా ఆయన సుప్రసిద్ధుడు. పద్యాన్ని పదునైన ఆయుధంగా చేసుకొని తెలంగాణా విముక్తికోసం ఉద్యమించిన దాశరథి ప్రాతఃస్మరణీయుడు.

"నా తెలంగాణా కోటి రతనాల వీణ" అని గర్వంగా ప్రకటించి ఉద్యమానికి ప్రేరణ అందించిన కవి దాశరథి.

దాశరథి కృష్ణమాచార్య వరంగల్‌జిల్లా గూడూరు గ్రామంలో జన్మించారు. బాల్యం ఖమ్మంజిల్లా మధిరలో గడిచింది. ఈయన సంస్కృతం, ఆంగ్లం, ఉర్దూ భాషలలో మంచి పండితుడు. చిన్నతనంలోనే పద్యం అల్లడంలో ప్రావీణ్యం సంపాదించాడు. ప్రారంభంలో కమ్యూనిష్టు పార్టీ సభ్యునిగా ఉండి, రెండవ ప్రపంచయుద్ధ సమయంలో ఆ పార్టీ వైఖరి నచ్చక పార్టీనుండి బయటకు వచ్చాడు. తరువాత హైదరాబాద్ సంస్థానంలో నిజాం అరాచక ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాల్లో పాలుపంచుకున్నాడు. ఉపాధ్యాయునిగా, పంచాయతీ ఇన్‌స్పెక్టరుగా, ఆకాశవాణి ప్రయోక్తగా ఉద్యోగాలు చేశాడు. సాహిత్యంలో దాశరథి అనేక ప్రక్రియల్లో కృషిచేశారు. కథలు, నాటికలు, సినిమాపాటలు, కవితలు రాశాడు.

నిజాం పాలనలో రకరకాల హింసలను అనుభవిస్తున్న తెలంగాణాను చూచి చలించిపోయాడు. పీడిత ప్రజల గొంతుగా మారి నినదించాడు.

"రైతుదే తెలంగాణా రైతుదే – ముసలినక్కకు రాజరికంబు దక్కునే" అని గర్జించాడు.

"దగాకోరు, బడాచోరు, రజాకారు పోషకుడవు దిగిపొమ్మని జగత్తంతా నగరాలు కొదుతున్నది. దిగిపోవోయ్, తెగిపోవోయ్" – అని నిజామును సూటిగా గద్దిస్తూ రచనలు చేశాడు.

ఆంధ్రమహాసభలో చైతన్యవంతమైన పాత్ర నిర్వహించి నిజాం ప్రభుత్వంచేత జైలుశిక్ష అనుభవించాడు. నిజామాబాదులోని ఇందూర్‌కోటలో ఆయన్ని మరో నూటయాభైమందితో ఖైదీచేసి ఉంచారు. ఆయనతోపాటు ఖైదులో వట్టికోట ఆళ్వారుస్వామి కూడా ఉన్నారు. పళ్ళుతోముకోవడానికి ఇచ్చిన బొగ్గుతో జైలుగోడలమీద పద్యాలు రాసి దెబ్బలు తిన్నాడు.

"నా తెలంగాణా – కోటి రతనాల వీణ" – ఈ గోడపై రాసినదే!

ఈయన మంచి ఉపన్యాసకుడు. భావప్రేరిత ఉపన్యాసాలతో ఊరూరా సాంస్కృతిక చైతన్యం కలిగించాడు. ఆంధ్ర సారస్వత పరిషత్తు నిర్మాతల్లో ఒకరు. 1953 లో తెలంగాణా రచయితల సంఘాన్ని స్థాపించి అధ్యక్షుడుగా

జిల్లాల్లో సాహితీచైతన్యాన్ని రగిలించాడు. ఆంధ్రప్రదేశ్ ఆస్థానకవిగా 1977 ఆగష్టు 15 నుండి 1983 వరకు పనిచేశాడు.

రాష్ట్ర, కేంద్ర అకాడమీ బహుమతులు గెలుచుకున్నాడు. అనేక సినిమాలకు గీతాలు రచించి అభిమానులను సంపాదించుకున్నారు. మీర్జాగాలిబ్ ఉర్దూ గజళ్ళను తెలుగులోకి 'గాలిబ్ గీతాలు' పేరున అనువదించారు. తల్లిమీద, తల్లి తెలంగాణామీద ఆయన రచించిన పద్యాలు ఎందరికో ఉత్తేజాన్ని కలిగించాయి. ఈయన 'అగ్నిధార, మహేంద్రోదయం, రుద్రవీణ, మార్పు నా తీర్పు, ఆలోచనాలోచనాలు, ధ్వజమెత్తిన ప్రజ' – వంటి కవితా సంపుటాలు రచించారు. 'కవితాపుష్పకం' అనే రచనకి ఆంధ్రప్రదేశ్ సాహిత్యఅకాడమి పురస్కారం, 'తిమిరంతో సమరం' అనే రచనకి కేంద్రసాహిత్య పురస్కారం లభించాయి. మచ్చుకు దాశరథి రచనల్లో తెలుగుజాతి ఆత్మకథలాంటిది ఈ పద్యం

ఎవరు కాకతి! ఎవరు రుద్రమ!
ఎవరు రాయలు! ఎవరు సింగన!
అంతా నేనే! అన్నీ నేనే!
అలుగు నేనే! పులుగు నేనే!
వెలుగు నేనే ! తెలుగు నేనే!

1975 లో ఆంధ్ర యూనివర్శిటీ కళాప్రపూర్ణ బిరుదుతో గౌరవించింది.

*ఆత్మవిశ్వాసం ద్వారా సర్వం సాధించగలం*

*మీరెలా ఆలోచిస్తే అలాగే తయారవుతారు. బలహీనులమని భావిస్తే బలహీనులే అవుతారు. శక్తిని స్మరిస్తే శక్తిమంతులే అవుతారు.*

**– స్వామి వివేకానంద**

# 2. శ్రీ ముద్దు రామకృష్ణయ్య

## (1907-1985)

ప్రపంచీకరణ నేపథ్యంలో ఉమ్మడి కుంటుంబాలు - చిన్న కుటుంబాలుగా మారుతున్నాయి. ప్రేమ, ఆప్యాయత, అనురాగం, వాత్సల్యం అనే పదాలు బలహీనమైన మానవుల జీవ లక్షణాలనే భావన పెరుగుతోంది. స్వార్థం, సంకుచితత్వాలను బలమైన ఉత్తమ లక్షణాలుగా భావించుకునే జాతి తయారౌతోంది. సంప్రదాయం, సంస్కృతి అనే రెండు పదాలు తమ ఉనికిని కోల్పోయే ప్రమాదం ఏర్పడింది. 21వ శతాబ్దం తొలి అంచులో ఉన్న మనం గత శతాబ్దంలోకి తొంగిచూస్తే కొన్ని నిలకడైన మెరుపు తీగలు, కొన్ని శక్తి కేంద్రాలు కనబడపతాయి.

**అలాంటి ఒక అపారమైన శక్తికేంద్రం శ్రీ ముద్దు రామకృష్ణయ్య.**

నూరేళ్ళక్రితం కరీంనగర్ జిల్లాలో ప్రభవించిన సానలు తీరిన జాతిరత్నం శ్రీ ముద్దు రామకృష్ణయ్య!

**అది మంథిని. ఒక విలక్షణమైన అగ్రహారం. గోదావరి గలగలలతో వేదమంత్రాలు శృతి కలిపి నినదించే పవిత్రభూమి. యజ్ఞ యాగాది క్రతువులు, హోమధూమాలతో ప్రకృతి పరవశించిన నేల. సంప్రదాయపు మేలిముసుగు కప్పుకున్న సువర్ణ శిల్పం ఆ గ్రామం. ఇప్పటికీ అడుగడుగునా శివాలయాల మండపాలతో మసకబారిన మహర్షి ఆశ్రమంలా కనిపిస్తుంది మంథిని.**

అక్కడ 1907 - అక్టోబర్ 18న జన్మించిన ఒక పేద బ్రాహ్మణ శిశువు మంథిని నుంచి బయల్దేరి మహాసముద్రాలు దాటి, ఖండఖండాలు తిరిగివచ్చి వేలాది మందికి విద్యను, వ్యక్తిత్వ వికాసాన్ని కలిగించి భారతీయ విద్యా వ్యవస్థకు కొత్త నిర్వచనాన్ని చెప్పాడు. ఆ బిడ్డ పేరు ముద్దు రామకృష్ణయ్య.

1907 లో జన్మించిన వారికి 2007 శత జయంతి! వారి శిష్యులు, ప్రశిష్యులు, కుటుంబసభ్యులు కలిసి సమిష్టిగా నిర్వహిస్తున్న గౌరవానురాగపూర్వక వైజయంతి!!

ఉజ్వలమైన స్ఫూర్తిమంతమైన శ్రీ ముద్దు రామకృష్ణయ్య గారి జీవన గాథాస్వరూపానికి "కొండ అద్దమందు"లా చూపించే చిరుప్రయత్నమే ఆయన గురించి రూపొందించిన కరదీపిక.

శ్రీ ముద్దు రామకృష్ణయ్యగారి తండ్రి ముద్దు రాజన్న, తల్లి అమ్మాయి. మంథిని జన్మస్థలం. బాల్యం అంతా కష్టాలు కడగండ్లమయం. అయినా ధైర్యం ఆయన జీవలక్షణం. జ్ఞానాన్వేషణా మార్గంలో ఎన్నో విద్యలు నేర్చుకున్నారు. ఆ విద్యలలో ఒక్కొక్కసారి ఒక్కొక్క విద్య ఆయనకు జీవితంలో ఉపయోగపడింది.

ఆ రోజుల్లో ఇంగ్లీష్ నేర్చుకోవడం గొప్ప. ఇంగ్లాండ్ వెళ్ళడం మరీను. దుర్భర దారిద్ర్యంలో నుంచి ఒక గొప్ప భవిష్యత్తును ఊహించి, దాన్ని చేరుకోవడం కోసం చేసిన ప్రయత్నమే ఆయన జీవితం.

పట్టభద్రుడైన తరువాత పై చదువుల కోసం ఓడపై ఇంగ్లాండ్ వెళ్ళారు. అక్కడ చదువు కోసం ఒక హొటల్‌లో నౌకరుగా, చౌకీదారుగా కూడా పనిచేశారు. తన మేథాశక్తితో ఇంగ్లాండ్‌లో బి.బి.సి.లో న్యూస్ రీడర్‌గా చేరారు. "విద్వాన్ సర్వత్ర పూజ్యతే!" అన్న ఆర్యోక్తి ఆయన పట్ల నిజమయింది.

ఆపై సిలోన్, బర్మా, ఇండోనేషియా, ఇండోచైనా, ఫిలిప్పైన్స్, అమెరికాలోని 30 రాష్ట్రాలు, ఫ్రాన్స్, ఇటలీ, ఈజిప్ట్, అరేబియా, రష్యా ఇవన్నీ వెళ్ళారు. అక్కడి విద్యను, సంస్కృతిని, సంప్రదాయాలను పరిశీలించారు. తన మేథ నిండా ఎన్నెన్నో అనుభవాలను, జ్ఞాపకాలను, విజ్ఞానాన్ని నింపుకున్నారు. ఇండియా వచ్చారు.

విజయవాడలో ఆల్ ఇండియా రేడియోలో అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉద్యోగంలో చేరారు. కొన్నాళ్ళ తర్వాత తన జీవిత గమ్యమైన విద్యారంగంలో ప్రవేశించారు. B.A., B.Ed., M.Ed., (UK Leads University), MRST (London) డిగ్రీలున్న ఆయన సేవలను రాష్ట్ర ప్రభుత్వ విద్యాశాఖ నిజామాబాద్ జిల్లా విద్యాధికారిగా, వరంగల్ బి.యిడి. కళాశాల వైస్ ప్రిన్సిపాల్‌గా, జగిత్యాల మల్టీ పర్పస్ పాఠశాల ప్రిన్సిపాల్‌గా వినియోగించు కుంది.

**ఎక్కడ పని చేసినా ఆయనది విలక్షణ వ్యక్తిత్వం. ఎదుటి వారిని అయస్కాంతంలా ఆకర్షించే వాక్చమత్కారం. గౌరవం కలిగించే క్రమశిక్షణ, భయం కలిగించే మౌనం, ప్రేమ పొంగి పొరలించే క్షమ. ఇవన్నీ కలిస్తే శ్రీ ముద్దు రామకృష్ణయ్య.** వారి గురించి ఎన్నెన్నో సంఘటనలు చెపుతారు. ఆయన వరంగల్‌లో పనిచేసేటపుడు కళాశాలలో ఒక చింతచెట్టు ఉండేది. దాని కాయను తెంపి తన మూడేళ్ళ మనుమరాలికి ఇచ్చాడట బడి నౌకరు. అంతే! దాన్ని ఆయన చర్చించి, శోధించి, బడికి రూ।। 10/- జరిమానా కట్టారు. ఆ సంఘటన చాలు ఆయన నిబద్ధత చెప్పడానికి.

జగిత్యాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేసే రోజుల్లో ప్రతి తరగతి గదిలో స్పీకర్ ఫోన్ పెట్టడం ఈనాటికీ వినూత్నమైన చర్యే. అలాగే ప్రతి ఏడాది విద్యార్థులతో భారతదేశ యాత్ర చేయించేవారు.

బడి పిల్లలు ఆయనను ప్రిన్సిపాల్ అనకుండా 'పితాజీ' అని పిల్చేవారు. ఎంత కమ్మని పిలుపో! ఆయన విద్యార్థులలో నేడు డాక్టర్లు, జడ్జీలు, న్యాయవాదులు, అధికారులు, లెక్చరర్లు, టీచర్లు, యం.యల్.ఎ.లు, వ్యాపారవేత్తలు, కవులు, మేధావులు, కళాకారులు ఉన్నారు.

**ఆయనతో ఆనాడు పరిచయం ఉన్న ఏ వ్యక్తిని పలకరించినా పొంగిపోతారు. అనర్గళంగా ఆయన గురించి మాట్లాడతారు. కన్నీళ్ళు పెట్టుకుంటారు. వారి గొంతు గాద్గదమౌతుంది. వారిలో గర్వం తొణికిసలాడుతుంది. తమ వ్యక్తిత్వ వికాసానికి శ్రీ ముద్దు రామకృష్ణయ్యగారు కారణం అని ఉద్వేగంగా చెపుతారు. ఆయన అమృత చైతన్యం మనకు నిరంతరం మార్గదర్శి కాగలదు.**

# 3. శ్రీనివాస రామానుజం

ప్రాచీన భారతదేశ సుప్రసిద్ధ గణిత శాస్త్రజ్ఞులలో భాస్కరాచార్యుడు, ఆర్యభట్టు ఎంత గొప్పవారో ఆధునిక కాలానికి శ్రీ శ్రీనివాస రామానుజం అంత గొప్పవాడు.

ఈ మహా గణిత శాస్త్రజ్ఞుడు జీవించినది 33 సంవత్సరాలైనా సూర్య చంద్రులున్నంత కాలం గణిత శాస్త్రములో ఈ పుణ్యపురుషుని కీర్తి దిగంతాలకు వ్యాపించి ఉంటుంది.

శ్రీ రామానుజం మద్రాసు రాష్ట్రంలోని ఓ కుగ్రామంలో సుప్రసిద్ధి చెందిన ఓ తమిళ బ్రాహ్మణ కుటుంబంలో 22-12-1887న జన్మించాడు. పువ్వు పుట్టగానే దాని పరిమళం వికసిస్తుందనే సూక్తి ఈ మహానుభావుని విషయంలో రుజువుపరచింది. ప్రాథమిక దశలోనే లెక్కలలో ఈయనకున్న పాండిత్యానికి కుటుంబసభ్యులు ఉపాధ్యాయులేగాక, ఆ ప్రాంతంలో నివసించు ప్రజలంతా ఆశ్చర్యపోయారు. గణితశాస్త్రంలో ఈయనకున్న విజ్ఞానం ఎంతో అపారమైనది. కాస్త తీరిక దొరికితే తన శక్తికి మించిన లెక్కలను తీసుకొని వాటిని వచ్చేవరకూ చేస్తూ కూర్చుండేవాడు. లెక్కలు చేస్తున్నప్పుడీయనకు మరో విషయం మనస్సుకు వచ్చేదికాదు. అసలు మరో విషయాన్ని ఆయన పట్టించుకునేవాడు కాదు. ఆకలిదప్పులు కూడా ఆయనను లెక్కలనుండి మరపించేవి కాదు. అంతటి నిష్టతో ఆయన లెక్కలు చేస్తుండేవాడు.

హైస్కూలు విద్య దాటి కాలేజిలో అడుగుపెట్టాక రామానుజం కీర్తి మరీ ఇనుమడించింది. ఎవ్వరికీ అంతుబట్టని లెక్కలను కూడా ఆయన సునాయాసంగా చేస్తుండేవాడు. దానితో ఆయన ఇంటర్ పరీక్షల్లో ఉత్తీర్ణుడు కాలేకపోయారు. కానీ లెక్కలలో మాత్రం నూటికి నూరు మార్కులు తెచ్చుకున్నాడు.

అంతంత మాత్రమైన ఆర్థిక పరిస్థితి. దానికితోడు పరీక్ష తప్పడంవలన రామానుజం మళ్ళీ చదవడానికి అవకాశం లేకపోయింది. అయితే చదువు సాగనంత మాత్రాన ఆయన ఊరుకోలేదు.

ఆ కాలాన్ని కూడా లెక్కలకే వినియోగించుకుని తాను కనిపెట్టిన అనేక కొత్త సిద్ధాంతాలను పత్రికలకు వ్యాసాలు రాశాడు. గణితశాస్త్రంలో రామానుజం కనిపెట్టిన సూత్రాలు, సిద్ధాంతాలు, పెద్ద సంచలనాన్ని కలిగించాయి.

అయితే అప్పట్లో ఆయనకు ఆర్థికంగా చెప్పుకోదగ్గ ఉపయోగాలు జరగలేదు. కాని ఆయన మద్రాసు రాష్ట్రంలో ప్రముఖ ఉద్యోగిగా ఉన్నప్పుడు ఒక బ్రిటీషు దేశస్తుడు రామానుజానికి మద్రాసు యూనివర్శిటీ నుండి 75 రూపాయల చొప్పున స్కాలర్‌షిప్ ఇప్పించాడు. అప్పటికి రామానుజం వయస్సు 25 సంవత్సరాలు.

రామానుజం తనకు వచ్చే ఆ కాస్త డబ్బుతో కాలం గడుపుతూ గణితశాస్త్రంలో ఇంకా అనేక కొత్త ప్రయోగాలను చేస్తూ వాటిని ఎప్పటికప్పుడు వ్యాసాల రూపంలో పత్రికలకు పంపుతున్నాడు.

ఈయన పాండిత్యాన్ని గుర్తించిన ఇంగ్లండ్‌లోని కేంబ్రిడ్జి యూనివర్శిటీవారు గణితశాస్త్రంలో పరిశోధన

చేసేందుకు 1914 సంవత్సరంలో రామానుజాన్ని ఆహ్వానించారు. ఈ వార్త విన్న మద్రాసు యూనివర్శిటీవారు అక్కడికి వెళ్ళి పరిశోధించటానికయ్యే ఖర్చులు తాము భరిస్తామని చెప్పారు.

ఆ విధంగా రామానుజం లండన్ వెళ్ళి గణితశాస్త్రం పరిశోధించి ఇంకా అనేక ప్రయోగాలు చేసి మొత్తం యూరప్ దేశంలోని గణితశాస్త్ర ప్రముఖునిగా కీర్తిపొందాడు. ప్రపంచంలోని ప్రముఖ పత్రికలన్నింటిలో ఆయన వ్యాసాలు ప్రచురించడమేగాక, ఏకకంఠంతో ఆయన బహుముఖ పాండిత్యాన్ని గురించి ప్రశంసించినవి.

శ్రీనివాస రామానుజం ఆధునిక కాలంలో గణితశాస్త్రంలో ప్రపంచంలోనే ఇంక అంతవాడులేడని యూరప్ దేశస్తులతో అనిపించుకుని భారతదేశం వచ్చాడు. నిజానికి ఈ మహాపురుషునికి భారతదేశంలో ఎంతో ఘనమైన స్వాగతము లభించవలసియున్నది. అందుకే త్రినిటీ కళాశాల ప్రధాన లెక్కల ఆచార్యుడైన డా॥ జి. హెచ్.హార్డీ రామానుజం గణితశాస్త్రంలో సంపూర్ణ పండితుడై భారతదేశం తిరిగి వస్తున్నాడు. బహుశా మళ్ళీ ఈ దేశంలో ఇంతటివాడు జన్మించకపోవచ్చు. అందుకే ఈ మహామహునికి సోదరులైన భారతీయులు ఘనంగా స్వాగతమిస్తారు అన్నాడు.

ఈ మహానుభావుడి పరిశోధనలను కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయంవారు వెంటనే అన్నింటినీ గ్రంథరూపంలో ప్రచురించారు.

మహామనుష్యులెప్పుడూ అల్పాయువులనేది మళ్ళీ ఓసారి శ్రీనివాస రామానుజం విషయంలో జరిగింది. హిందూమతాన్ని నిలబెట్టిన శంకరుడు ప్రాచ్య, పాశ్చాత్య దేశాలలో హిందూమత ప్రచారం చేసి విశిష్టమైనది హిందూమతమని వారి కెరిగింది. వచ్చిన వివేకానందుని కోవలోనే రామానుజం ఆత్మ నడిచినది.

గణితశాస్త్రం ఉన్నంతకాలం ప్రపంచంలో రామానుజం చిరంజీవిగానే ఉంటాడు.

*కార్యాచరణ మంచిదే కాని దానికి మూలం ఆలోచన...*

*కాబట్టి బుద్ధిని ఉన్నత విషయాలతో, అద్వితీయమైన ఆదర్శాలతో నింపుకోండి.*

*రేయింబవళ్ళు వాటినే స్మరించండి. అప్పుడే అద్భుతాలను సాధించగలరు.*

# 4. థామస్ మన్రో

'ప్రజల పట్ల నిజాయితీతో కూడిన సానుభూతిగల సునిశిత మేధావి' అని కార్ల్ మార్క్సుచే ప్రశంస లందుకొన్న పరిపాలకుడు సర్‌థామస్ మన్రో.

వ్యాపారులుగా వచ్చి మన దేశంలో స్థిరపడి దేశాన్ని దోచుకున్నారు ఆంగ్లేయులు. వారిలో అధిక సంఖ్యాకులు అవినీతిపరులు. అక్రమార్జనాపరులు, అహంకారులు. ప్రజలపట్ల ఏమాత్రం అభిమానం లేనివారు.

కారుచీకట్లలో వెలుగురేఖలవలె కొందరు నిజంగా మన దేశాన్ని ప్రజలను ప్రేమించారు. మన సంస్కృతి పట్ల గౌరవంతో వ్యవహరించారు.

ప్రధానంగా తెలుగు ప్రజలు మరువరాని తెల్లదొరలలో అగ్రగణ్యుడు సర్ థామస్ మన్రో. రాయలసీమ వాసులకు ఆపద్బాంధవుడు మన్రో.

రాయలసీమ తరతరాలుగా అనావృష్టికి గురియైన ప్రాంతం. ప్రకృతి వైపరీత్యానికి తోడుగా, పిండారీల దోపిడులు, పాలెగాండ్ర దురాగతాలు సీమ ప్రజలను నానా యాతనలకు గురిచేసేవి. అశాంతితో పరితపిస్తున్న ప్రజానీకాన్ని ఆదుకొని, సీమలో శాంతిభద్రతలను నెలకొల్పిన మహనీయుడు మన్రో.

1792లో జరిగిన శ్రీరంగపట్నం సంధి ప్రకారం కడప, అనంతపురం, కర్నూలు, బళ్ళారి నిజాం పాలనలోనికి వచ్చాయి. నిజాం పాలనలో అరాచకం మరింత పెరిగింది. పాలెగాళ్ళ అక్రమాలకు అంతులేకపోయింది. కడపజిల్లాలోని వేముల పాళెగాడు తనను తాను రాజుగా ప్రకటించుకొన్నాడు. కొరవలు, యానాదులు, బేదర్లు, ఎరుకలు గ్రామాలపై బడి దోచుకోసాగారు. అట్టి పరిస్థితులలో 12-10-1800న దత్త మండలాల ప్రధాన కలెక్టరుగా మన్రో నియమింపబడినాడు. అతని క్రింద నలుగురు సబ్‌కలెక్టర్లు వుండేవారు. ఆదవాని, హర్పనహళ్ళి, కడప, కంభంలలో వీరి కార్యాలయాలు ఉండేవి. మన్రోకు సహాయంగా మేజర్ జనరల్ దుగాల్డ్ క్యాంబెల్ నాయకత్వంలో ప్రధాన కేంద్రాలలో సైనిక దళాలుండేవి. అనంతపురం డివిజన్ మాత్రం మన్రో అధీనంలో ఉండేది.

సిద్దవటంలో ఉన్న కడప జిల్లా కార్యాలయం 1812 లో కడపకు మార్చబడింది. 1828 లో కంభం, దూపాడు, కోయిలకుంట్ల ప్రాంతాలను కడపజిల్లా నుండి విడదీసి కర్నూలు జిల్లాగా ఏర్పాటు చేశారు. 1911లో మదనపల్లి వాయల్పాడు ప్రాంతాలను కడపజిల్లా నుండి విడదీసి చిత్తూరు జిల్లాగా ఏర్పాటుచేశారు.

సర్ థామస్ మన్రో ఈస్టిండియా కంపెనీ వారి మద్రాసు సైన్యంలో ఒక సైనికుడు కుటుంబ పరిస్థితుల వల్ల ఉన్నతవిద్య పూర్తిచేయలేక, కంపెనీ కొలువులో చేరాడు. జీతం తక్కువైనా సర్దుకొనేవాడు. ఎర్స్‌కిన్ అనే మిత్రునికి రాసిన జాబులో యిలా అన్నాడు. భారతదేశానికి వచ్చేదాకా నాకు, ఆకలిదప్పులు, అలసట, బీదరికం అంటే ఏమిటో తెలియదు. ఇక్కడ మొదటి రెండూ నాకు అప్పుడప్పుడు అనుభవంలోకి వస్తుండగా మూడవది మాత్రం నన్ను నిత్యం వెంటాడుతూ ఉండేది. మొదటి మూడు సంవత్సరాల కాలంలో రాత్రిపూట తన పుస్తకాలను తలగడగానూ, నాలుగు కర్రలపై పరచిన కాన్వాస్ గుడ్డ పరుపుగాను, వేసుకొనే

కోటు దుప్పటిగాను ఉపయోగించినట్లు, మిత్రునికి 23-7-1789 లో వ్రాసిన జాబులో పేర్కొన్నాడు. పదేళ్ళపాటు సైనికుడుగా మంచిపేరు సంపాదించాడు. రెవిన్యూ విధానాన్ని రూపొందించుటలో శిక్షణ పొందాడు. 18వ శతాబ్ది చివర ల్యాండ్ సెటిల్‌మెంట్ నిర్వహణకు దక్షిణ కన్నడ ప్రాంతానికి పంపబడినాడు.

మన్రో నిజాయితీపరుడు. ప్రజల నుండి, రైతుల నుండి ఎట్టి కానుకలు స్వీకరించేవాడు కాదు. మన్రోకు స్వాగతమివ్వటానికి ఒక గ్రామాధికారి తన గ్రామంలో పెద్ద పందిరి వేయించాడు. అందుకు కూలీలకు పైసా యివ్వలేదని తెలుసుకున్న మన్రో, పందిరి వద్దకైనా వెళ్ళక, చెట్టునీడన చిన్న డేరాలో మకాం చేశాడు. రైతులనుండి పాలు, పళ్ళు కూడా ఉచితంగా తీసుకొనేవాడు కాదు. తన క్రింది అధికారులను కూడా అలాగే ఉండనిచ్చేవాడు.

రైతుల నుండి ఎక్కువ శిస్తులు వసూలుచేయటం న్యాయం కాదన్నాడు. భూసంబంధమైన చట్టాల ముందు, బీదలు, ధనికులు అన్న తేడా ఉండరాదన్నాడు. ఎవరైనాసరే తనకున్న భూమినంతటినీ తనకున్న వనరులతో సాగుచేసుకోవచ్చునన్నాడు. అంతవరకు గ్రామప్రాంతాలలో భూములమీద ఉన్న అగ్రవర్ణాల వారి పెత్తనంపై చావుదెబ్బ తీశాడు. భూమి ప్రభుత్వ ఆస్తి, నిర్ణీత శిస్తుపై రైతులకు కౌలుకు యివ్వాలని ఆదేశించాడు. రాయలసీమ ప్రాంతంలో తానున్న ఏడేళ్ళకాలంలో మన్రో 2,06,819 పట్టాలను రైతులకు అందజేశాడు. రైతులకు భూమిపై సర్వహక్కులు ఉంటాయని ప్రకటించాడు. ఇందువల్ల భూమిసాగు గణనీయంగా పెరిగింది. ప్రభుత్వాదాయం పెరిగింది.

ఉదారమైన భూమిశిస్తును ప్రకటించడం మన్రో గొప్పదనానికి నిదర్శనం. రైతు తన ఫలసాయం నుండి 2/3 వంతు మిగుల్చుకొన్నపుడే భూమి విలువైన ఆస్తి కాగలదన్నాడు మన్రో. 1807 లో అన్నిరకాల భూములమీద 25 శాతం పన్నులు తగ్గించాడు. రైతులు తవ్వుకొన్న బావులు, చెరువులమీద అదనంగా 8 1/3 శాతం పన్ను తగ్గింపుకు సిఫారసు చేశాడు. ఈ విధానాన్ని 1820 లో మద్రాసు గవర్నర్ చేరిన తర్వాత అమలుచేశాడు.

1807 లో మన్రో కలెక్టర్ పదవికి రాజీనామా చేసి లండన్ చేరాడు. మద్రాసు ప్రభుత్వం రైత్వారి విధానాన్ని రద్దుచేసి గ్రామీణ శిస్తు విధానాన్ని అమలుపరచింది. శిస్తు ఒక సంవత్సరం నుండి మూడేళ్ళపాటు వసూలు చేసే హక్కు గ్రామపెద్దకు లభించింది. మరల అగ్రవర్ణాల ఆధిపత్యం మొదలైంది. 1820 లో మద్రాసు గవర్నర్‌గా వచ్చిన మన్రో పాత విధానాన్ని అమలుచేశాడు.

ఆ కాలంలో రాయలసీమలో 80 మంది పాలెగాళ్ళుండేవారు. వీరిలో కడపజిల్లాలోని వేముల, చిట్వేలి, పోరుమామిళ్ళ, నరసాపురం, అప్పిరెడ్డిపల్లి, ఉప్పులూరు, కమలాపురం, పాలెగాళ్ళు ముఖ్యులు. వీరు నిరంకుశంగా గ్రామాలను దోచుకునేవారు. బందిపోట్లుగా వారి అనుచరులుండేవారు. హైదరాలి, నిజాం, గోల్కొండ నవాబులు కూడా వారిని అరికట్టలేకపోయారు. మన్రో తీవ్ర చర్యలతో వీరి ఆట కట్టించారు. పాలెగాళ్ళను, కావలివాళ్ళను కఠినంగా శిక్షించాడు.

అరాచకంగా ఉన్న రాయలసీమ జిల్లాల్లో జిల్లా కోర్టులు, పోలీసు యంత్రాంగాలు ఏర్పాటుచేశారు. మన్రో కఠినచర్యల వల్ల సుస్థిరమైన పాలన ఏర్పడింది. పాలనాపరమైన సంస్కరణలను ప్రవేశపెట్టాడు.

1813 లో ఛార్టర్ చట్టానికి సంబంధించిన పార్లమెంటు కమిటీ ముందు సాక్ష్యమిస్తూ, భారతదేశ సంస్కృతిని అనుసరించటంవల్ల ఇంగ్లండు లాభపడుతుందన్నాడు. భారతీయులు తయారుచేయు వస్తువుల నాణ్యత, యూరప్‌లో సమానమైనదన్నాడు. భారతదేశ ప్రజల పట్ల, మేధావుల పట్ల, చేతివృత్తులవారిపట్ల ఎంతో గౌరవముండేది.

భారతీయులు తెలుగు, ఇంగ్లీష్ భాషలు నేర్చుకొని ప్రభుత్వ ఉద్యోగాలు పొందటానికి వీలుగా జిల్లా తాలూకాస్థాయి పాఠశాలను నెలకొల్పారు. 1805 నాటికే మన్రో తెలుగు వ్రాయను, చదువనూ నేర్చుకొన్నాడు. రాయలసీమ రైతులతో ఆయన తెలుగులోనే మాట్లాడేవారు. తన క్రింది అధికారులు కూడా విధిగా తెలుగులోనే ప్రజలతో వ్యవహరించాలని ఆదేశించాడు. సి.పి.బ్రౌన్ ఆయన మాటలనెంతగానో గౌరవించేవాడు.

భూస్వాములు రైతులకు అన్యాయం చేస్తున్నట్లు వార్త వచ్చిన వెంటనే వారి వద్దకు వెళ్ళి వారి కష్టసుఖాలను విచారించేవాడు. మైళ్ళతరబడి కాలినడకన గ్రామాలను చూచేవాడు. పూడిపోయిన చెరువులు కనబడిన వెంటనే పూడిక తీయించే ఏర్పాటు చేసేవారు.

మన్రో భారతీయులను పెద్ద పదవులలో నియమించాడు. ధర్మవరం ప్రాంతం వాడైన, దేశాయి నారాయణప్పను 800 రూపాయల నెలవేతనంపై మద్రాసు రెవిన్యూ బోర్డు దివానుగా నియమించాడు. మైసూరు దివాన్ పూర్ణయ్య శిక్షణ పొందిన బచ్చేరావును 700 రూపాయల జీతంపై హుజూరు శిరస్తదారుగా నియమించాడు. బచ్చేరావు కార్యదక్షతను గుర్తించి కడప తాలూకాలోని పుట్లంపల్లె, పులివెందుల తాలూకాలోని ఇడుపులపాయ గ్రామాలను జాగీరుగా యిచ్చారు.

గండి క్షేత్రంలోని ఆలయం దర్శించాడు. కొండలోయ మధ్య అతనికి బంగారు తోరణం కన్పించిందట. అది పరమభక్తులకే కనిపిస్తుందని నమ్మకం. చూచినవారు ఆరు మాసాలకు మించి బ్రతకరన్న నమ్మకం ఉండేది. ఏడెట్లున్నా సర్ థామస్ మన్రో, ఆరునెలల్లోనే పత్తికొండలో కలరా సోకి 7-7-1827 న మరణించాడు. ఆయన శరీరాన్ని గుత్తి పట్టణంలో ఖననం చేశారు. ఆయన పేర నేటికీ గుత్తిలో సత్రం ఉంది.

రాయలసీమ రైతుల పాలిట పెన్నిధిగా ప్రశంసింపబడిన మన్రో శిలావిగ్రహం పత్తికొండ తాలూకా కార్యాలయం ఎదుట స్థాపించారు.

తాడిపత్రిలోని చింతల రామస్వామి ఆలయ ఆస్థాన మంటపాన్ని, కళ్యాణమండపాన్ని మరమ్మతు చేయించాడు. ఆలయంలో సక్రమంగా పూజలు జరిపే ఏర్పాటుచేశాడు. రాయదుర్గంలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామిని దర్శించాడు. ఆలయానికి మాన్యాలిచ్చాడు.

1807 బళ్ళారి-మైసూరు సరిహద్దు తగాదా వచ్చింది. సరిహద్దు గ్రామ ప్రజలు పరస్పరం కొట్టుకున్నాడు. వారిలో దెబ్బతిన్న వాడొకడు. 'అనంతపురం మా అయ్యకు చెబుతాను' అన్నాడు. ఆ అయ్య సర్ థామస్ మన్రోయే. ప్రజలు ఆయనను 'మండ్రోలప్ప' 'మండ్రోలయ్య' ని పిలిచేవారు. మాండవ్య ఋషి అంశం కలవాడంటారు.

ప్రజల మన్ననలందుకుని, రైతు జనబాంధవుడిగా నివాళులందుకొన్న సర్ థామస్ మన్రో చిరస్మరణీయుడు.

# 5. S.R. శంకరన్

ఊరికి దూరంగా ఏ సౌకర్యాలు లేని పాకల్లో జీవిస్తూ, సరైన తిండిలేక అనారోగ్యంతో కుంగిపోతూ, చెప్పులు వేసుకోవడానికి, కనీసం ఒంటిమీద చొక్కావేసుకోవడానికి కూడా హక్కులేక జీవితమంతా 'పెద్దోళ్ళకు' సేవచేస్తూ బానిసల్లా వాళ్ళెందుకుండాలి. వాళ్ళూ మనుషులే, భారతీయులే, ఈ గడ్డ మీద పుట్టిన వాళ్ళే రాజ్యాంగం – మనప్రజాస్వామ్యం స్వేచ్ఛగా, సుఖంగా బ్రతకడానికి అందరికీ హక్కులిచ్చింది. మరి వీళ్ళెందుకు ఇలా ఉన్నారు? మీరు ఇలాగే బతకాల్సిందేనా? వీరి జీవితాల్లో వెలుగునింపడం సాధ్యంకాదా! తప్పకుండా సాధ్యమవుతుంది. సామాజిక అంతరాల్ని పటాపంచలుచేసి అస్పృశ్యతా బంధనాలను ఛేదించి మేమూ మనుషులమే, మాకూ అందరిలా సర్వాధికారాలూ ఉన్నాయని గర్వంగా తలెత్తుకుని జీవించేలా వారికి అండగా నిలవడమే నా జీవితలక్ష్యం అని భావించిన మహోన్నత మానవతామూర్తి కీ.శే. S.R. శంకరన్.

కొందరివల్ల కుర్చీకి పేరొస్తుందంటారు. ప్రభుత్వంలో అప్పటిదాకా ఎందరో అధికారులు ప్రజాసంక్షేమ శాఖాధిపతులుగా పనిచేసినా కూడా దళితులు, బడుగు బలహీనవర్గాల సంక్షేమాన్ని మనసా వాచా కర్మణా కాంక్షించి పనిచేసినవారు లేరు. దోపిడీకి గురవుతున్న అణగారిన జాతులపక్షాన నిలిచి వారికి ఆర్థిక, సామాజిక న్యాయం కలిగించేందుకు S.R. శంకరన్ అహర్నిశలు కృషిచేశారు.

1959 లో కర్నూలుజిల్లా నంద్యాల సబ్‌కలెక్టరుగా పదవీబాధ్యతలు నిర్వర్తించేటపుడు షెడ్యూల్డుకులాల, తెగల, వెనుకబడిన జాతులకు ఇళ్ళపట్టాలు ఇప్పించాడు. సమాజంలో పేరుకుపోయిన అంటరానితనం జాఢ్యాన్ని తొలగించడానికి ఎన్నో కార్యక్రమాలు నిర్వహించారు. ఊరిలో ఉన్న బావిలో నీళ్ళు తోడుకోవడం మొదలు దేవాలయాలలోకి ప్రవేశం వరకు ఎన్నో కార్యక్రమాలు నిర్వహించి దళితులకోసం కృషిచేశాడు. 1960 ప్రాంతంలో నెల్లూరుజిల్లాలో సబ్‌కలెక్టరుగా అక్కడి యానాదుల అభివృద్ధికోసం విశేషంగా కృషిచేసారు. సాంఘిక సంక్షేమశాఖ కార్యదర్శిగా, ముఖ్యకార్యదర్శిగా పనిచేసిన ఆయన త్రిపుర రాష్ట్రానికి ప్రధాన కార్యదర్శిగా కూడా పనిచేశారు. పేదప్రజల అభ్యున్నతికోసం రాష్ట్రీయ హరిజన సమ్మేళన సభను నిర్వహించి అణగారిన వర్గాల ప్రజలకు సమన్యాయం జరగాలని ఎన్నో పథకాలు రూపొందించి అమలుచేసారు. ముఖ్యంగా బంజరుభూముల పంపిణి, వ్యవసాయ అనుబంధ వృత్తులు చేసుకోవడానికి రుణాలు, పారిశ్రామిక రుణాలు, కనిష్ట కూలీరేటు నిర్ధారించడం, వెట్టిచాకిరి నిర్మూలన వంటి కార్యక్రమాలు పెద్దఎత్తున చేపట్టి దళితులలో ఆత్మవిశ్వాసం నెలకొల్పారు.

అభివృద్ధిచెందాలంటే విద్య తప్ప మరో ఆయుధం లేదు కాబట్టి షెడ్యూల్డ్‌కులాలు, తెగలు, వెనుకబడిన జాతుల రిజర్వేషన్ల అమలు, విద్యావ్యాప్తి ఉద్యోగావకాశాలు పొందడంలో వారికి అండగా నిలిచారు. ప్రజాసంక్షేమం కోసం తన వ్యక్తిగత జీవితం ఆటంకం కాకూడదని బ్రహ్మచారిగా మిగిలిపోయి దళితుల వికాసానికి కృషిచేశారు. వారిమీద జరిగే దాడులను, దోపిడీని, అవహేళనను తొలగించడానికి అట్రాసిటి

చట్టాన్ని అమలులోకి తెచ్చారు. శంకరన్ చేస్తున్న విశేషకృషి ప్రతిబింబించేలా అప్పటి ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 20 సూత్రాల పథకంలో దళితుల సంక్షేమమే ప్రాధాన్యతాంశంగా ఉంచారు. 1976 లో వెట్టిచాకిరి నిర్మూలనకోసం చట్టాన్ని తీసుకొచ్చి పకడ్బందీగా అమలుచేసారు. మనుషులు బానిసలుకారని వారికీ చట్టబద్ధంగా హక్కులున్నాయని పేదలపక్షాన నిలిచారు.

ఒకరోజు సాయంత్రంపూట త్రిపుర రాష్ట్ర రాజధాని అగర్తలలో విమానం దిగింది. ఆ విమానం పూర్తిగా ప్రయాణీకులతో నిండివుంది. విమానం దిగిన ప్రయాణీకులు త్వరగా ఇళ్ళకు చేరుకోవాలనే ఆతురతలో తమ లగేజీలను తీసుకుంటున్నారు. వారిలో మధ్యవయస్కుడైన సాదాసీదా పొట్టిమనిషి ఒకరున్నారు. ఆయన్ని గుర్తుపట్టగలిగే ఒకే ఒక ప్రత్యేకత బాగా దువ్విన నల్లని వత్తైన జుట్టుమాత్రమే. ఆ విమానాశ్రయంలో కొందరు వ్యక్తులు హడావిడిగా పైకీ క్రిందకు దిగుతుండడం ఆయన గమనించాడు. వాళ్ళందరిని దాటుకొని ఆయన నిశ్శబ్దంగా లగేజీలు తెచ్చే బెల్ట్ వద్దకు చేరుకొని తన సూట్‌కేస్‌ను తీసుకున్నాడు. అక్కడ ఎవరికోసమో ఎదురుచూస్తున్న ఎర్రబల్బు కార్లు, పూర్తిస్థాయి యూనిఫామ్‌లతో పోలీసులు, అధికారుల సమూహం కనిపించింది. ఆయన నెమ్మదిగా నడుచుకుంటూ విమానాశ్రయానికి దగ్గరలో ఉన్న రిక్షా స్టాండ్‌కు చేరుకున్నారు. వచ్చీరాని హిందీ భాషతో సర్క్యూట్ హౌస్‌కు వెళ్ళేందుకు రిక్షా కార్మికునితో సంప్రదిస్తున్నాడు. ఒక రిక్షా కార్మికుడు ఆయనను తీసుకువెళ్ళేందుకు ముందుకు వచ్చి ధర ఎంతో తెలియజేసాడు. ఆ రిక్షా కార్మికుడు ఈ పెద్దమనిషి చేతిలోనుంచి సూట్‌కేసు తీసుకొని రిక్షా ఎక్కేందుకు సహాయం చేశాడు.

రిక్షా స్టాండ్‌వద్ద విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ ఒకరు ఈ మొత్తం వ్యవహారాన్ని గమనిస్తూ వస్తున్నాడు. ఆ పెద్దమనిషి మాటల్లో పలుమార్లు "సర్క్యూట్ హౌస్" అనే మాటను పదేపదే వాడటం ఈ కానిస్టేబుల్‌ని గుర్తించాడు. రాష్ట్రప్రభుత్వ కొత్త ప్రధాన కార్యదర్శి రాబోతున్నందున అతని కాన్వాయ్ వెళ్ళేంతవరకు రిక్షాలు రోడ్డుకు అడ్డురాకుండా చూసేందుకు తనను అక్కడ నియమించారని ఈ కానిస్టేబుల్‌కు తెలుసు. అతనికి అనుమానం వచ్చింది. దాంతో విమానాశ్రయం భవంతివైపు పరుగెత్తి తన పై అధికారులను కలిసి కొత్త ప్రధానకార్యదర్శి రిక్షాలో సర్క్యూట్ హౌస్‌కు వెళ్తున్నట్లున్నారని తెలియజేశాడు.

దాంతో ఒక్కసారి కలకలం చెలరేగి, అధికారుల హైరానా మొదలయ్యింది. అందరూ ఒక్క ఉదుటున ఈ కానిస్టేబుల్‌ని తీసుకొని రిక్షా స్టాండ్‌వైపు పరుగెత్తారు. ప్రధాన కార్యదర్శి కాన్వాయ్ వెళ్ళిన తరువాత కదిలేందుకు సిద్ధంగా ఉన్న రిక్షాలో ఆయన మౌనమునిలా కూర్చొనివున్నాడు. ప్రొటోకాల్ విభాగం డిప్యూటీ కార్యదర్శి ఆయనను సమీపించి తమరు ఎస్.ఆర్.శంకరన్‌గారా? అని భయంభయంగా ప్రశ్నించి విషయం నిర్ధారించుకున్నాడు. దాంతో అధికారులు ఆయన లగేజి గూర్చి ఆందోళన చెందారు. తన లగేజి తనవద్దే ఉందని చెప్పారు శంకరన్. కాళ్ళవద్ద పెట్టుకున్న చిన్న సూట్‌కేసే ఆయన మొత్తం లగేజి. రిక్షా దిగి వి.ఐ.పి. గేటువద్ద ఎదురుచూస్తున్న ప్రధాన కార్యదర్శి వాహనం ఎక్కవల్సిందిగా అధికారులు అభ్యర్థించారు. తాను

రిక్షా దిగడానికంటే ముందే తన పర్సు తీసి రిక్షా కార్మికునికి ఇస్తానని ఒప్పుకున్న నగదును అతని చేతిలో పెట్టారు.

అక్కడున్న అధికారులందరూ ఆయనను వారించే ప్రయత్నం చేసారు. అయితే శంకరన్ అధికారుల వైపు తిరిగి, ఇది తనకు రిక్షా కార్మికుడికి కుదిరిన ఒప్పందమని, తన కారణంగా ఆయన ఒక పాసింజర్‌ను కోల్పోయివుండవచ్చని చెప్పి ఆ మొత్తాన్ని చెల్లించారు.

రిక్షా కార్మికుడు తనకిచ్చిన మొత్తంలో సగం తిరిగి శంకరన్‌గారికి యిచ్చేశాడు. ముందు ఒప్పందం చేసుకున్నట్లుగా సర్క్యూట్ హౌస్ వరకు తాను తీసుకువెళ్ళనందున మొత్తం నగదు తీసుకోలేదని శంకరన్ గారితో ఆయన చెప్పాడు.

అగర్తల ఒక చిన్న పట్టణం. క్షణాలలో ఇది ఒక వింతవార్తగా పట్టణ ప్రజలకు చేరిపోయింది. తమ కొత్త ప్రధాన కార్యదర్శిగా గుర్తుపట్టలేనందుకు బాధపడుతూ అధికారులు పదేపదే క్షమాపణలు కోరడం మొదలుపెట్టారు. వారి మనోభావాలను గుర్తించిన శంకరన్, తాను వాళ్ళను విమానాశ్రయంలో గుర్తించానని అయితే వాళ్ళందరూ ఎవరో “పెద్ద” మంత్రికి స్వాగతం చెప్పడానికి వచ్చారని భావించినట్లు వారికి తెల్పారు. దాంతో ఒక్కసారిగా నవ్వులు వెల్లివిరిసాయి.

సర్క్యూట్ హౌస్‌కు చేరుకునేసరికి ఆయన బాగా అలసిపోయారు. ఢిల్లీ–కలకత్తా విమానంలో ఇండియన్ ఎయిర్‌లైన్స్ వారు యిచ్చిన కొద్దిపాటి ఆహారం తప్ప ఆయన మరేమి తీసుకోలేదు. సుదీర్ఘప్రయాణం తరువాత ఆ సాయంత్రం విశ్రాంతి తీసుకోవడానికి సిద్ధమవుతుండగా ఆయనకు ముఖ్యమంత్రి కార్యదర్శి నుండి ఫోన్ వచ్చింది. తనకు అభ్యంతరం లేకపోతే ముఖ్యమంత్రితో కలిసి రాత్రి భోజనం చేయడానికి ఆయన నివాసానికి రాగలరా? అని అడిగారు. త్రిపుర ముఖ్యమంత్రి నృపేన్ చక్రవర్తి మరో విశిష్టమైన వ్యక్తి. ఒక అపార్టుమెంటు లోని రెండుగదులే ముఖ్యమంత్రి నివాసం. అప్పటికే ముఖ్యమంత్రి చెవికి ఈ కథ చేరిపోయింది. ప్రధాన కార్యదర్శిగా తాను సరైన వ్యక్తినే ఎంపికచేసుకున్నానని ఆయనకు పూర్తిగా నమ్మకం కుదిరింది.

శంకరన్ ఆయన ఇంటికి చేరుకున్నారు. నృపేన్ తన సాంప్రదాయ లుంగీ, చొక్కాలతో బయటకు వచ్చి శంకరన్‌కు స్వాగతం పలికారు. వారు ఒకరికోసం ఒకరు అన్న జంటగా అమరిపోయారు.

శంకరన్ ప్రధాన కార్యదర్శిగా 6 సంవత్సరాలపాటు త్రిపుర ప్రభుత్వానికి తన సేవలు అందించారు. అక్కడినుండి వచ్చేసి రెండున్నర దశాబ్దాలు గడగిచినా ఇప్పటికీ ఆయన గూర్చి ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారు. ఎక్కడ పనిచేస్తే అక్కడ పేదలు ఆయనను ఎప్పటికీ తలచుకుంటూనే ఉంటారు.

ఉన్నతస్థాయి అధికారిగా ఉన్నప్పటికీ ఏనాడూ తన పరపతిని స్వలాభం కోసం వాడుకోని గొప్ప వ్యక్తిత్వం ఆయనది. వ్యవసాయ రుణం రాలేదనో, కాలేజీసీటు కావాలనో, వెట్టిచాకిరి తప్పడం లేదనో ఎప్పుడూ ఎందరో దళితులు ఆయన సాయంకోరి వచ్చేవారు. శంకరన్‌గారి ఇల్లు ఎప్పుడూ ఇలా వచ్చినవారితో

నిండిపోయివుండేది. ఒక అత్యున్నత ప్రభుత్వాధికారి దగ్గరకు ఒక నిరుపేద అంత ధైర్యంగా రాగలిగాడంటే అది ఆయన వారిపట్ల చూపిన ప్రేమకు వారి అభ్యున్నతిపట్ల ఆయనకున్న పట్టుదలకు సంకేతం.

1970లో జాతీయ సర్వీసుల్లో పనిచేసేటపుడు బొగ్గుశాఖమంత్రి కుమారమంగళంతో కలిసి బొగ్గు పరిశ్రమను జాతీయంచేసి కార్మికుల జీవితాల్లో వెలుగునింపడంలో ఎంతో కృషిచేశారు. 1985 లో కారంచేడు దుర్ఘటన జరిగినపుడు దళితులపక్షాన నిలిచి వెట్టిచాకిరి నిర్మూలన, చట్టాలను ఉపయోగించి వారికి సాయం అందించారు. అయితే ఇవేమీ అంత తేలికగా జరిగే పనులు కావు. భూస్వాములు, దళారులు, రాజకీయవేత్తలు వారికి కొమ్ముకాచే అధికారులు నిరంతరం ఆయనకు ఎన్నో అడ్డంకులు కల్పించేవారు. పేదల సంక్షేమమే ఆయుధంగా శంకరన్ దృఢసంకల్పంతో వాటన్నింటిని ఎదుర్కొనేవారు. కారంచేడు బాధితులకు చీరాలలో విజయనగర్‌కాలనీ నిర్మించి వారిని ఆదుకున్నారు. ఆతరువాత 1989 లో అట్రాసిటి చట్టం వచ్చేందుకు శంకరన్ చేసిన కృషి అనన్యసామాన్యం. 1990 లో కేంద్ర సర్వీసులకు మళ్ళీ వెళ్ళినపుడు పంచాయితీలలో దళితులకు రిజర్వేషన్లు కల్పించడం ఆయన చేసిన మరొక గొప్ప కృషి.

ప్రభుత్వ పథకాలు పూర్తిస్థాయిలో ప్రజలకు చేరినపుడు రాజ్యాంగం పేర్కొన్న సామాజిక ఆర్థిక సమానత్వం సాధ్యమవుతుందని ఆయన నమ్మేవారు. అందుకోసమే పేదలపక్షాన నిలబడ్డారు. ఇంత చేస్తున్నప్పటికీ ఇది చాలా స్వల్పమే. అధికశాతం దళిత బలహీన వర్గాలు పేదరికంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఉపాధి అవకాశాలు లేవు, ఉండడానికి ఇల్లులేదు, వ్యవసాయభూములు లేవు, పోషకాహారం లేదు, ఎందరో పిల్లలు చదువుకు నోచుకోలేక కూలీలుగా మారుతున్నారు. స్త్రీలు అవిద్య, అనారోగ్యాలలో ఉన్నారు. శిశుమరణాలు ఎక్కువగా ఉన్నాయి. ఇవన్నీ దళితుల సమస్యలే వారి బతుకు పోరాటంలో వారికి అండగా నిలవడానికి రాజ్యాంగబద్ధం చట్టం పరిధుల్లోనే ఎంత అద్భుతమైన కృషి చేయవచ్చో చేసిచూపిన ఘనత శంకరన్‌ది. పదవీ విరమణ అనంతరం కూడా 'సఫాయి కార్మిక ఆందోళన' లో మనుషులతో మరుగుదొడ్లు శుభ్రంచేయించే పనిని నిషేధించడానికి విశేషంగా కృషిచేశారు. 2004 లో ప్రభుత్వం నక్సలైట్లను జనజీవన స్రవంతిలో కలిపేందుకు వారితో చర్చలు జరపాలని నిర్ణయించినపుడు నక్సలైట్లపక్షాన చర్చలో పాల్గొన్నారు. భూసంస్కరణలు, దళారుల దోపిడి, వెట్టిచాకిరి వంటి అంశాలపై నక్సలైట్ల అభిప్రాయాలను ప్రభుత్వానికి వివరించడంలో విశేషంగా కృషిచేశారు. ఆ చర్చలు విఫలమైనప్పటికీ ప్రజాసంక్షేమం కోసం బడుగు బలహీనవర్గాలు అభ్యున్నతికోసం ఆయన చివరి శ్వాసవరకు కృషిచేశారు.

ప్రభుత్వ అత్యున్నత అధికారిగా పనిచేసినప్పటికీ అత్యంత నిరాడంబర జీవితం గడిపారు. ఆయనకు కనీసం సొంత ఇల్లుకూడా లేదు. పదవీవిరమణ రోజున అధికార నివాసాన్ని ఖాళీ చేయాల్సి వచ్చినపుడు ఆయన సామాను తరలించడానికి అధికారులు లారీని సిద్ధంచేశారు. ఆయన తనకు ఉన్న రెండుజతల బట్టలు ఒక సూట్‌కేస్‌లో సర్దుకుని ఇవే నా ఆస్తి. వీటికోసం లారీ ఎందుకు అనిచెప్పి ఆర్‌టిసి బస్సుఎక్కి తన గదికి చేరుకున్నారు. తన గదికి వచ్చినవారిని ఆప్యాయంగా పలకరించి తన చేత్తో కాఫీ కలిపి ఇచ్చి ఆదరించే వారని

ఆయనతో పనిచేసిన, పరిచయమున్నవారు ఎందరో చెబుతుంటారు. ఉద్యోగాన్ని కేవలం జీవనోపాధిగా కాకుండా చట్టబద్ధంగా ఉద్యోగ ధర్మాన్ని సమాజ సంక్షేమంకోసం మనస్ఫూర్తిగా నిర్వర్తించిన శంకరన్ జీవితం మనకందరికీ ఆదర్శం.

స్వామీ... మరణించిన తరువాత ఆత్మస్వర్గానికి పోయేదీ, నరకానికి పోయేదీ ఎలా తెలుస్తుంది అని ఒక శిష్యుడు గురువుగారిని అడిగారు. అపుడు గురువుగారు చనిపోయినవారి ఇంటికివెళ్ళి అక్కడివారు అతని గురించి ఏమేమి మాట్లాడుకుంటున్నారో విను నీకే అర్థమవుతుందని చెప్పాడట. స్వర్గనరకాలున్నాయో లేదో తెలియదు కానీ వ్యక్తి తన జీవితంలో ఇతరుల సుఖంకోసం సంక్షేమంకోసం ఎంతగా పాటుపడ్డాడో, పరితపించాడో ఆ సన్నివేశం తెలియజేస్తుందనడం అక్షరసత్యం. దళితజనబాంధవుడు S.R.శంకరన్ చనిపోయినరోజున దేశవ్యాప్తంగా ఎందరో దళిత బగుడుగులు, బలహీనవర్గాల ప్రజలు కన్నీరుమున్నీరుగా విలపిస్తూ ఆయనకు నివాళులర్పించేందుకు లక్షలాదిగా తరలివచ్చారు. పేదప్రజలకోసం ఆఖరి శ్వాసవరకు కృషిచేసిన ఒక మహనీయుని జీవన సాఫల్యతకు ఆరోజు హైదరాబాదులోని పంజగుట్ట స్మశానవాటిక ప్రత్యక్షసాక్షిగా నిలిచింది.

ఉద్యోగం ఒక ధర్మం - దానిని త్రికరణశుద్ధిగా నిర్వర్తించాలి.

ఉద్యోగం ఒక అర్థం - పరోపకారం కోసం సంపాదించాలి.

ఉద్యోగం ఒక కామం - మనస్ఫూర్తిగా మమేకం కావాలి.

ఉద్యోగం ఒక మోక్షం - ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోవాలి.

*"కాదు, నాకు చేతకాదు" అని ఎన్నడూ అనవద్దు. మీరు అనంతులు.*

*మీ స్వభావంతో పోలిస్తే దేశకాలాలు అన్నీ అల్పమై తోస్తాయి.*

*మీరు సర్వశక్తి సంపన్నులు. దేనిని చేపట్టితే దానిని సాధించగలరు.*

*- స్వామి వివేకానంద*

# ౬. కనుపర్తి వరలక్ష్మమ్మ

వరలక్ష్మమ్మకు పది సంవత్సరాల వయసులోనే కనుపర్తి హనుమంతరావు గారితో వివాహమయింది. ఆమె చదువు ఐదవ తరగతి వరకే. ఆ చదువుతోనే పత్రికలనూ, అనేక పుస్తకాలనూ చదువుతూ, గ్రంథాలయ సహాయాన్ని తీసుకుని వరలక్ష్మమ్మ సాహిత్యంలో, భాషలో, జ్ఞానాన్నీ, పాండిత్యాన్నీ సంపాదించారు. వీరేశలింగంగారి వ్యాసాలు చదివి ప్రేరణ పొందేవారు.

ఈమెలో పుస్తకాలు చదివే అలవాటునీ, సంస్కరణ భావాలనూ ప్రోత్సహించి వెన్నుతట్టింది కొటికలపూడి సీతమ్మగారు. ఆ రోజుల్లో బాపట్లలో చోరగుడి సీతమ్మగారు యువతీ విద్యాలయం నడిపేవారు. కనుపర్తి వరలక్ష్మమ్మగారు మధ్యాహ్న సమయాలలో అక్కడికి వెళ్ళి చదువుకునేవారు. క్రమంగా చదవటం నుంచి రచన చేసే వరకూ ఎదిగారు. వింజమూరి వెంకటరత్నమ్మ సంపాదకురాలిగా ఉన్న 'అనసూయ' పత్రికలో వరలక్ష్మమ్మగారు కథలూ, వ్యాసాలు రాశారు ఇంతలో 'గృహలక్ష్మి' పత్రిక ప్రారంభం కావటంతో ఆ పత్రికకు విరివిరిగా రాశారు. 'శారద లేఖలు' అనే రచనకు గృహలక్ష్మి స్వర్ణ కంకణాన్ని పొందారు.

'శారదలేఖలు' వర్తమాన సామాజిక రాజకీయ సమస్యలను చర్చించేవి. ఆ లేఖలలో వరలక్ష్మమ్మగారు స్త్రీల అభివృద్ధికి వ్యతిరేకంగా ఉన్న సనాతనాచారాలనూ, మూఢాచారాలను, మూఢనమ్మకాలనూ కటువుగా విమర్శించేవారు. బాల వితంతువుల కష్టాలను వివరంగా వర్ణించి ఆ దురాచారంవల్ల కలిగే అనర్థాలను రాసేవారు. పురుషాధిక్యత గురించీ, పురుషులు చేసే దౌర్జన్యాల గురించీ కనువిప్పు కలిగేలా రాసేవారు. విదేశీ వస్తు బహిష్కరణ. స్వదేశీ వస్త్రధారణ, రాట్నం వడకటం మొదలైన విషయాల గురించి వరలక్ష్మమ్మగారి రచనలు చదివి ఎందరో స్త్రీలు జాతీయోద్యమంలోకి ప్రవేశించారు. స్త్రీ సత్యాగ్రహుల సాహసాలు, వాళ్ళు జైళ్ళలో పురుళ్ళు పోసుకున్న వర్తమానాలు వార్తలలో రాగానే వారిని అభినందిస్తూ, ప్రోత్సహిస్తూ శారదలేఖ వచ్చేది. ఆ లేఖ చదివిన వారంతా ఉద్వేగభరితులయ్యేవారు. వెంటనే మరికొంత మంది జాతీయోద్యమంలోకీ, జైలు జీవితంలోకీ నడిచేవారు.

కనుపర్తి వరలక్ష్మమ్మగారు 1931వ సంవత్సరంలో బాపట్లలో 'స్త్రీ హితైషిణీ మండలి' ఏర్పాటు చేశారు. భద్రాచలంలో జరిగిన ఆంధ్రరాష్ట్ర మహిళా సభకు అధ్యక్షత వహించారు. జాతీయోద్యమంలో కాంగ్రెస్ కార్యక్రమాలకు మద్దతునిస్తూ, హిందీ ప్రచారాన్ని నిర్వహిస్తూ స్త్రీలతో పనిచేశారు. వచన రచనలో విశేష కృషి చేసి దానికొక సమకాలీన గౌరవాన్ని సంపాదించిన సాహితీవేత్తలలో కనుపర్తి ఒకరు. ఆధునిక భావాలతో నడిచే 'ఓటు పురాణము' అనే బుర్రకథ రచించారు. ఈమె ఆకాశవాణి ప్రసంగ కార్యక్రమంలో పాల్గొన్న మొదటి మహిళ. విజయవాడలో ఆకాశవాణి ... ప్రారంభించిననాడు ప్రసంగించిన మొదటి స్త్రీ వరలక్ష్మమ్మ. ఆంధ్ర సచిత్ర వార పత్రికలో 'మాచెట్టునీడ ముచ్చటలు' అనే శీర్షిక నిర్వహించారు. తెలుగులో మొదటి మహిళా కాలమిస్టు ఆమె.

# 7. స్నేహలతా భూపాల్

ఇంట్లో పాడి చేసేది స్త్రీలైనా వ్యవసాయపు పనులన్నీ స్త్రీలు చేసినా అది ఒక పరిశ్రమగా, వ్యాపారంగా చేసేటపుడు వాటి నిర్వహణాధికారులుగా గుర్తింపు పొందే స్త్రీలు అరుదు. అందులో స్త్రీలకు నైపుణ్యం లేదనే మాట వెంటనే వినపడుతుంది. ఐతే మనకు వినబడే మాటలకూ, వాస్తవాలకూ చాలాసార్లు పొంతన కుదరదు. పాడి పరిశ్రమ నిర్వహణలో స్త్రీల నైపుణ్యానికి ఉదాహరణ స్నేహలతా భూపాల్. ఆమె దక్షిణాసియాలో పశువుల పెంపకం చేపట్టిన మహిళలలో మొదటి వ్యక్తి.

స్నేహలత హైదరాబాదులో ఒక భూస్వామ్య కుటుంబంలో జన్మించారు. ఆమె తండ్రి నిజాం వద్ద అఫీసరుగా ఉండేవాడు. ఇంటి వాతావరణమంతా భూస్వామ్య విలువలతో, అహంకారాలతో స్త్రీలను అణిచివేసే నిరంకుశత్వంతో నిండి ఉండేది. స్నేహలత స్కూలు జీవితం కూడా అనేక కట్టుబాట్ల మధ్యా, నిర్బంధాల మధ్యా సాగింది. స్కూలు చదువు పూర్తికాగానే పై చదువులు చదవాలని ఆశపడితే. ఆ అవకాశం లేకుండా బలవంతపు వివాహం జరిగింది. ఆ జీవితం ఆమెను చాలా అశాంతి పెట్టింది. జాతీయోద్యమం బైటినుంచి ఎంతగా స్నేహలతను ఆకర్షిస్తున్నా నిజాంకు సన్నిహితమైన కుటుంబం కావడం వల్ల ఆమె మనోభావాలన్నీ అణిచివేసుకోవాల్సి వచ్చింది. మామగారి ఇంట్లో కూడా స్త్రీల అణిచివేతే. నైజాం రాజ్యం భారతదేశంలో కలిసిపోవటం. ఇతర చిన్న సంస్థానాలు కూడా స్వతంత్రభారతదేశంలో విలీనం కావటం స్నేహలతలో జీవితంపై ఆశను రేకెత్తించాయి. ఆ సమయంలో స్నేహలత. స్త్రీల బతుకులను ఇళ్ళకు కట్టివేసే ఫ్యూడల్ సంకేతాలుగా తాను భావించే మంగళసూత్రాన్నీ, మెట్టెలను తీసిపారేసి తన పద్ధతిలో స్వేచ్ఛా ప్రకటన చేశారు. అప్పటినుంచీ ఇప్పటివరకూ ఆమె తన కిష్టమైన వృత్తులనూ, ప్రవృత్తులనూ చేసుకుంటూ, ఆచరిస్తూ పోతున్నారు.

1950-69 సంవత్సరాల మధ్య కాలంలో భారతీయ సైన్యానికి వైజ్ఞానిక కార్యక్రమాలు, వికలాంగులకు కుటీర పరిశ్రమలూ, జాతీయ పొదుపు కార్యక్రమాలూ నిర్వహించారు. రాష్ట్రంలో మొదటి బాడ్మింటన్ (షటిల్) అసోసియేషన్ కార్యదర్శిగా పనిచేశారు. బాలల సంక్షేమ సంస్థకూ, జంతువుల సంక్షేమ సంఘానికీ (ఎస్.పి.సి.ఎ) ఉపాధ్యక్షులుగా పనిచేశారు. వ్యవసాయం, పశుపోషణ ఆమెకు చిన్నతనం నుంచీ ఇష్టమైన పనులు. 1969లో ద్రాక్షతోటలువేసి, ద్రాక్ష పండించి తానే అమ్మకాలను కూడా నిర్వహించారు. సూపర్ బజార్‌లో ప్రథమంగా ఉత్పత్తిదారుల విక్రయ కేంద్రాన్ని ప్రారంభించారు. విదేశాలకు కూడా ద్రాక్ష పండ్లను ఎగుమతి చేశారు.

1970వ సంవత్సరంలో కామధేను డైరీఫారం పెట్టి పాడిపరిశ్రమలో ప్రవేశించారు. దానికోసం ఆమె బెంగుళూరు లోని జాతీయ పాడి పరిశోధనా సంస్థ ఫారంలో శిక్షణ పొందారు. ఆధునిక పద్ధతులలో, పశువులకు గాలి బాగా ప్రసరించే షెడ్లు, హాయిగా పశువులు సంచరించేందుకు విశాలమైన దొడ్లు నిర్మించి డైరీ నడిపారు. దూడల పెంపకంలో ఎంతో శ్రద్ధపెట్టేవారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ విశ్వవిద్యాలయం

పాడిపరిశ్రమ రంగంలో స్నేహలత కృషిని ప్రశంసించింది. ఆంధ్రప్రదేశ్ పాడిపరిశ్రమాభివృద్ధి వారి నుంచీ, తిమ్మారెడ్డి ఫౌండేషన్ నుంచీ పశువుల పెంపకంలో స్నేహలత చూపిన పనితనానికి పురస్కారాలు లభించాయి.

చిన్నతనంలో అణచివేతకు గురి అవటంతో స్నేహలతకు స్త్రీ స్వేచ్ఛ గురించీ, స్త్రీల హక్కుల గురించీ ఎంతో ఆర్తి. తనకు అవకాశమున్నపుడల్లా మహిళాభివృద్ధికోసం పనిచేస్తున్నారు. 1988వ సంవత్సరంలో హైదరాబాదులో వారం రోజులపాటు స్త్రీ మేళాను నిర్వహించి స్త్రీల సమస్యలు చర్చించారు. స్త్రీల కళలనూ, చేతివృత్తులనూ ప్రోత్సహించారు. స్త్రీలకు, అసెంబ్లీలలో, పార్లమెంటులో 33% రిజర్వేషన్ ఉండాలనే ప్రతిపాదన వచ్చినప్పటినుండీ, దానిని సాధించేందుకు స్నేహలత రకరకాల కార్యక్రమాలు చేపట్టారు. మహిళా రాజకీయ అధికార వేదికను ఏర్పరచి పనిచేస్తున్నారు.

## 8. మల్లు స్వరాజ్యం

ఆంధ్రదేశంలో వామపక్ష రాజకీయాలలో పూర్తిగా భాగమైపోయిన మహిళలలో మల్లు స్వరాజ్యం ఒకరు. ఒక భూస్వామ్య కుటుంబంలో పుట్టి చిన్నతనంలోనే గుర్రపుస్వారీ, కత్తియుద్ధం నేర్చుకున్నారు. ఆంధ్రమహాసభ గురించి అన్నద్వారా తెలుసుకుని ప్రభావితురాలయ్యారు. ఆంధ్రమహాసభ పరదాకూ, ఘోషాకూ వ్యతిరేకంగా ఉండటం ఈమెకు ఆసక్తిని కలిగించింది. ఆరోజుల్లో నైజాం రాజ్యంలో స్త్రీల పరిస్థితి ఘోరంగా ఉండేది. ఆ పరిస్థితి మార్చాలనే కోరిక చిన్నతనం నుంచీ స్వరాజ్యానికి ఉండేది. స్వరాజ్యం పదకొండేళ్ళ వయసులోనే విజయవాడలో జరిగిన కమ్యూనిస్టు పాఠశాలకు హాజరయ్యారు. ఆ పాఠశాలలో రెండవ ప్రపంచయుద్ధంలో ఫాసిస్టులను ఓడించాలనే ఉద్దేశంతో, స్త్రీలకు కూడా ఆత్మరక్షణా పద్ధతులూ, గెరిల్లా యుద్ధ పద్ధతులూ నేర్పారు. గోర్కీ రాసిన 'అమ్మ' నవల స్వరాజ్యంపై చెరిగిపోని ముద్రవేసింది.

పన్నెండేళ్ళ వయస్సులో, కూలిపెంచాలనే పోరాటంలో, వెట్టిచాకిరికి వ్యతిరేకంగా జరిగిన ప్రచారంలో, భాగమై, కూలీలను పనికిపోకుండా ఆపే బాధ్యత తీసుకుని సమ్మెను జయప్రదం చేయించారు. భూస్వాములకు వ్యతిరేకంగా రైతుకూలీలు చేసే భూపోరాటం కోసం ఉయ్యాలపాటలు పాడుతూ దేవురుప్ప, కడివెండి, సిద్దనాపురం, పాలకుర్తి వంటి ఊళ్ళన్నీ తిరిగి ప్రచారం చేశారు. పాటల తర్వాతి దశ ఉపన్యాసాలు. ఉపన్యాసాలు ఇవ్వటంలో స్వరాజ్యానికి ఎంతో ప్రతిభ ఉంది. పొలాల్లో పనిచేసుకునే స్త్రీల దగ్గరకువెళ్ళి సమస్యల గురించి వివరించేవారు. తెలంగాణా రైతాంగపోరాటంలోకి ప్రజలను సమీకరించటం, నిధులు పోగుచేయటంలో స్వరాజ్యం పనిచేశారు. నాల్గవ తరగతి వరకే చదివిన పదిహేనేళ్ళ స్వరాజ్యం ఉపన్యాసాలిస్తుంటే ప్రజలు బి.ఏ. చదివిన విద్యాధికురాలు మాట్లాడుతుందనుకునేవారు. ఉపన్యాసం ఇస్తున్న ఆమె మీదకు డబ్బులు వెదజల్లేవారు. కాసులు వర్షంలా కురిసేవి. స్వరాజ్యం ఉపన్యాసం ఉందంటే ప్రజలు విపరీతంగా వచ్చేవారు.

కమ్యూనిష్టుపార్టీ రజాకార్లకు వ్యతిరేకంగా పోరాడి, వారిని తరిమికొట్టి గ్రామరాజ్యాలేర్పరుస్తున్న దశలో ఆ గ్రామ రాజ్యాల నిర్వహణ కోసం పార్టీ స్వరాజ్యాన్ని నియమించింది. గ్రామ పరిపాలన, సాంఘిక సమస్యల పరిష్కారం, వైద్యసౌకర్యాలు కలిగించడం, లేవీధాన్యం చెల్లించ నిరాకరించటం, ఈ పనులన్నీ స్వరాజ్యం చూసుకునేవారు. గెరిల్లా దళాలకు రిక్రూట్ చేసుకోవటం, ఆర్గనైజు చేయటం, వాలంటీర్స్‌ని, ముఖ్యంగా మహిళా వాలంటీర్లను తయారుచేయడం ప్రధాన బాధ్యతగా పనిచేశారు. ముప్ఫైగ్రామాలలో పెద్ద సంఘాలు నిర్మించారు. ఏరియా కమాండర్‌గా పోరాటంలో పాల్గొన్నారు. పార్టీలోపల స్త్రీల సమస్యలకు న్యాయం జరగటంలేదనిపించినపుడల్లా ప్రశ్నించి చర్చపెట్టేవారు.

తెలంగాణా రైతాంగ పోరాట విరమణ చేయాలని కమ్యూనిస్టుపార్టీ నిర్ణయం తీసుకున్న తర్వాత ఉద్యమంలో పాల్గొన్న స్త్రీలందరి వలే స్వరాజ్యం కూడా ఇంటికి వెళ్ళక తప్పలేదు. ఇంటికి వెళ్ళి వ్యవసాయం చేయటం మొదలుపెట్టారు. ఐనా ఏ ఉద్యమం వచ్చినా ఉపన్యాసాలిచ్చేందుకు పార్టీ స్వరాజ్యాన్ని పిలిచేది. “నేను స్పీకర్‌ని గద. అది పెద్ద ఆయుధం నాకు. గెరిల్లాకి తుపాకీ ఎంత ఆయుధం అయ్యిందో ఇదినాకు అంత ఆయుధం” అంటారామె.

పార్టీ మహాసభలలో స్వరాజ్యం తన అభిప్రాయాలు కచ్చితంగా చెప్పగలగడంతో, మాకినేని బసవపున్నయ్య, పుచ్చలపల్లి సుందరయ్య వంటి నాయకులు వచ్చి అనేక విషయాలమీద స్వరాజ్యం అభిప్రాయమేమిటని అడిగి ఆమె ఆలోచనలకు విలువ ఇచ్చేవారు. చైనా యుద్ధ సమయంలో నాయకులందరూ అరెస్టయినపుడు స్వరాజ్యం పౌరహక్కుల ఉద్యమంలో చురుగ్గా పనిచేశారు. 1978లో జరిగిన సాధారణ ఎన్నికలలో ఆంధ్రప్రదేశ్ శాసన సభకు పోటీచేసి గెలిచారు. శాసనసభ్యురాలిగా స్త్రీలకు సంబంధించిన సమస్యలమీద శాసనసభలో చర్చలేవదీశారు. ఇప్పటికీ వామపక్ష ఉద్యమాలలో, మహిళా ఉద్యమాలలో విశ్రాంతి లేకుండా పనిచేస్తున్నారు.

*అన్నదానము ఉన్నతమైనది. కానీ దానికంటే గొప్పది విద్యాదానం.*

*ఎందుకంటే అన్నము వలన క్షణికమైన తృప్తి కలుగుతుంది.*

*కాని విద్య వలన అజ్ఞానం తొలగిపోయి జీవితమంతా సుఖశాంతులు లభిస్తాయి.*

# ౨. మెల్లీ సోలింగర్

స్విట్జర్లాండ్‌లోని జ్యూరిచ్ పట్టణంలోని సంపన్న కుటుంబంలో జన్మించిన మెల్లీ పట్టభద్రురాలయ్యే వరకూ అక్కడే చదివారు. స్త్రీలకు ఓటుహక్కు కోసం జరుగుతున్న ఉద్యమంలో విద్యార్థిగా ఉన్నపుడే పాల్గొన్నారు. స్విట్జర్లాండ్‌లో కార్మికులు ఎనిమిది గంటల పనిదినం కోసం చేసిన ఆందోళనలో పనిచేశారు. 1924వ సంవత్సరంలో లెనిన్ మరణించిన రోజు జ్యూరిచ్ నగరంలో జరిగిన కార్మిక ప్రదర్శనలో పాల్గొన్నారు.

1929వ సంవత్సరంలో భారతదేశం వచ్చిన మెల్లీ భారత స్వతంత్రోద్యమంలో భాగమయ్యారు. లాహోరు కాంగ్రెస్ మహాసభలో పాల్గొని, ప్రతినిధులందరితో పాటూ 'రావీ' నది ఒడ్డున స్వాతంత్ర సాధన దీక్ష స్వీకరించారు. సబర్మతీ ఆశ్రమంలో సంవత్సరం పాటు జీవించి, ఆశ్రమంలో స్త్రీల హక్కుల కోసం సత్యాగ్రహం చేసి, స్త్రీలు కూడా రాత్రిపూట గస్తీ తిరిగి పాములను చంపవచ్చనే హక్కు సాధించారు. ఆ తరువాత శ్రీకాకుళంలో రెండేళ్ళకు పైగా నివసించి సన్ననూలు నాణ్యత గురించీ, దానిని ప్రమాణీకరించటానికీ పరిశోధనలు చేసి కొన్ని సూచనలు చేసి, వాటిని 'భారతి' పత్రికలో వ్యాసాలుగా ప్రచురించారు. విదేశీ వస్తు బహిష్కరణ పికెటింగులలో పాల్గొన్నారు. అప్పటి వరకూ వాడుకలో ఉన్న రాట్నంలో లోపాలను సవరించి, ఇరుసుకు రెండువైపులా బాల్ బేరింగులు అమర్చిన కొత్త రాట్నాన్ని రూపొందించి దానిని ప్రచారం చేస్తూ ఆంధ్రదేశమంతా తిరిగారు. ఆ పర్యటనలో ఉన్నవ లక్ష్మీబాయి, పొణకా కనకమ్మ, తల్లాప్రగడ విశ్వసుందరమ్మ మొదలైన నాయకులతో స్నేహం పెంచుకున్నారు.

1922వ సంవత్సరం నుండీ తనకు స్నేహితులైన ఉప్పల లక్ష్మణరావుగారిని 1937లో వివాహం చేసుకున్నారు. స్త్రీ పురుష సమానత్వం, విడాకులకు సమాన హక్కులూ గల సోవియట్ యూనియన్‌లో తన వివాహం జరగాలని మాస్కోలో సోవియట్ పద్ధతుల ప్రకారం వివాహం చేసుకున్నారు. 1938లో వ్యక్తి సత్యాగ్రహంలో అరస్టయి తొమ్మిది నెలలు నెల్లూరు జైలులో ఉన్నారు. జైలు నుండి విడుదలై మళ్ళీ సత్యాగ్రహం చేసి అరస్టయి సంవత్సరం జైలులో గడిపారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొని విజయవాడ సబ్‌జైలులో రెండు నెలలు ఉన్నారు. అక్కడ స్త్రీలకు సరైన సదుపాయాల కోసం పోరాడారు. నెల్లూరు జైలులో రెండున్నర సంవత్సరాలు నిర్బంధాన్ని అనుభవించారు. గాంధీ హత్య జరిగినపుడు ఆమె తన తల్లి ఆరోగ్యం బాగోలేని కారణంగా జ్యూరిచ్ వెళ్ళారు. అక్కడ సోషలిస్టు పత్రికలో గాంధీ గురించీ, భారతీయ సత్యాగ్రహోద్యమం గురించీ వ్యాసాలు రాశారు.

కృష్ణాజిల్లా మహిళా సంఘానికి ఉపాధ్యక్షురాలిగా, విజయవాడ మహిళా సంఘానికి అధ్యక్షురాలిగా కొన్నాళ్లు పనిచేశారు. డాక్టర్ అచ్చమాంబ గారితో కలిసి "కృష్ణాజిల్లా బాలనేరస్థుల పునరావాస సంఘం" స్థాపించి చాలాకాలం ఆ సంస్థకు ఉపాధ్యక్షురాలిగా పనిచేశారు. అనేక సంవత్సరాలపాటు ఆంధ్ర కమ్యూనిస్టు ఉద్యమంలో పనిచేసి 1957లో భారత కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం తీసుకున్నారు. కాంగ్రెస్ నుంచి బైటికి వచ్చినా జీవితాంతం ఖద్దరు ధరించారు.

మెల్లీకి ఆటలంటే ఎంతో ఆసక్తి. పర్వతారోహణ, ఈత, ఆమెకు ప్రాణం. రాజోలు నుంచి నరసాపురానికి గోదావరిలో 15మైళ్ళు ఈదిన సంఘటనను ఆ ప్రాంత ప్రజలు ఇప్పటికీ చెప్పుకుంటారు. 1958లో లక్ష్మణరావుగారితో కలిసి మాస్కోవెళ్లారు. 1965వ సంవత్సరంలో మాస్కోలోనే ఒక రోడ్డు ప్రమాదంలో మరణించారు.

# 10. సుప్రసిద్ధ వెయిట్ లిఫ్టర్ - కరణం మల్లీశ్వరి

మన ఆంధ్రదేశంలో కొన్ని కుటుంబాలు సాహిత్యానికీ, కొన్ని కుటుంబాలు సంగీతానికీ నిలయమై ఉంటాయి. అలాగే కొన్ని కుటుంబాలు క్రీడలకు నిలయమై ఉంటాయి. అలా క్రీడలకు నిలయమైన కుటుంబం సుప్రసిద్ధ వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరిది.

నందలూరు (అరిపల్లి) లో 1975 జూన్ 1వ తేదీ శ్యామల, మనోహర్ దంపతులకు మల్లీశ్వరి జన్మించింది. ఆమె తండ్రి మనోహర్ రైల్వేపోలీసు శాఖలో హెడ్‌కానిస్టేబుల్. అతనిది ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మారే ఉద్యోగం. కాబట్టి వారు అనేక ప్రాంతాలు తిరగవలసి వచ్చింది. ప్రస్తుతం వారి కుటుంబం విశాఖపట్నంలోని న్యూరైల్వే పోలీసు కాలనీలో నివసిస్తున్నారు.

తండ్రికి బదిలీ అయినపుడల్లా మల్లీశ్వరి కూడా తండ్రితోపాటే అనేక ప్రాంతాలు తిరగవలసి వచ్చింది. ఆమె చదివింది ఎస్.ఎస్.సి. వరకే. అదీ పలుప్రాంతాల్లో చదివింది. ఆమె ఒకటి, రెండు తరగతులు విజయనగరంలోని ఆర్.ఎస్.ఎమ్. పాఠశాలలో, తర్వాత 3 నుంచి 6 వరకు శ్రీకాకుళం బాలికోన్నత పాఠశాలలో, 7వ తరగతి దొనకొండ బాలికల పాఠశాలలో, 8వది చీరాలలోని ఈపురుపాలెం బాలికోన్నత పాఠశాలలో, 9, 10 తరగతులు మళ్ళీ శ్రీకాకుళం బాలికోన్నత పాఠశాలలో చదివింది.

ఆమెకు ఒక సోదరుడు, నలుగురు అక్కచెల్లెళ్ళు. మనోహర్‌కు ఈమె మూడవ కుమార్తె. ఆమె పెద్ద అక్క నర్సమ్మ, చెల్లెలు కృష్ణకుమారి అంతర్జాతీయ వెయిట్ లిఫ్టర్లుగా పేరు పొందారు.

వీరిది మధ్యతగతి కుటుంబం. ఆమె సోదర సోదరీమణులూ, తండ్రీ, ఆమెను వెయిట్ లిఫ్టింగ్‌లో కృషి చేయమని బాగా ప్రోత్సహించేవారు. అంతే కాదు. ఆమె అక్క నర్సమ్మ మొదటి గురువుగా (ఫస్ట్‌కోచ్) ఆమెకు శిక్షణ ఇచ్చింది.

తన కుటుంబం వారి ప్రోత్సాహంతో అంచెలంచెలుగా పైకి వచ్చి మల్లీశ్వరి జాతీయ, అంతర్జాతీయ స్థాయిలలో మంచి పేరు ప్రతిష్ఠలు సంపాదించింది. అనేక అవార్డులను పొందింది. కొత్తరికార్డులను నెలకొల్పింది. మనదేశ ప్రతిష్ఠను ఇనుమడింప జేసింది. ఆమె 1990లో వెయిట్ లిఫ్టింగ్ ప్రారంభించింది. ఆమె ప్రస్తుతపు కోచ్ పాల్ సింగ్ సంధు.

**ఆమె పొందిన అవార్డులు, రికార్డులు :**

**(అ) జాతీయ స్థాయిలో .... :**

1990 డిసెంబర్‌లో రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో జాతీయ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో కరణం మల్లీశ్వరికి ప్రథమ స్థానం లభించింది. ప్రథమస్థానం లభించిన వారికి మూడు స్వర్ణ పతకాలు లభిస్తాయి. (స్నాచ్ - 62.5 కిలోలు, క్లీన్, జర్క్ - 85 కిలోలు) ఆ మూడింటిని ఈమె కైవసం చేసుకుంది.

తర్వాత 1992లో ఉత్తర ప్రదేశ్‌లోని 'లక్నో'లో జరిగిన జాతీయ జూనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో కూడా ప్రథమ స్థానాన్ని పొంది, మూడు బంగారు పతకాలను గెలుచుకుంది.

(అపుడు స్నాచ్ -70 కిలోలు, క్లీన్, జర్క్ - 100 కిలోలు)

1991లో 'అంగోల' (హెలైనా) లో జరిగిన జాతీయ సీనియర్ స్త్రీల వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో ద్వితీయ స్థానాన్ని పొంది, మూడు వెండి పతకాలను సంపాదించింది.

(స్నాచ్ - 65 కిలోలు; క్లిన్, జర్క్ - 85 కిలోలు)

1992 లో బెంగుళూరు (కర్నాటక) లో జరిగిన సీనియర్ జాతీయ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానంలో నిలిచి, మూడు స్వర్ణపతకాలు సాధించింది.

(స్నాచ్ - 80 కిలోలు, క్లీన్, జర్క్ 107.5 కిలోలు)

1993 లో ఏలూరు (ఆంధ్రప్రదేశ్) లో జరిగిన జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ద్వితీయ స్థానం పొంది, మూడు రజత పతకాలను గెలుచుకుంది.

(స్నాచ్ - 75 కిలోలు; క్లీన్, జర్క్ 95 కిలోలు)

1994 లో కలకత్తా (పశ్చిమ బెంగాల్) లో జరిగిన జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్‌లో ప్రథమస్థానం పొందడమే గాకుండా, ఆరు జాతీయ రికార్డులను, నెలకొల్పి 'బెస్ట్ లిఫ్టర్' గాను ప్రశంసలు పొందింది.

1995 లో పూనా (మహారాష్ట్ర) లో జరిగిన జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమ స్థానం పొంది, నాలుగు జాతీయ రికార్డులను నెలకొల్పడమేగాక, ప్రపంచ రికార్డును సాధించింది.

1996 లో త్రిచూర్ (కేరళ) లో జరిగిన జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ప్రథమస్థానం పొంది నాలుగు జాతీయ రికార్డులను నెలకొల్పింది.

1997 మార్చి 16వ తేదీన మల్లేశ్వరి తన ప్రతిభను మరోసారి నిరూపించుకుంది. చెన్నైలో జరిగిన జాతీయ సీనియర్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌లో ఆమె మూడు కొత్త రికార్డులు కూడా నెలకొల్పి సంచలనం సృష్టించింది. మహిళల 59 కిలోల క్యాటగిరిలో అలవోకగా మూడు స్వర్ణపతకాలు సంపాదించింది. పదముగ్గురు పాల్గొన్న ఈ ఈవెంటులో ఆమె మొత్తం 212.5 కిలోల బరువెత్తి ప్రథమ స్థానం ఆక్రమించి స్నాచ్, క్లీన్, జర్క్, ఓవరాల్ వెయిట్‌లలో తనపేరు మీదే ఉన్న నిరుటి రికార్డులను అధిగమించింది. జాతీయస్థాయిలో ఆమె స్వర్ణపతకాలు సాధించడం ఇది వరుసగా నాలుగోసారి.

**(ఆ) అంతర్జాతీయ స్థాయిలో .... :**

1991 లో జర్మనీలో మొదటి ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొని ఆరవస్థానాన్ని, 1992 మే లో బల్గేరియాలో ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొని నాల్గవ స్థానాన్ని సాధించింది.

1992 డిసెంబర్‌లో "థాయిలాండ్" లో జరిగిన "ఏషియన్ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్ షిప్" లో ద్వితీయ స్థానాన్ని పొంది, మూడు వెండిపతకాలు గెలుచుకుంది.

1993 మే లో 'మెల్బోర్న్' (ఆస్ట్రేలియా) లో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్‌లో పాల్గొని మూడవస్థానాన్ని పొంది, మూడు కాంస్య పతకాలను సాధించింది. అలాగే 1993 అక్టోబర్‌లో చైనాలో "ఏషియన్ చాంపియన్‌షిప్' లో మూడవస్థానంలో నిలిచి, మూడు కాంస్యపతకాలు గెలుచుకుంది.

1994 అక్టోబర్‌లో జపాన్‌లో "హిరోషిమా ఏషియన్ గేమ్స్" లో పాల్గొని రెండవ స్థానంలో నిలిచింది. అలాగే 1994 నవంబర్‌లో 'టర్కీ'లో జరిగిన ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్నది. దీనిలో రెండవస్థానం పొందినట్లుగా ప్రకటించారు. కాని తర్వాత మొదటిస్థానాన్ని పొందిన చైనా వనితను అనర్హురాలుగా నిర్ణయించడంవల్ల మల్లీశ్వరికి ప్రథమస్థానం లభించింది. ఈ వార్తను ఆమె పేపర్లలో చదివి ఆశ్చర్యానందాలు పొందింది.

1995 జూలైలో దక్షిణ కొరియాలోని 'పూసన్' లో జరిగిన 'ఏషియన్ చాంపియన్‌షిప్' లో పాల్గొని, ప్రథమ స్థానాన్ని నిలబెట్టుకొని, మూడు స్వర్ణపతకాలు గెల్చుకుంది. అలాగే 1995 నవంబర్‌లో చైనాలోని 'క్రౌంగ్' లో జరిగిన ప్రపంచ చాంపియన్ షిప్‌లో పాల్గొని, మూడు బంగారు పతకాలను సాధించడమేకాక, ఒక కొత్త ప్రపంచ రికార్డును నెలకొల్పింది.

భారతదేశంనుండి 'ప్రపంచ వెయిట్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్' లో పాల్గొన్నవాళ్ళలో ఒకేఒక మొట్టమొదటి లిఫ్టర్ మల్లేశ్వరి. మొదటి మహిళా వెయిట్ లిఫ్టర్ అనికూడా ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

కరణం మల్లీశ్వరికి 1995 ప్రతిష్ఠాత్మకమైన అర్జున్ అవార్డ్, శిరోమణి అవార్డు లభించాయి. అలాగే 1996 లో 'బిల్లా అవార్డు, రాజీవ్‌గాంధీ ఖేల్‌రత్న' అవార్డు లభించాయి.

అనేక జాతీయ అంతర్జాతీయ పోటీలలో పాల్గొని ఆమె మన దేశ ప్రతిష్ఠను, మహిళల గౌరవాన్ని పెంపొందించినదనడంలో అతిశయోక్తి లేదు.

*ప్రతి పని ఈ మూడు దశలను దాటాలి.*

*అవహేళన, వ్యతిరేకత, తరువాత ఆమోదం.*

**– స్వామి వివేకానంద**

# 11. డెల్టా శిల్పి - సర్ ఆర్థర్ కాటన్

ఆంధ్రులకు ప్రీతి పాత్రుడైన కాటన్ ఆంధ్రుడు కాదు, కనీసం భారతదేశంలో జన్మించినవాడైనా కాదు. 'ఉదార చరితానాంతు వసుధైవ కుటుంబకం' (ఉదార చరితులకు ప్రపంచమే కుటుంబం) అన్న విధంగా అన్నార్తులైన భారతీయుల కడగండ్లను బాపి, 'అపర భగీరథునిగాను, డెల్టా శిల్పి' గాను పేరొందాడు. ఆయన అన్యదేశీయుడైన విధంగా ఈ 'డెల్టా' అనే పదం కూడా అన్యదేశ్యమే. ఆయన మనలో ఒకడుగా కలసిపోయినట్లే ఈ డెల్టా అన్న పదం కూడ మన నిత్య వ్యవహార పదాలలో ఒకటిగ మారిపోయింది.

**విద్యాభ్యాసం - ఉద్యోగం**

ఇతడు తన 15వ ఏట 'ఆడిస్ కాంబి'లో మిలిటరీ శిక్షణాలయంలో విద్యార్థిగా ఒకటిన్నర సంవత్సరాలు ఇంజనీరింగ్ శిక్షణ పొందాడు. ఈ శిక్షణకాలంలో కష్టపడి విద్య నభ్యసించాడు. తన ప్రవర్తనచేత పెద్దల మన్ననలకు పాత్రుడయ్యాడు. అడుగడుగునా తెలివితేటలు ప్రదర్శించాడు. అందువలన ఇతనిని శిక్షణ కాలం పూర్తికాగానే ఎటువంటి పరీక్ష లేకుండగనే 'రాయల్ ఇంజనీర్స్'లో మిలిటరీ విద్యార్థిగా చేర్చుకొన్నారు. ఇక్కడ ఒక సంవత్సరం కాలంలోనే అతడు 'లెఫ్టినెంట్' పదవికి వచ్చాడు. తన 18వ ఏట ఉద్యోగార్థం మద్రాసు చేరాడు. ఈస్టిండియా కంపెనీ ఈయనను దక్షిణప్రాంతానికి చెరువులశాఖ ఇంజనీరుకు సహోద్యోగిగా నియమించింది.

**గోదావరీ ఘనకార్యాలకు పూర్వం :**

ప్రభుత్వాదేశానుసారం కాటన్ మద్రాస్ సముద్రపుటొడ్డున నౌకాశ్రయానికై కొన్ని సూచనలు చేశాడు. పెద్ద మొత్తంలో సొమ్ము మంజూరై కూడ ఏకారణానో ఏమో ఆ పని ఆగిపోయింది. మద్రాసులో జరుగుతున్న కట్టడాలకు ముడి వస్తువులు తక్కువ ఖర్చుతో చేరవేసేందుకు 'రెడ్‌హిల్స్'కు ఒక రైలు మార్గం వేయించాడు.

విశాఖపట్టణంలో సముద్రపుటొడ్డున కెరటాల తాకిడి నరికట్టేందుకు 50గజాల దూరాన పెద్ద పెద్ద బండ రాళ్ళ గుట్టలను గట్టు పొడవున అక్కడక్కడ వేయించాడు. వాటి వలన అక్కడ ఒక విశాలమైన బీచ్ కూడా ఏర్పడింది.

**ఘోర క్షామం - ప్రభుత్వంలో కదలిక :**

18, 19 శతాబ్దాలలో అతివృష్టి, ఉప్పెన మొదలైన కారణాల వల్ల ఆంధ్ర ప్రాంతంలో కరువు కాటకాలు విలయతాండవం చేశాయి. ఆంగ్ల ప్రభుత్వం, జమీందారులు చేపట్టిన సహాయకార్యక్రమాలేమూలకు రాలేదు. మద్రాసు ప్రాంతానికి తరలి వెళ్ళారు. కొందరు తమ సంతానంలో ఆడపిల్లల్ని అమ్ముకొన్నారు. మద్రాసు నుండి ఉత్తరానికి పోయే రాచబాట పీనుగుల గుట్టయింది. గుంటూరు సీమలో ప్రతి అయిదుగురికి ఇద్దరు, గోదావరీ సీమలో ప్రతి నలుగురికి ఇద్దరు చొప్పున మరణించారు. పశుపక్ష్యాదుల మరణాల కంతులేదు. ఈస్టిండియా

ప్రభుత్వం వారి బట్టల మిల్లులు మూతపడ్డాయి. ఎగుమతుల వ్యాపారం సన్నగిల్లి ఆదాయం 14 లక్షలనుండి 2 లక్షలకు దిగజారింది.

ఈ పరిస్థితుల్లో ప్రభుత్వంలో కదలిక పుట్టింది. 'సర్ హెన్రీ మాంట్ గామరీ' అనే ఉన్నతాధికారిని గోదావరీ మండల పరిస్థితుల్ని పరిశీలించి నివేదికను పంపుమన్నది. అతడు తన నివేదికలో 'నేటి దుర్భిక్ష పరిస్థితులకు మూల కారణం ఉన్న నీటి వనరులను నిర్లక్ష్యం చేయటమే' నని వక్కాణించాడు.

ప్రభుత్వం కాటన్‌ను గోదావరీసీమలో నిర్మాణాత్మక కార్యక్రమాల్ని సూచింపుమని ఆజ్ఞాపించింది. కాటన్ రాజమండ్రి వెళ్ళి, గోదావరిని పరిశీలించి పథకాన్నొకదాన్ని తయారు చేసి, అందుకయ్యే ఖర్చుల వివరాలతో ఒక నివేదికను పంపాడు. అతని అభిప్రాయాలకా జిల్లా కలెక్టరు, ఛీఫ్ ఇంజనీర్లు కూడ తమమద్దతును తెల్పారు. మద్రాసు ప్రభుత్వం చేపట్టబూనిన ఈ కార్యక్రమానికి లండన్‌లోని 'బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్' ఆమోదం తెలిపింది. కొంత సొమ్మును కూడ మంజూరు చేసింది.

**ఆనకట్ట - స్థలనిర్దేశం - రూపు రేఖలు :**

మేజర్ ఆర్థర్ కాటన్ గోదావరికి ధవళేశ్వరం వద్ద ఆనకట్ట కట్టటానికి నిర్ణయించాడు. గట్టుకు గట్టుకు మధ్య ఆనకట్ట పొడవు 3 4/5 మైళ్ళు. కాని దీనిలో మూడవవంతు కంటె ఎక్కువ భాగం లంకల కింద, సెంట్రల్ డెల్టా తలకట్టు కిందను పోతున్నది. నదికి తూర్పు గట్టుకు ఒక మైలు దూరంలో 2300 అడుగుల పొడవుగల "పిచికలంక" ఉంది. దీనికి రెండు వైపుల ధవళేశ్వరం పాయ, ర్యాలిపాయలు ప్రవహిస్తున్నాయి. ర్యాలిపాయకు పడమరగా సెంట్రల్ డెల్టా ప్రారంభమయేచోట 'బొబ్బర్లంక' ఉంది. దీని తర్వాత 'మద్దూరు పాయ'. దీనికి పడమరగా 'చిగురులంక'. ఈ చిగురులంక తర్వాత ఒక చిన్న కాలువ, దీనినంటు కొని పడమటిగట్టు ఉన్నాయి.

ఈ విధంగా అఖండ గోదావరి రెండు గట్లను కలిపి కట్టబోయే ఆనకట్ట 4భాగాలు. వీటిని కలుపుతూ 4లంకలు, ఈ లంకల కటునిటు గోదావరి పాయలు 21/2 మైళ్ళ పొడవు, 12 అడుగుల ఎత్తుగల రాతి కట్టడంతో ఆనకట్టను నిర్మించటానికి కాటన్ నిర్ణయించాడు. లంకలకు రెండు వైపుల గట్లను బలపరచటం కూడ ఈ పనిలోని భాగమే. నీరులేని కాలంలో ఈ ఆనకట్టను రహదారిగా కూడ ఉపయోగించవచ్చును.

**ఆనకట్ట నిర్మాణం - 1 :**

గోదావరి ఆనకట్ట నిర్మాణం పనులు 1847 ఏప్రిల్ మాసంలో ప్రారంభమయ్యాయి. ఆర్థర్‌కాటన్ నిర్మాణ కార్యక్రమాలకు సహాయపడేందుకనుకూలుడైన కలెక్టరును రాజమండ్రికి బదలీచేశారు. రాళ్ళ కోసం దగ్గరనున్న కొండను తొలిచే పని ప్రారంభమయింది. నిర్మాణ స్థలాలకు పనివాళ్ళను సరుకులను చేరవేసేందుకు పడవలు తయారయ్యాయి. సున్నపు బట్టీలు నిత్యాగ్ని హోత్రాల్లా మండుతున్నాయి. రెండు రైలుమార్గాలు, వ్యాగన్లు సిద్ధమయ్యాయి. తూర్పు డెల్టాకు ముఖ్యమైన కాలువకు ఇది వరకున్న ముఖద్వారం మూసివేసి,

కొత్తగా వెడల్పైన ముఖద్వారాన్నేర్పాటు చేసి, పశ్చిమ మధ్య డెల్టాలకు కాలువలను తవ్వడం జరిగింది. ధవళేశ్వరంవైపునున్న సన్నని కాలువ వరదతాకిడికి తెగిపోతుందేమోనని అక్కడే ఎక్కువగా రాళ్ళుదింపి బలపరచడం జరిగింది. ఇంతటితో ఆ సంవత్సరం పూర్తయింది.

1848వ సంవత్సరం ప్రవేశించింది. ధవళేశ్వరం మద్దూరు ఆనకట్టలు 9 అడుగుల ఎత్తువరకు తయారయ్యాయి. ధవళేశ్వరం, విజ్ఞేశ్వరంలవద్ద ద్వారాలపని చాలవరకు పూర్తయింది. కాని రాళ్ళతో కటిన చిన్నతూములు తరచు చెడిపోతున్నాయి. అంతేకాక మరికొన్ని ఇతర కారణాల వలన తొలి అంచనాల ప్రకారం కేటాయించిన డబ్బు చాలలేదు. అందుచే రూ.1,39,100/- (ఒక లక్ష ముప్పదితొమ్మిది వేల ఒక వంద రూపాయలు) లు అదనపు ధనం కేటాయించవలసిందిగా రాశాడు.

ఈ ఉత్తరం పంపిన కొద్ది రోజుల్లోనే జూన్ నెలలో గోదావరికి ఇంతకు ముందెన్నడు రానంతగా వరదలు వచ్చాయి. మద్దూరు ఆనకట్టకు దెబ్బ తగులకుండా ఒత్తుగా పోయించినమట్టి కొట్టుకుపోయింది. ఆనకట్టతలపై జానెడెత్తున వరదనీరు ప్రవహించింది. కాని నిర్మాణానికి మాత్రం నష్టం రాలేదు. కాకుంటే జరుగుతున్న పనులు మాత్రము రెండునెలలు వెనుకబడ్డాయి.

కాటన్ గోదావరిసీమకు వచ్చి దాదాపు ఒకటిన్నర సంవత్సరం కావస్తోంది. ఈ కాలంలో ఆయన ఎన్నో చేదు అనుభవాలను చవి చూడవలసి వచ్చింది. ఇక్కడకు వచ్చిన తర్వాత కల్గిన ఆడపిల్ల సంవత్సరం తిరుగకుండానే మరణించింది. గోదావరీ తీరాన ఆయన కట్టుకున్న ఇంటిలోకి వరదనీరు ప్రవేశించి ఎన్నో విలువైన వస్తువులను ధ్వంసం చేసింది. అటు తర్వాత ఆయన ఒక కొండపై ఇల్లు కట్టుకున్నాడు. ఆ ఇంటిలోనికి తరచు పాములు వచ్చి బాధ పెట్టాయి.

వర్షాకాలానికి ముందే సాధ్యమైనంత ఎక్కువ పని పూర్తి చేయాలనే ఆతురతతో ఎండల్ని, వడగాల్పుల్ని కూడ లెక్క చేయకుండా పనులు జరుగుతున్న స్థలాల్లోనే తిరుగుతున్నాడు. అందుచేత ఆయన ఆరోగ్యం దెబ్బతిన్నది. ఆకారణం చేత ఆయన సెలవుపై ఆస్ట్రేలియా వెళ్ళిపోయాడు.

**ఆనకట్ట నిర్మాణం - 2 :**

కాటన్ ఆస్ట్రేలియాకు బయలుదేరివెళ్ళే నాటికి నిర్మాణంపని సగం వరకే జరిగింది. మిగిలిన కార్యక్రమాల్ని పూర్తిచేసే బాధ్యత సి.ఎ.ఆర్ (చార్లెస్ అలెగ్జాండర్ ఆర్) కొప్పగించబడింది. అతడు కాటన్‌తో పాటు పనిచేస్తున్న ఇంజనీర్. అతడు కూడ కాటన్ ప్రణాళికానుసారమే పనులు సాగిస్తున్నాడు. కాని ర్యాలి ఆనకట్టలో అడ్డురాతి గోడలను, ఆనకట్ట తలభాగం పిట్టగోడను చెక్కిన రాతితో పూర్తిచేయదలచాడు. అందువలన ఖర్చులధికమైనా మరమ్మతుల ఖర్చులుండవు. అంతేకాక తాను నిర్వహింపవలసిన కార్యక్రమాలకోసం మరో 3 1/2 లక్షల రూపాయలదనంగా కావాలని కోరాడు. ఈ ఉత్తరం ఇంకా రవాణాలోనే ఉంది. కాని అంతకుపూర్వం కాటన్ అడిగిన అదనపు మొత్తాన్ని గూర్చి అసంతృప్తి వ్యక్తపరుస్తు లండన్‌లోని 'బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్' నుంచి మద్రాసు ప్రభుత్వానికి జవాబు వచ్చింది. అంతేకాక ఒకరిద్దరింజనీర్లను రాజమండ్రి పంపి, అంతవరకు కాటన్ చేసిన నిర్మాణాలను, ఇంకను పూర్తి చేయవలసి ఉన్న నిర్మాణాలను పరిశీలించి నివేదికను పంపుమన్నది.

ఆ ప్రకారం మద్రాసు ప్రభుత్వం ఒక సాంకేతిక పరిశీలక బృందాన్ని రాజమండ్రి పంపింది. కెప్టెన్ ఆర్ వారు కోరిన వివరాలు తెల్పి ఇంకను పూర్తి కావలసిన పనులకవసరమైన అదనపు మొత్తాన్ని గురించి వివరించాడు. వారుకూడ సంతృప్తి పడి, ఆ అదనపు మొత్తం యొక్క ఆవశ్యకత గూర్చి నొక్కిచెపుతు ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. అటు తర్వాత అవసరమైన మొత్తానికి ఆమోదం లభించేసరికి ఆరునెలలు పట్టింది.

కాని ఇంతలోనే గోదావరికి బ్రహ్మాండమైన వరదలు వచ్చాయి. భీకరమైన కెరటాల తాకిడికి విజ్ఞేశ్వరం ఆనకట్ట చంద్రవంక మట్టి గోడ నామరూపాలు లేకుండా పోయింది. దానితోపాటు ఆనకట్టలో 22 గజాల మేరకొట్టుకుపోయిది. ఆనకట్ట మధ్య భాగం మరొక 44 గజాల వెడల్పున గండి పడింది. ఇదే విధంగా మద్దూరు ఆనకట్టకు ఎగువన కట్టిన అడ్డుగోడలంతరించాయి. రాళ్ళను తెస్తున్నపడవలు ధ్వంసమైనాయి.

వారం, పది రోజుల్లో వరద నష్టాలు చాలవరకు సర్దుకొన్నాయి. ర్యాలిఆనకట్ట 9 అడుగుల ఎత్తు, 120 గజాల మేర పొడిగించబడింది. ధవళేశ్వరం ఆనకట్ట దిగువను ప్రక్క గోడ వద్ద విశేషంగా రాళ్ళగుట్టలు పేర్చి ఆనకట్ట బలపరచాడు. ర్యాలి ఆనకట్ట తూర్పు పడమరలవైపు చెరి 120 గజాల మేర 6 అడుగుల ఎత్తు వరకు రాతి పేర్పుతో కట్టబడింది. విజ్ఞేశ్వరం ఆనకట్ట సున్నంతో రాతికట్టుపని కూడ పూర్తయింది.

సెప్టెంబర్‌లో మళ్లీ వరదలు వచ్చాయి. అది చాలదన్నట్లు దానికి తుఫాను కూడ తొడయింది. అవి రెండు కలసి సృష్టించిన విలయానికి సరకు పడవలు విసరికొట్టబడ్డాయి. ధవళేశ్వరం ఆనకట్ట కుడిభాగం బీటలు వారింది. 1850వ సంవత్సరం ప్రవేశించింది. మే 25 నాటికి ర్యాలి ఆనకట్టలో సున్నపురాయి కట్టడపు పని పూర్తయింది. ఆనకట్ట 10 1/2 అడుగులు మొదలు 12 అడుగుల ఎత్తునకు వచ్చింది.

జూన్ 10వ తారీఖునుండి వారంరోజుల పాటు గోదావరి పొంగుతోంది. ఆనకట్టపై 10 అంగుళాల ఎత్తున నీరు పారుతు ధవళేశ్వరం, ర్యాలి ఆనకట్టల అడుగుతలపుల నుండి కూడ మహావేగంతో నీరు బయటకు వస్తోంది. 17వ తారీఖు ఉదయం ర్యాలి ఆనకట్ట దిగువన కట్టిన చపటా క్రుంగిపోయి, నీరు పోయే ద్వారాలు మూసుకుపోయాయి. వెంటనే కెప్టెన్ ఆర్ రక్షణ చర్యలు తీసుకొన్నాడు. కాని మధ్యాహ్నం 2గంటలకు నీటి ఒత్తిడి ఎక్కువయి పునాదుల అడుగునుండి ఇసుకను పై కెగదన్నడంతో పాటు సున్నపురాయి కట్టడంలో కొంతభాగం కుంగిపోయింది. ఆనకట్ట అడుగునగల 14 ద్వారాలలో 7 ద్వారాలు కూలిపోయాయి. కాని జూలై 8వ తారీఖునకు ఆ ఆనకట్ట అడుగు ద్వారాలు మరిరెండు కూలిపోయాయి.

**ఆనకట్ట నిర్మాణం - 3 :**

ఈ విధంగా రెండు సంవత్సరాలు గడిచాయి. సెలవుపై వెళ్ళిన కాటన్ తిరిగి వచ్చి 1850 జూలైలో పనిలోచేరాడు. అంతవరకు జరిగిన పనులను, మిగిలి ఉన్న పనులను గూర్చి తెలుసుకొన్నాడు. ప్రస్తుతం ఆయన హోదా 'మేజర్' నుండి 'కర్నల్'కు పెంచబడింది. విజ్ఞేశ్వరం వద్ద ఆనకట్ట పొడిగించవలసిన అవసరం ఉంది కావున, మరికొంత వ్యయాన్ని మంజూరు చేయవలసిందిగా కోరుతు 1850డిసెంబర్ లో ఒక నివేదిక పంపాడు. కాని 1851 ఫిబ్రవరి వరకెదురు చూచినా ప్రభుత్వం నుండి ఆమోదం రాలేదు. అంతేకాక 1851

నవంబర్లో గోదావరికి వరదలు వచ్చి వెళ్ళాయి. కెప్టెన్ ఆర్ చాల దూరదృష్టితో కష్టపడి వేసిన బండరాతి చపటా ఈ ఏడాది వరదలకు ముందు బాగుగా బలపరచాడు. అందువలన ఏ ప్రమాదం రాలేదు. అది చూచి విజ్ఞేశ్వరం ఆనకట్టను పొడిగించాలన్న తన ప్రతిపాదనను కాటన్ విరమించుకొన్నాడు. ర్యాలి ఆనకట్ట వద్ద అడుగుతలుపులు, ఆనకట్టలకు తుది మెరుగులు మొదలైనవన్నీ పూర్తి చేసి, 1852 మార్చి 31నాటికి గోదావరి ఆనకట్ట నిర్మాణం పూర్తిచేశాడు.

ఈ మహత్తర నిర్మాణం పూర్తియైన శుభవార్తను మద్రాసు ప్రభుత్వానికి కాటన్ తెలిపాడు. ఆ ప్రభుత్వం తన సంతోషం, సంతృప్తి వ్యక్తపరుస్తు కాటన్‌ను విశేషంగా కొనియాడింది. ఆయనకు విశేష సహకార మందించిన కెప్టెన్ ఆర్‌ను, సబ్‌కలెక్టరు పోర్చ్‌ను కూడ ప్రశంసించింది. కాటన్ కోరిక ననుసరించి ఓవర్‌సీనియర్ 'వీణ వీరన్న'కు సబ్ ఇంజనీర్‌గా ఉన్నతపదవినిచ్చి 'రావుబహద్దూర్' బిరుదు నిచ్చింది. కెప్టెన్ ఆర్‌ను ఛీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా (ప్రధాన నిర్వాహకులు) కృష్ణానదిపై బెజవాడవద్ద ఆనకట్ట నిర్మాణానికి పంపింది. కర్నల్ ఆర్థర్ కాటన్ మద్రాసురాజధాని ఛీఫ్ ఇంజనీరుగా ఉన్నత పదవినొందాడు. మద్రాసుకు 6 మైళ్ళ దూరానున్న 'పల్లవరా'నికి తనమకాం మార్చాడు.

ఈ నిర్మాణంవల్ల కొన్ని లక్షల ఎకరాలు గోదావరీ సీమలో సాగులోనికి వచ్చాయి. అంతే కాక ఈ కాలువలు నౌకాయానానికి కూడ ఉపయోగపడ్డాయి. వాటి ద్వారా ఎగుమతులు కూడ పెరిగి ప్రజల ఆర్థిక జీవన స్థాయి కూడ పెరిగింది.

## ఇతర నదీ సమస్యలు :

ఆయన నైపుణ్యాన్ని బట్టి భారత దేశంలో 'కమాండర్ ఆఫ్ ఇంజనీరు' గా అంటే ప్రభుత్వానికి ఈ విషయంలో సలహాదారుగా నియమించారు.

1857 - 58 సంవత్సరాల్లో ఒరిస్సా క్షామంతో నరక ప్రాయమయింది. మహానది డెల్టాప్రాంతం వరదల్లో మునిగి విపరీత నష్టం కల్గింది. కాటన్ అక్కడి పరిస్థితులను సమీక్షించి, 'మహానదిపై సరియైన ఆనకట్ట లేక, నదీజలం వృధాగా సముద్రం పాలవటమే ముఖ్యకారణమని పేర్కొన్నాడు. అతని ప్రతివాదనలను కేంద్ర ప్రభుత్వ మామోదించి, తగిన ఖర్చును మంజూరు చేసింది. ఆ కార్యక్రమాలు 'మద్రాసు ఇరిగేషన్ మరియు కెనాల్ కంపెనీ'కి అప్పగించింది.

బెంగాల్‌లోని భగవతీనది పొంగి 'ముర్షిదాబాద్' నగరానికి వరదదెబ్బను, ప్రజలకు ప్రాణభీతిని కల్పిస్తున్నది. మేజర్ మేకంజీ కాటన్ నాహ్వానించి సలహాలు పొందాడు.

కృష్ణా, గోదావరుల ఆనకట్టలు 1855 నాటికి పూర్తయినాయి. అటు తర్వాత కాటన్ తన దృష్టిని నీటి కాలువల తవ్వకంపై కేంద్రీకరించాడు. గోదావరి, కృష్ణ, తుంగభద్ర నదులపై అనుకూల స్థలాల్లో జలాశయ నిర్మాణాలు ప్రతిపాదించాడు.

నౌకాయానానికి ఉపయోగపడేట్లుగా 'రాజ్‌మహల్' వద్ద గంగా కాలువ పథకం సూచించాడు. అంతేకాక 'గంగా - కావేరీ జలమార్గం' కూడ ప్రతిపాదించాడు.

'ఇండియాకు గల అశేష సంపద ఒక్కటే – అది జలసంపద. దానిని ఎంతవరకు సద్వినియోగపరుచుకొన గల్గిన అంత శ్రేయస్సుంది. సేద్యపు నీటి పారుదలకు, సరుకుపడవల రాకపోకలకు వీలుండునట్టి కాలువల ఏర్పాటుపై ఇండియా భవితవ్యముంది' అనే ప్రగాఢ విశ్వాసంతో కాటన్ ఈ ప్రతిపాదనలు చేశాడు. కాని ఈ దేశాన్ని వీలైనంత వరకు దోచుకోవడానికే అలవాటు పడిన ప్రభుత్వం, ఈ ప్రతిపాదనల నామోదించేటంతటి ఉదారబుద్ధితో వ్యవహరించలేదు.

గాలివేగం గల ప్రత్యేక స్థలాలలో నదీ సదుపాయంలేని ప్రాంతాల్లో గాలికి తిరిగి, బావులనుండి వీటిని బయటకు తోడేయంత్రాలను స్థాపించి నీరు పారింపవచ్చునని సూచించాడు. బహుశః భారతదేశంలో ఇటువంటి అభిప్రాయం ఇచ్చిన ఇంజనీర్లలో ప్రప్రథముడితడేనేమో!

**బిరుద ప్రదానాలు :**

1860లో పదవీ విరమణ చేసిన కాటన్ ఇంగ్లండ్‌కు వెళ్ళాడు. ఆసమయాన విక్టోరియా రాణి ఆయనను 'సర్' బిరుదుతో గౌరవించింది. అంతేకాక ఇంగ్లండులో ఆయన కెన్నో సన్మానాలు కూడ జరిగాయి. ఆయన పదవీ విరమణానంతరం కూడ నదీ జలాల సద్వినియోగ విషయంలో భారత ప్రభుత్వాని కెన్నో సలహాలిచ్చాడు.

ఆయన ఇండియాకు చేసిన సేవలను కొనియాడి బ్రిటిష్ రాణి 1866లో ఆయనను K.C.S.I. (నైట్ కమాండర్ ఆఫ్ ది స్టార్ ఆఫ్ ఇండియా) అనే అత్యున్నత బిరుదు నిచ్చి సత్కరించింది.

**వార్ధక్యం – నిర్యాణం :**

వార్ధక్యంలో కూడ అతడు మూడు చక్రాల సైకిల్ తయారుచేశాడు. కాని దాని వేగం తగ్గించటానికి బ్రేకులు మాత్రం ఒకంతట చక్కబడలేదు.

ప్రపంచంలో ఎక్కడ నదీ జలాల సద్వినియోగానికై సేద్యపు నీటి పారుదల, రహదారి కాలువలవంటి బృహత్పథకాలు నడుస్తున్నా, ఆయా దేశాదిపతులతో ఉత్తర ప్రత్యుత్తరాలు జరుపుతుండేవాడు. అంతేకాక 'డెయిలీ టెలిగ్రాఫ్', 'టైమ్స్' మొదలైన పత్రికలకు వ్యాసాలు పంపేవాడు.

1899 జూన్ నుండి ఆయన ఆరోగ్యం దిగజారసాగింది. 1899 జూలై 14న తనువు చాలించాడు. ఆయనను కన్నదేశం బ్రిటన్, అల్లుణ్ణి చేసికొన్నది ఆస్ట్రేలియా, కాని ఏనాటి అనుబంధమో కాని ఆయనకు భారతదేశమన్నా, భారతదేశ ప్రజలన్నా వల్లమాలిన అభిమానం. ఆ విధంగా ఆయన తన జీవితాన్ని బ్రిటన్, ఆస్ట్రేలియాలకు మధ్యనున్న భారత దేశ ప్రజా శ్రేయస్సుకై అంకితం చేశాడు.

భారతదేశ నదీ జలాలలో అంతర్లీనమై ఆయన కీర్తికాయం కలకాలం నిలిచి ఉంటుంది. ఆయనకు స్మృతి చిహ్నంగా ఆంధ్రప్రజలు గోదావరి బరాజ్‌ను 'కాటన్ బారేజి'గా నామకరణం చేశారు; ఆయన అశ్వారోహకుడై స్వారీ చేసే విగ్రహం ధవళేశ్వరంలో బ్యారేజివద్ద తమ కృతజ్ఞతా సూచకంగా నిల్పుకొన్నారు.